శివానంద లహరి

స్వామి సుందర చైతన్యానంద

శ్రీ ఆదిశంకరుల

శివానందలహరి



జ్ఞానబ్రహ్మ

స్వామి సుందర చైతన్యానంద

శివానందలహరి

స్వామి సుందర చైతన్యానంద

ప్రథమ కెరటం మార్చి 1989 .... 2000 కాపీలు
ద్వితీయ కెరటం ఏప్రియల్ 1994 .... 2000 కాపీలు

ప్రతులకు :

సుందర చైతన్య ఆశ్రమం


ధవళేశ్వరం - 533 125

ఫోన్ : 77378




వెల : రు 25-00

ముద్రణ :
శ్రీ లక్ష్మీగణపతి బైండింగ్ వర్క్సు
కొవ్వూరు - 534 350
ఫోన్: 575



జ్ఞానబ్రహ్మ

పూజ్యశ్రీ స్వామి సుందర చైతన్యానంద



ఉపోద్ఘాతము

అనంత చిత్స్వరూపము పరిమిత వాక్కులద్వారా నిర్వచించబడదు. అనిర్వచనీయ రసానుభూతి మనకు గోచరించు నిర్వచన పద్ధతుల ద్వారా తెలియబడదు. మాటలకు చిక్కని సత్తా-స్వరూపమును మాటలు వివరించ గలవా? మనసుకు దక్కని జ్ఞానస్వరూపమును మనసు విశదీకరించగలదా? మనసు, మాటలు మనకు అందుబాటులో ఉన్నవి. అందుబాటులో ఉన్న మనోవాక్కులకు అందని రీతిలో సత్యపదార్థం భాసించుచున్నది. సత్యము అవినాశి. నశించే స్వభావముగల అసద్వస్తువులు అవినాశియగు సత్యమును గ్రహించలేవు. అగ్రాహ్యమగు చైతన్యమును గ్రహించుటకు చేయు ప్రయత్నమే వేదాంతావగాహనయై ఉన్నది. అందుచేత వేదాంతబోధ గుహ్యమై యున్నది. గుహ్యమయిన వేదాంత రహస్యములను శ్రోతలకు జీర్ణమగునట్లు తెలియజేయుట సర్వులకు సాధ్యము కాదు. సర్వులకు సాధ్యముగాక, ఏ కొందరికో సాధ్యమగు ఈ తత్త్వమును సర్వులకు అర్థమగునట్లు తెలియజేయు నేర్పు. జ్ఞాన నైశిత్యము కొందరికే ఉంటుంది. అట్టివారిలో అగ్రగణ్యులు శ్రీ ఆదిశంకరులు.

బిడ్డల వయోభేదముల ననుసరించి తల్లి ఆహారము నందించునట్లు విద్యార్థుల స్థాయీభేదము ననుసరించి బోధచేయు నేర్పు శ్రీ శంకరులకు వెన్నతోపాటు వెన్నంటి వచ్చినది. జ్ఞానమార్గమున చరించు మేధావులకు ప్రస్థానత్రయ భాష్యములు, భక్తి మార్గమున సంచరించు ముముక్షువులకు ప్రకరణ గ్రంథములు. జ్ఞానానుభూతిలో స్వాత్మానందము ననుభవించు వారలకు ముంజేతి కంకణమువలె దక్షిణామూర్తి స్తోత్రము-వివరణ ఏల? శ్రీ శంకరులు చేయని ప్రయోగము లేదు. చూపని తాత్త్విక ప్రదర్శనలేదు.

భక్తిజ్ఞానములను సమరసముచేసి శ్రీశంకరులు సాగించిన "శివానందలహరి" అను ఈ గ్రంథము అత్యంత రమణీయమైన కమనీయ భక్తి ప్రబంధము. జ్ఞాన ప్రభంజనము. ప్రమోద భరితము. ప్రశాంత శివ చరితము.

"శివానంద లహరి" అను ఈ గ్రంథ నామమునందు 'శివ'- 'ఆనంద'- 'లహరి' అను మూడు పదములు గోచరించుచున్నవి. మంగళకరమైన ఆనంద ప్రవాహము లేదా శుభప్రద ఆనంద కెరటమని భావము. ఈ పదత్రయమును విమర్శించి సత్యావగాహన చేసెదముగాక! 'శివ' శబ్దము మంగళదాయకము. శివుడు శుభప్రదుడు. కళ్యాణమూర్తి. నిష్క్రియత్వ నిరంజన స్వరూపము. శివుడు గుణాతీత నిర్గుణ పరబ్రహ్మమని సాయణా చార్యులు తన వేదభాష్యమునందు తెలిపియున్నారు.

'శివానుగ్రహేణ జ్ఞానప్రాప్తిః'

'శివుని కరుణ చేతనే జ్ఞానముదయించును' అని ఉపనిషత్తు తెలియజేయు చున్నది. 'జ్ఞాన మిచ్ఛే న్మహేశ్వరాత్

పరమశివుని నుండియే జ్ఞానమును సముపార్జించవలెను' అని శాస్త్ర వచనము.

'ఈశ్వరానుగ్రహాదేవ పుంసామద్వైతవాసనా'

'అద్వైతవాసనకూడా ఈశ్వరకరుణచేతనే ప్రాప్తమగుచున్నది. అని దత్తాత్రేయులవారు అవధూత గీతయందు తెలిపియున్నారు.

'స శివః'

'ఆత్మయే శివుడు' అని నారాయణోపనిషత్తు తెలియజేయుచున్నది.

'శివ ఏకోధ్యేయ శ్శివంకరః'

'ధ్యానించ దగినవాడు శివుడే' యని అధర్వ శిరస్సు ఉపనిషత్తు తెలుపుచున్నది.

సృష్టికి పూర్వము సత్స్వరూప చైతన్య మొక్కటే యుండెను. అది అద్వయ స్త్వాత్స్వరూపము.

'స దేవ సౌమ్య ఇదమగ్ర ఆసీత్'

అని వేదము తెలియజేయుచున్నది. చైతన్యము అవికార్య చిద్రూపమైయుండెను. తన వ్యాప్తిని తాను గ్రహించు యీక్ష చైతన్యమునందు స్పందనను కలిగించెను. తద్వారా అవ్యక్తమగు నాదము ఏర్పడెను. అదియే ప్రణవము. ప్రణవము జ్యోతి స్వరూపము. దీనినే 'బిందు' అని పిలుతురు. నాదబిందు లేకమయిన అపూర్వశోభనమే 'కళ' అనబడును. నాదబిందు కళాత్మక స్పందనలో సృష్టికొరకు క్రియను పొందుట జరిగెను. ఈ సృష్టి సంబంధ క్రియయే పురుషత్వము. ఆ పురుషుడే రుద్రుడనబడే మహేశ్వరుడు. తనచే తపింపజేయబడిన ద్యులోకము స్త్రీయాయెను. ఆమెయే రుద్రాణి. విశ్వమునకు వీరే జననీ జనకులు.

నాదబిందులనుండి కదలిన ప్రథమ నాదమే ఓంకారము. ప్రథమ నాదమయిన ఈ ఓంకారమునుండి 'నమశ్శివాయ' అనెడి పంచాక్షరి ఆవిర్భవించెను. ఇది శివప్రీతికరమగు శుభకరమంత్రము. నమశ్శివాయ యనెడి ఈపంచాక్షరినుండి పంచభూతములు ఆవిర్భవించెను. అవియే పృథివప్తేజో వాయురాకాశములు. పంచభూతములు పంచీకరణము చెందుట ద్వారా ఈ సకల ప్రపంచము ఆవిర్భవించెను.

పరమశివుని యందలి మహిమాన్విత శక్తి పంచాక్షరియే అయి యున్నది. బహ్మాండము పిండాండమునందే నిండియున్నందున పంచాక్షరి స్వరూపమును మానవశరీరమందే యోగులు దర్శింతురు. 'న' అనెడి అక్షరము మానవుని రెండు కాళ్ళకు సంకేతము. 'మ' అనెడి అక్షరము ఉదరభాగమునకు ప్రాతినిధ్యము వహించును. 'శి' భుజములకు, 'వా' నోటికి, 'య' నేత్రద్వయమునకు ప్రాతినిధ్యము వహించును. కనుక మానవుని శరీరము కూడా పంచాక్షరి మహామంత్ర సంయుక్తమైయున్నది. దేహము అందుచేతనే

దేవాలయము అనబడినది. పంచాక్షరికి ఆధారమైన ప్రణవచైతన్యమే దేహమునందలి దేవుడనబడే దేహియైయున్నది.

ఆధారమైన ప్రణవ చైతన్యమే నమశ్శివాయ అని పిలువబడినది. నమశ్శివాయ నుండియే పంచభూతములు కదలివచ్చుట చేత ఆధేయమైన పాంచభౌతిక ప్రపంచము సైతము పంచాక్షరి స్వరూపమే అయియున్నది. ఆధార, ఆధేయములు రెండును సాగర తరంగములవలె అభిన్నములై యున్నవి. ఈ సత్యము అనుభవమునకు అందుటయే మోక్షమనెడి శివ తత్త్వానుభూతి. ఇదియే పరమానంద స్వరూపస్థితి. శివానంద ప్రాప్తి.

'శివానందలహరి' అనెడి పదత్రయమునందు శివతత్త్వమును సంక్షిప్తముగ గ్రహించితిమి. తదుపరి ఆనంద పద వివరణ జరుగవలసియున్నది.

ఆనందప్రాప్తియే ప్రతి వ్యక్తి ఆశయమై యున్నది. ఆనందమును పొందుటకై కర్మలాచరించుచున్నాడు. కర్మలాచరించి, మానవుడు తద్వారా పొందు వస్తువులనుండి ఆనందం అనుభవించాలని యత్నిస్తున్నాడు. పరిమితమైనకర్మలు అందించే ఫలితాలు కూడా పరిమితమైనవే కనుక వాటినుండి తాను ఆశించు పూర్ణానందం లభ్యము కాదు. కాల జనిత వస్తు ప్రపంచము కాలాధీనమై యుండి దాని నుండి నిరవధిక సుఖానుభూతి పొందే అవకాశము లేదు. ఈ సత్యము తెలియకపోవుటచేత మనసులో కోరికలు బయలుదేరుతున్నాయి. తీరిన కోరికలు పునరానుభూతి కోరుచుండ, తీరని కోరికలు అసంతృప్తిని అందించుచున్నవి. కోరికలను తృప్తి పరుచుట వలన అసంతృప్తిపెరుగుతుందే కాని సంతృప్తి కలుగనేరదు.

'As well might you try to put out a fire by pouring upon it melted butter, as to get rid of desire by filling it with the objects of desire.

అనుభవించుట ద్వారా కోరికలను అణచవలెనని ప్రయత్నించుట అగ్నిలో అజ్యమును పోయు ప్రయత్నములాంటిదే.

'The appetite grows by what it feeds on' అని షేక్స్పియర్ అభిప్రాయపడ్డాడు.

మానవుని స్వభావమే ఆనందమయి ఉన్నందున అనిత్య వస్తు సంతతి తనకు పరిపూర్ణానందమును అందించజాలదు.

'ఆధార మానన్ద మఖణ్డ బోధం'

అని యజుర్వేదము తెలుపుచున్నది. సర్వజీవులు ఆశించు అఖండానందమే శివానందము. నిత్యానంద స్వరూపమైన ఈశివానందాన భూతియే శివానందలహరి. నిత్యమైన ఆనందము గనుక సత్యమై యుండును. సత్యమై యుండుటచే కాలపరిధిలో చేరక సర్వదా అనుభూతిగా నిలిచి యుండును. కనుక ఆత్మానందము లేదా శివానందము ఎడతెగని ఆనంద ప్రవాహమై యున్నది.

భక్తుల పాలిటి కల్పవృక్షమై వెలుగు ఈ శివానందలహరిని ఆది శంకరులు శ్రీశైల పర్వతమున రచించినట్లు తెలియుచున్నది. భ్రమరాంబా సమేత శ్రీ మల్లికార్జునస్వామిని స్తుతించి, రక్షించమని వేడుటయే ఇందలి కేంద్ర విషయము. శ్రీశైలము పరమపావన క్షేత్రరాజము. శివకుమారుడగు కుమారస్వామి భూప్రదక్షిణ చేసి కైలాసము చేరెను. తన సోదరుడైన గణపతి వివాహవిషయములను నారదమహర్షి ద్వారా ఆలకించినవాడై, కినుక వహించి క్రౌంచ పర్వతమునకు చేరెను. బిడ్డను సందర్శించ ఉద్దేశపడిన పార్వతీ పరమేశ్వరులు శ్రీశైలము జేరి, భక్తులగు తమ బిడ్డలను అనుగ్రహిం చుటకు జ్యోతిస్వరూపులై అక్కడనే నిలిచిపోయిరి. శ్రీశైలమున ప్రభవించు పరమేశ్వరుడే మల్లికార్జునస్వామి. శ్రీశైలమున మల్లికార్జున జ్యోతిర్లింగ దర్శనము పొందినవారలు ఆత్మవిదులై తరించెదరని శివపురాణము నందు తెలియజేయబడినది.

శ్రీశైల మహిమను వర్ణించు ఘట్టములు మన పురాతన గ్రంథములలో పెక్కుచోట్ల గలవు. శ్రీశైలమును వృషభాచలమని, శ్రీ పర్వతమని కూడా పిలుతురు. మహాభారతములోని వనపర్వమునందు శ్రీశైల మహిమను వర్ణించు శ్లోకములు పెక్కు కలవు. పాండవులు అజ్ఞాతవాస సమయమునందు శ్రీశైల క్షేత్రమును సందర్శించి సహస్రలింగ ప్రతిష్ఠ జరిపినట్లు తెలియుచున్నది. స్కాంధ పురాణమునందు శ్రీశైల వైభవమును కీర్తించు "శ్రీశైలకాండ" అను ప్రత్యేక అధ్యాయమే కలదు.

పూజ్యపాదులగు శ్రీ ఆదిశంకరులు తమదిగ్విజయ యాత్రను జరుపు శుభసమయమున దేశ నలుమూలలయందు ద్వాదశ జ్యోతిర్లింగములను అర్చించిరి. వానిలో శ్రీశైల మల్లికార్జున జ్యోతిర్లింగ మొకటి. శ్రీవారు శ్రీశైలమందు కొంతకాలము తపమాచరించినట్లుకూడా తెలియు చున్నది. శ్రీశైల క్షేత్రపాలకులగు భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దివ్యవైభవమును గాంచి పులకాంకితులైన శంకరులు, తన హృదయ పారవశ్య తరంగ కుసుమాలను సాహిత్య దారములతో కూర్చి, అందమైన భక్తి ప్రబంధమాలగా తీర్చి, మల్లికార్జునునిమెడను అలంకరించి అర్చించారు. అట్టి భక్తి భావ సుమాలయే శివానంద లహరి.

పూజ్యపాదులు సమర్పించిన "శివానందలహరి" యనెడి భావ పుష్పహారమునందలి జ్ఞాన సౌరభమును భక్తులు ఆఘ్రాణించునట్లు తోడ్పడుటయే ఈవ్యాఖ్యానమును రచించుటలోని ముఖ్యోద్దేశ్యము. ఇంతవరకు ఆచార్యులవారి పదునాలుగు గ్రంధములకు వ్యాఖ్యానమును రచించి అందించ గలిగిన ఈనాడు ఆచార్యులవారి భక్తిరస ప్రధాన గ్రంధ రాజమగు "శివానంద లహరి"ని వ్యాఖ్యాన సహితముగా మీ కర కమలము లందుంచు భాగ్యము కలిగినది. శ్రీకృష్ణార్పణమస్తు.

భక్తులారా! సుందర చైతన్య వనవాటికనుండి మరొక సౌందర్య కుసుమము విరబూసింది. నీరుపోసి, కంచెవేసి, రక్షించే బాధ్యత మాది. అందుకొని, ఆఘ్రాణించి, ఆనందించే హక్కు మీది. తోటమాలిని నేను. యజమానులు మీరు.

అందుకోండి. ఆఘ్రాణించండి.

భక్తజన సేవకుడు
మీ
స్వామి సుందర చైతన్యానంద

శివానంద లహరి

అనంతజ్ఞాన సాగరులు, అపర శివావతారమూర్తులైన శ్రీ శంకరులు "శివానంద లహరి" గ్రంథమును ప్రారంభము చేయుచు ఆదిలో మంగళాచరణ చేయుచు కరుణా మూర్తులైన పార్వతీ పరమేశ్వరులను స్తుతించుచున్నారు.

కలాభ్యాం చూడాలంకృత శశికలాభ్యాం నిజతపః
ఫలాభ్యాం భక్తేషు ప్రకటిత ఫలాభ్యాం భవతుమే
శివాభ్యా మస్తోక త్రిభువన శివాభ్యాం హృదిపున
ర్భవాభ్యా మానంద స్ఫురదను భవాభ్యాం నతి రియమ్ ॥ 1

కలాభ్యాం = సర్వవిద్యా స్వరూపులును, చూడాలంకృత = శిరమునందలంకరించు కొన్న, శశికలాభ్యాం = చంద్రరేఖలు గలవారును, నిజతపః = అన్యోన్యమగు తమ తపస్సులకు, ఫలాభ్యాం=ఫలమైనవారును, భక్తేషు = భక్తుల యందు, ప్రకటిత = గోచరించిన, ఫలాభ్యాం = ఫలమునొసగువారును, అస్తోక = అధికముగ, త్రిభువన = లోకములకు, శివాభ్యాం = శుభము లొసంగువారును, హృది = హృదయమునందు, పునర్భవాభ్యాం= సాక్షాత్కరించువారును, ఆనంద = పరమానందముతో, స్ఫురత్ = ప్రకాశించెడి, అనుభవాభ్యాం = స్వరూపానుభవము గలవారును, శివాభ్యాం = పార్వతీపరమేశ్వరులకు, ఇయం = ఈ, మే = నా యొక్క, నతిః = నమస్కారము, భవతు = అగుగాక!

భావము :- సర్వవిద్యా స్వరూపులు, శశిరేఖను శిరసునందలంకరించు కొన్నవారును, అన్యోన్యమగు తమ తపస్సులకు ఫలమగు వారును, భక్త జనుల అభీష్టములను నెరవేర్చువారును, ముల్లోకములకు శుభప్రదాతలును, హృదయమున సాక్షాత్కరించువారును, పరమానందముతో ప్రకాశించెడి స్వరూపానుభవము గలవారును అగు పార్వతీపరమేశ్వరులకు నమస్కారము.

వ్యాఖ్య

పూజ్యపాదులగు శ్రీ శంకరులు మంగళాచరణ శ్లోకమును ప్రారంభించుచు "కలాభ్యాం" అని మొదలిడినారు. గ్రంథారంభము శుభకరముగ నుండుట మన సంప్రదాయ మందించిన విశిష్టాచారము. గ్రంథరచన నిరాటంకముగ

జరుగుటకు భగవదాశీస్సుల నభిలషించుటయే అందలి ఆంతర్యము. గ్రంధరచన వెనుక రచయితకున్న ఆశయముకూడా వెల్లడి యగును. భవిష్యత్తులో వాఖ్యాతలు రచయిత మనోభావమును గ్రహించి వ్యాఖ్యానమును నడుపుటకు కూడా దోహదకారి యగును. వేదవ్యాస మహర్షి బ్రహ్మసూత్రములను ప్రారంబిస్తూ "అధాతో బ్రహ్మ జిజ్ఞాసా" అని ప్రారంభించెను "అధాతో" అను పదములు "అ" అను అక్షరముతో ప్రారంభమైనవి. "అ" కార, "ఉ" కార, "మ" కారములతో కూడిన ఓంకారమునందు "అ" అను అక్షరము మొదటిదై యున్నందున అట్టి అకార ప్రయోగముద్వారా ప్రణవచైతన్యమును అనుభవమునకు తెచ్చుకొని ఆనందించు నుద్దేశ్యముతో రచయిత 'అ' కారముతో మంగళాచరణ చేసెనని మనకు తెలియుచున్నది. వ్యాసభగవానుని ఈ బ్రహ్మసూత్రములకు శంకరుల వారు వ్యాఖ్యానము రచించి భాష్యకారులైరి.

జైమిని మహర్షి తన పూర్వమీమాంస గ్రంధమును ప్రారంభించుచు 'అధాతో కర్మ జిజ్ఞాస, అని మొదలిడెను. నారదమహర్షి భక్తిసూత్రములను ప్రారంభించుచు 'అధాతో భక్తిం వ్యాఖ్యాస్యామః' అని మొదలిడెను. పాణిని మహర్షి వ్యాకరణశాస్త్రమును రచించుటకు మొదలుపెట్టి 'వృద్ధి' అను పదముతో ప్రారంభించెను. వృద్ధి అనగా వ్యాపించుట అని భావము. తాను ప్రారంభించిన ఈ గ్రంధము చివరివరకు ఏ ఆటంకము లేక భావ బంధురముగా కొనసాగవలయుననియు, దీని ఉపయోగము ప్రజలలో ఎక్కువగా వ్యాపించవలయుననియు భావన చేయుటయే ఈ ప్రారంభ పద ప్రయోగము వెనుకయున్న ఆశయమై యున్నది. పాణినీ వ్యాకరణ సూత్రములకు పతంజలి మహర్షి వ్యాఖ్యానము రచించి మహా భాష్యకారుడని పేరొందెను. అలాగే మన ప్రస్తుత గ్రంధమగు శివానందలహరి 'కలాభ్యాం' అను పదముతో ప్రారంభమగుచున్నది.

'కలాభ్యాం' అనగా కళాస్వరూపులును, సర్వవిద్యాస్వరూపులును అని భావము. ఈ మంగళాచరణ శ్లోకమునందు గౌరీశంకరులను ఆచార్యులు స్తుతించుచు వారిని సర్వవిద్యా స్వరూపులని తెలుపుచున్నారు.

'ఈశిశ్వర స్సర్వ విద్యానాం'

"సమస్త విద్యలకు పరమశివుడే అధిపతి" యని వేదము తెలియ జేయుచున్నది. సర్వశాస్త్రములకు ఉద్గమ స్థానమైన సాంబశివులు సర్వ కళా స్వరూపులై యున్నారు. అట్టి మంగళ స్వరూపులైన గౌరీశంకరులను ప్రారంభములో ధ్యానించి శుభప్రదమైన మనుగడను తన హృదిలో ఆవిష్కరించుకొను ప్రయత్నమే ఆచార్యుల ఆశయమైయున్నది.

సర్వవిద్యాస్వరూపులగు పరమశివుని ధ్యానించువారలు కూడా కళాస్వరూపులే కాగలరు. మంగళస్వరూపులై శోభించగలరు. వశిష్ట మహర్షి ఒక నాడు మహేశ్వరుని సమీపించి

తెదేశాస్తే జనపదా స్తా దిశస్తే చ పర్వతాః

త్వదను స్మరణై కాన్త ధియో యత్ర స్థితా జనాః

"హే పరమశివా ! నీ స్మరణయందు తన్మయులైన మహాత్ములు ఎచట వసించుచుందురో ఆ దేశములు, పల్లెలు, పర్వతములు, సర్వమును పవిత్ర క్షేత్రరాజములే" అని తెలియజేసెను.

లౌకిక విద్యాప్రకర్షలు గాక, పారమార్థిక జీవనస్థితిని కల్గించి ఆధ్యాత్మవిద్య ననుగ్రహించి బ్రోచువారలగు ఉమామహేశ్వరులను ధ్యానించుచు వారిని "కలాభ్యాం" అని స్తుతించారు.

సర్వవిద్యాస్వరూపులైన ఉమామహేశ్వరులు శిరము నందు శశిరేఖను ధరించియున్నారని వర్ణించుచున్నారు. చంద్రుడు తాపమును చల్లార్చు చల్లని కిరణజాలమును అందించును. అట్టి చంద్రరేఖను శిరమునందు ధరించియున్న గౌరీశంకరులు ప్రశాంతమూర్తులై తమనాశ్రయించు భక్త జనుల శిరములనందలి వాసనాతాపమును నిర్మూలించువారై యున్నారు.

శిరస్సునందు చంద్రరేఖను ధరించిన సాంబశివులు అన్యోన్యమగు వారి తపస్సులకు ఫలములై యున్నారు. ప్రకృతీ పురుషులైన ఉమాశంకరులు

తామాచరించిన పరస్పర తపస్సులకు తామే పరస్పరము ఫలములై యున్నారు. ప్రకృతి లేని పురుషుడు సృష్టిక్రమమున అయోమయము. పురుషుడు లేని ప్రకృతి జడప్రాయము. అందుచే ప్రకృతి పురుషులనెడి పార్వతీ పరమేశ్వరుల అద్భుత సమ్మేళనము నిరుపమానమై యున్నది.

'శివ శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం'

'శివ శక్తుల సమ్మేళనమే సృష్ట్యాది వ్యాపారములు జరుగుటకు ప్రధాన కారణము' అని శ్రీ శంకరులు సౌందర్య లహరి అను గ్రంధమున తెలియజేసిరి.

అట్టి పార్వతీపరమేశ్వరులు భక్తుల కోర్కెలను ఫలింపజేయువారై యున్నారని తరువాత శ్రీశంకరులు తెలుపుచున్నారు. భక్తుల కోర్కెలు భక్తాధీనుడైన భగవంతుడు తీర్చకపోతే మరెవరు తీరుస్తారు? భక్తులకు కోర్కెలుండునా? కోరికల మూటలను గార్ధభమువలె మోయువారు భగవానుని తమ బుద్ధిలో ధరించగలరా? ఆర్తాది భేదములుగల చతుర్విధ భక్తులను పార్వతీపరమేశ్వరులు అనుగ్రహించువారై యున్నారు. నిజ భక్తులగు వారు వాంఛించుమోక్షమును కూడా ప్రసాదించువారైయున్నారు. చతుర్విధ పురుషార్థము లను ప్రసాదించి అనుగ్రహించువారై యున్నారు.

భక్తుల కోర్కెలను తీర్చువారు అనగానే గౌరీశంకరులు మానవులకే పరిమితమైన దేవతలు అని భావించే ప్రమాదము కలదు. అందుచేత గౌరీ శంకరులు ముల్లోకములకు శుభముల నొసగువారని శ్రీ శంకరులు తెలియజేయుచున్నారు. సృష్టినంతను తనయందే సాగించు సాంబశివులు తమ చల్లనిచూపుచేత సమస్త సృష్టిని రక్షించువారై యున్నారని భావము. ఉదరములో పడిన ఆహారము జీర్ణమై శరీరములోని సర్వావయవములకు అందించబడునట్లు ఉమామహేశ్వరుల దివ్యకరుణ త్రిలోకములను పునీత మొనర్చుచున్నది.

ముల్లోకములకు శుభములొనగూర్చు సాంబశివులు హృదయ కుహరము నందు దర్శించదగియున్నారని ఆచార్యులు ధ్యానస్థితిని ఎరుక పరచుచున్నారు.

"హృత్పుండరీకం విరజం విశుద్ధం"

అని కైవల్య శృతి తెలుపుచున్నది. విద్యుచ్ఛక్తి తీగనంతటిని నిండి యున్నను దీపమునందు, పంకాయందు స్పష్టముగా గోచరించుచున్నట్లు సర్వవ్యాపకుడైన ఈశ్వరుడు ధ్యానస్థితిలో హృదయస్థానమున గోచరమగు చున్నాడు. సంకల్ప అలజడి అణిగి, వాసనాప్రేరణలుడిగి, మనస్సునుండి జారి హృదయజోలిలో పడినపుడు శివస్వరూపము అనుభవమునకు అందును.

హృదయస్థానమున గోచరమగు సాంబశివులు ఆనందస్వరూపులై, స్వరూపస్థితిలో వెల్గొందుచున్నారని చివరగా ఆచార్యులు తెలుపుచున్నారు. హృదిలో కలుగు అనుభవము మానసికానందమువలె క్షణికముకాదు. అది పరమానంద స్వరూపమైయున్నది. నిజస్వరూపస్థితిలో హృదయమునందు సాంబశివులు దర్శనీయమగుచుండ, అచ్చట కల్గెడి దివ్యానుభూతి ఆత్మాను భూతియేగాని ఇంద్రియ మనోబుద్ధులకు సంబంధించినదికాక పోవుటచేత అది అమృతానుభూతియై మిగిలియున్నది.

అమృతస్వరూపులై, అమృతానుభవ ప్రదాతలగు పార్వతీ పరమేశ్వరులకు నమస్కరించుచు పూజ్యపాదులు ఈ ప్రథమ శ్లోకమును ముగించు చున్నారు. వందనము శరణాగతిని తెలియజేయును. అంతఃకరణ చతుష్టయమును ఈశ్వర పాదపద్మములచెంత సమర్పించి సంపూర్ణ శరణాగత హృదయముతో అంకితమగుటయే నమస్కరించుటలోని అంతరార్థము. భగవంతునికి నమస్కరించుట అనగా భగవత్స్వరూపమును అనుభవమునకు తెచ్చుకొనుట యని అర్థము. భగవత్స్వరూపమును అనుభవించుట యనగా మనలోని బలహీనతలను అధిగమించుట అని భావము. ప్రారంభ శ్లోకములోనే గౌరీశంకరులకు ప్రణమిల్లి బలహీనతలను త్రోసిపుచ్చి, భగవదనుభూతిని పొందయత్నించవలెనని వందనముద్వారా సూచింపబడినది.

మొదటి శ్లోకములో మంగళాచరణ చేసి ద్వితీయ శ్లోకములో 'శివానందలహరి' అను ఈ గ్రంథ వైశిష్ట్యమును తెలుపుతూ విజయ ఘోష నందించుచున్నారు.

గళంతీ శంభోత్వచ్చరిత సరితః కిల్బిషరజో
దళంతీ ధీకుల్యా సరణిషు పతంతీ విజయతామ్
దిశంతీ సంసారభ్రమణ పరితాపోప శమనం
వసంతీ మచ్చేతో హ్రద భువి శివానందలహరీ 2

శంభో=సదాశివా, త్వత్ = నీయొక్క, చరిత = చరిత్ర మనెడి, సరితః = నది నుండి, గళంతీ = ప్రవహించు నదియు, కిల్బిష = కల్మషములనెడి, రజనః = ధూళిని, దళంతీ= పోగొట్టునదియు, ధీ = బుద్ధియనెడి, కుల్యా = పిల్లకాల్వల, సరణిషు = త్రోవలయందు, పతంతీ = సాగునదియు, సంసారభ్రమణ = సంసార భ్రమణముచే కలిగిన, పరితాప= సంతాపముయొక్క, ఉపశమనం = ఊరటను, దిశంతీ = కల్గించునదియు, మత్ = నా యొక్క, చేతః = చిత్తమనెడి, హ్రదభువి = మడుగునందు, వసంతీ = ఉండునదియునగు, శివానంద లహరి = శివప్రద ఆనంద ప్రవాహము, విజయతాం = సర్వోత్కృష్టముగా నుండు గావుత!

భావము :- హే శంభో ! నీ చరిత్రమనియెడి నదినుండి ప్రవహించు నదియు, కల్మషములనే దుమ్మును పోగొట్టునదియు, బుద్ధి యనెడి కాల్వలో సాగునదియు, సంసార తాపమును పోగొట్టు నదియు, నాచిత్తమనెడి ప్రదేశమున నిలుచు నదియునగు ఈ శివానందలహరి సర్వోత్కృష్టముగా నుండు గాక !

వ్యాఖ్య

శివానంద లహరిలోని ఈ రెండవ శ్లోకమునందు గ్రంథ ప్రాశస్త్యమును గూర్చి శ్రీ శంకరులు విజయభేరి మ్రోగించుచున్నారు. జలము ప్రదేశములను పరిశుద్ధ మొనర్చునట్లు శివానంద లహరి జీవులను పావన మొనర్చునని తెలియజేయుచున్నారు.

సాధారణ వ్యక్తులు దేహమును నిత్యము శుభ్రపరచుకొందురు. సాధకులు దేహముతోపాటు అంతఃకరణను కూడా శుభ్రపరచుకొందురు. దేహ మాలిన్యమును జలము పోగొట్టకలదు. మనోమాలిన్యమును దైవచింతన

ద్వారానే పోగొట్టుకొనవలెను. శివచరితమనెడి జల్లులు హృదయ సీమపై పడగానే, అంతవరకు ఈషణత్రయముచే, వాసనా త్రయముచే కరుడు గట్టిన హృదయభూమి ప్రేమామృత ధారలచే తడిసి మృదువై అమృతముగా మారును.

జీవనదు లెప్పుడూ ప్రవహించు చుండును. ఆ జలప్రవాహము భూమిపైయున్న దుమ్మును అణచివేయును. ప్రయాణ మార్గమున కాలువలుగా చీలును. ఆ కాలువలలో జనులు స్నాన మాచరించి ఎండచే కలిగిన తాపమును పోగొట్టుకొందురు. అలా కాలువల గుండా ప్రవహించిన జలము తటాకము లందు జేరి నిలిచిపోవును. ఆ నీరే తటాక సమీపములోని ప్రదేశములకు అందించబడి పంటపొలాలను సస్యశ్యామలము చేయును.

శుభకరుడగు మహేశ్వరుని దివ్య చరిత్రముకూడా ఎడతెగక ప్రవహించు నది వంటిది. నదీ ప్రవాహము దుమ్మును అణచివేయునట్లు, శివచరిత మనెడి పావన గంగా ప్రవాహము అంతఃకరణలోని కల్మషములను శుద్ధమొనర్చును. సంకల్పములను అణచివేయును. సంకల్పములు అణగారినచో అంతఃకరణ శుద్ధి పడినదని భావము. ఆ స్థితిలో మనో చేష్టలుడిగి బుద్ధి పనిచేయుట కుపక్రమించును. మహేశ్వరుని దివ్యగాధ యనెడి నది బుద్ధియనెడి కాలువగుండా ప్రవహించును.

'బుద్ధి గ్రాహ్య మతీంద్రియం'

"ఇంద్రియ మనస్సులకు అందని చైతన్యానందము బుద్ధికిఅందును" అని శాస్త్రము తెలియజేయుచున్నది. ఇదియే శుద్ధ బుద్ధి అని పిలువబడుతుంది. కాలువలో స్నానమాచరించువానికి దేహ తాపము తొలగునట్టు, బుద్ధి యనెడి కాలువలో జలకమాడు వానికి సంసారతాపము తొలగిపోవును. కాలువల ద్వారా ప్రవహించిన జలము తటాకములందుచేరి అక్కడే నిలిచి యుండునట్లు, బుద్ధియనెడి కాలువల ద్వారా ప్రవహించిన శివచరిత్ర ప్రవంతి హృదయ మడుగులో శాశ్వతముగా నిలిచిపోవును. తటాకము నందలి జలము

సమీపములోని ప్రదేశములను సస్యశ్యామలము చేయునట్లు, హృదయ గుహలో అనుభూతిగా నిలిచిన శివానంద స్రవంతి దేహేంద్రియ మనోబుద్ధులను ప్రకాశవంతము చేయుటయేగాక పరిసరములను పావన మొనర్చును. దరిచేరు వారలను పవిత్రులుగా మార్చును. శివానంద లహరి అనెడి ఈ శుభకర ఆనంద ప్రవాహము సర్వోత్కృష్టమై, సర్వోత్కర్షమై యుండుగాక అని శ్రీ శంకరులు ప్రార్థించు చున్నారు.

శివ చరితమనెడి నదీ ప్రవాహము గురుదేవుని ముఖ కమలమునుండి శిష్యుని కర్ణములకు స్రవించును. ఇదియే శ్రవణము. బుద్ధి యనెడి కాలువ గుండా ప్రవహించుట యనగా మననము. మనస్సునందు నిలిచియుండుట అనగా నిధిధ్యాసము. శ్రవణ మనన నిధిధ్యాసల ద్వారా శివతత్త్వానుభూతిని పొంది తరించ వలెననుట ఇందలి విశేషార్థము.

ఇదా నీ మిదానీం మృతిర్మే భవిత్రీ
త్వహో సంతతం చిన్తయా పీడితోఽస్మి
కథం నామమా భూత్ మృతౌ భీతిరేషా
నమస్తే గతీనాం గతే నీలకంఠ !

"నేను ఇప్పుడే గతించెద ననెడి భయంకర సంకల్పముచే తపించు చున్నాడను. హే శివా! నీ దివ్యనామమును స్మరించ లేకున్నాను గదా! హే మహేశ్వరా! దిక్కులేని నాలాంటి వారలకు నీవే దిక్కువై యున్నావు" అని ఆచార్యులవారు శివ భుజంగ స్తోత్రమునందు ప్రార్థించియున్నారు.

శివ కథామృతమును పానము చేసి శివనామ మాధుర్యము నందే రమించు భక్తుడు సర్వోపద్రవ స్థితినుండి విడిపడి సర్వోత్కర్ష స్థితిని పొందును. అట్టి సర్వోత్కృష్ట స్థితియే మంగళకర ఆనంద ప్రవాహ మనెడి శివానంద లహరి అని గ్రంథ ప్రాశస్త్యమును వివరించిన పూజ్యపాదులు పరమేశ్వర సేవయే చేయదగినదని రాబోవు శ్లోకములో తెలియ జేయుచున్నారు.

త్రయీవేద్యం హృద్యం త్రిపురహరమాద్యం త్రినయనం
జటాభారోదారం చలదురగహారం మృగధరం
మహాదేవం దేవం మయి సదయభావం పశుపతిం
చిదాలంబం సాంబం శివ మతివిడంబం హృది భజే ॥ 3

త్రయీ = ఋగ్యజుస్సామవేదముల చేత, వేద్యం = తెలియదగిన వాడును, హృద్యం= హృదిలో గోచరించువాడును, త్రిపురహరం = పురత్రయములను నశింప జేయువాడును, ఆద్యం = ఆద్యపురుషుడును, త్రినయనం = త్రిలోచ నుడును, జటాభారోదారం = గొప్ప జటాజూటము గలవాడును, చలత్ = కదులుచున్న, ఉరగ = సర్పములనెడి, హారం = మాలగలవాడును, మృగధరం = లేడిని దాల్చినవాడును, మహాదేవం = గొప్పదేవుడును, దేవం = ప్రకాశవంతుడును, మయి = నాయందు, సదయభావం = కరుణగల వాడును, పశుపతిం = పశువుల కధిపతియును, చిదాలంబం = జ్ఞానమునకు ఆధారమైనవాడును, అతి విడంబం = లోకానుసరణము గలవాడును, సాంబం = అంబా సమేతుఁడును అగు, శివం = సదాశివుని, హృది = హృదయమున, భజే = భజింతును.

భావము :- మూడు వేదములచే తెలియువాడును, హృదయమునందు గోచరించువాడును, పురత్రయమును హరించు వాడును, ఆద్యపురుషుడును, త్రిలోచనుడును, గొప్ప జటాజూటము గల వాడును, చలించెడి సర్పహారము గలవాడును, జింకను ధరించిన వాడును,మహాదేవుడును, ప్రకాశ వంతుడును, నాపై దయ గలవాడును, పశుపతియును, జ్ఞానాధారుండును, లోకాను సరణము గలవాడును అగు అంబా సమేతుడైన పరమశివుని నేను హృదయమున భజింతును.

వ్యాఖ్య

పరమశివుడు వేద వేద్యుడని కీర్తించబడినాడు. యజుర్వేదము అతని శిరముగా యున్నది. రుద్రము ఆతనికి ముఖమై యున్నది. పంచాక్షరి నేత్రమై యున్నది. వేద స్వరూపమై, వేదముల ద్వారా తెలియబడు పరమశివుడు వేద వేద్యుడై యున్నాడు.

దేవదేవుడైన మహేశ్వరుడు హృదయమునందు దర్శనీయమై యున్నాడు. సర్వగత అవ్యక్త స్వరూపమైన పరమేశ్వరుని ధ్యానించగనే అఖండ ఏకరస పరిపూర్ణ చిత్స్వరూపము హృదయములో అనుభవమునకు అందును.

పురత్రయమును హరించువాడై యున్నాడు. ఈ త్రిపురా సంహారము మహాభారతములోని కర్ణ పర్వమునందు గోచరించును. యుద్ధములో దానవులు దేవతల చేత ఓడించబడిరి. ప్రతీకారముగ తారకాసురుని కుమారులగు ముగ్గురు రాక్షసులు బ్రహ్మదేవుని ధ్యానించుచు తీవ్ర తప మాచరించిరి. బ్రహ్మదేవుడు వారి ననుగ్రహించి కోరిన వరమును ప్రసాదించెను. వారి కోర్కెమేరకు ఆ ముగ్గురిని ఎవ్వరును జయించలేరు. వారు నిర్మించు మూడు పురములను ఎవ్వరయితే ఒకేసారి నశింప చేయగలరో వారు మాత్రమే జయింపగలరు. స్వర్గములో స్వర్ణ భవనమును, ఆకాశమున రజిత భవనమును, భూతలమున లోహ భవనమును నిర్మించి, అప్పటినుండి దేవతలను బాధించప్రారంభించిరి. వారిని మహేశ్వరుడు తప్ప మరెవ్వరూ సంహరించలేరని బ్రహ్మదేవుడు తెలియజేయగా దేవతలందరు శంకరుని శరణు జొచ్చిరి. ధనుర్బాణములను వారే సమర్పించిరి. బ్రహ్మ రథమును నడిపెను. పరమశివుడు బాణమువేసి పురత్రయమును రెప్పపాటు కాలములో కూల్చి వేసెను. ఆనాటి నుండి శంకరుడు త్రిపురహరు డయ్యెను.

త్రిపురహరుడనగా మరియొక వేదాంత అవగాహనకూడా యున్నది.

"పురత్రయే క్రీడతి యశ్చజీవః"

అని యజుర్వేదము తెలియజేయుచున్నది. జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలనెడి పురత్రయమునందు జీవుడు సంచరించుచున్నాడు. ఈ జీవభ్రాంతి తొలగి శాశ్వతానందమును పొందవలెనన్న శివసాన్నిధ్యమును పొందవలెను. శివ తత్త్వానుభూతి కలుగగనే జీవభ్రాంతి తొలగుటచేత పురత్రయము నశించుచున్నది. ఆ కారణముచేత మహేశ్వరుడు త్రిపురహరుడయ్యెను.

త్రిపురహరుడైన శివుడే ఆద్యపురుషుడై ఉన్నాడు. తనకు ఆదిలేదు. ప్రపంచమునకు తాను ఆదియై, ఆధారమైయున్నాడు. తన నుండియే సర్వముకదిలి వచ్చినది.

"తతస్తు జాతం సకలం విచిత్రం"

విచిత్రమైన ఈ సమస్తదృశ్య మాన ప్రపంచము తననుండియే ఆవిర్భ వించిందని కైవల్యోపనిషత్ తెలుపుచున్నది. సృష్టికి ఆధారభూతుడై ఆద్య పురుషుడైన మహేశ్వరుడే త్రిలోచనుడని కీర్తించబడినాడు.

త్రినేత్రధారియైన శివునకు సూర్యచంద్రులు రెండు నేత్రములు కాగా, అగ్ని నొసటన మూడవ నేత్రమైయున్నాడు. ఈ త్రినేత్రములు సృష్టిస్థితిలయాదులను సాగించునవియై యున్నవి. పరమేశ్వరుని నొసటన భాసించు మూడవ నేత్రము జ్ఞాననేత్రము. తన మూడవ కన్ను తెరువగనే ఎదుటనున్న ప్రపంచము భస్మీపటలమగును. జ్ఞాన నేత్రము తెరువబడగానే దృశ్య ప్రపంచము అదృశ్యమై బ్రహ్మ సత్యం జగన్మిధ్య అనెడి సత్యాను భూతి కలుగును అనునదియే అందులోని అంతరార్థము.

గొప్ప జటాజూటము కలిగి, చలించెడి సర్పముల మాలను మహేశ్వరుడు ధరించి యున్నాడు. కదిలెడి వ్యక్త ప్రపంచము తానేయని సర్పహారము ద్వారాను, అచలమై భాసించెడి అవ్యక్త చైతన్యము కూడా తానేయని జటాజూటము ద్వారాను తెలియజేయుచున్నాడు.

జటాజూటధారి, నాగభూషణుడైన ఆదిదేవుడు లేడిని ధరించి యున్నాడు. పరమశివుని అంతమొందించవలెనని కొందరు మునులు సంకల్పించి దారుకావనములో యజ్ఞము నారంభించిరి. యజ్ఞకుండమునుండి వ్యాఘ్రము ఆవిర్భవించెను. మహేశ్వరుడా పులిని చంపి దాని చర్మమును వస్త్రముగా ధరించెను. తరువాత త్రిశూలమును ప్రయోగించిరి. శివుడు దానిని తన ఆయుధముగా గ్రహించెను. చివరగా పదునైన కొమ్ములు గల లేడిని సృష్టించి పంపించిరి. శివుడు ఆ లేడిని ఎడమచేతితో పట్టి ఉంచెను. వ్యాఘ్ర మనెడి

అజ్ఞానమును, త్రిశూలమనెడి త్రిపుటిని, లేడి యనెడి చంచల మనస్సును స్వాధీనపరచుకొని శివుడు మహాదేవుడయ్యెను.

సదాశివుడు చైతన్య స్వరూపమైనందున ప్రకాశవంతుడై వెల్గొందుచున్నాడు. అట్టి తాను భక్తులపై అపారకృపావృష్టిని కురిపించు వాడై యున్నాడు. దయామయుడైన మహేశ్వరుడు పశుపతియై యున్నాడు. బ్రహ్మ స్థావర పర్యంతము సర్వజీవులు పశువులని పిలువబడుదురు. సర్వులకు అధిపతియై, వారిలోని పశు ప్రవృత్తులను క్రమపరచి నడిపించువాడై యున్నందున మహేశ్వరుడు పశుపతియని స్మరించబడుచున్నాడు. అందుచేత తాను జ్ఞానస్వరూపుడై, జ్ఞానప్రదాతయై, ఇతరులు జ్ఞానమును పొందుటకు ఆధారమైనవాడై యున్నాడు. సర్వము అతని కృపాదృష్టిచే నడుపబడు చున్నందున లోకానుసరణము గలవాడై యున్నాడు. అట్టి అంబాసమేతుడైన పరమేశ్వరుని ఆచార్యుల వారు హృదయమున భజించుచున్నారు.

యజుర్వేదమునందు"నమఃసోమాయచ"అని ఉచ్చరించినపుడు"సోమ" అనగా స+ఉ మ, ఉమాదేవితో కూడిన మహేశ్వరుడని భావము.

బ్రహ్మదేవుడు సృష్ట్యారంభమున తన మానస పుత్రులైన సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులను సృష్టించెను. ఆ నలుగురు మహాత్ములు గృహస్థాశ్రమమున ప్రవేశించుటకు ఇష్టపడక యోగులైరి. సృష్టి కార్యమును కొనసాగించు మార్గము అవగతముగాక బ్రహ్మదేవుడు వైకుంఠమున కేగి విష్ణుదేవునకు మొరపెట్టుకొనెను. శ్రీమహావిష్ణువు ఆలోచించి దీనికి తరుణోపాయము నందించగలవాడు మహేశ్వరుడేనని తెలుపగా ఇరువురు కలసి కైలాసమునకేగి ఆదిదేవుని ప్రార్థించిరి.

కరుణాసముద్రుడైన పరమశివుడు వెంటనే తన వక్షస్థలమున ఎడమ వైపుపై దృష్టిసారించెను. ఉమాదేవి ఆవిర్భవించెను. ఇక సృష్టి కార్యమునకు ప్రతి బంధకము లేదని శివుడు తెలియజేసెను. స్త్రీ పురుషులు కలసి జీవించుచు స్రవంతిని కొనసాగించిరి. ఇదంతయు శక్తి మాయయని ఎరుగవలెను.

ప్రకృతి కార్యములన్నిటిని సాక్షివలె శివుడు వీక్షించును. విశ్వజననీ జనకులైన ఉమామహేశ్వరులను శ్రీశంకరులు హృదయమున సేవించుచున్నారు. అన్య దేవతల నారాధించుటకు తన మనస్సు అనుకూలముగా లేదని రాబోవు శ్లోకములో తెలుపుచున్నారు.

సహస్రం వర్తంతే జగతి విబుధాః క్షుద్రఫలదా
నమన్యే స్వప్నేవా తదను సరణం తత్కృతఫలం
హరి బ్రహ్మాదీనా మపి నికట భాజా మసులభం
చిరం యాచే శంభోశివ తవ పాదాంభోజ భజనమ్ ॥ 4

క్షుద్రఫలదా = నీచమైన లేదా అల్పమైన ఫలము లొసంగు, విబుధాః = దేవతలు, సహస్రం = వేలసంఖ్యలో, జగతి = లోకమునందు, వర్తంతే = ఉన్నారు, స్వప్నేవా = కలలోకూడా, తదను సరణం = ఆదేవతల ననుసరించుటగాని, తత్కృతఫలం = వారిచ్చుఫలమునుగాని, నమన్యే = కోరను, శంభో = మహేశ్వరా, శివా = మంగళస్వరూపుడా! నికటభాజా = సమీపమునయున్న, హరిబ్రహ్మ దీనామపి = హరిబ్రహ్మదులకు సైతము, అసులభం= లభ్యముగాని, తవ = నీయొక్క, పదాంభోజభజనం = పాదపద్మములసేవను, చిరం = సర్వదా, యాచే = కోరుచున్నాను.

భావము :- తుచ్ఛమైన ఫలముల నొసంగెడు దేవతలు లోకమునందు ఎందరో కలరు. వారిని సేవించవలయునని, వారిచ్చు ఫలముల ననుభవించవలెనని స్వప్నములో కూడా నేను భావించను. హే! మహేశ్వరా! సమీపమున నున్న హరిబ్రహ్మదులకు సైతము అలభ్యమైన నీ పదాంభోజ సేవనమును నేను సదా యాచించుచున్నాను.

వ్యాఖ్య

భక్తుడు సత్త్వసంపదకల్గియుండును. సత్త్వగుణ ప్రధానుడై చరించు ఉత్తమ భక్తుడు భగవానుని తప్ప అన్యమైన ఫలములను వాంఛించడు. ఇహాము త్రార్థఫల భోగము లన్నియు అనిత్యమని, కాలపరిధిలో నుండునవి అనియు

భక్తుడు గ్రహించును. అల్పమైన ఫలముల నొసంగెడి దేవతలు విశ్వములో ఎందరున్నను, వారిని సేవించవలయు ననెడి భావనగాని, వారందించు ఫలములను అనుభవించవలయు ననెడి కోరికగాని భక్తునకు స్వప్నములో కూడా కలుగదు. భగవచ్చరణారవింద సేవ మినహా అన్యమైన ఫలములను ఆశించుట ఉండదని శ్రీపూజ్యపాదులు తెలియజేయుచున్నారు.

యజన్తే సాత్త్వికాదేవాన్ యక్షరక్షాంసి రాజసాః
ప్రేతాన్ భూతగణాం శ్చాన్యే యజన్తే తామసా జనాః

"సత్వగుణముగలవారు దేవతలను, రజోగుణముగలవారు యక్షులను, రాక్షసులను, తమోగుణముగలవారు భూతప్రేతములను పూజించుదురని భగవద్గీత 17వ అధ్యాయము శ్రద్ధాత్రయ విభాగయోగమునందు తెలియ జేయబడినది.

గుణత్రయపరిధిలో చరించు భక్తులు చేయుపూజలను పై శ్లోకము సూచించుచున్నది. ఇది గౌణభక్తి అని పిలువబడుచున్నది. త్రిగుణముల స్థాయి నధిగమించి చరించు భక్తి ముఖ్య భక్తి లేదా పరాభక్తి అని పిలువబడుచున్నది. ప్రస్తుత శ్లోకములో ఆచార్యులు చూపుభక్తి దేవతలను కూడా నిరసించుటచేత ఇది గౌణభక్తి నధిగమించి పరాభక్తిని ప్రతిపాదించు చున్నది.

దేవత లనుగ్రహించు వరములు ఇహలోకమునకు మరియు స్వర్గాదిలోకములకు సంబంధించిన ఫలముల నొసంగును. భ్రాంతిమయ జగదనుభవములు, స్వప్నతుల్యమైన స్వర్గ సుఖములు అనిత్యములని, కాలరూప సుడిగుండానికి ఆహుతి అగునవి అని ఉత్తమ భక్తుడు గ్రహించును. అనుభవించగానే అసంతృప్తిని, అలసటను పంచేంద్రియ సుఖములు ఎండమావుల వంటివని తాను భావిస్తాడు. దేహేంద్రియ మనోబుద్ధుల స్థాయిలో తెలియవచ్చు సుఖములు, అట్టి సుఖకారణములు సర్వమును మిధ్యయేనని తనకు తెలుసు. అందుచేత దేవతారాధనలు తద్వారా లభించు ఫలితములను గూర్చి భక్తుడు స్వప్నములో కూడా తలపడు. బ్రహ్మాది దేవతలకు సైతము అలభ్యమగు ఈశ్వరపదాంభోజ సేవనమునే తాను వాంఛించును.

సంసారతాపత్రయములను తొలగించి, జనన మరణ చక్రమునుండి మనలను విడుదల చేయు శక్తి ఈశ్వరుని యందేగలదు. ఈశ్వర సాక్షాత్కారమే సర్వోపద్రవ వినాశకారిణియై యున్నది. అందుచేత ఈశ్వర పాదపద్మ సేవకన్నా అన్యమగు సేవలను భక్తుడు స్వప్నములో కూడా తలపడని ఆచార్యులు తెలియజేయు చున్నారు. జగదీశ్వరునికి అంకితమైన వాని హృదిలో జగద్వ్యా మోహములు కదలగలవా? అసంభవము. జ్యోతిర్మయ స్వరూపమైన యోగేశ్వరునియందు లగ్నమైన చిత్తము భోగానుభవముల నొందుటకు ప్రయత్నించదు. వాంఛించదగినది నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వరూపమైన ఈశ్వరాను భూతియేగాని, ఈ షణత్రయ పెనుగులాట కాదు. ఇది తెలియక జీవితమును సాగించువాడు పశుతుల్యుడు. అట్టి పశుతుల్యుడైన మానవుడు పరమశివుని ప్రార్థించవలసిన విధమును రాబోవు శ్లోకములో తెలుపుచున్నారు.

స్మృతౌ శాస్త్రే వైద్యేశకున కవితా గాన ఫణితౌ
పురాణే మంత్రేవా స్తుతినటన హాస్యే ష్వచతురః
కథం రాజ్ఞాం ప్రీతిర్భవతి మయికోఽహం పశుపతే
పశుం మాం సర్వజ్ఞ ప్రథితకృపయా పాలయవిభో ॥ 5

స్మృతౌ = పరాశర, మను, యాజ్ఞవల్క్యాది స్మృతులయందుగానీ, శాస్త్రే = తర్క, వ్యాకరణాది శాస్త్రములయందుగాని, వైద్యే = వైద్యమునందుగానీ, శకున = శకునశాస్త్రమునందుగాని, కవితా = కవిత్వమునందుగానీ, గాన ఫణితౌ = గానము చేయుటయందుగానీ, పురాణే = పురాణ ప్రవచనమునందుగానీ, మంత్రేవా = మంత్రశాస్త్రమునందుగాని, స్తుతి = ప్రశంసించుటయందుగానీ, నటన = అభినయించుటయందుగానీ, హాస్యేషు = నవ్వించుటయందుగానీ, అచతురః = ప్రావీణ్యములేనివాడను, మయి = అట్టినాయందు, రాజ్ఞాం = ప్రభువులకు, ప్రీతి = ప్రియము, కథం = ఎట్లు, భవతి = కలుగును, ప్రథిత = వేదవిదుడవు, సర్వజ్ఞ = సమస్తమును తెలిసినవాడవు, పశుపతే = ఓపరమేశ్వరా! కోఽహం = నేనెవరినో (అర్థంగావి), పశుం = పశుసమానుడనైన, మాం = నన్ను, కృపయా = కృపతో, పాలయ = రక్షింపుము.

భావము :-స్మృతులయందుగానీ, వ్యాకరణాది శాస్త్రములయందుగానీ, వైద్యమునందుగానీ, శకునము నందుగానీ, కవిత్వము నందుగానీ, గానమునందుగానీ, పురాణము లందుగానీ, మంత్రశాస్త్రము నందుగానీ, శ్లాఘించుటయందుగానీ , నటించుట యందుగానీ, హాస్యప్రదర్శనలయందుగానీ ప్రావీణ్యము లేనివాడను. అట్టి నా యందు ప్రభువులకు ప్రీతి ఎలా కలుగును? నీవు వేద వేద్యుడవు; సర్వజ్ఞుడవు. నన్ను నేనెఱుగని పశువును. నీవు పశుపతివి. దయచేసి నన్ను రక్షింపుము.

వ్యాఖ్య

'విద్యలేనివాడు వింతపశువు' అను సామెత గలదు. మానవునకు విచక్షణ చేయు మనోబుద్ధులు గలవు. మనో బుద్ధులు గల మానవుడు జ్ఞానావశ్యకతను గుర్తించి, విద్యను సముపార్జించి జీవించాలి. మరి తాను గడించు విద్య ఎలాంటిదై ఉండాలి? జీవనజ్యోతిని వెలిగించునదియై ఉండాలి. అదియే ఆధ్యాత్మ విద్య. ఆధ్యాత్మముకాని విద్య ఎంత గొప్పదైనను అది నిరుపయోగ మైనదియేనని గ్రహించాలి. ఈ పరమ సత్యమునే శ్రీ శంకరులు ప్రస్తుత శ్లోకమునందు తెలుపుచున్నారు. ఆధ్యాత్మ విద్య మినహా తదితర విద్యలన్నియు అవిద్యలేయని వొక్కి వక్కాణించు చున్నారు. ఏ శాస్త్రమునందును ప్రావీణ్యత లేదని తెలియజేయుట ఆయా శాస్త్రముల యందలి నిస్సారమైన ప్రగతిని గ్రహించి గుర్తించుటయేనని మనము తెలుసుకోవాలి.

స్మృతులనెడి ధర్మశాస్త్రములు ధార్మిక, నైతిక జీవనమును క్రమపరచు సిద్ధాంతములను అందించును. ధర్మమే దేశకాల పరిధిలోనిది గాన, మానవుడాశించు అఖండానందము ధర్మావలంబనచే లభించదు. దేశ కాలాదులననుసరించి మార్పుచెందు స్మృతి ధర్మములు ఆత్మానందము నొసంగవని ఆచార్యులు భావిస్తున్నారు.

తర్క వ్యాకరణాది శాస్త్రములుకూడా శాశ్వతానందమును పంచలేవు. తర్కించు మనస్సుయొక్క స్థాయి ననుసరించి తర్కము నడచు చుండును.

భాష పరిధిలోని వ్యాకరణము, భావపరిధిలోని తర్కపరిజ్ఞానము ఈ రెండును భావాతీత జ్ఞానమును ప్రసాదించలేవు. శబ్దయుతమైన తర్క వ్యాకరణాది శాస్త్రములు నిశ్శబ్ద ప్రణవ స్వరూపమును తెలియజేయలేవని అభిప్రాయ పడుతున్నారు.

వ్యాధినివారణ కుపకరించునది వైద్యశాస్త్రము. దేహమే వ్రణతుల్యమని భావించు సాధకునకు ఔషధ సేవనమువలన లభించు శారీరకా రోగ్యము సంతృప్తి నివ్వగలదా? నీటి బుడగలా ఒకనాడు చితికిపోయే మానవ శరీరమును, వైద్యశాస్త్రము ద్వారా రక్షించ యత్నించుట నిరర్థక మని నిర్ణయిస్తున్నారు.

ప్రయాణ సమయాలలో కాకి, పిల్లి, నక్క ఇత్యాది జంతువుల, పక్షుల సవ్య, అపసవ్య గమన విధులను తెలిపి తద్వారా ప్రయాణమును నిర్ణయించు శకున శాస్త్రము ప్రేయో మార్గీయులైన లౌకిక జనులకే తృప్తి నొసంగునుగాని, శ్రేయో మార్గమున చరించు ముముక్షువులకు వాంఛనీయము కానేరదు. బుద్ధి వికసించని మూఢాత్ములనుసరించు శకున శాస్త్రము అవసర అనుసరణీయము కాదని తెలుపు చున్నారు.

గద్య, పద్యములతో, శబ్ద గుంభనముతో సాగెడి కవిత్వముగాని, మనోరంజకమగు సంగీత విభావరిగానీ, శబ్ద పరిధిలో, లయ ఫణితిలో చరించి తాత్కాలిక మానసికానందము నొసగునవియేగాని శాశ్వత సుఖాను భూతిని పంచేవి కావు. వాడిపోయే కవితా కుసుమము చిందించే సాహిత్య సౌరభము క్షణికమని వివరిస్తున్నారు. కాలములో సాగే రాగము కాలాతీత నాద సుస్వనమును అందుకోలేదని విపులీకరించు చున్నారు.

పంచ లక్షణాయుతమైన పురాణములు, శక్తి నొసగు మంత్రరాజములు విషయ వాహకములేగాని, నిర్విషయానంద భూమికలు కావు, స్తుతి పాటవములు, హాస్య ప్రదర్శనలు చౌకబారు వినోదములేగాని పరతత్త్వము నెరింగించు వికాసములు కావు.

పైన తెలిపిన విషయము లన్నిటియందును తనకు చతురతలేదని శ్రీశంకరులు తెలుపుచున్నారు. సర్వశాస్త్ర పారంగతులైన శ్రీ శంకరులు తనకు

సమర్థత లేదని అంగీకరించు పద్ధతి వినయ సూచకమేగాక, సర్వ శాస్త్రముల యందలి నిస్సార విషయములను తనకు బాగుగా జీర్ణమయ్యెనని తెలియజేయుచు శ్రీ శంకరులు అసమాన చతుర వచోనిధి అనిపించుకున్నారు.

అదియునుగాక అట్టి అసమర్థుడైన తనకు రాజప్రీతి ఎలా కలుగునని వాపోవుచున్నారు. అనగా పైశాస్త్ర ప్రభావములన్నియు ప్రభు సంభావనలు గ్రహించుటకే గాని విభుడైన శివుని అనుగ్రహమును పొందేందుకు కాదని తేటతెల్ల మగుచున్నది.

"కోహం నేనెవరినో తెలియని పశుతుల్యుడను" అంటున్నారు శ్రీశంకరులు. స్వస్వరూపజ్ఞానము లేనివాడు పశు సమానుడని భావము. సమస్త విద్యలన్నియు అపరవస్తు జ్ఞానము నందించునవియే గనుక విద్యలేని వాడు వనమృగమైనచో, లౌకిక విద్యావంతుడు సర్కస్ మృగమని భావము.

కనుక అన్యశాస్త్రములలోని నిస్సారమనుగడను అవగతము చేసుకొన్న శ్రీశంకరులు, ఆయాశాస్త్రములను చిలుకవలె వల్లించు గురువుల నాశ్రయించుట కంగీరించక వేదవేద్యుడు, సర్వజ్ఞుడైన పశుపతిని శరణుజొచ్చు చున్నాడు. 'సర్వజ్ఞ' శబ్ద ప్రయోగముచేత శ్రీశంకరులు జ్ఞానమునే అభిలషించు చున్నారని తెలియుచున్నది. అది భగవత్కృపచేతనే కలుగగలదని భావించి దయాభిక్షను వేడుటచేత భక్తిని ఆవిష్కరింప జేసుకొనుచున్నారని భావము. భక్తి జ్ఞానముల సమ్మేళనమే నిరవధిక నిర్వికల్పానందమును అందించ గలదు.

పరమశివుడు పాండిత్య ప్రకర్షలను, భాషావైదుష్యములను చూడడు. భగవత్ప్రీతికరమైనది నిష్కళంక భక్తి. హృదయ సంబంధమైన అకుంఠిత ప్రేమ భక్తి. అదియే సాధకునిలోని మాధుర్యశక్తి.

నాయనార్లు గొప్ప శివభక్తులు. వారిలో ఒకరైన తిరు నీలనక్క నాయనార్ పూజచేయుచుండెను. భక్త్యావేశముతో ఆ భక్తుడు శివలింగమునకు పూజచేయు సమయాన పై నుండి ఒక సాలెపురుగు శివలింగముపై బడెను.

శివలింగముపైబడిన ఆ సాలీడును ఆ భక్తుని సతీమణి కూడా గాంచెను. ఆమె వెంటనే వేగిరపడి ఆ సాలెపురుగును నోటితో దూరముగా ఊది, ఆ సాలీడు పడినచోట శివలింగముపై ఉమ్మివేసెను. పరమభక్తుడైన తిరునీల నక్క నాయనార్ హృది ఆ సంఘటనకు కలత చెందెను. మది విషాదభరిత మయ్యెను. పూజకు అంతటితో తెరపడినట్లాయెను. పరమ పవిత్రమగు శివలింగము అపవిత్ర మాయెననెడి భావన మదిలో స్థిర పడి పోయెను. భార్యను వదిలివేయుటకు నిశ్చయించుకొనెను.

ఆనాటి రాత్రి పరమశివుడు ఆ భక్తునికి స్వప్నదర్శన మిచ్చెను. నాయనార్ పూజించెడి శివలింగమును ఆ స్వప్నములో దర్శించునట్లు చేసెను. సాలీడు పడుటచేత శివలింగ మంతయు బొబ్బలు, పొక్కులు లేచియుండెను. ఆ మహాసాధ్వి ఉమ్మివేసిన ప్రదేశము మాత్రము యధా ప్రకారము శోభించుచుండెను. ఆ మహాతల్లి భక్తి పరాకాష్ఠను శివుడు తన భక్తుని కెరింగించగా, మేలుకొనగానే పశ్చాత్తాపముతో నాయనార్ కదిలిపోయెను.

ఈ సంఘటన జ్ఞానము కన్నను భక్తికిగల ఆవశ్యకతను నిరూపించు చున్నది. అందుచేత సర్వశాస్త్రములను విస్మరించి సర్వశాస్త్రాధారుడైన సర్వేశ్వరుని స్మరించి తరించుటకు ఉపాయమును ఈ శ్లోకంలో శ్రీశంకరులు తెలుపుచూ, రాబోవు శ్లోకములో వాదోప వాదముల సారహీనతను గుర్తించమని తెలియజేయుచున్నారు.

ఘటోవా మృత్పిండోఽప్యణు రపి చ ధూమోఽగ్ని రచలః
పటో వా తంతుర్వా పరిహరతి కిం ఘోర శమనమ్
వృథా కంఠక్షోభం వహసి తరసా తర్కవచసా
పదాంభోజం శంభోర్భజ పరమ సౌఖ్యం వ్రజసుధీః 6

సుధీః = సద్బుద్ధి గలవాడా! ఘటోవా = కుండగానీ, మృత్పిండోపి = మట్టిముద్దగాని, అణురపి = పరమాణువులుగాని, ధూమః = పొగగాని, అగ్నిః = నిప్పుగాని,

అచలః = చలించని పర్వతముగాని, పటోవా = వస్త్రముగాని, తంతుర్వా = దారముగాని, ఘోరశమనం = భయంకరమగు మృత్యువుని, పరిహరితికిం? = పోగొట్టునా ఏమి? తర్కవచసా = తర్కపలుకులచే, వృధా=వ్యర్థముగా, కంఠ క్షోభం=గొంతుకకు బాధను, వహసి = కల్గించుకొనుచున్నావు, శంభోః = శంభుని యొక్క, పదాంభోజం = చరణయుగ్మమును, భజ = సేవింపుము, తరసా = త్వరితముగా, పరమ సౌఖ్యం = మోక్షప్రాప్తిని, వ్రజ= పొందుము.

భావము :- ఓ సద్బుద్ధీ! కుండగాని, మట్టిగాని, అణువుగానీ, ధూమము గానీ, నిప్పుగానీ, కొండగానీ, వస్త్రముగాని, దారముగానీ భయంకరుడగు యముని నివారించలేవు. తర్కమునకు లోనై కంఠశోషను పొందకుము. పరమేశ్వరుని చరణ కమలములను ధ్యానించి పరమ సుఖమును పొందుము.

వ్యాఖ్య


వేదాంత శాస్త్రమును చక్కగా అవగతము చేసికొనుటకు తర్క శాస్త్రము అవసరము. అవసరము గనుక అవసరమున్నంత వరకే వినియోగించుకోవాలి. వంటలో ఉప్పులాగా, కంటిలో కాటుకలాగా వేదాంతంలో తర్కము నిండియుండాలి. విషయమును విస్మరించి, తర్కమునే అనుసరించువారు నేలవిడిచి సాముచేయు మహితాత్ములు. వాదములలో చిక్కి ప్రసాద మనస్తత్త్వమును పాడు చేసుకోరాదు. మార్గమైన వాదము ఏ గమ్యము వైపు నడువవలసి యున్నదో దానిని సాధకులు మరువకూడదు. సాధకుడు వేదమూర్తి కావాలేగాని వాదమూర్తి కాకూడదు. వాదమొక బాహ్యానినాదమై ఆంతరంగిక సునాదమును మూగబోవునట్లు చేయును. వాదప్రతివాదసారహీనతను గుర్తించి, కంఠశోషను మాని నీలకంఠుని పదాంబుజములను నమ్మి నడువమని ఆచార్యులు ఈ శ్లోకమునందు తెలియజేయుచున్నారు.

ఈ విశ్వమెలా ఆవిర్భవించినది? దీనికి కారణమేమి? అనునది శాస్త్రము నందు గణనీయమైన క్లిష్ట సమస్యగా గోచరిస్తూ వుంటుంది. దీనిపై అనేకులు అనేక విధములైన వాదములను సాగిస్తుంటారు.

ఈ జగత్తు ఆవిర్భవించుటకు కారణమున్నదా? అది జడమా? చైతన్యమా? కారణమంటూవుంటే అది ఏకమా? బహుళమా? అనేకమా? ఈ మీమాంసకు అనేక సంప్రదాయకుల నుండి అనేక నిర్వచనాలు అందాయి.

ప్రపంచము యాదృచ్ఛికమే గనుక దాని వెనుక ఏ కారణము వుండ నవసరము లేదని, ఈ విశ్వంలో నడచు ప్రతి కర్మ యాదృచ్ఛికమైన దేనని యాదృచ్ఛికవాదము (accidentalism). అసలు రెండు వాహనములు ఢీ కొనుట కూడా సంఘటనాధీనమే కాని యాదృచ్ఛికమనేదే జగత్తులోలేదు అని మరొక వాదన. దీనిని స్వభావవాదము అంటారు (naturalism). అయితే జగత్తుకు స్వభావతః జగత్తే కారణమై యున్నది అని వీరి అయోమయ వాదము. చార్వాక మతము నిరీశ్వర వాదమును నిర్ణయము చేయుచూ భూమి, నీరు, నిప్పు, గాలి అనెడి నాలుగు భూతములే సర్వము అని తెలిపిరి. గౌతముని న్యాయము, కణాదుని వైశేషికము పరమాణువుల సముదాయమే సృష్టి అనియు ఈ అణువులను చలింపజేయు శక్తి భగవంతుడనియు నిర్ణయము చేయుట జరిగినది. కపిల మహర్షి సాంఖ్యము ప్రధానమను దానిని ప్రవేశపెట్టి, భగవ దవసరము సృష్టికి లేదనియు పురుష ప్రకృతి సంయోగమునందు సృష్టి కదిలినదని నిర్ధారణ చేసెను. కొందరు భగవానుడు జగత్తుకు నిమిత్త కారణ మనియు, ప్రకృతి ఉపాదానమని చెప్పగా అది భగవానుని అనంతత్వమునకు భంగము వాటిల్లునట్లు చేయుట చేత నిమిత్త ఉపాదాన కారణములు రెండునూ భగవానుడేయని మరొకరి వాదము. ఈ వాద శాస్త్రములు, మొండి యనెడి పిడిని తగిలించుకొని, వడివడిగా నడిచి, సుడిని సృష్టించి మనల నందులో పడదోస్తాయి.

కుండకు మట్టి కారణమైనట్లు జగత్తుకు కారణమెవరు? అణువులచే జగత్తు ఆవిర్భవించినదా? ధూమము అగ్నిని గుర్తుతెచ్చునట్లు కార్య రూపమైన ఈ జగత్తు కారణస్వరూపమైన భగవానుని గుర్తుతెచ్చుట లేదా? చలించు ధూమము తెలియునట్లు, అచలమగు పర్వతము కూడా తెలియుచున్నదికదా? దారములతో వస్త్రము తయారైనది. దారములకన్నా వేరుగా వస్త్రము ఉన్నదా?



వస్త్రము నుండి దారపు పోగులను వేరు చేసినచో వస్త్రము మిగులునా? మరి సృష్టికి దారమువలె ఉపాదాన మెయ్యది?

ఈ వైవిధ్య ప్రపంచాన్ని యాదృచ్ఛికము అనేందుకు వీలులేదు. ఒకవేళ అలా అంగీకరించినా ఈ విశ్వము యాదృచ్ఛికము యొక్క ఫలితమే గనుక యాదృచ్ఛికమును కారణమని అంగీకరించుటయే జరుగుచున్నదికదా? జగత్తుయే జగత్తునకు కారణమను స్వభావ వాదముకూడా సరియైనదికాదు. జడమైన జగత్తు తానే కార్యకారణాలయ్యేందుకు వీలులేదు. అణువులుగానీ, పరమాణువులుగానీ, పంచభూతాలుగానీ, లేదా చతుర్భూతములుగానీ, కారణమయ్యేందుకు వీలులేదు. వాటికి జ్ఞానము లేనందున కారణములు కాజాలవు. భగవానుడు కేవలం నిమిత్త కారణమే అనేందుకు వీలులేదు. ఉపాదానము మరియొక టైనచో భగవంతుడు పరిమితుడగును.

కనుక వేదాంతము సృష్టివాదము నంగీకరించదు. శైశవదశ జ్ఞానములో యున్నవారి కొరకు తెలుపబడిన సృష్టి వాదము సత్యద్రష్టలైన వేదాంతాచార్యులకు పేలవంగా గోచరిస్తుంది. బ్రహ్మముయొక్క వివర్తమే జగత్తు. అదొక గారడి వానిచే చూపబడిన వస్తువులాంటిది. బ్రహ్మమొక్కటియే సత్యము. జగత్తు మాయా జనితము. వేదాంతముచే సత్యవస్తు నిర్ణయము ఇలా జరుగుచుండ ఆవేశజనిత అనర్థతర్కములతో జీవితమును వమ్ముచేసుకొనుచున్న అయోమయ జీవులను హెచ్చరిస్తూ, లేని జగత్తు ఎలా ఉద్భవించింది? అని తర్కించుచు కాలయాపన చేయుటకన్నా ఉన్న సత్య వస్తువును చింతన చేయుచూ తరించమని శ్రీశంకరులు తెలియజేయుచున్నారు. వ్యర్థమైన చర్చలు జీవితమును వృథాచేయకపోవు. వీటివలన మిగిలేది కంఠశోషయే. కంఠశోషమాత్రమే మిగిల్చి జ్ఞాన మార్గంలో కంటకమై నిలిచే తర్కముకన్నా, నీలకంఠుని పదాంబుజములనే ధ్యానించి తరించమని తెలుపుతూ మనస్సును ఈశ్వరధ్యానమునందు లయింప జేయు విధమును రాబోవు శ్లోకమునందు తెలుపుచున్నారు.

మనస్తే పాదాబ్జే నివసతు వచస్స్తోత్ర ఫణితౌ
కర శ్చాభ్యర్చాయం శృతిరపి కథా కర్ణనవిదౌ
తవధ్యానే బుద్ధిర్నయన యుగళం మూర్తివిభవే
పరగ్రంథా న్కైర్వా పరమశివ జానే పరమతః ॥ 7

పరమశివ = హే! పరమేశ్వరా!, మనః = నామనస్సు, తే = నీయొక్క, పాదాబ్జే=పాదపద్మముల యందును, వచ = వాక్కు, స్తోత్రఫణితౌ=స్తుతించుటయందును, కర = హస్తములు, అభ్యర్చాయాంచ = అర్చించుటయందును, శృతిః = చెవులు, కథాకర్ణనవిదౌ = కథాశ్రవణమునందును, బుద్ధిః = బుద్ధి, తవ = నీయొక్క, ధ్యానే = ధ్యానమునందును, నయనయుగళం = కన్నుదోయి, మూర్తివిభవే = రూపవైభవమునందును, నివసతు = ఉండుగాక! అతఃపరం = ఆ తరువాత, కైర్వా = ఏ ఇంద్రియములు, పరగ్రంథాన్ = నీకన్యమగు గ్రంథములను, జానే = తెలుసుకొనును?

భావము :- హే పరమశివా! నామనస్సు నీ పాదకమలముల చెంతను, నావాక్కు నిన్ను స్తుతించుటయందును, నా హస్తములు నిన్ను అర్చించుటయందును, నా చెవులు నీ కథాశ్రవణము చేయుట యందును, నా బుద్ధి నిన్ను ధ్యానించుట యుందును, నా నేత్ర యుగము నీ రూపవైభవమును గాంచుట యందును సదా ఉండుగాక! ఆ తదుపరి నీ కన్యమగు గ్రంథములను ఏ ఇంద్రియములు తెలుసుకొనును?

వ్యాఖ్య

తర్కములు, వాదములయొక్క నిస్సార ఉనికిని గడిచిన శ్లోకములో తెలియజేసిన శ్రీ పూజ్యపాదులు, అలా నిరర్థకంగా కొనసాగే ఇంద్రియ మనోబుద్ధులను పశుపతియైన పరమేశ్వరునిపై మళ్ళించి, తరించు ప్రక్రియలను ఈ శ్లోకంలో తెలియ జేయుచున్నారు.

ప్రారబ్ధవశాత్తు పాంచ భౌతికదేహం మనకు ప్రాప్తించినది. ప్రారబ్ధాధీనమై అరుదెంచిన శరీరముతో ప్రారబ్ధ కర్మఫలమును అనుభవించుచు, పురుషార్థము ద్వారా భగవానుని చేరువగుటయే ప్రతి సాధకుని ముఖ్య కర్తవ్యమైయున్నది.

ప్రారబ్ధాధీనమైన దేహము ప్రారబ్ధ కర్మఫలములవైపు నడక సాగించు లాగునవే, ఆ దేహమందలి ఇంద్రియ మనోబుద్ధులు కూడా కర్మవలయములో తగుల్కొనేందుకే ప్రయత్నించు చుండును. అన్యమార్గముల చరించి అన్యాయమగు దేహేంద్రియ మనోబుద్ధులను అనన్యచిత్తముతో ఆదిదేవునియందు ఉంచు పద్ధతి ఈ శ్లోకములో స్వచ్ఛంగా తెలుపబడినది.

బహిర్ముఖమై, వస్తుప్రపంచములో తగుల్కొని అల్లాడే మనస్సును శివ పాదాబ్జములయందు సదావుండవలెనని శ్రీ శంకరులు ప్రార్థించుచున్నారు. నానారుచుల ననుభవించుటకు ఉవ్విళ్ళూరే మనస్సును అంతర్ముఖంచేసి, సర్వవస్తువులు ఒకే పరమాత్మయందు ఎలాచోటుచేసికొని యున్నవో గ్రహించే స్థితిని మనస్సుకు అందించాలి. దానికి నిరంతర ఈశ్వర ప్రణిధానమే శరణ్యము. బాహ్యమునందు కర్మాచరణ సాగించి నపుడు కూడా మనస్సును ఈశ్వరుని చరణ కమలములయందే ఉంచుకొను ఉన్నతస్థితిని సదాకల్గియుండాలి.

మనస్సు పరమేశ్వరుని అంఘ్రియుగ్మము చెంత ఊరట చెందుతుండ, అట్టి దివ్యానుభూతిని గూర్చియే వాక్కు మాట్లాడగలగాలి. ప్రపంచములో లౌకిక వ్యక్తుల మధ్యన మనం జీవించవలసినను, వారితో ముచ్చటించు సందర్భాలలో, యుక్తరీతిన మధ్య మధ్య భగవత్ప్రసక్తిని, భగవత్కారుణను ప్రస్తావించుచు, మన మనస్సు విషయ సుడిగుండములో తగుల్కొనకుండా జాగ్రత్త వహించుటయేగాక, ఎదుటి వారి మనస్సులలో కూడా భగవద్భావనను నింపే ప్రయత్నమును సాధకుడు సాగించాలి. భగవంతుని స్తుతించే మనస్సు ఇంద్రియ విషయ ప్రస్తావనలలో తలదూర్చే ప్రమాదము లేకుండా చూసుకోవాలి.

మనస్సు భగవంతుని స్మరించేందుకు, వాక్కు స్తుతించేందుకు ఉన్నట్లే కరములు భగవంతుని అర్చించేందుకే ఉన్నవని గ్రహించాలి. ఇచ్చట అర్చించుట యనగా అర్ఘ్యమధుపర్క, నైవేద్యాలతో పూజించుట అనియేగాక, భగవంతుని సృష్టిలోని ప్రతిప్రాణిని భగవద్భావనతో వీక్షించి, సేవించుటయని భావము.

అర్చన అనగా పూజయే అని భావించినచో, దినమంతయు మనం పూజాగదిలో అర్చిస్తూ కూర్చొనే అవకాశమున్నదా? అలాలేకుండా, పూజయనేది ఏదో ఒక గంటకు పరిమితమైనచో, మిగతా కాలమంతా వృథా అయినట్లేకదా! అందుచేత అర్చన పూజాగదికే పరిమితము గాక సదా ఆచరించి, తద్వారా సదానందానుభూతిని అనుభవించేదై యుండాలి అని శంకరుల భావము.

కరములు భగవత్సేవయందు పునీతమగుచుండ, కర్ణములు భగవద్గుణ శ్రవణమునందు ఓలలాడుతూ ఉండాలి. నిరంతరము భగవద్విషయమునే విను అలవాటును సాధకుడు కల్గియుండాలి. శ్రవణము చేయు అవకాశము లభించనపుడు, పఠించుటకూడా శ్రవణమే అవుతుంది. శ్రవణము చేయునపుడు మనకు బోధించు వ్యక్తి పరమశివుడే అను భావనను కలిగియుండాలి. గ్రంధమును చేతనుంచుకోగానే ఆలయములో ఉన్నామనే భావనను కల్గియుండాలి.

కర్ణములద్వారా మనస్సునకు చేరిన భగవద్విషయమును విచారించు బుద్ధితో ధ్యానించి తరించాలి. కేవలం మనోస్థాయికి మాత్రమే పరిమితమైన విషయము నిత్యా నందమును ప్రసాదించలేదు. బుద్ధిలో స్థిరపడిన విషయమే అనుభూతిని అందించగలదు. బుద్ధిలో ఏర్పడిన జ్ఞానమునే ఆ తరువాత సాధకుడు బాహ్యంలో దర్శించాలి. ఈ విషయమును శ్రీశంకరులు రూపవైభవ దర్శనమని ఆ తరువాత తెలియజేయుచున్నారు.

సాధకుని కన్నుదోయి సదా భగవానుని దివ్యమూర్తిని దర్శిస్తూ వుండాలి. విగ్రహములోను, ప్రతీకములోను పరమశివుని దర్శించమని దాని భావముకాదు. ప్రతిరూపము భగవంతుని రూపమేననియు, ప్రతి శబ్దము ప్రణవనాదమే ననియు, గ్రహించి సమదర్శన వీక్షణమును కల్గి యుండుటయే రూపవైభవ దర్శనము. ఈ విధముగా దేహేంద్రియమనో బుద్ధులు ఈశ్వర ప్రణిధానమునందే ఉండునట్లు సాధకుడు జాగరూకుడై ఉండవలెనని శ్రీశంకరులు తెలుపుచు, అట్టి స్థితి ప్రాప్తించిన పిదప శివుని కన్నను అన్యమగు గ్రంథముల అవసరము

ఉండదనియు, అలాంటి జ్ఞాన రహిత విషయముల యందు శివ భక్తుని చిత్తము రమించదనియు ఆచార్యులు తెలియజేయుచు, శివుని యందు భక్తి కుదరని కుమతి యొక్క దుర్గతిని తదుపరి శ్లోకమున తెలుపుచున్నారు.

యథా బుద్ధి శ్శుక్తౌ రజతమతి కాచాశ్మని మణి
ర్జలే పైష్టే క్షీరం భవతి మృగతృష్ణాసు సలిలమ్
తథా దేవభ్రాంత్యా భజతి భవదన్యం జడజనో
మహాదేవేశం త్వాం మనసి చ న మత్వా పశుపతే 8

మహాదేవ = మహేశ్వరా!, పశుపతే = సర్వభూతనాథా!, జడజనః = జడుడైన మానవుడు, ఈశం = ప్రభువైన, త్వాం = నిన్ను, మనసి = చిత్తమునందు, నమత్వా = భావింపక, శుక్తౌ = ముత్యపు చిప్పయందు, రజతం = వెండి, ఇతి = అనియు, కాచాశ్మని = గాజుజాతియందు, మణిః = మాణిక్యమును, పైష్టే = పిండిగల, జలే = జలమునందు, క్షీరం = పాలను, మృగతృష్ణాసు = ఎండమావులయందు, సలిలమ్ = జలమును, బుద్ధిః= మిథ్యాబుద్ధి, యథా = ఏ విధముగా, భవతి = కలుగుచున్నదో, తథా = అలాగుననే, భవదన్యమ్ = నీకన్యమగువానిని, దేవభ్రాన్త్యా = దేవుడను భ్రాంతిచేత, భజతి = సేవించుచున్నాడు.

భావము :- మహాదేవ! పశుపతే! జడమతియగు మానవుడు ముత్యపు చిప్పను జూచి వెండియనియు, గాజు జాతిని మణియనియు, పిండినీళ్ళను పాలనియు, ఎండమావులు జలమయములనియు భావించునట్లు, ఈశ్వరుడవగు నిన్ను పరమాత్మయని భావింపక, నీకన్యమగు దేవతలను భ్రాంతితో భజించు చున్నాడు.

సత్యము తెలియని దశలో అసత్యమే సత్యముగా తెలియును. ఇదియే భ్రాంతి, మాయ, అధ్యాస, అజ్ఞానము అనెడి నామములతో తెలియుచున్నది. ముత్యపుచిప్పను జూచి దానిలో తెలిపెడి రజత వర్ణమును గాంచి భ్రమించిన మానవుడు దానిని వెండియని భ్రమించును. అలాగే పిండి కలిసిన నీటిలో గోచరించెడి శ్వేత వర్ణమును జూచి భ్రమించిన మందమతి పిండి నీటిని

జలమని భావించును. గాజు ముక్కల యందలి ప్రకాశమును దర్శించి భ్రమ చెందిన జడుడు దానిని మాణిక్యమని తలచును. మృగ తృష్ణను జూచి జలాశయమని భావించు వానికి ఎండమావి తెలిసిరాదు. ఇవన్నియు వాస్తవములు కావు. సంకల్పములే గాని సత్యములు కానేరవు. జ్ఞానము లేని దశలో తెలిసెడి ఈ అయోమయ దృశ్యములు విసర్జనీయములే గాని విలోకించ దగినవి కావు.

పరమాత్మయగు పరమశివుడు ముత్యపు చిప్పవలె సత్యము. ఆ మహానుభావునికి అన్యముగా తెలియ వచ్చెడి దేవతా గణములు అసత్యములు. ఈ రహస్యమును గుర్తించి, గ్రహించలేని మూర్ఖమానవుడు అల్ప బుద్ధితో స్వల్పవాంఛలకు గురియై, అన్య దేవతల నారాధించువాడై పరమ శివుని పరిత్యజించును. నిజ భక్తుడు నటరాజమూర్తిని వదలి అన్య దేవతలను ఆరాధించే అయోమయ స్థితికి దిగజారడు.

ఇతర లోకములకు పయనించ నిచ్ఛగించువారు అన్యదేవతల నారాధించెదరు. కానీ సర్వలోకములు శివుని యందే అంతర్లీనములని గ్రహించిన శివ భక్తుడు అన్యదేవతల నెలా ఆరాధించగలడు? ఎందులకు ఆరాధించాలి? వివిధములైన వాంఛలతో సతమతమయ్యే అయోమయ జీవులు కోరికల నీడేర్చుకొనుటకు అన్యులైన వారి నారాధించెదరు. కానీ నిజ భక్తునికి శివారాధనలో సర్వాభీష్టములు నెరవేరు చున్నవి.

అడుగం బోనిఁక నన్యమార్గ రతులం బ్రాణోపనోత్సాహి నై
యడుగం బోయినఁ బోదు నీదుపద పద్మారాధక శ్రేణియు
న్నెడకుం, నిన్ను భజింపఁగా గనియు నాకేలా పరాపేక్ష? కో
రెడిదేమింక? భవత్ప్రసాదమ తగుం శ్రీకాళహస్తీశ్వరా!

అని ధూర్జటి మహాకవి శ్రీకాళహస్తీశ్వర శతకము నందు ప్రార్థించినాడు. ప్రాణములను రక్షించుకొను సమయము ఆసన్నమైనపుడు కూడా అన్యుల నాశ్రయించుట లేదని తెలుపుచున్నాడు. అనన్య భక్తి తత్పరునకు అన్యాశ్రయము అననుసరణీయము. ఒకవేళ యాచించవలసిన స్థితి ఏర్పడినచో నీ పాదార్చకులైన

శివభక్తుల కడకేగెదను అంటున్నాడు. శివభక్తుల వద్ద ఏమి లభిస్తుంది? శివ సాయుజ్యమేకదా? శివ భక్త సన్నిధియే నిజమైన పెన్నిధియని భావిస్తున్నాడు. పరమశివుని కరుణను వాంఛించు వానికి అన్య రాగము లుండవని తెలుపుతున్నాడు. మరి శివుని దయను పొందవలె నన్నచో శివ కైంకర్యము సాగించవలెను గదా? శివుని ఎలా పూజించవలెను? ఏ సుమములతో అర్చించవలెను? శివునికి ప్రీతి నొసంగు సుమమెయ్యది? రాబోవు శ్లోకమే చక్కని సమాధానము.

గభీరే కాసారే విశతి విజనే ఘోర విపినే
విశాలే శైలేచ భ్రమతి కుసుమార్థం జడమతిః
సమర్ప్యై చేత స్సరసిజ ముమానాథ భవతే
సుఖే నావస్థాతుం జన ఇహ న జానాతి కిమహో 9

జనః = మానవుడు, జడమతిః = మందమతియై, కుసుమార్థం = సుమములకొరకు, గభీరే = లోతైన, కాసారే = తటాకమువందు, విశతి = కాలిడుచున్నాడు,విజనే = జనులులేని, ఘోర = భయంకరమైన, విపినే = అరణ్యమునందును, విశాలే = విశాలమైన, శైలేచ = పర్వతము నందును, భ్రమతి = పరిభ్రమించుచున్నాడు, హే ఉమానాథ = హే ఉమాపతీ!, ఏకం = ఒక్క, చేతస్సరసిజం = మనస్సనెడి పద్మమును, భవతే = నీకొరకు, సమర్ప్య = సమర్పించి, ఇహ = ఇచ్చట, సుఖేన = సుఖముగా, అవస్థాతుం= స్థిరుడై ఉండుటకు, న జానాతి = తెలియలేకున్నాడు, కిమహో = ఏమి ఆశ్చర్యము?

భావము :- హే ఉమాపతీ! మందమతియైన మానవుడు నిన్ను పూజించవలెనని పూలకై లోతైన చెఱువులలో దిగుచున్నాడు. జనులులేని భయంకర అరణ్యములందు పరిభ్రమించు చున్నాడు. విశాలమైన పర్వతములందు చరించు చున్నాడు. కానీ మనస్సనెడి కమలమును నీకు సమర్పించి సుఖపడవలెనని భావింపలేకున్నాడు కదా!

వ్యాఖ్య

ముముక్షువులు మనస్సును శుద్ధి చేసుకొని, దానిని భగవంతునివైపు మఱలించుటకు అధికముగా శ్రమించు చుందురు. ఎంతగా పరిశ్రమించినను

సఫలీకృతులు కాలేక నీరసించు చుందురు. భగవంతుడు బాహ్య ప్రదర్శనలను వాంఛించడు. చిత్తమును దర్శించి అనుగ్రహించును. విశేష పూజలను గాంచి పరమాత్మ సంతసించడు. విషయ వాసనలు దూరమైన చిత్తమును తాను స్వీకరించును. నిర్మలమైన చిత్తమును పరమాత్మకు సమర్పించను అశక్తులైనవారు గావించే విశిష్టారాధన లన్నియు నిష్ప్రయోజనములే యని శ్రీ శంకరులు తెలియ జేయుచున్నారు.

మందమతులైన మానవులు భగవత్పూజకు పూలను సేకరించుటకు లోతైన చెఱువుల యందు దిగుచుందురు. భయంకరమైన నిర్జన ప్రదేశముల యందు పరిభ్రమించు చుందురు. విశాల పర్వతములపై సంచరించు చుందురు. కానీ చిత్తమనెడి సరోజమును సమర్పించి సుఖించలేక పోతున్నారు గదా? యని శ్రీ శంకరులు విస్మయమొందుచున్నారు.

ప్రతి వ్యక్తి పరిపూర్ణ శాంతి నొందవలెనని అభిలషించును. అదియే పరమాత్మ స్వరూపము. శాంతి యనెడి పరమాత్మను పొందుటకు కర్మ యనెడి పూజను చేయును. ఈ ప్రయత్నములో సంకల్పము లనెడి సుమములను సమీకరించు కొనుటకు యత్నించును. లోతైన చెఱువుల యందు దిగును. సంసారమే లోతైన చెఱువు. ఈ సంసార తటాకమునందు ఈదులాడుటయే దేహాత్మ భావము. దేహస్థాయిలో ఎంతగా వెదికినను పరమాత్మ లభ్యము కాదు.

దేహమే ఒక మృణ్మయ భాండము. కార్బన్, కాల్షియం, ఫాస్ఫరస్, నైట్రోజన్ మొదలగు వాటిని నింపిన పాట్లమే శరీరము. ఇది పరిమితమైనది. పరిణామ శీలమైనది. పరిమితమై, పరిణామ శీలమైన దేహము పరిపూర్ణ శాంతి నెలా అందించగలదు? కనుక దేహాత్మభావముతో సంసార తటాకమున బడి ఎంతగా ఈదినను ప్రయోజనము శూన్యమే కాగలదు. అలా నిరాశ చెందిన వ్యక్తి భయంకరమైన అరణ్యముల యందు ప్రవేశించును.

అజ్ఞాన చీకట్లతో, అభిమాన తీగలతో, రాగద్వేషములనెడి శాఖలతో దట్టమైన అంతఃకరణయే భయంకరారణ్యము. అదొక మాయా సుడి గుండము.

ఎఱ్ఱగా నిప్పువలె ప్రకాశించు మందారము నందు ఉష్ణము ఎలా లేదో మనస్సు నందు శాంతి కూడా అలాంటిదే. సమస్త దుఃఖములకు నిలయమైన మనస్సనెడి అరణ్యములో శాంతి ఎలా లభ్యమగును? అట్టి స్థితిలో విచిత్ర వైఖరి గల మానవుడు విశాల పర్వతములపై సంచరించును. మనస్సు కన్నను విశాలమైనది బుద్ధి. బుద్ధిలో శాంతిని అన్వేషించుటయే విశాల గిరులపై పరిభ్రమించుట యని గ్రహించాలి. విశాలముగా గోచరించెడి బుద్ధి కూడా విజ్ఞానమయ కోశమే గనుక శాంతిని పొందుటకు అది కూడా పరిమితమైనదియే.

ఆహా! భగవత్పూజకు సుమములను సేకరించుటకు మానవుడు ఇన్ని అగచాట్లు పడుతున్నాడేగాని అర్చన భావముతో, అంకిత భావముతో మనస్సనెడి పద్మమును పరమాత్మకు సమర్పించ లేకున్నాడు గదా! అని శ్రీశంకరులు విస్మయమొందుచున్నారు.

శివునికి ప్రీతికరమైనది చిత్తసరోజము. మహేశ్వరునకు ఎవరయితే వారి మనస్సును సమర్పించెదరో అట్టివారు మంగళకరమైన ఆత్మజ్ఞానమును పొంది తరింతురు.

చిత్త సరోజమును పరమేశ్వరునికి సమర్పించు జన్మమే ధన్యము. అట్టి జన్మ ఎలాంటిదైనను వాంఛనీయమే. ఈ విషయమును రాబోవు శ్లోకములో ధృవపరచు చున్నారు.

నరత్వం దేవత్వం నగవన మృగత్వం మశకతా
పశుత్వం కీటత్వం భవతు విహగత్వాది జననమ్
సదా త్వత్పాదాబ్జ స్మరణ పరమానంద లహరీ
విహారాస క్తం చేద్హృదయమిహ కిం తేన వపుషా 10

నరత్వం = నరుడుగా గానీ, దేవత్వం = దేవుడుగా గానీ, నగ = పర్వతము, వన = అడవిగా, మృగత్వం = మృగముగా గానీ, మశకతా = దోమగా గానీ, పశుత్వం = పశువుగా గానీ, కీటత్వం = కీటకముగా గానీ, విహగత్వాది = పక్షులు మొదలగునవిగా గానీ,

జననం = జననము, భవతు = అగుగాక! హృదయం = హృదయము, ఇహా = ఈ జన్మలయందు, సదా = నిరంతరము, త్వత్ = నీయొక్క, పాదాబ్జ = పాద పద్మముల యొక్క, స్మరణ = చింతనము, పరమానంద = గొప్పదియగు ఆనందము యొక్క, లహరీ= ప్రవాహము నందు, విహార = విహరించుటకు, ఆసక్తం = ఆసక్తి, భవతిచేత్= కలిగినచో, తేన = ఆ, వపుషా = శరీరముచేత, కిం = ఏమి?

భావము :- మానవుడు, దేవుడు, పర్వతము, కొండలపైన, అరణ్యములలోను సంచరించు మృగము, దోమ, పశువు, కీటకము, పక్షి మొదలగు జన్మలు కలిగిన కలుగుగాక.నా హృదయము సదా నీ పాదపద్మస్మరణము యనెడి పరమానంద లహరిలో విహరించుటకు ఆసక్తి కలిగియున్నచో ఏవిధమైన దేహము లభించిన నేమి?

వ్యాఖ్య

పరిస్థితులు మన ఆధీనములో నుండవు. కానీ ప్రవర్తన మన ఆధీనమే. ప్రారబ్ధము ననుసరించి జన్మ వచ్చును. పురుషార్థము ప్రవర్తనను సరిజేయును. జీవితము మన చేతికి రాదు. కానీ జీవనము ద్వారా జీవన గతులను మార్చవచ్చును.

గత కర్మాను సారము మనకు జన్మ వచ్చును. ప్రారబ్ధము ననుభవించుటకు జన్మ వచ్చినది. కనుక ప్రారబ్ధానుభవము అనివార్యము. మరి ప్రారబ్ధమును అనుభవించునదెవరు? మనస్సు. అట్టి మనస్సు పరమాత్మ స్మరణ మనెడి శ్రేష్ఠమగు ఆనంద ప్రవాహమున విహరించునపుడు అది చైతన్యమే అయి ఉన్నది. చైతన్యమునకు తెలియునది చైతన్యమే గాని అన్యము కానేరదు. అట్టి దశలో జీవి శరీరము ఎలా ఉండినను ఒక్కటే. దేహభ్రాంతి లేని జీవికి దేహమెక్కడిది? దైవ చింతన కలిగిన మనస్సునకు దేహత్వమెక్కడున్నది? సముద్రమును చేరిన నది తన నామ రూపములను ఎలా పోగొట్టుకొను చున్నదో, చైతన్యము నందు లయించిన జీవి దేహేంద్రియ మనో బుద్ధుల పరిధి నుండి విడిపడుచున్నాడు. శ్రేష్ఠమైన ఆనంద ప్రవాహములో ఈదులాడు చున్నాడు. ఈ దశలో దేహ భేదములు అనూహ్యములు.

జీవికి దేహమున్నది. కానీ జీవత్వమునకు దేహము లేదు. మనిషికి దేహమున్నది. కానీ మానవత్వమునకు దేహము లేదు. భక్తునికి దేహమున్నది. కానీ భక్తికి లేదు. కనుక వాంఛించ దగినది భక్తియే గాని దేహాదులు గావు. రూప జీవనము కన్నను జీవన రూపమే శ్రేష్ఠమైనది.

"నాస్తి తేషు జాతి విద్యా రూప కుల ధనక్రియాది భేదః"

"భగవద్భక్తులయందు జాతి, విద్య, రూప, కుల, ధన క్రియాది భేదములు లేవు" అని నారద మహర్షి భక్తి సూత్రాలలో తెలియ జేసినారు.

దేహస్థాయిలో ఉన్నంతవరకు దివ్య స్థితి తెలిసిరాదు. దివ్య స్థితిలో రమించునపుడు దేహ స్థితి తెలిసిరాదు. దేహ స్థాయిలో భేద దర్శనము అనివార్యము. చైతన్యస్థాయిలో అభేదమే అనుభవము. కనుక దేహము ఏ విధమైన దైనను భక్తిని ప్రసాదించమని ప్రార్థించు చున్నారు.

సాలెపురుగు, పాము, హస్తి పరమ శివుని ధ్యానించి తరించినట్లు శ్రీకాళహస్తి క్షేత్రమహిమ తెలుపు చున్నది. తిన్నడు బోయవాడైనను పరమ శివుని అనుగ్రహమునకు పాత్రుడాయెను. నంది పశువు యైనను శివుని నేత్రముల ముందుంచుకొనినది. ప్రథమ పూజలందుకొంటున్నది. కనుక ఏ జన్మయైనను భక్తి కలిగినచో నిష్ఫలము కానేరదని తెలుపుతూ భక్తికి వర్ణాశ్రమ ధర్మాదులు కూడా అవాంఛనీయమే నని రాబోవు శ్లోకమున తెలుపుతున్నారు.

వటుర్వా గేహీవా యతిరపి జటీవా తదితరో
నరోవా యః కశ్చిద్భవతు భవ కిం తేన భవతి
యదీయం హృత్పద్మం యది భవ దధీనం పశుపతే
తదీయ స్త్వం శంభో భవసి భవభారం చ వహసి 11

నరః = నరుడు, వటుర్వా = బ్రహ్మచారి యైనను, గేహీవా = గృహస్థుయైనను, యతిరపి = సన్యాసి యైనను, జటీవా = జడధారియైనను, తదితరః యః కశ్చిత్ = మరి ఎవడైనను గాని, భవతు = అగు గాక! తేన = దాని చేత, హేభవ = పరమేశ్వరా!

కిం భవతి? = ఏమియగును?, యదీయం = ఎవని యొక్క, హృత్పద్మం = హృదయ కమలము, భవ దధీనం యది = నీ యధీనమై ఉండునో, తదీయః = తత్సంబంధీయుడువై, త్వం = నీవు, భవసి = అయ్యెదవు, హే శంభో = శివా!, భవ భారం చ = వాని సంసార బరువు నంతటిని, వహసి = వహించెదవు.

భావము :- హే పరమేశ్వరా. బ్రహ్మచారి, గృహస్థుడు, సన్యాసి,జడధారి, మరి ఏవిధమైన వాడైనను వాటి వలన ఇసుమంతైనను ప్రయోజనములేదు. ఎవని హృదయ కమలము నీ యందు సమర్పింపబడెనో, నీవు అతనికి సంబంధించిన వాడవై, అట్టివాని సంసార భారమును వహించుచుందువు.

వ్యాఖ్య

అసంఖ్యాకములైన అనేక జన్మలలో యాత్రను సాగించిన పిదప జీవి ప్రశస్తమైన మానవ జన్మను పొందుట జరిగినది. భగవంతుని పొందుటయే ముఖ్య కర్తవ్యముగా అరుదెంచిన మానవ జన్మము వరప్రసాదము లాంటిది. భక్తి ఉత్తమము. భక్తుడు ఉత్తమ పురుషుడు. సర్వకాలము లందును అతని అంతఃకరణము నందు పరమాత్మయే నిలిచియుండును. నిరంతర భగవత్స్మరణ చేత భక్తుని చిత్తము పరమేశ్వరుని యందే స్థిరపడును. ప్రాపంచిక విషయ సుడిగుండము నుండి విడిపడి యుండును. సాధన సాగుకొలది దర్శనము ప్రాప్తించును. తదుపరి భేదము అదృశ్యము. అద్వైతాను భూతి హృదయములో స్థిరపడును. సర్వత్ర సమదర్శనము లభించును. ఈ విధమైన అవకాశము ఒక్క మానవ జన్మకే లభ్యమగును. కనుక మానవునికి ప్రధానమైనది భగవద్భక్తియే. భక్తికి వర్ణాశ్రమములు ప్రధానములు కానేరవు.

ఉపనయన సంస్కారము కలిగి విద్యాభ్యాసము చేయువాడు బ్రహ్మచారి లేదా వటువు. స్నాతక వ్రతమును పూర్తి చేసుకొని సంసార జీవనము నందు అడుగిడు వాడు గృహస్థుడు. జడలు ధరించి అరణ్యములలో నివసిస్తూ తపశ్చర్యనందు కొనసాగువాడు వానప్రస్థుడు. సర్వ కర్మములను పరిత్యజించి నిరంతర బ్రహ్మను చింతనము నందు కొనసాగువాడు యతి లేక సన్యాసి.

ఈ నాలుగు ఆశ్రమాలలో ఏ ఆశ్రమము గొప్పది? అని చాలా మంది ప్రశ్నిస్తూంటారు. పదవగాహన లోపించినపుడు సందేహాలే సహచరులు. వయో భేదము ననుసరించి ఆశ్రమ ధర్మాలు అందుతూ ఉంటాయి. వానప్రస్థునికి బ్రహ్మచారి ధర్మము శ్రేయము నొసంగునా? బ్రహ్మచారికి గృహస్థ ధర్మము సమంజసమా? గృహస్థునికి సన్యాసాశ్రమము అనుసరణీయమా? ఏ ఆశ్రమము నందున్నను వ్యక్తికి కావలసింది భక్తి. భక్తి లేని వ్యక్తి ఏ ఆశ్రమము నందు కొనసాగినను నిరుపయోగమే. కనుక హృదయ కమలమును పరమాత్మకు సమర్పించినచో భగవానుడు మనకు నీడయై నడచును. తోడుగా నిలుచును.

శుక బ్రహ్మ బ్రహ్మచర్యాశ్రమము నందే తరించెను. జనకుడు గృహస్థుడై ముక్తి నొందెను. దండకారణ్యములోని ముని గణము నందు అనేకులు వానప్రస్థులై సత్యద్రష్టలైరి. మధుసూదన సరస్వతి, విద్యారణ్యాదులు సన్యాసులుగా ఆత్మ విదులైరి. భక్తి గల వారికి ఆశ్రమ ధర్మములు అడ్డురావు. భక్తి కొరవడి మూఢ విశ్వాసములతో ఆశ్రమ ధర్మముల నాచరించు వారికి ఆధ్యాత్మిక ప్రగతి లభించదు. కనుక భక్తి సాధనయే వాంఛనీయము. మరి ఈ భక్తి సాధనను సాధకులు అనేక విధములుగా సాగించుచుందురు. ఇందులో ఏ విధమైన సాధన పరమోత్కృష్టము? ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

గుహాయాం గేహేవా బహిరపి వనే వాద్రి శిఖరే
జలేవా వహ్నౌవా వసతు వసతేః కిం వద ఫలమ్
సదా యస్యై వాంతఃకరణ మపి శంభో తవ పదే
స్థితం చేద్యోగోఽసౌ స చ పరమయోగీ స చ సుఖీ 12

గుహాయం = కొండ గుహయందో, గేహేవా = గృహమునందో, బహిరపి = బయటనో, వనేవా = వనమునందో, అద్రిశిఖరే = పర్వత శిఖరమందో, జలేవా = నీటియందో, వహ్నౌవా = అగ్నియందో, వసతు = వసించుగాక! హే శంభో = పరమేశ్వరా! వసతేః= అలా జీవించుట వలన, కిం ఫలం? = ఏమి ఫలితము?, వద = చెప్పుము,

యస్య:=వానియొక్క,అంత:కరణమపి = అంత:కరణము కూడా, సదా = నిరంతరము, తవ:= నీయొక్క, పదే ఏవ = పాదముల యందే, స్థితం చేత్ = స్థిరపడినచో, అపౌ = అలా నిలుచుటయే, యోగ: = యోగము, స: = వాడు, పరమ యోగీ = ఉత్కృష్టమైన యోగము నందున్నవాడు, సచ.= వాడే, సుఖీ = సుఖించువాడును.

భావము :- హేశివా! కొందరు యోగము ననుష్ఠించువారై గుహయందు గాని, మైదానము నందుగాని, అరణ్యమునందుగాని, గిరి శిఖరములయందుగాని, జలమునందు గాని, అగ్నియందు గాని వసించుచుందురు. దాని వలన ఫలితమేమిటో తెలియ జేయుము. ఎవని అంత:కరణము సదా నీ చరణ కమలముల యందు నిలిచియుండునో అదియే యోగము. అట్టి యోగము నందున్న వాడే పరమ యోగి. అతడే సుఖవంతుడు.

వ్యాఖ్య

శివ సన్నిధి యనెడి గమ్యమును చేరుటకు సర్వ సాధనలు మార్గములై యున్నవి. మనస్సును మహేశ్వరుని యందు స్థిరముగా నిలుపుటయే సమస్త సాధనల యొక్క ఏకైక లక్ష్యమై ఉన్నది. మనస్సు నిలకడను కోల్పోయినచో అట్టి సాధన నిష్ప్రయోజనమే కాగలదు. శివుని చిత్తమునందు స్థిరపరచునది ఏదియో అదియే సరియైన సాధన. సమస్త సాధనలు, యోగములు ఇందు కలసియే యుండును. పరమేశ్వరుని సదా స్మృతిలో నుంచుకొని జీవించుటయే సాక్షాత్కారమునకు ఏకైక మార్గము.

సాధన లాచరించుటకు కొందరు కొండగుహలలో ప్రవేశిస్తూంటారు. అచ్చట సాధన నిరాటంకముగా సాగునని వారి అభిప్రాయము. ఆటంకములనేవి ఆంతరంగిక కల్లోలములే యని మరువరాదు. నిర్జన ప్రదేశమునందు ఉన్నంత మాత్రాన నిస్సంకల్ప స్థితి ప్రాప్తిస్తుందా? కొందరు ప్రశాంతతను గోరి మైదానముల కేగి అచ్చట పక్షుల కూతలకు కూడా నిదానమును కోల్పోవు చుందురు. కనుక మైదానము ప్రధానము కాదు. 'నాది' అను దానిని దానము చేయుటయే ముఖ్యము. కొందరు యోగులు జలము నందును, కొందరు

అగ్ని యందును ప్రవేశించి సాధనలు చేయుచుందురు. అంతర్యములో క్రోధాగ్నిని ఆర్పుకోలేని అర్భకులు అగ్ని ప్రవేశము అనెడి బాహ్యా ప్రదర్శనల ద్వారా అమాయకుల అంతఃకరణను పాడుచేయు చుందురు. జలాగ్నుల యందు నిలువ నవసరము లేదు. అవి ఉండుట వలననే మన దేహానికి రూపము, గుణము ఏర్పడినవి. కనుక ఆది దేవుని అంతః కరణము నందు నిల్పునదియే నిజమైన యోగము. అట్టి యోగము నందు రమించువాడే యోగి యనబడును. అతడే సదా సుఖించును. అంతియే గాని ముక్తి పట్టుకొనుటలో లేదు. పట్టు విడుచుటలోను లేదు. పట్టు విడుపుల మర్మమెరిగి పట్టక, విడువక సదా శివుని పాదాబ్జములను పట్టుకొని యుండుటయే మోక్ష పట్టము నొందుటకు సూటియైన మార్గము. సంసారమును మనస్సులో వదలక, బాహ్యంలో పట్టుకొనెడి సన్యాసము, మోతను పెంచునే గాని ముక్తిని దించదు. వైరాగ్య మనునది అంతగ తేలికగా లభించునది కాదు. ఈ సందర్భమున శ్రీకాళహస్తీశ్వర శతకము నందలి ఒక చక్కని పద్యమును మననము గావించుకొనెదము.

చావంగాలము చేరు వౌటెఱిఁగియున్ జాలింపఁగా లేక త
న్వైద్యుండు చికిత్సం బ్రోవఁ గలడో? యే మందు రక్షించునో?
యే వేల్పు ల్కృపం జూతురో? యనుచు నిన్నింతైనఁజింతింపఁడో
జీవ శ్రాద్ధముఁ జేసికొన్న యతియున్ శ్రీకాళహస్తీశ్వరా!

"తనకు తాను పిండము పెట్టుకొన్న సన్యాసి కూడా మృత్యువు సమీపించి నపుడు తనువును ఆనందముతో త్యజించలేడు గదా! తననే వైద్యుడు బ్రతికించును? తనకేమందు పరిపడును? తననే దేవతలు రక్షింతురు? అని చింతించునే గాని పరమేశ్వరుని చింతింపడు" అని కవి విస్మయ మొందు చున్నాడు. కనుక భక్తి జ్ఞాన వైరాగ్యములే వాంఛనీయములు. మరి అవి ఎలా సిద్ధించును? భగవత్కృప వలననే ప్రాప్తించును. ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

అసారే సంసారే నిజభజన దూరేఽజడధియా
భ్రమంతం మా మంధం పరమ కృపయాపాతు ముచితమ్
మదన్యః కో దీనస్తవ కృపణ రక్షాతి నిపుణః
త్వదన్యః కో వామే త్రిజగతి శరణ్యః పశుపతే 13

పశుపతే = పరమేశా!, అజడ = జడములైన వానికన్నా వేరైన, పరమ = పరమాత్మా!, అసారే = నిస్సార మైనదియు, నిజ భజనదూరే = సత్యసేవకు దూరమైనదియును అగు, సంసారే= సంసారమునందు, భ్రమంతం = పరిభ్రమించు, అంధం = అంధుడనైన, మాం = నన్ను, కృపయా = కృపతో, ధియా = బుద్ధి ననుగ్రహించుట, పాతుం = రక్షించుటకు, ఉచితం = యుక్తము, దీనః = దీనుడైన, మదన్యః = నాకన్నను అన్యమైనవాడు, తవ = నీకు, కః = ఎవడు?, కృపణ = కృపణులను, రక్షాతి నిపుణః = రక్షించుటయందు నిపుణుడును, మే = నాకు, శరణ్యః = రక్షింపదగినవాడును, త్వదన్యః = నీకంటే అన్యమైనవాడు, త్రిజగతి = ముల్లోకములయందు, కః = ఎవడు?

భావము :- హే పశుపతీ! పరమాత్మా! నిస్సారమైనదియు, నిజభజనకు దూరమైనదియు నగు సంసారము నందు పరిభ్రమించు అంధుడను నేను. నీవు జ్ఞానమును ప్రసాదించి అనుగ్రహించుటకు కన్నను దీనులైన వారు నీకెక్కడ లభించరు. అలాగే కృపణులను రక్షించుటయందు నిపుణుడును, శరణు జొచ్చిన వారిని రక్షించువాడును అగు నీవును ముల్లోకములందు ఒక్కడవే కలవు. నన్ను రక్షింపుము.

వ్యాఖ్య

సంసారమునకు దగ్గరైన చిత్తము సదాశివునికి దూరమవుతుంది. లౌకికమైన సంసార పెనుగులాట వాంఛనీయము గాదు. సంసార లంపటమునకు దూరము కావలె నన్నచో సంసారము నందలి దోషములను దర్శించుటయే మార్గము. సంసారముపై అనురాగం కలుగునపుడు అందలి దోషములను అన్వేషించాలి. అప్పుడు దోషాలు తెలుస్తాయి. అనురాగం నశిస్తుంది. సంసారము

సమసిపోతుంది. ఈ విషయమునే శ్రీశంకరులు ప్రస్తుత శ్లోకములో తెలియజేయుచున్నారు.

సారము లేనిదియు, నిత్య ప్రకాశమునకు దూరమైనదియునగు సంసారము నందు పరిభ్రమించు జీవి ఆత్మానాత్మ వివేకమును కోల్పోయిన వాడై అంధునివలె అలమటించు చున్నాడని తెలుపుచున్నాడు.

సంసారము సారహీనమైనది. ఇచ్చట శాశ్వతమైనది ఏదియునులేదు. ఏ విధంగా అగ్ని కొంపను బూడిద చేసి తాను కూడా ఆరిపోతుందో, అలాగే సంసారము వ్యక్తిని అంతము చేసి తానూ అంతరించిపోతుంది. ఈ సత్యమును గ్రహింపని వాడు అంధుడు.

గ్రుడ్డివాడు తన ఎదుట నున్న వస్తువులను కూడా గాంచలేడు. అలాగే అజ్ఞానాంధకారములో అలమటించు అవివేకి ప్రత్యక్షముగా తెలియుచున్న సంసారము నందలి నిస్సారతను తిలకించలేడు. అట్టివాడు విశ్వసించదగినది శివునే గాని చిత్తమును గాదు. అంకిత భావముతో చిత్తమును శివునకు సమర్పించి దీనుడనైన తనను రక్షింప మని ప్రార్థించుటయే ఏకైక మార్గము.

శివుడు దీనరక్షకుడు. దీనదయాళుడు. దిక్కులేని వారికి తానే దిక్కుయై ఉన్నాడు. భక్తుల పాలిట పెన్నిధియై ఉన్నాడు. అట్టి సదాశివుని అనన్య చిత్తముతో ధ్యానించువారు తప్పక తరించగలరు. శివుని ధ్యానించి తరించవలె నన్నచో ఆ దివ్యాత్మునితో మనకు గల సంబంధమును సదా గుర్తుంచు కొనవలెను. భక్తునికి భగవంతునితో గల సంబంధము ఎలాంటిది? ఈ విషయమును రాబోవు శ్లోకములో తెలుపు చున్నారు.

ప్రభుస్త్వం దీనానాం ఖలు పరమబంధుః పశుపతే
ప్రముఖ్యోఽహం తేషామపి కిముత బంధుత్వ మనయోః
త్వయైవ క్షంతవ్యాః శివ మదపరాధాశ్చ సకలాః
ప్రయత్నా త్కర్తవ్యం మదవన మియం బంధుసరణిః 14

పశుపతే = పశుపతీ!, త్వం = నీవు, ప్రభుః = ప్రభువువు, దీనానాం = దీనులకు, పరమబంధుః = శ్రేష్ఠమైన బంధువుడవు, అహం = నేను, తేషాం = అట్టి దీనులలో, ప్రముఖ్యః = ప్రముఖుడను, అనయోః అపి = అట్టి మనకు, బంధుత్వం = బంధుత్వము, కిముత = చెప్పవలెనా, శివ = హే శివా!, సకలాః = సమస్తమైన, మదపరాధాః = నా అపరాధములు, త్వయైవ = నీచేతనే, క్షంతవ్యాః = క్షమింప దగినవి, మదవనం = నారక్షణము, ప్రయత్నాత్ = ప్రయత్నమువలన, కర్తవ్యం = చేయదగినది, ఇయం = ఇది, బంధుసరణిః = చుట్టరికపు పద్ధతి.

భావము :- ప్రభూ! పశుపతీ! నీవు దీనబంధువుడవు. నేను దీనులలో అగ్రగణ్యుడను. అట్టి మనకు చుట్టరికమును వేరుగా చెప్పవలెనా? హే పరమశివా! నా తప్పులన్నియు మన్నించి, నన్ను నీవే దయతో రక్షింపవలయును. ఇదియే గదా చుట్టరికపు మర్యాద.

వ్యాఖ్య

భక్తునికి భగవంతునికి గల సంబంధమును తెలుపుతూ భక్తుడు దీనుడనియు, భగవంతుడు దీనదయాళుడనియు తెలియజేయు చున్నాడు.

ఈ ప్రపంచములో అనేకమంది వ్యక్తులతో మనకు బంధుత్వాలున్నాయి. అవి అన్నియు తాత్కాలికమైనవియే గాని తరింపజేసేవి కావు. తగిలించు కొనినవియే గాని తనవి కావు. ఈ బంధాలన్నీ మతాబుల కాంతివంటివి. ఇవి శాశ్వతమైనవి కావు. ఇష్టముంటే ఉంచుకోవచ్చు. లేదా త్రెంచు కోవచ్చు. కానీ పరమాత్మతో నీ కుండే సంబంధము అలాంటిది కాదు. పరమాత్మయే నీ మనుగడకు ఆధారమై ఉన్నాడు. సంస్కార లోపముచే పరమాత్మను నీవు నిరాకరించ వచ్చునేమో గాని అలా నిరాకరించే నీకు ఆధారమైనవాడు కూడా పరమాత్మయే. ఈ సత్యమును జీర్ణించు కొనువాడు దీనుడై, భక్తుడగును. భగవంతుడు నీకు ప్రభువు యైనందున దీననాథుడై యున్నాడు. దీన బాంధవుడై యున్నాడు.

"ప్రభుజీ తుమ్ స్వామీ హమ్ దాసా"

"హే ప్రభూ! నీవు స్వామివి. నేను నీ దాసుడను" అని రోహిదాస్ గానము చేసాడు. ఇదియే భక్తునికి భగవంతునికి మధ్య ఉండవలసిన బాంధవ్యము.

"తుమ్ బడే ఠాకురా మైబనీ దాసీ"

"కృష్ణా! నీవు యజమానివి. నేను నీ దాసిని" అని మీరాబాయి గానం చేసింది. ఇదియే నిజమైన చుట్టరికము.

పరమ శివుడు ప్రభువుగా ఈ శ్లోకములో పేర్కొనబడినాడు. ప్రభువు అనగా రాజు అని అర్థము. రాజు రాజ్యము నేలును. రాజాధి రాజైన రాజేశ్వరుడు భక్తుని హృదయము నేలును. రాజు లేనిచో రాజ్యమేలేదు. ప్రభువు లేనిచో బ్రతుకే లేదు. రాజు కాటకము లొచ్చినపుడు ప్రజలను రక్షించును. పరమాత్మ భక్తుని కర్కశ బాధల నుండి విడిపించును. న్యాయము చెప్పేవాడు రాజు. జ్ఞానము నిచ్చేవాడు పరమేశ్వరుడు. అట్టి పరమ కృపానిధియైన పరమేశ్వరుని సన్నిధియే భక్తుడు వాంఛింప దగిన నిజమైన పెన్నిధి. ఇది నిజ బాంధవ్యము. నిర్మల సుఖ స్థానము. ఇదియే పరమ సమాగమము. ఈ దివ్య స్థానమును పొందుటకు అడ్డు దగులుచున్న ప్రారబ్ద కర్మమును నిర్మూలించమని రాబోవు శ్లోకమునందు ప్రార్థించు చున్నారు.

ఉపేక్షా నోచేత్కిం న హరసి భవద్ధ్యాన విముఖాం
దురాశా భూయిష్ఠాం విధిలిపి మశక్తో యది భవాన్
శిరస్త ద్వైధాత్రం న నఖలు సువృత్తం పశుపతే
కథం వా నిర్యత్నం కర నఖముఖేనైవ లులితమ్ 15

పశుపతే = పరమేశ్వరా!, ఉపేక్షానోచేత్ = ఆవిధముగా ఉపేక్ష లేనిచో, దురాశా భూయిష్ఠాం = దురాశతోనిండినదియు, భవద్ధ్యాన విముఖాం = నీ ధ్యానమునకు దూరమైనదియు, విధిలిపిం = బ్రహ్మవ్రాతను, కిం న హరసి = ఎందులకు తుడిచి వేయవు?, భవాన్= నీవు, అశక్తోయది = అశక్తుడ వైనచో, న నఖలు = గోటితో త్రుంచుటకు వీలుగాని, తత్ = ఆయొక్క, సువృత్తం = మిక్కిలి శక్తిగల, వైధాత్రం = విధాత సంబంధమైన,

శిరః = శిరమును,నిర్యత్నం = ప్రయత్నము లేకనే, కర = కరముయొక్క, నఖ ముఖేనైవ= గోటికొనచేత, కథం వా = ఎట్లు, లులితం = త్రుంచబడినది?

భావము :- హే పరమేశ్వరా! నీవు నన్ను ఉపేక్షించనిచో, దురాశా భూయిష్ఠమైనదియు, నీధ్యానమునకు దూరమైనదియును అగు బ్రహ్మవ్రాతను ఎందులకు తుడిచి వేయవు? బ్రహ్మ దేవుని శిరమును చేతి గోటి కొనచేతనే త్రుంచితివి గదా? కనుక తప్పించుకొను ప్రయత్నము చేయక నన్ను అనుగ్రహించుము.

వ్యాఖ్య

మగ్గము ద్వారా వస్త్రమును నేయునపుడు నాడి కొమ్ము అటు ఇటు పరుగిడు చుండును. ప్రతి పర్యాయము ఒక పోగును వదులుచునేయుండును. ఇలా ఒక్కొక్క పోగు కలిసి వస్త్రము ఏర్పడు చున్నది. వ్యక్తి చరించే రీతిలో అందెడి అనుభవము లన్నియు ఏకమై జీవన వస్త్రము తయారగు చున్నది. నేటి మన కార్యకలాపము లన్నియు గత కర్మలపై ఆధారపడి యున్నవి. ఈ కర్మ సంచితమే విధివ్రాతగా నొసట నిలిచి యున్నది. విధాత నిర్ణయాలను ఎవ్వరు ఎదిరించలేరు. విధి వక్రించనపుడు తల వంచుట కన్నను చేయదగిన కార్యము మరొకటి ఉండదు. బ్రహ్మదేవుని ఈ విధి వ్రాతను తుడపగలిగే శక్తి ఒక్క మహేశ్వరునికే గలదు. అందుచేత విధి లిఖితమును తుడిచి వేయమని పరమ శివుని ప్రార్థించు చున్నాడు.

మార్కండేయుని నొసటి వ్రాతను పరమాత్మయే గదా మార్పు చేసినది. కుచేలుని దైన్య రేఖలను మార్చినది ప్రభువే గదా! అహల్య బ్రతుకును తీరమునకు చేర్చిన దెవరు? కుబ్జను అనుగ్రహించిన దెవరు? కనుక విధి వ్రాతను తుడిచే శక్తి కలిగిన పరమాత్మ తన నొసటి వ్రాతను ఎందులకు చక్కచేయడు?

దుష్టమైన సంకల్పములతో, ధ్యాన జీవితమునకు విముఖతతో యున్న విధి వ్రాతను ఎందుకు నీవు తుడుచుట లేదు? అని పరమేశ్వరుని ప్రశ్నించు చున్నాడు. ఒకవేళ అశక్తుడవా? అని ప్రశ్నించి, అశక్తుడనైనచో బ్రహ్మ

దేవునియొక్క ఐదవ శిరమును ఎలా త్రుంచగలిగితివి అని ఎదురు ప్రశ్న వేయుచున్నాడు.

దక్షుడు రుద్రునకు సతీదేవి నిచ్చి వివాహము గావించెను. ఆ సందర్భమున సతీదేవి యొక్క రూపమును గాంచి బ్రహ్మదేవుడు విచలిత మనస్కుడాయెను. మోహముచే విధాత రేతో విసర్జనము గావించుకొనెను. జ్ఞాన నేత్రము ద్వారా ఈ విషయమును గ్రహించిన పరమశివుడు, బ్రహ్మదేవుని ఐదవ శిరమును త్రుంచివేసెను. ఆనాటి నుండి విధాత చతుర్ముఖ బ్రహ్మ ఆయెను.

ఈ సంఘటనను గుర్తు చేయుచు చెడు తలంపు గలిగిన బ్రహ్మ శిరమును ఖండించిన నీవు, చెడు కర్మలను పురికొల్పెడి బ్రహ్మవ్రాతను మా నొసట ఎందుకు తుడపవు? అని ప్రశ్నించు చున్నాడు. కనుక తుడప గలిగే శక్తి గలిగిన పరమేశ్వరుడు మౌనమును వహించుటలో పరమార్థము ఏదో ఉండాలి. కనుక నొసటివ్రాత తుడప వలసినది కాదేమో? అది నిరుపయోగము కాదేమో? ఎలా నిరుపయోగము కాదు?తరువాత శ్లోకమే ఈ ప్రశ్నకు సమాధానము.

విరించి దీర్ఘాయు ర్భవతు భవతా తత్పరశివ
శ్చతుష్కం సంరక్ష్యం స ఖలు భువి దైన్యం లిఖితవాన్
విచారః కో వా మాం విశద కృపయా పాతి శివ తే
కటాక్ష వ్యాపార స్స్వయమపి చ దీనావన పరః 16

విశద = విశుద్ధమైన, శివ = పరమేశ్వరా!,విరించిః = బ్రహ్మదేవుడు, దీర్ఘాయుః = దీర్ఘాయుష్మంతుడు, భవతు = అగుగాక!, భవతా = నీ చేత, తత్పర శిరశ్చతుష్కం= అతని యొక్క నాలుగు శిరములు, సంరక్ష్యం = రక్షింపబడినవి. సః = ఆ బ్రహ్మదేవుడు, భువి = భూలోకము నందు, దైన్యం = దీనత్వమును, లిఖిత వాన్ ఖలు = వ్రాసెను గదా! దీనావన పరః = దీనులకు దిక్కైన, తే = నీ యొక్క, కటాక్ష వ్యాపారః = కటాక్ష ప్రసారము, స్వయమపి = స్వయముగనే, కృపయా = దయతో, పాతి = రక్షించు చున్నది, విచారః = విచారము, కోవా = ఏమున్నది?

భావము :- హే పరమశివా! బ్రహ్మదేవుడు దీర్ఘాయుష్మంతుడు అగు గాక! మిగిలిన అతని నాలుగు శిరములను నీవు రక్షింపవలసి యున్నది. భూలోకమునందు అతడు మా లలాటముపై దైన్యమును వ్రాయుచున్నాడు. దీనులను బ్రోచుట యందు నీకు ఆసక్తి యున్నది. నీ కృపా విశేషము మమ్ములను కాపాడు చున్నది. ఇక నాకు విచార మెందులకు?

వ్యాఖ్య

మనకు దేహమును కలుగజేసి ఈ లోకములో సుఖదుఃఖ రూప ఫలములను అందించి, అనుభవించగనే నశించిపోవునది ఏదియో అదియే ప్రారబ్ధ కర్మమనబడును. ఈ ప్రారబ్ధమే బ్రహ్మదేవుడు వ్రాసెడి నొసటి వ్రాత. దీనిని తప్పించు కొనుటకు ఎవ్వరికిని సాధ్యముకాదు. మేడపై నుండి క్రిందికురికి నేలను తాకకూడదని భావించుట ఎలా అసాధ్యమో, ఆహారమును భుజించి, అది జీర్ణము కాకూడదని తలంచుట ఎంత అసమంజసమో, కర్మము లాచరించి అవి ఫలముల నివ్వరాదని భావించుట కూడా అలాంటిదే. కర్మ ఫలముల నుండి ఎవ్వరూ దూరము కాలేరు.

ఒక గ్రామములో కర్మ సిద్ధాంతము నందు విశ్వాసము లేని ఒక మందమతి యుండెను. అతని నాస్తిక ప్రలాపములను భరించలేక ఆ ఊరి ప్రజలు చాలా యాతన పడుచుండిరి. ఒకనాడు ఒక యోగిపుంగవుడు ఆ గ్రామమునకు వచ్చెను. అతనిని జనులందరు పూజించిరి. అక్కడికి ఆ నాస్తికుడు కూడా వచ్చెను. విధివ్రాతను తాను విశ్వసించుట లేదని వదురుతూ అస్తవ్యస్త వచనములను పలికెను. గ్రామస్థులందరు యోగిని సమీపించి ఈ నాస్తికుని వలన కలిగెడి బాధను విన్నవించు కొనిరి. జరగబోయే విషయమును ఎవ్వరైన చెప్పినచో, అది అలా జరుగకుండా తాను ప్రయత్నిస్తాడట. అయినను అది జరిగినచో కర్మ సిద్ధాంతమును, విధి వ్రాతను తాను విశ్వసించ గలనని ప్రగల్భాలు పలుకుచున్న నాస్తికుని చేరబిలిచి "నీవు రేపు మధ్యాహ్నము

పండ్రెండు గంటలకు పాయసము నారగించ గలవు. ఇది నీ నొసటి వ్రాత. శక్తి యున్నచో అది జరుగకుండా ప్రయత్నించుము" అని యోగి పుంగవుడు చెప్పెను.

నాస్తికుడు సంబర పడిపోయెను. ఇంటివద్ద యున్నచో పాయసము తినే గతి పట్టునేమోయని శంకించి, మరునాడు ఉదయమే ఇంటి నుండి బయలు దేరి అరణ్య ప్రాంతమునకు వెళ్ళెను. కొంత దూరము వెళ్ళుసరికి ఒకచోట వన విహారమునకై వచ్చిన కొందరు ఒక చెట్టు క్రింద భోజనములు తయారు చేసుకొని, భుజించుటకు సిద్ధముగా యుండిరి. ఈలోగా వారిలో ఒక వ్యక్తి పరుగెత్తుకొని వచ్చి ఆ వైపుగా బందిపోటు దొంగలు వస్తున్నట్లు తెలియ జేసెను. వారు భోజన పాత్రలను వదిలేసి పరుగెత్తుకొని వెళ్ళిరి. పరుగిడుటకు శక్తిలేని నాస్తికుడు చెట్టునెక్కి దాగెను.

దొంగలు రానే వచ్చిరి. పాత్రల యందలి షడ్రసోపేతమైన ఆహార పదార్థములను గాంచి ముదమందిరి. తినుటకుపక్రమించబోయిరి. ఈలోగా ఒకదొంగ, "ఆగండి. ఇందులో విషము కలిపి మనలను చంపుటకు ఎవరైనా కుట్రపన్ని యుండవచ్చు," అనెను. ఆ మాట విని అందరూ సందిగ్ధములో పడిరి. దొంగల నాయకుడు దీర్ఘంగా ఆలోచించుటలో పైకి జూచెను. నాస్తిక మహాశయుడు గోచరించెను. అతనిని దింపించిరి. మొదట అతనికి ఆహారమొసగి, అతడు ఆరగించిన పిదప ఆరోగ్యముగా యుండినచో తరువాత తాము ఆరిగించునట్లు, నిర్ణయించిరి. ఆమాటల నాలకించిన నాస్తికుడు "నేను దేనినైనను తినగలను - పాయసమును తప్ప" అనెను. అయితే పాయసములోనే విషముండితీరాలి అనెడి నిర్ణయమునకు వచ్చిన దొంగల నాయకుడు రెండు తన్నులు తన్ని పాయసమును తినిపించెను.

నాస్తికుడు పాయసము నారగించి, వెనుదిరిగి గ్రామమునకువచ్చి, యోగి పాదములపై బడెను. క్షమించమని ప్రజలను ప్రాధేయపడెను.

విధివ్రాత అనివార్యమే గాని అనాలోచితము కాదు. అట్టి విధి వ్రాతను వ్రాసెడి విధాతను దీర్ఘాయుష్మంతుడుగా ఉంచమని ప్రార్థించు చున్నారు.

బరువుల బ్రతుకును చిత్రించే బ్రహ్మదేవుడు చిరంజీవి కావలెనని భక్తుని ప్రగాఢ వాంఛ. బ్రహ్మదేవుడు చిరంజీవి యైనచో చిరకాలము మన నొసట బాధలనే లిఖించు చుండును. బాధానుభవములో భగవానుడు మన స్మృతిలో మెదలును. హృదిలో కదులును. భగవానుని గుర్తుచేసే బాధలు నిజంగా ఐశ్వర్యములే. అట్టి బాధల నందించెడి బ్రహ్మదేవుడు మన కెంతయో ఉపకారము చేయుచున్నాడు. అట్టి బ్రహ్మదేవుడు చిరంజీవిగా యుండునట్లు ఆశీర్వదించమని శ్రీశంకరులు ప్రార్థించు చున్నారు.

బాధలు బోధల నందిస్తాయి. బోధలు భగవానుని ముందుంచుతాయి. కానీ ముందున్న పరమాత్మను చూడలేని మందమతులుగా మిగిలిపోతున్నాము. కారణమేమి? ఈ ప్రశ్నకు సమాధానమును రాబోవు శ్లోకమునందు చూడగలము.

ఫలాద్వా పుణ్యానాం మయి కరుణయా వా త్వయి విభో
ప్రసన్నేఽపి స్వామిన్ భవదమల పాదాబ్జ యుగళమ్
కథం పశ్యేయం మాం స్థగయతి నమ స్సంభ్రమ జుషాం
నిలింపానాం శ్రేణిర్ని జ కనక మాణిక్య మకుటైః 17

విభో=సర్వేశ్వరా!, స్వామిన్=స్వామి, మమ=నాయొక్క, పుణ్యానాం=పుణ్యకార్యములయొక్క, ఫలద్వా=ఫలితమో, మయి=నాయందు, కరుణ యావా=దయచేతనో, త్వయి=నీవు, ప్రసన్నేపి= ప్రసన్నుడవైనచో, భవత్=నీయొక్క, అమల=నిర్మలమైన, పాదాబ్జ యుగళం=పాదపద్మములను, కథం=ఎట్లు? పశ్యేయం=గాంచుదును, నమస్సంభ్రమ జుషాం=నమస్కరించుటకు తొందరపడుచున్న, నిలింపానాం=సురుల యొక్క, శ్రేణిః=సమూహము, నిజ కనక మాణిక్య మకుటైః=మాణిక్యములు పొదిగిన స్వర్ణ కిరీటములతో, మాం=నన్ను, స్థగయతి=అడ్డగించు చున్నవి.

భావము :- హే సర్వేశ్వరా! నా పుణ్యఫలము వలననో, లేదా నీ కటాక్ష వీక్షణము వలననో నీవు ప్రసన్నుడవైనను నిర్మలమైన నీ పాదారవిందములను నేను ఎలా దర్శించగలను? నీ పాదములకు నమస్కరించవలెనని తొందరపడుతున్న దేవతల యొక్క రత్న ఖచిత మకుటములు నీ పాదములను నాకు గోచరింపకుండా అడ్డు నిలిచియున్నవి.

వ్యాఖ్య

గతములో మన మాచరించిన పుణ్యాకర్మల ఫలితముగా మన చిత్తము పరమాత్మ వైపునకు మఱలును. అట్టి మనలను పరమాత్మ కరుణించును. కృపజూపును. భగవానుడు ప్రత్యక్షమగును. మన హృదయము నందే అవ్యక్తముగా నున్న పరమాత్మ, ప్రహ్లాదుని కొరకు స్తంభము నుండి వ్యక్తమైనట్లు వ్యక్తమగును. కానీ ప్రత్యక్షమైన పరమాత్మను దర్శించలేని తన అశక్తతకు రచయిత వ్యథ చెందుతున్నాడు. నిర్మలమైన భగవాముని దివ్య పాదారవిందములను స్పృశించి, ధ్యానించుటకు తొందరపడుచున్న దేవతల రత్నఖచిత కిరీటములు అడ్డు నిలిచి భగవత్పాదారవింద దర్శనమును నిరోధించు చున్నవని కలత చెందుతున్నారు.

దేవతలు అనగా ప్రకాశించువారు అని భావము. మనలోని జ్ఞానేంద్రియములు ప్రకాశించుట వలననే మనము బాహ్యము నందలి వస్తువులను దర్శించగలుగుచున్నాము. అయితే ఇంద్రియ మనోబుద్ధులకు అతీతమైన భగవంతుని పాదారవిందములను దర్శించునపుడు ఇంద్రియములు అడ్డు నిలిచి దివ్యదర్శనమును అడ్డగించు చున్నవి అని భావము. "ఇంద్రియాల పరిచ్ఛేదములో సత్యదర్శనము వక్రించబడు చున్నద"ని కాంట్ కూడా అభిప్రాయపడటము జరిగినది.

ఇంద్రియములు విషయ జ్ఞానము నందించగలవే గాని గ్రహించ లేవు. విషయమును గుర్తించునది మనస్సు నందలి సంకల్పములే. కనుక రత్నఖచిత కిరీటములు అడ్డు నిలిచి యున్నవి అనుటలోని అంతర్భావమును గ్రహింపవలెను. సంకల్పములచే నిండియున్న మనోబుద్ధులే రత్నఖచిత మకుటములని గుర్తించాలి. కనుక భగవంతుని కృప చేతనే ఈ అడ్డంకులను అధిగమించి మనము శివ పాదార్చకులమై తరించాలి. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

త్వమేకో లోకానాం పరమ ఫలదో దివ్యపదవీం
వహంత స్త్వన్మూలాం పునరపి భజన్తే హరిముఖాః
కియద్వా దాక్షిణ్యం తవ శివ మదాశా చ కియతీ
కదా వా మద్రక్షాం వహసి కరుణా పూరిత దృశా 18

శివ = హే శివా!, లోకానాం = లోకులకు, పరమ ఫలదః = మోక్ష ఫలము నిచ్చు వాడవు, త్వం = నీవు, ఏకః = ఒక్కడవే, హరిముఖాః = విష్ణువు మొదలగు వారు, త్వన్మూలాం = నీ కారణముగ, దివ్య పదవీం = దివ్యపదవిని, వహంతః = వహించువారై, పునరపి = మఱల కూడా, భజంతే = భజించుచున్నారు, తవ = నీ యొక్క, దాక్షిణ్యం = దయ, కియద్వా = ఏ పాటిది?, మదాశాచ = నా యొక్క ఆశయు, కియతీ = ఏ పాటిది?, మత్ రక్షాం = "అహం" నుండి కాపాడుటకు, కరుణా పూరిత = దయాపూర్ణమైన, దృశా = వీక్షణముతో, కదా = ఎప్పుడు, వహసి = చేయుదువు.

భావము:- ఓ శివా! జనులకు మోక్షఫలము నిచ్చువాడవు నీవే. విష్ణువు మొదలైన దేవతలు నీ కృప చేతనే దివ్య పదములను పొందిన వారై, అత్యున్నత పదవులను పొందుటకు ఇంకనూ భజించుచునే యున్నారు. ఆహా! భక్తుల మీద నీకు ఎంత దయయో కదా! నా ఆశకు కూడా హద్దులేదు. పరమశివా! నా పై పూర్ణ కృపను ప్రసరింపజేసి, అహంకారమును బాపి రక్షింపుము.

వ్యాఖ్య

పరిమితుడైన మనుజుని మస్తిష్కములో దైవ స్వరూపం విచిత్రముగా ఉంటుంది. ఖాళీ సమయాలలో కొందరికి భగవంతుడు కాలక్షేపానికి వస్తువు. మరి కొందరికి కబుర్లకు కథావస్తువు. మరి కొందరికి పరమాత్మ అవసరాలు - తీర్చే పనిముట్టు. బాధలు చుట్టు ముట్టినపుడు కొందరు భగవంతుని ధ్యానిస్తూ ఆలయాలు తిరుగుతారు. బాధలు తీరగానే భగవంతుని మరచిపోతారు. ఒకవేళ బాధలు తీరకపోతే భగవంతుడు లేడేమోవనే సందేహములో కూడా పడిపోతారు. తాను ఎంతగా భక్తి చేసినా భగవంతునికి కృతజ్ఞత లేదనే చౌకబారుమాటలనుటకు కూడా వెనుకాడరు.

నీ బాధలను తీర్చమని భగవంతుని అడుగుతావా? నీ పనులు చేసిపెట్టే నౌకరు స్థాయికి భగవంతుని దించావా? నీవు పనులు చెప్పేవాడివి. భగవంతుడు చేసేవాడా? ఒకవైపు పరమాత్మను సర్వజ్ఞుడని శ్లాఘిస్తూ, మరొకవైపు ఆయనను నీ పనులు చేసి పెట్టమని ఆజ్ఞాపిస్తావా? ఏమో! మానవుని బుద్ధి ఈ విషయాలన్నింటినీ ఆలోచించదు.

భగవంతుని విగ్రహం ముందు కూర్చొని ధ్యానం చేస్తారు. అయితే ఆ ధ్యానము యొక్క ఫలితమేమిటో తెలిసే చేస్తున్నారా? నీవు పరమాత్మను ధ్యానిస్తూ సాధన చేస్తావు. ఆయన నీకు ప్రత్యక్షం కావాలి? నిన్ను అనుగ్రహించాలి. అంతేనా! అయితే సాధకుడవైన నీవు ముందు. సాధ్య రూపుడైన పరమాత్మ తరువాతయని భావము. నీవు పరమాత్మను సృష్టిస్తావా? నిన్ను సృష్టించిన భగవంతుని నీవెలా సృష్టించగలవు? ఒకవేళ నీవు భగవంతుని సృష్టిస్తే అతడు కాలంలో కలిగిన వాడవుతాడు. కాలంలో కదిలినవాడు కాలంలో నశించడా! నశించే పరమాత్మను ఆశ్రయించి నీవు సాధించే దేముంటుంది? కనుక భక్తి యొక్క సమగ్ర స్వరూపము చాలా మంది భక్తులకు తెలియదు.

మోక్షమే మన జీవిత లక్ష్యము. అది గుణాతీత స్థితి. సృష్టి స్థితి లయాదులను అధిగమించిన స్థితి. అట్టి మోక్షమును అనుగ్రహించువాడే పరమశివుడు.

" మోక్షమిచ్ఛే న్మహేశ్వరాత్ "

" మోక్షమును అనుగ్రహించువాడు మహేశ్వరుడు." కనుకనే పరిమితమైన వైకుంఠాది పదవులపై ఆశలేని వారై విష్ణువు మొదలగు వారు మహేశ్వరుని ప్రార్థించు చున్నారు అని శ్రీ శంకరులు తెలియజేయుచున్నారు.

ఆత్మ జ్ఞానమును పొందవలె నన్నచో అహంకారము దూరము కావలెను. అహంకారి ఆత్మజ్ఞాని కాలేడు.

అహమి నాశభా జ్యహ మహంతయా

స్ఫురతి హృత్స్వయం పరమ పూర్ణసత్

"అహము నశించిన తానిలో పరమ పూర్ణ రూపమైన ఆత్మ " నేను-నేను" అనుచు స్ఫురించు చుండును" అని రమణ మహర్షి తమ ఉపదేశ సారములో తెలుపుతారు.

అహంకారము అంత తేలికగా నశించదు. అది శివానుగ్రహము చేతనే అంతమగును. మరి శివుడు భక్తుని అహంకారమును అంతము చేయకుండుటకు కారణమేమి? ఈ విషయమును రాబోవు శ్లోకమున గాంచెదము.

దురాశా భూయిష్ఠే దురధిప గృహ ద్వార ఘటకే
దురంతే సంసారే దురిత నిలయే దుఃఖ జనకే
మదాయాసం కిం న వ్యపనయసి కస్యోపకృతయే
వదేయం ప్రీతిశ్చే త్తవ శివ కృతార్థాః ఖలు వయమ్ 19

దురాశా భూయిష్ఠే = దురాశతో కూడినదియు, దురధిప = దుష్ట ప్రభువుల, గృహద్వారా ఘటకే = గృహద్వారములకు చేర్చునదియు, దురంతే = చెడ్డదియును, దురిత నిలయే = పాపములకు ఉనికి పట్టును, దుఃఖ జనకే = దుఃఖహేతువునైన, సంసార = సంసారమునందు, మదాయాసం = నాశ్రమను, కస్య = బ్రహ్మదేవుని యొక్క, ఉపకృతయే = ఉపకారము కొరకు, న వ్యపనయసి కిం?, = పోగొట్టక ఉంటివా ఏమి?, వద = చెప్పుము, ఇయం = ఈ, ప్రీతిః = ప్రేమ, తవ = నీకు, చేత్ = యున్నచో, వయమపి = మేము కూడా, కృతార్థాఃఖలు = కృతార్థులమేగదా!

భావము:- శివా! దురాశాపరులైన దుష్టప్రభువుల గృహ ద్వారముల చెంత పడియుండి, పలు దుఃఖముల ననుభవింప జేయు తుది లేని సంసారము నందలి నా శ్రమను నీవు ఏల నశింపచేయవు? బ్రహ్మదేవునకు ఉపకారము చేయు నుద్దేశ్యముతో అలా చేయు చుంటివా? అయినచో చెప్పుము. భక్తులపై అలాంటి ప్రేమ నీ కున్నచో నిన్ను భక్తిచేయు మేము కూడా ధన్యజీవులమే కదా!

వ్యాఖ్య

వయస్సు నశిస్తున్నను ఆశ నశించదు. ఆశారాక్షసి కోఱలు ప్రపంచాన్ని కాటువేయని చోటులేదు. ఆశకు దాసులై ... నవహలు. చేయరాని

పడరాని పాట్లు పడుతూ, అగచాట్లతో కూడిన ఆవేదనా బ్రతుకును అనుభవిస్తున్నారు. ఆశకు అంతములేదు. తృప్తి తెలియదు. బ్రతుకు ఆశయమును బుగ్గిపాలు చేయునవి ఆశలే.

ఆశలను తీర్చుకొనే ప్రయత్నములో చేయరాని పనులు చేయడానికి అలవాటు పడిన మానవుడు దుష్ట ప్రభువుల గృహముల చెంత కుక్కలా కాపలా కాస్తూ ఉంటాడు. ఒక ఉద్యోగి తన చదువుకు తగిన ప్రభుత్వోద్యోగమును భగవత్కృపతో పొంది జీవిస్తున్నాడు. నిజాయితీగా ఉద్యోగ కర్తవ్యమును నిర్వహించి, న్యాయంగా లభించే జీతముతో నీతిగా, తృప్తిగా జీవించవచ్చు గదా! నిద్రలేవగనే ఆఫీసరుగారి కొంపకెళ్ళి సుప్రభాతం ఆలపించవలసిన అగత్యమేమిటి? ఆశ. ఈ సుప్రభాతం తనకు సుఖ జీవనమును ప్రసాదిస్తుందనే ఆశ. దురాశ. పేరాశ. అధికారిని తృప్తిపరచాలి. అతనికి అనుగుణంగా భాషించాలి. సుప్రభాతం పాడలేని వారిపై చాడీలు చెప్పాలి. అప్పుడు ముందున్నవారి సర్వీసులను చిన్న చూపుచూసి ఈ సుప్రభాత ప్రబుద్ధుణ్ణే అధికారి ముందు కుర్చీలో కూర్చోబెడతాడు. ఈ నిర్వాకంలో భాగంగా మనస్సును చంపుకొని ప్రవర్తించడము, అధికారి దుర్జనుడైతే ఆ దౌర్భాగ్యుని దురలవాట్లను తీర్చుతూ దైన్య జీవితమును గడపడము, - ఎందుకు ఈ కుళ్ళు జీవితము? తాను చెడి సమాజాన్ని పెడదారి పట్టించే ఈ దురాశాపరులకు సిగ్గులేదు-మానవత్వములేదు. కానీ ఇక్కడ ఒక్క విషయాన్ని ఆలోచించాలి. ఈ ఉల్టాపీదా బ్రతుకును సాగిస్తూ అంతర్యంలో ఘోర నరకాన్ని అనుభవించే కన్నా నీతిగా జీవించి భార్యా పిల్లలతో హాయిగా జీవించ వచ్చును గదా? బ్రతికేది మూడునాళ్ళు-ఈకుళ్ళు మనస్తత్వంతో మూడు వందల సంవత్సరాల ఘోరనరకాన్ని అనుభవించాలా? ఉన్నదానిపై అసంతృప్తి లేక, లేనిదాని కొరకు అర్రులు చాచక ఆనందంగా, ప్రసాద మనస్తత్వంతో జీవించవచ్చును గదా!


ఆశలకు ఆలవాలమైన ఈ సంసారము కీ~ చేయు స్వభావము గలదనియు,పాపములకు బు తెలియజేయు

చున్నారు. దుఃఖాలయమని హెచ్చరించు చున్నారు. ఇటువంటి పాప కూపము నుండి మమ్ములను ఎందులకు రక్షించుటలేదు? అని ప్రశ్నించి, దానికి అనుమానాస్పదముగా సమాధానమును కూడా తానే తెలుపుతున్నారు.

బ్రహ్మదేవుని విధివ్రాత కారణముగా ఈ సంసారము మనకు ప్రాప్తించినది. బ్రహ్మ శివ భక్తుడు. కనుక భక్తుడైన బ్రహ్మదేవుని సృష్టికి అడ్డు తగలలేక పరమశివుడు మనకు సంసారమును దూరము చేయుటలేదని తెలుపుతూ, ఈ విషయము తనకు విచారమును కలిగించుట లేదని పలుకు తున్నారు. బ్రహ్మదేవుడు భక్తుడైనందున ఆయనపై శివునకు ప్రేమ కలిగినది. అయితే అట్టి భక్తిని తాము కూడా అలవరచుకొనినచో భక్తవత్సలుడైన శివుడు తమను కూడా తరింపజేయునని పొంగిపోవుచున్నాడు. ఇచ్చట అతి సూక్ష్మమైన విషయము నొకదానిని తెలుసుకొనవలెను. బ్రహ్మ సృష్టి మంగళకరము. మనము కూడా లోక కళ్యాణమునకు ఉపకరించెడి శుభకర కార్యములను ఆచరించినచో మహేశ్వరుని కృపకు పాత్రులము కాగలము అనెడి సూచన సూక్ష్మముగా తెలియచేయబడినది. దానికి మార్గమెయ్యది? ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

సదా మోహాటవ్యాం చరతి యువతీనాం కుచగిరౌ
నట త్యాశాశాఖా స్వటతి ఝుడితి స్వైర మభితః
కపాలిన్ భిక్షో మే హృదయకపి మత్యంత చపలం
దృఢం భక్త్యా బద్ధ్వావ శివ భవ దధీనం కురు విభో 20

కపాలిన్ = కపాలమును ధరించిన వాడును, విభో = సర్వవ్యాపకుడును, శివ = శుభకరుడును, భిక్షో = భిక్షువును, సదా = నిరంతరము, మోహాటవ్యాం = మోహమనెడి అరణ్యము నందు, చరతి = చరించుచున్నది, యువతీనాం = యువతుల యొక్క, కుచగిరౌ = కుచము లనెడి గిరుల యందు, వటతి = వర్తించు చున్నది, ఆశా శాఖాసు = ఆశయనెడి శాఖయందు, అటతి = దుముకుచున్నది, ఝుడితి = శీఘ్రముగా, అభితః = నలు వైపుల, అటతి = పరుగులిడుచున్నది, అత్యంత = మిక్కిలి, చపలం=



చంచలమైన, మే = నాయొక్క, హృదయ కపిం = హృదయ మనెడి కోతిని, ధృఢం = ధృఢముగా, భక్త్యా = భక్తియనెడి త్రాటితో, బద్ధ్వా = కట్టి, భవదధీనం = నీ వశముగా, కురు = చేయుము.

భావము:- కపాలమును ధరించిన వాడును, సర్వ వ్యాపకుడును అగు శివుడా, నీవు ఆది భిక్షువువు. సదా మోహ మనెడి అరణ్యము నందు చరించుచున్నదియును, యువతుల కుచము లనెడి గిరుల యందు నర్తించు చున్నదియును, ఆశయనెడి శాఖలపై దుముకు చున్నదియును నలువైపుల శీఘ్రముగ పరుగులిడునదియు, అత్యంత చపలమైన నా యొక్క హృదయ మనెడి కోతిని ధృఢముగా భక్తి యనెడి త్రాటితో కట్టి నీ వశము చేసికొనుము.

వ్యాఖ్య

బ్రహ్మదేవుని వలె భక్తుడు దృఢ భక్తిని కలిగియున్నచో పరమేశ్వరుని కృపకు పాత్రులము కాగలము. భక్తి స్థిరపడవలె నన్నచో హృదయమనెడి కోతి స్థిరముగా యుండవలెను. ఈ సుస్థిరత భగవత్కృప చేతనే పొందదగియున్నది.

మనస్సనెడి మర్కటము మోహమనెడి అరణ్యములో పరిభ్రమించు చున్నది. భయంకరారణ్యము నందు ఎక్కడ ఏ విపత్తు సంభవించునో తెలియదు. అలాగే సంసారారణ్యము నందు ఏ క్షణము ఏ ఆపద సంభవించునో తెలియదు. మోహమునకు గురియైన మనస్సు కామ సుడిగుండములో చిక్కుకొని పోతున్నది. కామ పాశమునకు గురియై యువతుల స్తన పర్వత శిఖరముల యందు చరించుచున్నది. దారి తప్పిన మనో మర్కటము మాంసమయ సుఖములను, క్షణికానందమును కోరుచున్నదే గాని, మంత్రమయ జీవితమునకు అలవాటు పడలేకున్నది. భార్యా పుత్రాదులనెడి కొమ్మల నాధారముగా గొని దుముకు చున్నది. మార్గము తెలియని హృదయ మర్కటము నలువైపుల పిచ్చిదాని వలె పరిభ్రమించుచున్నది. అట్టి చిత్తమనెడి మర్కటమును నిగ్రహించుట భక్తులకు సాధ్యంకాదు. కనుక పరమశివుడే దానిని వశము చేసుకొనవలెనని శ్రీ శంకరులు ప్రార్థించుచున్నారు. భక్తి యనెడి పాశముతో బంధించమని వేడుకొనుచున్నాడు.

హృదయ కపిని బంధించుటకు భక్తి పాశమే ఏకైక మార్గము. నిర్మల భక్తి మందాకినీ వీచికలకు అలవాటు పడిన తరువాత మోహారణ్యములో పరిభ్రమించుట జరుగదు. హృదయ పద్మమున పవ్వళింపజేసి పారవశ్యములో ముంచే భక్తి కామాతురతను నిరోధించును. శివ నామామృత పానముచే మత్తెక్కి మహదానందములో మైమరచి యున్న మానసము ఆశా శాఖలపై దుముకుటకు శక్తి లేనిది యగును. చిందులేసే చిత్తము శివ పాదారవింద స్మరణముచే నిర్మలానందము ననుభవించును. ఇట్టి భక్తి ఈశ్వరానుగ్రహము వలననే లభించును. ప్రతి వ్యక్తి భక్తిని పెంపొందించుకొనవలెను. పరమేశ్వరుడు హృదయములో నిలిచినపుడే అది సాధ్యమగును. కనుక చిత్తములో నిలిచి నిజభక్తిని సదా నిలుపమని శ్రీ శంకరులు రాబోవు శ్లోకము నందు తెలుపు తున్నారు.

ధృతి స్తంభాధారం ధృఢగుణ నిబద్ధాం సగమనాం
విచిత్రాం పద్మాఢ్యాం ప్రతిదివస సన్మార్గ ఘటితామ్
స్మరారే మచ్చేత స్స్ఫుట పటకుటీం ప్రాప్య విశదాం
జయ స్వామిన్ శక్త్యా సహ శివ గణై స్సేవిత విభో 21

స్మరారే = మన్మథునికి శత్రువైన పరమశివా!, స్వామిన్ = స్వామీ!, గణైః = శివగణములచే, సేవిత = పూజింపబడువాడా!, విభో = ఓ సర్వవ్యాపకా!, శివ = శివుడా!, ధృతి = ధైర్యము, స్తంభ = స్తంభమును, ఆధారం = ఆధారముగా గలదియు, ధృఢ = స్థిరమైన, గుణ = గుణములచే, నిబద్ధాం = కట్టుబడినదియు, సగమనాం = స్వేచ్ఛాగమనము గలదియు, విచిత్రాం = విచిత్రమైనదియు, పద్మాఢ్యాం = కమల సదృశ్యమైనదియు, ప్రతి దివస = ప్రతి దినము, సన్మార్గ ఘటితాం = సన్మార్గయుతమైనదియు, విశదాం = విశుద్ధమైనదియు, మత్ = నా యొక్క, చేతః = చిత్తము, స్ఫుట = గట్టిదియగు, పటకుటీం = డేరాను, ప్రాప్య = పొంది, శక్త్యాసహ = పార్వతీదేవితో కూడినవాడవై, జయ = వర్ధిల్లుము.

భావము:- శివా! కామదహనా! స్వామీ! సర్వేశ్వరా! గణపూజితా! నా చిత్తము ఒక చక్కని డేరా వంటిది. దానికి ధృతి యనెడి స్తంభమే ఆధారము. అది గుణపాశములచే

కట్టబడియున్నది. ఎచ్చటికైనను గొనిపోవుటకు వీలుగా నున్నది. చిత్ర విచిత్ర మైనరీతిలో పద్మముల యొక్క రూపములను ధరించి యున్నది. సన్మార్గమున చరించునదియై ఉన్నది. విశుద్ధమైనదియై ఉన్నది. అట్టి నా పట కుటీరమునందు పార్వతీ సమేతుడవై హాయిగా వసింపుము.

వ్యాఖ్య

సర్వేశ్వరుడు సర్వత్ర సంచరించువాడై ఉన్నాడు. సంచారియగు తాను విశ్రమించుటకు ఒక డేరా అవసరము. విశ్రాంతి తీసుకొను అనువైన పట కుటీరము తన దగ్గర ఉన్నదని శ్రీ శంకరులు పరమశివునకు తెలుపుతున్నారు. అట్టి పట కుటీరము తన చిత్తమే యని విన్నవించు కొనుచున్నాడు. చిత్తమును శివునకు సమర్పించుకొను ఒక ఉత్తమ భక్తి మార్గమును ఈ శ్లోకమునందు తెలియజేయుచున్నారు.

మనస్సు శుద్ధమనియు, అశుద్ధమనియు రెండు విధములు. అయితే పరమాత్మకు సమర్పించవలసినది శుద్ధమైన మనస్సునా? లేక అశుద్ధచిత్తమునా? శుద్ధమైన మనస్సు ప్రేయస్సుకు దూరమై ఉండుట వలన అది శివస్మరణము నందే యుండును. అశుద్ధమైన మనస్సు ప్రేయా మార్గములో చరించుచు నికృష్ట గతిని పొంది యున్నందువ అది శివస్మరణ గావింపలేదు. మరి శివునికి ఎలాంటి చిత్తమును సమర్పించాలి? ఈ జటిలమైన విషయమును పరిష్కరించుచూ శుద్ధాశుద్ధ మనస్సులు రెండును పరమేశ్వర ప్రీతికే యున్నవని ఈ శ్లోకమునందు అద్భుతముగా తెలియజేయుచున్నారు.

మనస్సు ఒక చక్కని డేరా వంటిది. డేరా పరిమితమైనది. మనస్సు కూడా పరిమితమైనదియే. తాను ఎండలో మాడుచున్నను తన నాశ్రయించిన వారలకు డేరా వేడిని తగుల నివ్వదు. తాను వర్షములో తడుస్తున్నను తనలో నిలిచియున్న వారలపై వర్షమును పడనివ్వదు. అలాగే శుద్ధమైన మనస్సు తన నాశ్రయించిన జీవుని సురక్షిత జీవనమునకు సహకరించును.

డేరాను నిలుపుటకు స్తంభము ఆధారము. మనస్సనెడి డేరా ధైర్య మనెడి స్తంభము నాధారముగా గొని నిలిచి యున్నది. అయితే ఈ ధైర్యము సాత్వికమా? రాజసికమా? శుద్ధమనస్సునందు సాత్త్విక ధృతి యుండును. అశుద్ధమనస్సు నందు రాజస ధృతి యుండును. దేనికైనను ధీరత్వమే ఆధారము.

డేరాను నిర్మించుటకు ఆధారమైన ధృతి యనెడి స్తంభమును గుణము లనెడి త్రాళ్ళచే బంధింపవలెను. సాత్విక ధృతి స్తంభము సుగుణము లనెడి త్రాళ్ళతో కట్టబడి యుండగా, రాజస ధృతి స్తంభము దుర్గుణము లనెడి పాపములతో బంధింపబడి యున్నది. సత్వరజస్తమోగుణ పాశములతో బంధింపబడి యున్న ధైర్యమనెడి స్తంభము మనస్సనెడి పట కుటీరమునకు ఆధారమై ఉన్నది.

చలించుటకు వీలుగా యున్న డేరా ఎక్కడి కేగుటకైనను అనుకూలముగా యున్నది. మలిన యుతమగు అశుద్ధ మనస్సు ఆశాపాశములచే కట్టబడి ఒక ప్రదేశమునకు సర్వత్ర పిచ్చిదానివలె చరించును. మహిమాన్వితమైన శుద్ధ మనస్సు శోభాయమానమై, నిర్మలమై సర్వత్ర శివదర్శనము నొందునదియై వికారము తెలియక విహరించును.

విచిత్రమైన ఈ మనస్సనెడి పటకుటీరము పద్మముల శోభతో చక్కగా రూపుదిద్దుకొని యున్నది. డేరా రంగు రంగుల చిత్రములను కలిగి యుండును. మనస్సనెడి డేరా విచిత్రమైన రూపములను కలిగి యున్నది. పద్మము లనెడి చిత్రములను కలిగియున్నది అంటున్నారు.

శుద్ధ మనస్సు జ్ఞాన మనెడి శోభతో వెల్గొందు చున్నది. పద్మము జ్ఞానమునకు సంకేతము. పద్మ సౌందర్యమును సూచించుటలో జ్ఞానము నెరుకపరచుట జరుగుచున్నది. అలాగే ఈ పద్మ సౌందర్యమును మలిన మనస్సునకు సమన్వయ పరచి చూసినపుడు, పుష్పము వాడి, రేకులు ఊడి ఎలా అంతరించునో మలిన మనస్సులో కలిగెడి అనుభవములు కూడా

అలాగుననే అంతరించునని అవగత మగుచున్నది. అట్టి చిత్త పట కుటీరము యోగ్యముగా నున్నది యని చివరగా తెలియ జేయుచున్నారు.

శుద్ధ సంకల్పములకు శుద్ధ మనస్సు నివాస యోగ్యముకాగా, అశుద్ధ సంకల్పములకు అశుద్ధ మనస్సు నివాస యోగ్యమై ఉన్నది. కనుక మనస్సు ఏ విధముగా నున్నను దానిని పరమేశ్వరునికి సమర్పించి నపుడే నిజమైన శాంతి జీవికి లభించును. మనస్సనెడి డేరానందు ప్రవేశించి విశ్రమించుమని ప్రతి భక్తుడు పరమ శివుని ప్రార్థించాలి. ప్రవేశించిన పరమాత్మ మళ్లీ జారిపోకుండా స్థిరముగా నిలుచునట్లు చూసుకోవాలి. మరి అట్టి శక్తి మన కెలా లభ్యమగును? శివుని అనుగ్రహము చేతనే లభ్యమగును. శక్తి నిచ్చువాడు తానే. శక్తి స్వరూపము తానే. అందుచేతనే పార్వతీ సమేతుడవై నా హృదయ డేరాలో ప్రవేశింపుము అని శ్రీశంకరులు ప్రార్థించుచున్నారు. "గణసేవితా!" అని కూడ పరమశివుని ఈ శ్లోకములో శ్రీ శంకరులు స్తుతించినారు. గణములు ఇంద్రియములకు ప్రతీకములుగా తెలియుచున్నారు. ప్రమథ గణములు కైలాసమున నిన్ను సేవించునట్లు, నా హృదయ డేరాలో ప్రవేశించిన నిన్ను నా ఇంద్రియములు బహిర్ముఖము కానివియై సదా సేవించు చుండవలెను అని ప్రార్థించుటయే అందులోని అంతర్భావము. చిత్తమనెడి ఈ పట కుటీరము నందు రాజాధిరాజైన రాజేశ్వరుడు ప్రవేశింపవలెను. లేనిచో అది చోరులకు నిలయమగును. ఈ విషయమును రాబోవు శ్లోకమునందు తెలుపుచున్నారు.

ప్రలోభా ద్యై రర్థాహరణ పరతంత్రో ధనిగృహే
ప్రవేశో ద్యుక్తస్స న్భ్రమతి బహుధా తస్కరపతే
ఇమం చేత శ్చోరం కథమిహ సహే శంకర విభో
తవాధీనం కృత్వా మయి నిరపరాధే కురు కృపామ్ 22

తస్కరపతే = చోరనాథా!, హే శంకర = సుఖప్రదా!, విభో = విభుడా!, ప్రలోభాద్యైః = ప్రలోభములచేత, అర్థాహరణ = ధనము నపహరించుట యందు,

పరతంత్రః = ఆసక్తి గలవాడై, చేతశ్చోరః = చిత్తచోరుడు, ధనిగృహే = ధనవంతుని గృహమునందు, ప్రవేశోద్యుక్తస్సన్ = ప్రవేశించుటకు ఉద్యుక్తుడగుచు, బహుధా = బహువిధములుగ, భ్రమతి = తిరుగుచున్నాడు, ఇమం = ఈ, చిత్తచోరం = చిత్తమనియెడు దొంగ, కథం = ఎట్లు, సహే = సహింతును, ఇహ = ఇప్పుడు, తవ ఆధీనం కృత్వా = నీవశము చేసుకొని, నిరపరాధే = దోషము తెలియని, మయి = నాయందు, కృపాం = దయను, కురు =చేయుము.

భావము :- హే చోరనాథా! శంకరా! నా చిత్తమనెడి చోరుడు ధనము నార్జించుట యందు ఆసక్తి గల్గినవాడై ప్రలోభముచే ధనికుల ఇండ్లలో ప్రవేశించుట కుద్యుక్తుడై అనేక విధములుగా తిరుగు చున్నాడు. నేను ఇతనిని భరింపలేకున్నాను. వానిని నీవు వశపరచుకొని నిరపరాధి నగు నన్ను కృపజూడుము.

వ్యాఖ్య

కామ క్రోధాదుల నుండి విడిపడని మనస్సు శివారాధనకు ఉప యుక్తము కాదు. ఇరువది యవ శ్లోకమున కామమును జయించునట్లు అను గ్రహించమని పరమశివుని ప్రార్థించిన శ్రీశంకరులు ఈ శ్లోకమున లోభమును జయించునట్లు ఆశీర్వదించమని వేడుకొనుచున్నారు.

ధన దాహమే లోభము. ధన సంపాదనకై చెడు దారులు నన్వేషించు వాడు చోరుడు. లోభముతో అడ్డు దారులలో సంచరించే మనస్సును చోరుడుగా ఈ శ్లోకమున శ్రీశంకరులు వర్ణించుచున్నారు. ధన వ్యామోహముతో ధనికుల ఇండ్ల చుట్టు తిరిగి కల్లబొల్లి మాటలు పలుకుచూ, వారిని స్తుతించుచూ వ్యర్థమయ్యే మనస్సే చోరుడు. పరమాత్మను కీర్తించవలసిన నోరు ప్రలోభములకు గురియై, ధనికులను స్తుతించడానికి అలవాటు పడింది. గురు దక్షిణ సమర్పించగనే పొంగిపోయి గుర్తు మిగలని వ్యక్తిని కూడా గణనీయంగా పొగిడే గురువులు, సర్వసంగ పరిత్యాగులై, ఆశ్రమాలు నిర్మించుకొని, ధనదాహంతో ఆహ్వానం లేకపోయినా గృహస్థుల ఇండ్ల చుట్టూ సంచి చేత

పట్టుకొని తిరిగే సన్యాసులు, ప్రజలలో బలహీనతలను ఆసరాగా తీసుకొని వారిపై స్తోత్ర పత్రములు వ్రాసి, గ్రంథములను ముద్రించి డబ్బు గడించుటయే ప్రధాన కర్తవ్యముగా పెట్టుకొన్న కుహనా పండితులు-వీరంతా శ్రీశంకరుల దృష్టిలో చోరులే. ఈ విధమైన చోరత్వమునకు అలవాటుపడిన చిత్తమును ఎవరు సంస్కరించగలరు? అది ఎవరికి సాధ్యం? పరమ శివునకే సాధ్యము.

మనస్సు చోరత్వమునకు అలవాటు పడినందున మనిషి చోరుడయ్యాడు. మనిషికి మనస్సున్నదే గాని మనస్సు తాను గాదు. కనుక మనోపరిధి నుండి వీడిపడే ప్రయత్నములో అతి ముఖ్యమైన లోభ శృంఖలము నుండి బయట పడేందుకు భక్తుడు భగవంతుని ప్రార్థించాలి.

దొంగను దొంగయే పట్టగలడు. చిత్తము చోరుడుకాగా, శివుడు చోరపతి యని శ్రీశంకరులు తెలియజేయు చున్నారు. రుద్రము నందలి నమకము నందు పరమశివుని "తస్కరాణాం పతయే నమః" అని స్తుతించడము జరిగినది. కనుక చిత్త చోరుని నిగ్రహింప గలిగినవాడు శివుడే. అంతే కాదు. తాను ఈ చోరుని భరింపజాలనట్లు పలుకుతున్నాడు. దొంగయైన వాడు దొంగల ముఠాలోనే ఉండవలెను. అలాగే చిత్తమనెడి చోరుడు శివుని చెంతనే ఉండవలెనని భావము. కనుక మనస్సును వశముచేసుకొని తనను రక్షింపమని ప్రార్థించడము జరుగుచున్నది. తాను నిరపరాధియని చెప్పుచున్నాడు.

అపరాధములకు అలవాటు పడిన అంతఃకరణము తాను కాదని ఈ శ్లోకమునందు నిర్ణయించు చున్నాడు. వ్యతిరేక పద్ధతి ద్వారా చిత్తమును శివుని యందు లయింపజేయుటకు యత్నించు చున్నాడు.

లోభమును జయించుటయే ఈ శ్లోకమునందు కేంద్ర విషయము. లోభికి బ్రతుకులో శోభ మిగలదు.

"లోభశ్చే దగుణేన కిం?"

"లోభమునకు మించిన దుర్గుణము లేదు" అన్నాడు. భర్తృహరి. ధనము శాశ్వతముకాదు. దేహమున్నంత వరకే ధనము యొక్క అవసరము. మనిషి ధర్మ ద్రవ్యమును తయారు చేసుకోవాలి.

నియత తపమును ఇంద్రియ నిగ్రహంబు
భూరి విద్యయు శాంతికి కారణములు
దాని యన్నిటి కంటె మేలైన శాంతి
కారణము లోభ ముడుగుట మనుజనాథా!

అని లోభ జయమును సూచిస్తూ మహాభారతము తెలిపినది. కనుక ధనమునకు గాని పుణ్య జీవవానికి మనిషి శ్రమించాలి.

కీర్తిమంతుల శుభ్రమౌ కీర్తినైన
గుణము గలవారి యొప్పగు గుణమునైన
చెరచు నలుసంత లోభంబు చేరెనేని
తెల్లపాడ మేని యందంబు నెల్లవోలె

అని భాగవతము నందు తెలుపబడినది. సర్వ అనర్థములకు కారణమైన ఈ లోభ గుణమును భక్తులు తప్పక త్యజించాలి. కనుక లోభాది గుణములకు నిలయమైన చిత్తచోరుని శివునికి అప్పగించి శాంతిని పొందాలి. ఈ సమర్పణము దేని కొరకు? మోక్ష ప్రాప్తికా? స్వర్గప్రాప్తికా? ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

కరోమి త్వత్పూజాం సపది సుఖదో మే భవ విభో
విధిత్వం విష్ణుత్వం దిశసి ఖలు తస్యాః ఫలమితి
పునశ్చ త్వాం ద్రష్టుం దివి భువి వహన్ పక్షి మృగతా
మదృష్ట్వా తత్ఖేదం కథమిహ సహే శంకర విభో 23

విభో = విభుడా!, త్వత్పూజాం = నీ యొక్క పూజను, కరోమి = చేయుదును, సపది = ఇప్పుడు, శంకర = సుఖప్రదాతా! మే = నాకు, సుఖదః = సుఖము నొసంగు

వాడవు, భవ = కమ్ము!, తస్యాః = దానికి, విదిత్వం = బ్రహ్మత్వము, విష్ణుత్వం = విష్ణుత్వము, ఫలమితి = ఫలమని, దిశసిఖలు = ఇచ్చెదవుగదా!, పునశ్చ = మఱల, దివి = ఆకాశము నందును, భువిచ = భూమి యందును, త్వాం = నిన్ను, ద్రష్టుం = చూచుటకు, పక్షి మృగతాం = పక్షి రూపమున గాని, వరాహ రూపమున గాని, వహన్ = వహించును, అదృష్ట్వా = గాంచలేక, తత్ఖేదం = ఆవిధమైన దుఃఖమును, కథం = ఎట్లు, సహే = సహింతును?

భావము:- హే పరమ శివా! నేను నిన్ను పూజింతును. నాకు శాశ్వత సుఖమును ప్రసాదించుము. అంతేగాని నా పూజకు ఫలముగా! బ్రహ్మత్వమునో, విష్ణుత్వమునో అనుగ్రహించకుము. లేనిచో పక్షిగానో, పందిగానో మఱల జన్మించి నిన్ను గాంచుటకు ఆకాశము నందును, భూమియందును తిరిగి దర్శించలేని అశక్తుడనై దుఃఖముతో జీవింపజాలను.

వ్యాఖ్య

పూజ యనునది చక్కని సాధన. పూజలు ఎందరో చేస్తుంటారు. కానీ పూజాఫలము ఎందరికి తెలుసు? పూజలు కేవలం కర్మలు మాత్రమే. పూజ చేయు మనస్సులోని భావములే పూజాఫలములను అందిస్తూ ఉంటాయి.

చేతితో పూజచేయవచ్చు. లేదా మరొకరిని హత్యచేయవచ్చు. నాలుకతో భగవన్నామము నుచ్ఛరించవచ్చు. లేదా బండమాటలు పలుకవచ్చు. మనస్సును బట్టియే గతి నిర్ణయింప బడుతూ ఉంటుంది.

లౌకిక ప్రపంచమునందు అనేక రకములైన సుఖములున్నవి. వాటన్నిటిని నిరాకరించిన సాధకుడు పరమాత్మ నాశ్రయించి పూజలు చేస్తాడు. అలౌకిక ఆనంద ప్రాప్తిని వాంఛించి లౌకిక సుఖ విచ్ఛేదమును గావిస్తాడు. అట్టి సాధకుడు స్వర్గలోకము నందలి అనిత్య సుఖములను వాంఛించడు. కనుకనే తన పూజకు ఫలముగా పరమ పురుషార్థమైన మోక్షమును అనుగ్రహించమని శ్రీశంకరులు ప్రార్థించు చున్నారు. విష్ణుత్వము, బ్రహ్మత్వములు తనకు అవసరము లేదని చెబుతున్నాడు.

బ్రహ్మ, విష్ణువులు ఒకసారి తమ ఆధిక్యములను నిరూపించుకొన నిచ్ఛగించిన వారై పరమశివుని వద్దకు అరుదెంచినారట. అప్పుడు శివుడు వారిని పరీక్షింపదలచి, "నా స్వరూపము యొక్క ఆద్యంతములను కనుగొనిన వారు శ్రేష్ఠులు " అని తెలిపినాడట. బ్రహ్మదేవుడు హంసయై పైకి పోయి నాడట. విష్ణుమూర్తి వరాహ రూపమును ధరించి క్రిందికి పయన మైనాడట. ఇరువురి ప్రయత్నములు వ్యర్థములైనవి. శివుని యొక్క ఆద్యంతములు ఇరువురికి అవగతము కాలేదట. ఫలితము సిద్ధించలేదు. కానీ హంస వరాహాది జన్మలెత్తుట వలన కలిగిన దుఃఖము మాత్రమే మిగిలినదట. కనుక అలాంటి శ్రమలు తమకు అవసరము లేదనియు, శివుని యొక్క అనంత స్వరూపమైన మోక్షమును మాత్రమే అనుగ్రహించ వలసినదనియు ప్రార్థించు చున్నారు. కనుక పరమాత్మ దర్శనమే, సాక్షాత్కారమే వాంఛనీయమని తెలియుచున్నది. ఈ విషయము రాబోవు శ్లోకమున పరాభక్తి తెలియబడును.

కదా వా కైలాసే కనకమణి సౌధే సహ గణై
ర్వసన్ శంభో రగ్రే స్ఫుట ఘటిత మూర్ధాంజలి పుటః
విభో సాంబ స్వామిన్ పరమశివ పాహీతి నిగదన్
విధాతౄణాం కల్పాన్ క్షణమివ వినేష్యామి సుఖతః 24

కైలాసే = కైలాసమునందు, కనకమణి సౌధే = స్వర్ణమణి సౌధముపై, గణై స్సహ = గణములతో గూడ, శంభోః = శివునియొక్క, అగ్రే = ముందు, వసన్ = వసించువాడనై, స్ఫుట ఘటిత = దృఢముగా కూర్చబడిన, మూర్ధాంజలి పుటః = శిరస్సుపై చేతులుంచి నమస్కరించువాడనగుచు, విభో = విభుడా!, స్వామిన్ = స్వామీ, పరమశివా = పరమశివా!పాహి = రక్షింపుము, ఇతి = అని, నిగదన్ = పలుకుచున్న వాడనై, సుఖతః = అట్టి సుఖము వలన, విధాతౄణాం కల్పాన్ = అనేక బ్రహ్మకల్పములను, క్షణమివ = క్షణము వలె, కదావా = ఎప్పుడు, వినేష్యామి = గడుపుదునో.

భావము:- కైలాసము నందు స్వర్ణమణి సౌధముపై ప్రమథ గణములతో గూడియున్న శివుని ముందు నిలిచి శిరమోడ్చి అంజలి సమర్పించిన వాడనై "విభుడా! స్వామీ!

పరమశివా! నన్ను రక్షింపుము' అని పలుకుచూ, సుఖానుభూతి నొందుచూ అనేక బ్రహ్మకల్పములను క్షణమువలె ఎప్పుడు గడుపుదునో గదా!

వ్యాఖ్య

భగవత్సాక్షాత్కారము నొంది పరిపూర్ణ శాంత్యా నందముల ననుభవించుటయే మానవ జీవిత లక్ష్యమై యున్నది. మన మాచరించు సమస్త సాధనలు భగవంతుని నిరంతరము స్మృతిలో నిలుపుకొనుటకే. ఈ సాధనలలో అత్యంత ఉపయుక్తమైనది రూప దర్శనము. భగవానుని రూప మాధుర్యము ననుభవిస్తూ అనంతానంద ప్రాప్తి నొంది తరించుటయే రూప దర్శనములోని అమోఘ విషయము. అందుచేతనే కైలాసమున పరమశివుని దర్శించుచూ ఆనందాతిశయముతో పరవశించు అమృతమయ ఘడియలను ప్రసాదించమని శ్రీ శంకరులు ప్రార్థించుచున్నారు.

పరమేశ్వరుని సాన్నిధ్యమును పొందవలెనని ఊహించు తాను ప్రమథ గణముల మధ్యనున్నట్లు ఊహించు కొనుచున్నాడు. భక్త జనములే ప్రమథ గణములు. భగవంతుడెప్పుడూ భక్తుల మధ్యనే లభ్యమగును. అట్టి పరమశివుని కూర్చబడిన అంజలి బంధమును తలపై నుంచుకొని ప్రార్థించడము జరుగుచున్నది. రెండు చేతులను కలిపి అంజలి ఘటించుట యనగా మనో హృదయాలను ఐక్య మొనర్చుట యని భావము. తలపై నుంచుకొనుట శరణాగతిని సూచించును.

పరమాత్మకు సంబంధించిన ఆనందము నిర్మలానందము. నిరవధిక సుఖము. అది మనోబుద్ధుల నధిగమించిన స్థితి. ఆ స్థితిలో కాలగమనము తెలిసేందుకు వీలులేదు. కనుకనే అనేక బ్రహ్మకల్పములను నిముషకాల మనుభవించు దివ్యస్థితిని ప్రసాదించమని శ్రీశంకరులు ప్రార్థించుచున్నారు. ఈ శ్లోకమున ప్రారంభమైన రూప వైశిష్ట్యమును రాబోవు శ్లోకము నందు కూడా కొనసాగించు చున్నారు.

స్తవై ర్బ్రహ్మాదీనాం జయ జయ వచోభి ర్నియమినాం
గణానాం కేళీభి ర్మదకల మహోక్షస్య కకుది
స్థితం నీలగ్రీవం త్రినయన ముమాశ్లిష్ట వపుషం
కదా త్వాం పశ్యేయం కరధృతమృగం ఖండ పరశుమ్ 25

బ్రహ్మాదీనాం = బ్రహ్మాదులయొక్క, స్తవై = స్తోత్రముల తోడను, నియమినాం = నియమ నిష్ఠలుగల వారి యొక్క, జయ జయ వచోభిః = జయ జయ ధ్వనుల తోడను, గణానాం = ప్రమథగణముల యొక్క, కేళీభిః = క్రీడల తోడను, మద కల మహోక్షస్య = ఆనందముతో నిండియున్న వృషభము యొక్క, కకుది = మూపురము నందు, స్థితం = ఉన్నవాడును, నీలగ్రీవం = నల్లని కంఠము గలవాడును, త్రినయనం =మూడుకన్నులు గలవాడును, ఉమాశ్లిష్ట వపుషమ్ = పార్వతీ దేవిచే ఆలింగనము చేసుకొన బడిన దేహము గలవాడును, కరధృత మృగం = మృగమును చేతితో పట్టుకొనిన వాడును, ఖండ పరశుం = విరిగిన గండ్రగొడ్డలిని ధరించిన వాడును, త్వాం = నిన్ను, కదావా =ఎప్పుడు, పశ్యేయం = చూతును.

భావము:- బ్రహ్మాది దేవతలు స్తోత్ర పాఠములతోను, మహర్షులు జయ జయధ్వనులతోను, ప్రమథ గణములు నృత్యములతోను, గొలుచు చుండుగా, ఆనందాతి శయముతో గూడియున్న వృషభము యొక్క మూపురముపై ఆసీనమై యున్న నీలకంఠుడును, త్రినేత్రధారియును, పార్వతీదేవిచే నాలింగనము చేసుకొనబడిన వాడును, మృగమును చేతియందు ధరించి యున్న వాడును, విరిగిన గండ్ర గొడ్డలిని ధరించిన వాడును అగు పరమ శివుని నేను ఎప్పుడు దర్శింతునో గదా..

వ్యాఖ్య

పరమ శివుని రూప వైశిష్ట్యమును వివరించుచూ బ్రహ్మాదుల స్తోత్రములతోడను, మహర్షుల జయ జయ ధ్వనుల తోడను, ప్రమథ గణముల క్రీడలతోడను కూడిన వాడై వృషభము యొక్క మూపురముపై నున్నవాడు అని వర్ణించడము జరిగినది.

అభిప్రాయములను నిర్ణయించి కార్యములు సృష్టింపబడుటకు కారణమైన బుద్ధికి ప్రతీకముగా బ్రహ్మాదులు తెలియబడినారు. మననము చేయుట కుపకరించు చిత్తమునకు ప్రతీకములుగా మునులు తెలుపబడినారు. విషయ ప్రపంచమును గ్రహించుటకు కారణములైన ఇంద్రియములకు ప్రత్యామ్నాయంగా ప్రమధ గణములు తెలియ బడినారు. అహంకారమునకు ప్రతీకముగా వృషభము సూచింపబడినది. ఎప్పుడైతే మనోబుద్ధులు, అహంకార ఇంద్రియాదులు భగవంతుని పరివేష్ఠించి స్థిరపడునో అప్పుడే మనకు శివ దర్శన మగును.

అతడు నీలిరంగు కంఠముతో కనబడును. త్యాగము నలవరచుకొని ప్రేమలో చరించువారు మాత్రమే శివదర్శనము గావించుకొని తరించగలరని తెలుపుటయే నీలకంఠముయొక్క అంతర్భావము. సూర్యచంద్రుడు ఆయనకు రెండు నేత్రములుకాగా, అగ్నికి ప్రతీకమైన మూడవనేత్రము జ్ఞాన నేత్రమై యున్నది.

త్రిలోచనం నీలకంఠం ప్రశాన్తం
ధ్యాత్వా వలని ర్గచ్ఛతి బ్రహ్మయోనిం

"త్రిలోచనుడు, నీలకంఠుడు, ప్రశాంతుడైన పరమేశ్వరుని ధ్యానించిన మునులు బ్రహ్మదేవునికి ఉద్గమ స్థానమైన దివ్య స్థానమును చేరుదురు" అని కైవల్య శ్రుతి తెలుపుచున్నది. శక్తివంతుడైనందున సాంబశివుడై యున్నాడు. తన నాశ్రయించు భక్తులలోని మనో చాంచల్యమును పోగొట్టువాడు అని తెలియుటకు చేతిలో లేడిని, భక్తుల కర్మ పాశములను ఖండించువాడు అని తెలుపుటకు చేతిలో గండ్రగొడ్డలిని ధరించి యున్నాడు. ఇలా భగవానుని రూపవైభవమును వివరించిన పిదప భగవానుని దివ్య పాద పద్మములను శాశ్వతముగా హృదయములో నిలుపుకొను ప్రయత్నమును తరువాత శ్లోకములో కొనసాగించు చున్నారు.

కదా వా త్వాం దృష్ట్వా గిరిశ తవ భవ్యాంఘ్రి యుగళం
గృహీత్వా హస్తాభ్యాం శిరసి నయనే వక్షసి వహన్
సమాశ్లిష్యా ఘ్రాయ స్ఫుటజలజ గంధాన్ పరిమళా
నలభ్యాం బ్రహ్మాద్యైర్ముదమను భవిష్యామి హృదయే 26

గిరిశ = గిరిపై శయనించిన స్వామీ!, త్వాం = నిన్ను, దృష్ట్వా = చూచి, తవ = నీయొక్క, భవ్య = క్షేమకరమైన, అంఘ్రి యుగళం = పాద కమలములను, హస్తాభ్యాం = హస్తములతో, గృహీత్వా = గ్రహించి, శిరసి = శిరము నందుమ, నయనే = నేత్రము నందును, వక్షసి = వక్షఃస్థలమందును, వహన్ = వహించు వాడనై, సమాశ్లిష్య = ఆలింగన మొనర్చుకొని, స్ఫుటజలజగంధాన్ = వికసిత పద్మ సుగంధముగల, పరిమళాన్ = వాసనలను, ఆఘ్రాయ = ఆఘ్రాణించిన, బ్రహ్మాద్యైః = బ్రహ్మాదులచేత, అలభ్యాం = పొంద శక్యముగాని, ముదం = సంతోషమును, హృదయే = హృదయము నందు, కదావా = ఎప్పుడు, అనుభవిష్యామి = అనుభవింతును.

భావము:- హే పరమశివా, నిన్ను దర్శించి, నీయొక్క శుభకర చరణ కమలములను శిరస్సునందును, నేత్రములయందును, హృదయము నందును, ఆలింగన మొనర్చుకొని అందలి పద్మ గంధముల నాఘ్రాణించి బ్రహ్మాదులకును లభ్యము గాని దివ్యానందములను నా హృదిలో ఎప్పుడు అనుభవింతునో గదా!

వ్యాఖ్య

ఛిద్రమైన సంసారమును తొలగించుకొని రుద్రుని హృదయమున భద్రముగా దాచుకొనువాడే శివ భక్తుడు. భగవత్పాదములను శిరము నందును, కంటియందును, హృదయము నందును కౌగలించుకొన వలెనని అభిలషించు చున్నారు.

సంకల్పములు, దృష్టి, ప్రేమ యనునవి శివ సంబంధమై యుండవలెనని భావించుటయే ఈ శ్లోకము నందలి అంతర్భావము. శివుని ధరించు శిరము శివమయమే. శివుని పాద పద్మములు సత్యమునకు సంకేతము. సత్యమునకు సంబంధించిన సంకల్పములు మనస్సులో కదులుటయే శివుని పాదములను శిరమున నిలుపు కొనుటలోని అంతర్భావము.

మనసులో కదిలెడి సంకల్పములు క్రియారూపము నొందే ప్రయత్నములో ఇంద్రియముల ద్వారా వ్యక్తమగు చుండును. ఇంద్రియ పరిచ్ఛేదము వలన అవగాహన చెదిరే అవకాశము కూడా కలదు. అందువలన నేత్రములు శివుని పాదముల నాలింగనము చేసుకొనుట యనగా ఇంద్రియ నిగ్రహము జరిగి జ్ఞాన దృష్టి ప్రసరించుట అని అర్థము.

హృదయ గుహలో నిలిచియున్న వాసనలే మనోఫలకముపై సంకల్ప ములుగా వ్యక్తమై, ఇంద్రియాల ద్వారా శబ్దాది విషయములతో సంయోగము చెందును. హృదయములో భగవద్వాసన నిలిచినచో బ్రతుకులో వ్యక్తమయ్యే సంకల్పాది విషయములన్నియు తన్మయములై ఆనంద భూమికలుగా మారిపోవును. హృదయములో శివుని పాదములను నిలుపుకొనుట యనగా శుభవాసనను కలిగి యుండుట అని భావము. అప్పుడే జ్ఞానము వికసించును.

పద్మము జ్ఞానమునకు సంకేతము. వికసిత పద్మ సుగంధము నాఘ్రాణించుట యనగా జ్ఞాన సౌరభమును అనుభవించుట యని అర్థము. కనుక అట్టి జ్ఞానమును పొందుటకు మార్గమెయ్యది? ఏది సమర్పించుట వలన మనకు జ్ఞానము లభ్యమగును? ఈ విషయమును రాబోవు శ్లోకములో తెలుపు చున్నారు.

కరస్థే హేమాద్రౌ గిరిశ నికటస్థే ధనపతౌ
గృహస్థే స్వర్భూజామర సురభి చింతామణి గణే
శిరః స్థే శీతాంశౌ చరణయుగళస్థేఽఖిల శుభే
కమర్థం దాస్యేఽహం భవతు భవదర్థం మమ మనః 27

గిరిశ = పరమేశ్వరా!, హేమాద్రౌ = మేరు పర్వతము, కరస్థే = హస్తము నందుండగా, ధనపతౌ = ధనరాజగు కుబేరుడు, నికటస్థే = సమీపమున యుండగా, స్వర్భూజ = కల్పవృక్షము యొక్క, అమర సురభి = కామధేనువుయొక్క, చింతామణి = చింతామణి యొక్క, గణే = సమూహము, గృహస్థే = ఇంటిలో నుండగా, శీతాంశౌ =చంద్రుడు, శిరస్థే = శిరమున యుండగా, అఖిల శుభే = సమస్త శుభములను, చరణ యుగళస్థే=

పాదపద్మముల యందుండగా, కం = ఏ, అర్థం = ఇష్టార్థమును, అహం = నేను, దాస్యే = మీకిత్తును? మను = నాయొక్క, మనః = మనస్సు, భవదర్థం = నీకొఱకు, భవతు = అగు గాక!

భావము :- హే గిరీశా. స్వర్ణగిరి నీ చేతి యందున్నది. ధన రాజగు కుబేరుడు నీ చేరువ నున్నాడు. కల్పవృక్షము, కామధేనువు, చింతామణులు, ప్రమథగణములు నీ ఇంటియందే ఉన్నవి. చల్లని వెన్నెలను కురిపించు చంద్రుడు శిరమున నున్నాడు. సర్వ శుభములు నీ పాదముల వద్ద నున్నవి. కనుక పరమ శివా! నేను నీకు ఇవ్వదగిన దేదియో తెలియుట లేదు. కనుక నా చిత్తమును నీకు సమర్పించెదను.

వ్యాఖ్య

భక్తి మార్గము నందు సమర్పణ భావము అత్యుత్తమమైనది. పరమాత్మకు పూజలో ఏదైనా సమర్పించ వలెనని భక్తుడు ఆరాట పడుచుండును. భగవంతునికి మనము ఏమి ఇవ్వగలము? ఏది సమర్పించినను అది భగవానుని సృష్టిలోని ఫలమే కాగలదు. భగవానుడు పూర్ణ పురుషుడు. పరమేశ్వరుడు ఆప్తకాముడు. అట్టి పరమాత్మకు చిత్తము నొక్కదానిని సమర్పించ గలిగినచో మన చిక్కులన్నియు తీరిపోవును.

చిత్తము నాధారముగా గొని చిందులేయు వానికి పరమశివుడు లభించడు. చిత్తము స్థిరపడినచో శివుడు నీవాడగును. అప్పుడు సర్వమూ నీదే యగును. శివుని చేతిలో స్వర్ణగిరి కోదండముగా యున్నది. కనకమునకు నీకు కొదవేల? కుబేరుడు శివుని సహచరుడై యున్నాడు. ధనమునకు నీవు వగచనేల? కల్పవృక్షము మహేశ్వరుని ఇంటి యందే గలదు. అన్నపానాదులకు కొఱత ఏమిటి? కామధేనువు కామహరుడైన శంకరునికి సేవ చేయుచుండ వస్త్రములకై నీకు ఆలోచనలేల? చింతామణి శివునాజ్ఞకై నిరీక్షించుచుండ వాహనాదులు నీకు అలభ్యమా? మనస్సునకు అధిష్ఠాన దేవతయైన చంద్రుడు శివునికి భూషణమై యుండ వైఢూర్యలతో నీకు భూషణములేల? సర్వశుభములు

శివుని పాదముల చెంత నిలిచియున్నవి. చిత్తము నొక్కదానిని శివునకు సమర్పించ గలిగినచో సర్వమూ నీకు సమకూరినట్లే యగును. సారూప్య, సామీప్య, సాలోక్య, సాయుజ్య ముక్తులు లభ్య మగును. ఈ విషయమును రాబోపు శ్లోకము వివరించును.

సారూప్యం తవ పూజనే శివ మహాదేవేతి సంకీర్తనే
సామీప్యం శివ భక్తి ధుర్య జనతా సాంగత్య సంభాషణే
సాలోక్యం చ చరాచరాత్మక తను ధ్యానే భవానీపతే
సాయుజ్యం మమ సిద్ధ మంత్ర భవతి స్వామిన్కృతార్థో స్మ్యహమ్ 28

స్వామిన్ = ఓ స్వామీ, తవ =నీయొక్క పూజనే = పూజయందు, సారూపం = సమాన రూపమును బొందుటయు, శివ = శివా!, మహాదేవ = మహాదేవా!, ఇతి = అని,సంకీర్తనే= కీర్తించుట యందు, సామీప్యం సమీప మందుండుటయు, శివభక్తి = శివ భక్తి యనెడి, ధుర్య = భారము వహించుచున్న, జనతా = జన సమూహము యొక్క, సాంగత్య సంభాషణే = సాంగత్య సంభాషణలు లభించినపుడు, సాలోక్యం = సమాన లోక నివాసమును, హే భవానీ పతే =పార్వతీ వల్లభా!, చరాచరాత్మక = చరాచర రూపమైన, తను = మూర్తి ధ్యానే = ధ్యానము నందు, సాయుజ్యం = నీతోడి నైక్యమును, మమ= నాకు, అత్ర = ఇప్పుడే, సిద్ధం భవతి = సిద్ధించు చున్నది, అహం = నేను, కృతార్థః= కృతార్థుడను, అస్మి = అగుచున్నాను.

భావము :- హే మహాదేవా. నీ పూజయందు నాకు సారూప్యము సిద్ధించు చున్నది. నీ కీర్తనము నందుసామీప్యము లభించు చున్నది. నీ భక్తుల సాంగత్య సంభాషణముల యందు సాలోక్యము కలుగుచున్నది. చరాచరాత్మకమైన నీ మూర్తి ధ్యానము నందు సాయుజ్యము ప్రాప్తించు చున్నది. అంతయు నాకు ఇచ్చటనే లభ్యమగుచున్నది. కనుక నేను కృతార్థుడ నైతిని.

వ్యాఖ్య

భగవంతుని ఆరాధించు భక్తునికి లభించెడి అనుభవములు చతుర్విధ ముక్తులనెడి పేరుతో నాలుగు విధములుగా యుండును. అవి 1. సారూప్యము. 2. సామీప్యము 3. సాలోక్యము 4. సా[illegible]ము.

సారూప్యమనగా భగవంతుని రూపమును బొందుటయని భావము. సామీప్యమనగా భగవంతునికి సమీపమగుట. సాలోక్యమనగా భగవంతుని లోకమున ఉండుట. సాయుజ్య మనగా భగవంతుని యందు పాలలో పంచదారవలె కలిసియుండుట. మరి ఈ నాలుగు విధములైన ముక్తులు శివభక్తునికి ఈ ప్రపంచము నందు ఇప్పుడే లభించును.

పూజ చేయువానికి పరమాత్మయందు ప్రగాఢమైన ప్రేమ యుండును. అట్టి ప్రేమ అమృత రూపము నందించును.

"సా పరాను రక్తి రీశ్వరీ"

ఈశ్వరుని యందలి ప్రగాఢమైన అనురక్తియే నిజభక్తియని శాండిల్య మహర్షి భక్తి సూత్రముల యందు తెలిపి యున్నాడు. అట్టి ప్రేమ యందు తద్రూప స్థితి లభించును. ఇదియే సారూప్యము. సారూప్యస్థితి లభించిన వానికి సర్వము శివ మయముగా గోచరించును. ప్రతి రూపము భగవన్మూర్తి గనే తెలియును. ప్రతి శబ్దము ప్రణవ నాదముగా వినిపించును. జగత్తు జగదీశ్వరాలయమై భాసిల్లును. సారూప్య స్థితి రానిదే అది పూర్ణ భక్తి కానేరదు.

"నా రుద్రో రుద్ర మర్చయేత్"

"రుద్రుడు కానివాడు రుద్రుని అర్చించరాదు" అని శాస్త్రవాక్యము. విభూతి, రుద్రాక్షులను భక్తులు ధరించుటలోని అంతర్భావము కూడా నిదియే.

భగవానుని కీర్తించుటయే సామీప్య స్థితి. మాయా నర్తకి ఆటకట్టించు అమోఘ సాధనయే కీర్తన. భక్తితో నామము నుచ్చరించగనే పరమాత్మ కనుల ముందు ప్రత్యక్షమగును. దృఢ భక్తి కొనసాగినచో హృదయమున శాశ్వతముగా నిలిచిపోవును. ఇదియే సామీప్యము.

శివ భక్తులతో కూడి సాంగత్య సంభాషణములు సాగించుటయే సాలోక్యస్థితి. ఇచ్చట లోక మనగా అనుభవ భూమిక యని అర్థము. సంత్ సమాగమము సత్పదార్థమునకు సంబంధించిన అవగాహనను కలిగించును.

పరమాత్మ సంబంధమైన భావములతో నింపును. ఆధ్యాత్మిక లోకమున విహరించునట్లు చేయును. ఇదియే సాలోక్యస్థితి.

చరాచర భూత ప్రపంచమును పరమాత్మ స్వరూపముగా భావించి, ధ్యానించి, ధ్యేయ వస్తువుతో తాదాత్మ్యము చెందుటయే సాయుజ్యము. ఈ చతుర్విధ మోక్షములు శివ భక్తునికి ఇప్పుడే లభించుచున్నవి. అందుచేత భక్తుడు ధన్యుడైనాడు. పరమేశ్వరుని వదలి జీవించలేని భక్తుడు పరప్రేమలో చరించి తరించు చున్నాడు. శివైక్యమే అతని ప్రగాఢ ఏకైక వాంఛ.

అంతఃకరణ విశుద్ధిం భక్తిం చ
త్వయి సతీం ప్రదేహి విభో
సాంబ సదాశివ శంభో శంకర
శరణం మే తవ చరణయుగం

"హే శంకరా!మాకు అంతఃకరణ శుద్ధిని, నిర్మల భక్తిని ప్రసాదించుము. సాంబా! సదాశివా! శంభో! శంకరా! నీ చరణకమలములే నాకు శరణ్యము" అని శ్రీశంకరాచార్యుల వారు సువర్ణ మాలాస్తుతి యందు తెలిపి యున్నారు. కనుక హృదయమును శివునికి సమర్పించి మోక్ష ప్రాప్తినొంది తరించవలెను. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

**త్వత్పాదాంబుజ మర్చయామి పరమం త్వాం చింతయామ్య
న్వహం, త్వామీశం శరణం వ్రజామి వచసా త్వా మేవ
యాచే విభో, వీక్షా మేదిశ చాక్షుషీం సకరుణాం దివ్యై
శ్చిరం ప్రార్థితాం, శంభో లోక గురో మదీయ మనసస్సౌఖ్యోపదేశం కురు 29**

విభో = విభుడా!, పరమం = శ్రేష్ఠమైన, త్వత్పాదాంబుజం = నీ చరణ కమలమును, అర్చయామి = అర్చించు చున్నాను, అన్వహం = ప్రతిదినము, త్వాం = నిన్ను, చింత యామి = చింతించు చున్నాను, ఈశం = జగత్కర్తవగు, త్వాం = నిన్ను, వరణం = శరణ్యముగా, వ్రజామి = పొందుచున్నాను, వచసా = వాక్కు చేత, త్వామేవ = నిన్నే, యాచే = యాచించు చున్నాను, దివ్యైః = దేవతల చేతను, చిరం = చాలాకాలముగా, ప్రార్థితాం = ప్రార్థింపబడినదియు, సకరుణాం = దయతో కూడినదియు,

చాక్షుషీం = నేత్రసంబంధమైన, వీక్షాం = కటాక్ష ప్రసారమును, మే = వాకు, దిశ = ఇమ్ము, శంభో = పరమేశ్వరా, లోకగురో = జగద్గురువా!, మదీయ = నాయొక్క, మనసః= మనస్సునకు, సౌఖ్యోపదేశం = బ్రహ్మోపదేశమును, కురు = చేయుము.

భావము :- హే శివా! ఉత్కృష్టమైన నీ పాద పద్మమును పూజించుచున్నాను. ప్రతిదినము నిన్నే చింతించు చున్నాను. జగత్కర్తవైన నిన్నే శరణు జొచ్చి యున్నాను. నా వాక్కుచేత నిన్నే యాచించుచున్నాను. దేవతలచే చిరకాలముగా ప్రార్థించ బడినదియు, దయతో కూడినదియును అగు నీ కటాక్షమును నాపై ప్రసరింప జేయును. పరమేశ్వరా! జగదాచార్యా! నా మనస్సునకు సౌఖ్యోపదేశమగు బ్రహ్మోపదేశము నొసంగుము.

వ్యాఖ్య

ప్రారంభ సాధకునికి పూజయనునది శ్రేష్ఠమైన సాధన. బహిర్ముఖమయ్యే ఇంద్రియ మనో బుద్ధులను అంతర్ముఖ మొనర్చి పరమాత్మ యందు లగ్నమొనర్చుటకు పూజయే ఎక్కువగా ఉపకరించును. సాధన సోపానాలలో రెండవ దశ జపము. పూజ యందు పరమాత్మ తన కన్నా వేరుగా నున్నట్లు సాధకుడు భావించును. జపము దశలో పరమాత్మ తన హృదయము నందు న్నట్లే భావించును. ఈ విధమైన వైఖరి వలన పరమాత్మ సహచర్య భాగ్యము అత్యంత సన్నిహితమై, దైవశక్తి, వైభవాదులను అనుభవించే అవకాశము లభించును. ఈ రెండు దశలు దాటిన పిమ్మట పూర్ణంగా మనస్సును భగవంతుని యందు లయింపజేసి శరణాగతుడగుట. ఇదియే ధ్యానము. ఈ మూడింటిని క్రమముగా తెలిపి, ప్రతి దినము తాను పరమేశ్వరుని యాచించు చున్నట్లు శ్రీశంకరులు తెలుపుచున్నారు. పూజ, జప, ధ్యానాదుల ద్వారా తనను సోపాన క్రమముగా దివ్యధామమువైపు నడిపించమని ప్రార్థించుచున్నారు.

కాయ వాఙ్మనః కార్య ముత్తమం
పూజనం జప చింతనం క్రమాత్

"దేహముతో చేయు పూజ కన్నను వాక్కుతో చేయు జపము శ్రేష్ఠము. వాక్కుతో చేయు జపము కన్నను మనస్సుతో చేయుధ్యానము శ్రేష్ఠము" అని శ్రీ రమణ మహర్షుల వారు తమ ఉపదేశసారములో తెలుపుతారు.

సమస్తమైన సాధనలు ఫలించుటకు దైవ కృపయే ప్రధానాంశముగ తెలియుచున్నది. అందుచేత పరమేశ్వరుని కృపా కటాక్షమును వాంఛించు చున్నారు. బ్రహ్మోపదేశమును అర్థించు చున్నాను.ఆది గురువు పరమేశ్వరుడే అయినందున తానే జగద్గురువు.

ఈ శ్లోకమునందు "వీక్షాం మే దిశ" అనుటకు బదులు "దీక్షాం మే దిశ" అనెడి పాఠాంతరము కలదు.

జగద్గురువని పరమేశ్వరుని ప్రశంసించినపుడు గురువుకు సేవలొనర్చ వలెను గదా! ఆ విషయములో తాను అశక్తుడట. ఈ విషయము తరువాత శ్లోకము నందు దర్శితము.

వస్త్రోద్ధూత విధౌ సహస్ర కరతా పుష్పార్చనే విష్ణుతా
గంధే గంధవహాత్మతా న్నపచనే బర్హిర్ముఖా ధ్యక్షతా
పాత్రే కాంచన గర్భతాస్తి మయి చేద్బాలేందు చూడామణే
శుశ్రూషాం కరవాణి తే పశుపతే స్వామిన్ త్రిలోకీ గురో 30

బాలేందు చూడామణే = చంద్రశేఖరా!, పశుపతే = భూతనాధా!, స్వామిన్ = స్వామీ!, త్రిలోకి గురో = త్రిజగద్గురు, వస్త్రోద్ధూత విధౌ = వస్త్రోపచారము చేయుట యందు, సహస్ర కరతా = వేయి హస్తములు గల వాడగుటయు, పుష్పార్చనే = పుష్పపూజ యందు, విష్ణుతా = విష్ణువగుటయు, గంధే = గంధమును సమర్పించుటయందు, గంధవహాత్మతా= వాయు రూపుడగుటయు,అన్నపచనే = ఆహారమును వండుటయందు, బర్హిర్ముఖాధ్యక్షతా= ఇంద్రుడగుటయు, పాత్రే = అర్ఘ్యమును అర్పించుట యందు, కాంచన గర్భతా = హిరణ్య గర్భుడగుటయు, మయి = నాయందు, అస్తిచేత్ = ఉన్నయెడల, తే = నీయొక్క, శుశ్రూషాం = సేవను, కరవాణి = చేయ జాలుదును.

భావము :- మహేశా త్రిజగద్గురూ. నీకు వస్త్రోప చారము చేయుటకు వేయి చేతులు గలవాడు కావలెను. నీకు పుష్పోప చారము గావించుటకు సర్వవ్యాపియగు విష్ణు దేవుడే సరిపోవును. గంధోపచారము చేయుటకు వాయుదేవుడు కావలెను. అన్నము తయారుచేసి నైవేద్యమును సమర్పించుటకు అగ్నిముఖుల కధ్యక్షుడగు ఇంద్రుడే కావలెను. అర్ఘ్యము నర్పించుటకు హిరణ్య గర్భుడు కావలెను. ఈ లక్షణములు నాలో ఉన్నప్పుడే నేను నీకుసేవ లొనర్పగలను.

వ్యాఖ్య

సర్వవ్యాపకుడైన సదాశివునికి వస్త్రోప చారము చేయవలెననిన అది వేయి కరములు గల సూర్యునికే సాధ్యమగును. విష్ణుదేవుడు సర్వవ్యాపి గనుక ఆయనే పుష్పములను సమర్పించగలడు. గంధమును సమర్పించుట పరిమిత ఉపాధులు గలవారికి సాధ్యము కాదు. అందుచేత వాయుదేవుడే ఆ పనికి సమర్థుడు. ఇంద్రుడే నైవేద్యమును సమర్పించగలడు. అర్ఘ్యాదులను అర్పించుట బ్రహ్మదేవునకే సాధ్యము అని శ్రీ శంకరులు తెలియ జేయుచూ, పై లక్షణములన్నియు తనయందు కలిగినపుడు మాత్రమే పరమేశ్వరుని సేవించుట జరుగునని తెలుపుతున్నారు. ఆ దివ్యలక్షణములను సాధకుడు ఏర్పరచు కొనవలెనని భావించుటయే అందులోని అంతర్భావము.

సూర్యుని వలె జ్ఞాన కిరణములను కలిగియుండవలెను. విష్ణు దేవుడు సర్వవ్యాపి. ప్రతి వస్తువు నందును, వ్యక్తి నందును, పరమేశ్వరుని గాంచవలెను. వాయువు సమస్తమును ఆలింగన మొనర్చు కొనునట్లు ప్రపంచములోని ప్రతిప్రాణిని ప్రేమించి, మానసికంగా ఆలింగన మొనర్చుకో గలగాలి. ఇంద్రియములను స్వాధీన పరచుకొని ఆంతరంగిక హోమమును సాగించాలి. బ్రహ్మదేవుడు సృష్టికార్యమును అద్భుతముగ సాగించునట్లు నీ సాధన క్రమమును కొనసాగించవలెను. ఈ లక్షణములను తయారు చేసుకొని నపుడే శివార్చన చేయగలుగుదుము. శివార్చన సాగినపుడే శివానుగ్రహమునకు పాత్రులమై తరించగలము. శివ మహిమను తెలియ గలము. పరమేశ్వరుని మహిమ ఏలాంటిదో రాబోవు శ్లోకము విదిత మొనర్చు చున్నది.

నాలం వా పరమోప కారక మిదం త్వేకం పశునాంపతే
పశ్యన్కుక్షి గతాన్ చరాచర గణాన్ బాహ్యా స్థితాన్ రక్షితుమ్
సర్వామర్త్యపలాయ నౌషధ మతి జ్వాలాకరం భీకరం
నిక్షిప్తం గరళం గళే న గళితం నోద్గీర్ణ మేవ త్వయా 31

పశూనాం పతే = భూతనాధా!, కుక్షిగతాన్ = కడుపులో నున్న, చరాచర గణాన్ = చరాచర గణములను, బాహ్యా స్థితాన్ = వెలుపల నున్న వారలను, రక్షితుం = రక్షించుటకు, పశ్యన్ = ఆలోచించుచు, త్వయా = నీ చేత, అతి జ్వాలాకరం = మిక్కిలి తాపమును కలిగించునదియు, భీకరం = భయంకరమగు, గరళం = విషము, సర్వామర్త్య = సమస్త దేవతల యొక్క, పలాయన = పలాయనము, ఔషధం = మందు, గళే = కంఠమునందు, నిక్షిప్తం = ఉంచబడినదియై, నగళితం = మ్రింగబడలేదు. నోద్గీర్ణమేవ = ఉమియ బడలేదు, పరమోపకారకం = మిక్కిలి ఉపయుక్తమైన, ఇదం ఏకం = ఇది యొక్కటియే, నాలం వా = చాలదా!

భావము :- భూతాధిపా! కడుపులో నున్న చరాచర గణములను, వెలుపలనున్న వారలను రక్షించుటకు ఆలోచించి, అతి భయంకర మైనదియు సర్వదేవతలు బెదరి పారిపోవునట్లు అగ్ని జ్వాలలతో సర్వత్ర వ్యాపించిన హాలాహలమును లోనికి మ్రింగక, బయటకుమియక కంఠమున నిలిపితివి. మిక్కిలి ఉపయుక్తమైన ఈ ఒక్క కార్యము నీ ఘనతను తెలియ జేయుచున్నది.

వ్యాఖ్య

సురాసురులు క్షీరసాగరమును మధించినపుడు హాలాహలము ఆవిర్భవించినది. భయంకరమైన, అగ్ని జ్వాలలను క్రుమ్మరించుచు సర్వవ్యాపకమై గన్పట్టుచున్న గరళమును పరమశివుడు పానము చేసెను. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన జగదీశ్వరుని కుక్షిలో నిలిచియున్న చతుర్దశ భువనములు నశించునేమో యని గరళమును మ్రింగలేదు. బయట కుమ్మివేసినచో వెలుపల నున్న జీవరాసులు నశించును. అందుచేత కంఠము నందే విషమును నిలిపిన

వాడై పరమశివుడు నీలకంఠు డాయెను. ఇదొక మహోన్నత త్యాగమును సూచించు సన్నివేశము. వైభవమును వ్యక్తీకరించు అత్యద్భుత సంఘటనము. అన్యులకు ఆపద ఉండకూడదని కాలకూట విషమును పానము చేసిన దివ్యాత్ముడు సాంబశివుడు.

సాధకుని అంతర్యములో జరిగే జ్ఞాన నిర్మథనాభ్యాసమే క్షీరసాగర మథనము. సాధకుని అంతర్యమున నిలిచియున్న అహంకారమే హాలాహలము. అహంకారము లోనున్నచో అంతర్యమును పాడుచేయును. బయట నున్నచో అన్యులకు ఆవేదనకు గురిచేయును. కనుక దానిని కంఠమునందే నిలుపవలెను. శివుని వైభవము సాధకుని కర్తవ్యమును కూడా ఎఱుక పరచుచున్నది.

శివాను గ్రహము లభించునపుడే సాధకుడు ఆధ్యాత్మికాభివృద్ధిని సాధించును. శివునివలె త్యాగమయ జీవితమునకు అలవాటు పడినపుడే మనకు శివానుగ్రహప్రాప్తి కలుగును. ఈ విషయము రాబోవు శ్లోకము నందు కూడా కొనసాగుచున్నది.

జ్వాలోగ్ర స్సకలామ రాతి భయదః క్ష్వేళం కథం వా త్వయా
దృష్టః కిం చ కరే ధృతః కరతలే కిం పక్వ జంబూఫలమ్
జిహ్వాయాం నిహితశ్చ సిద్ధ ఘటికా వా కంఠ దేశే భృతః
కిం తే నీలమణి ర్వి భూషణమయం శంభో మహాత్మన్వద32

మహాత్మన్ = మహాత్మా!, జ్వాలోగ్రః = మంటల చేత కూడి, సకలామర = సర్వదేవతలకు అతి భయదః = మిగుల భయంకరమైనదియు, క్ష్వేళః = విషము, త్వయా = నీచేత, కథం వా = ఎట్లు, దృష్టః = చూడబడినది,కించ = అంతియేగాక, కరే = చేతియందు, ధృతః = ధరింప బడినది. కరతలే = అఱచేతియందు, నిహితః = ఉంచబడినది, పక్వ జంబూఫలం కిం? = పండిన నేరేడు పండా యేమి? జిహ్వా యాంచ = నాలుక యందును, నిహితః = వేసుకొనబడినది, సిద్ధ ఘటికావా = సిద్ధ ఘటికయా ఏమి? కంఠదేశే = కంఠ ప్రదేశమునందు, భృతః = భరింపబడినది, అయం = ఇది, తే = నీకు, విభూషణం = అలంకారమైన, నీలమణిః కిం? = ఇంద్ర నీల మాణిక్యమా ఏమి?, వద = తెలుపుము.

భావము :- మహాత్మా! మహాదేవా! తీవ్ర జ్వాలలతో గూడినదియు, సమస్త దేవతలకు భయమును కలిగించినదియునగు కాలకూట విషమును నీవు ఎలా దర్శించ గలిగితివి? చేతితో ఎలా పట్టుకొంటివి? అరచేతిలో ఎలా ధరించితివి? అది నీకు పండిన నేరేడు పండువలె నుండినదా. నాలుకపై వేసుకొని నపుడు నీకు అది సిద్ధఘుటిక యైనదా? కంఠము ధరించితివి కదా! అది నీకు ఇంద్రనీలమాణిక్యము వలె అలంకారమైనదా? చెప్పుము.

వ్యాఖ్య

త్యాగమయుడైన శివుడు పరోపకారార్థియై హాలాహలమును మ్రింగెను. పరోపకారము అందరికిని సులువైన కార్యము కాదు. తీవ్ర జ్వాలలతో కూడి అతి భయంకరముగ గన్పట్టెడి హాలాహలమును శివుడు ఎలా దర్శించ గలిగినాడు? అని శ్రీ శంకరులు విస్మయమొందుచున్నారు. సేవా దృక్పథము గల మహోన్నత వ్యక్తి అన్యులు దర్శించలేని స్థితిని చూడ గలిగిన వాడై యుండాలి. అంతేకాదు. అట్టి స్థితి అతిభయంకరమై అగ్ని జ్వాలలను కురిపించు చున్నను నిర్భయముగా చూడగల్గిన వాడై యుండాలి.

దర్శించినను దానిని గ్రహించుట బహుకష్టము. ఆదర్శమును ఎందరో దర్శించ గలరు. కానీ కొందరే దానిని స్పృశించగలరు. ధీర పురుషులకే ఇది సాధ్యపడును. దానిని స్పృశించిన పిదప మఱల జారిపోకుండా, రాలిపోకుండా చూసుకోవాలి అందుచేతనే శివుడు హాలాహలమును అరచేతి యందు ధరించెను. భయంకరమైన విషము ఆదర్శ జీవికి పండిన నేరేడు పండును పట్టుకొనినట్లే యున్నది. అట్టి భయంకర విషమును శివుడు పానము చేసెను. అది నాలుక మీద పడగానే దారుణ పరిస్థితి ఏర్పడి యుండాలి. కానీ శివున కది సిద్ధౌషధము వలె పనిచేసెను. ప్రసాద మనస్తత్త్వముతో జీవించు వ్యక్తికి విష, పాయసములు రెండును సమానమే. భరింప శక్యము గాని హాలాహలము శివుడు కంఠము నందు నిలుపుకొని నీలకంఠుడాయెను. పరోపకారమునకై ముందు కురికిన వారికి విషమ పరిస్థితులు ఎదురౌతాయి. అయినను వాటిని

బోధలుగా మార్చుకుంటారే గాని బాధలని భయపడరు. శివుని కంఠమున నిలిచిన విషము ఇంద్ర నీల మాణిక్యమువలె అలంకారమై అలరారు చున్నది. కనుక ఆరాధించ దగిన వాడు ఆదర్శమైన దేవుడు పరమశివుడే గాని అన్యులు గారు. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

నాలం వా సకృదేవ దేవ భవతస్సేవా నతిర్వా నుతిః
పూజావా స్మరణం కథాశ్రవణ మప్యాలోకనం మాదృశామ్
స్వామి న్నస్థిర దేవ తానుసర ణాయాసేన కిం లభ్యతే
కావా ముక్తిరితః కుతో భవతి చేత్కిం ప్రార్థనీయం తదా 33

స్వామిన్ = స్వామీ!, భవతః = నీ యొక్క, నతిర్వా = వందనము గాని, నుతిర్వా = స్తోత్రము గాని, పూజావా = పూజయేని, స్మరణం = స్మరించుట గాని, కథాశ్రవణ మపి = కథాశ్రవణముగాని, ఆలోకనం = దర్శించుటగాని, సకృదేవ = ఒక్కమాటు మాత్రమే, భవతః = నీయొక్క, సేవా = భజనము, మాదృశాం = నాలాంటి వారలకు, నాలం వా = చాలదా!, ఇతః = ఇదిగాక, ముక్తిః = ముక్తి, కావా = ఎట్టిది?, కుతోపి = వానిలో ఏదైనను, భవతి చేత్ = కలుగునేని, తదా = అప్పుడు, న అస్థిరః = స్థిరముగాని, దేవతా = దేవతలయొక్క, అనుసరణా యాసేన = అనుసరించు విధముచేత, కిం లభ్యతే = ఏమి లాభము?, ప్రార్థనీయం = కోరదగినది, కిం = ఏమున్నది?

భావము :- స్వామీ. శంకరా. నీకు ఒక్కసారి నమస్కరించినను, నిన్ను స్తుతించినను, పూజించినను, స్మరించినను, నీ కథాశ్రవణము చేసినను, నీరూపమును దర్శించినను మాలాంటి వారికి చాలును. వీనిలో ఏ ఒక్క దానివలన యైనను ముక్తి లభించుచుండగా అనిత్యమైన దేవతారాధన వలన ఏమి ప్రయోజనము? నేను వాంఛింప దగిన దేమున్నది?

వ్యాఖ్య

మనస్సును మహేశ్వరునిపై మళ్ళించుటయే సమస్త సాధనల పరమ గమ్యమై యున్నది. శరీరము ద్వారా చేయునది నమస్కారము. వాక్కు ద్వారా

చేయునది స్తుతి లేక ప్రార్థన. మనస్సు ద్వారా చేయునది స్మరణము. ఇంద్రియముల ద్వారా జరుగునది రూప దర్శనము లేదా కథా శ్రవణము. కనుక దేహేంద్రియ మనో బుద్ధులను పరమాత్మపై మఱలించుటయే ఉత్తమ సాధన. ఈ సాధనల ద్వారా అంతఃకరణ ఆది దేవుని సామీప్యము నొందగలదు. నిరాటంకముగా సాగినచో మన ఆంతర్యములోనే ఒక ప్రశాంత వాతావరణము ఏర్పడి మనము దైనందిన కార్యముల నాచరించునపుడు బాహ్యములో కూడా అదియే ప్రశాంత వాతావరణము చోటు చేసుకొనును. అప్పుడు పరమాత్మ కృపా కటాక్షముల వలననే మనము సర్వకర్మముల నాచరించు చున్నట్లు అనుభూతి ఏర్పడును. కనుక సదా మన ఆలోచనలు పరమేశ్వరునిపై సాగవలెను. నాలుకపై భగవన్నామమే కదులుచుండవలెను. మనమండి కదిలే ప్రతి కర్మయు ఈశ్వర సేవగా కదలవలెను.

అనిత్య వస్తు ప్రపంచము నుండి మనస్సు విడిపడినపుడు మోక్షము సిద్ధించును. పైన తెలిపిన ఏ ఒక్క సాధన యైనను వ్యక్తిని అంతర్ముఖుని గావించ గలదు. అట్టి స్థితిలో అన్య దేవతల నారాధించుట నిష్ఫలమేనని శ్రీ శంకరులు తెలియచేయుచున్నారు. భగవత్సేవ యందు సర్వమూ సమకూరుచున్నందున వాంఛింప దగినదంటూ మరేదియు నుండదు అని తెలుపుతున్నారు. భయభ్రాంతులు కదిలే అవకాశములేదు. శోకమోహాదులు ముట్టేందుకు వీలులేదు. ఎందువలన? పరమ శివుడు శుభకరుడు గనుక. అభయ ప్రదాత గనుక. ఈ విషయమును రాబోవు శ్లోకము తెలుపగలదు.

కిం బ్రూమ స్తవ సాహసం పశుపతే కస్యాస్తి శంభో భవ
ద్ధైర్యం చేదృశ మాత్మనస్థ్సితి రియం చాన్యైః కథం లభ్యతే
భ్రశ్యద్దేవగణం త్రసన్మునిగణం నశ్యత్ప్రపంచం లయం
పశ్యన్నిర్భయ ఏక ఏవ విహర త్యానంద సాంద్రో భవాన్ 34

పశుపతే = భూతనాథా!, శంభో = ఓ శంభుడా!, తవ = నీయొక్క, సాహసం = ధైర్యము, కిం బ్రూమః = ఏమని చెప్పుదుము?, ఈదృశం = ఇటువంటి, భవ ద్ధైర్యం = నీధైర్యము,

కస్య = ఎవరికి, అస్తి = కలదు?, ఇయం = ఈ, ఆత్మనః = తనయొక్క, స్థితిశ్చ= స్థితియును, అన్యైః = అన్యులచేత, కథం = ఎట్లు, లభ్యతే = లభించును?, ఆనందసాంద్రః = ఆనందముతో కూడియున్న, భవాన్ = నీవు, భ్రశ్యద్దేవగణం = పడిపోవు దేవతాగణంబును, త్రసన్మునిగణం = భయపడుచున్న మహర్షి గణమును, నశ్యత్ = నశించిపోవుచున్న, ప్రపంచం = ప్రపంచమును, లయం = లయమును, పశ్యన్ = గాంచుచు, నిర్భయః = నిర్భయుడవై, ఏక ఏవ = ఒక్కడవే, విహరతి = విహరించు చున్నావు.

భావము :- హే పశుపతీ! ఏమి నీ సాహసము? నీ యొక్క ధైర్యము ఎవరి కున్నది? ఈ నీ స్థితిని అన్యులెట్లు పొందగలరు? ఆనంద పూర్ణుడవైన నీవు పడిపోవు దేవతా గణమును, భయపడుచున్న మహర్షి గణమును, నశించిపోవుచున్న ప్రపంచ లయమును గాంచుచు నిర్భయుడవై ఒంటరిగా విహరించు చున్నావు.

వ్యాఖ్య

సమస్త విశ్వము ప్రళయకాలమున లయించు చుండగా పరమశివుడు నిర్భయుడై నిలిచి యుండెను. సాగరమునందు అలపుట్టును. కదులును. నశించిపోవును. అల నశించినదేగాని సాగరము నశించలేదు. అల యొక్క మార్పులను గాంచి అంబోధి ఆవేదన చెందదు. పరమశివుడు అధిష్ఠాన పర బ్రహ్మము. జగత్తు అధేయ ప్రతిబింబము. విశ్వేశ్వరునిపై ఆధారపడి విశ్వము చరించు చున్నది. విశ్వము నశించినంత మాత్రాన ఈశ్వరునకు భంగము వాటిల్లదు.

సృష్టి ఎలా విచిత్రమైన కార్యమో లయ కూడా అలాంటిదే. త్రాడులో పాము గోచరించింది. గోచరించినదే గాని సత్యము కానేరదు. సత్యమైన వస్తువు మార్పు చెందదు. మార్పు చెందే వస్తువు సత్యము కానేరదు. త్రాటిలో పామును చూసిన వాడు భీతి చెందును. త్రాడును త్రాడుగా చూచువానికి భయములేదు. దుఃఖము ఉండదు. రెండవ వస్తువు యొక్క ఉనికియే వ్యక్తిలో భయమును కలిగించును. ఏకత్వమును దర్శించు వారికి శోకమోహాదులు భయభ్రాంతులు కలిగేందుకు వీలులేదు.

శివునిది అద్వైత దృష్టి. ఆ దివ్యాత్ముని జ్ఞానమయ దృష్టికి రెండవ వస్తువు తెలిసిరాదు. అది అద్వయ దృష్టి. అద్వైత దృష్టి. అందుచేత తాను ఏకమై, నిర్భయుడై ఉండును.

యథో జాయతే పాల్యతే యేన విశ్వం

తమీశం భజే లీయతే యత్ర విశ్వం

'ఈ విశ్వము ఎవని నుండి ఆవిర్భవించి, ఎవనిచే పాలింపబడి, చివరగా ఎవని యందు లీనమగుచున్నదో అట్టి ఈశ్వరుని నేను భజించుచున్నాను' అని శ్రీ ఆదిశంకరులు తమ వేదసార శివస్తోత్రము నందు తెలిపియున్నారు.

నిర్భయుడైన పరమేశ్వరుని ఆశ్రయించినచో మనము కూడా నిర్భయులమే కాగలము. ఈ విషయ వివరణము తరువాత శ్లోకము నందు చూడుడు.

యోగ క్షేమ ధురంధరస్య సకల శ్రేయః ప్రదోద్యోగినో
దృష్టాదృష్ట మతోపదేశ కృతినో బాహ్యాంతర వ్యాపినః
సర్వజ్ఞస్య దయాకరస్య భవతః కిం వేదితవ్యం మయా
శంభో త్వం పరమాంత రంగ ఇతిమే చిత్తే స్మరామ్య న్వహమ్

యోగ = యోగమువందును, క్షేమ = రక్షణము నందును, ధురంధరస్య = బరువును భరించు, సకల శ్రేయః = సర్వశుభముల నొసంగెడు, ప్రదోద్యోగినః = ఉత్తమోద్యోగము గల, దృష్టా దృష్ట = గోచరించినవానికి, గోచరింపని వానికి, మత = సమ్మతమైన, ఉపదేశ కృతినః = ఉపదేశించు నేర్పుగల, బాహ్యాంతర వ్యాపినః = బాహ్యాంతరముల యందు వ్యాపించియున్న, సర్వజ్ఞస్య = సర్వజ్ఞుడైన, దయాకరస్య = కరుణకలిగినట్టి, భవతః = నీ యొక్క, మయా = నాచేతను, వేదితవ్యం = తెలియ దగినదియు, కిం = ఏమున్నది? త్వం = నీవు, మే = నాకు, పరమాంతరంగః = అత్యంత ఆప్తుడవు, ఇతి = ఇట్లు, అన్వహం = ప్రతిదినమును, చిత్తే = చిత్తమునందు స్మరామి = స్మరించు చున్నాను.

భావము :- **యోగక్షేమముల భారమును నీవే వహించు చున్నావు. ఐహికాముష్మిక ఫలమును పొందుటకు ఉపాయము నుపదేశించు నేర్పు నీకు గలదు. సర్వశ్రేయముల నొసంగు చున్నావు. బాహ్యాభ్యంతరముల యందు నిండియున్న**

నీ స్వరూపము కరుణా పూర్ణమై యున్నది. ఇవి అన్నియు నీ కళ్యాణ గుణములు. ఇక నేను తెలుసుకొన వలసినది ఏమున్నది? నీవే నాకు ఆంతరంగిక అప్తుడవు. నిన్నే నేను సదా స్మరించు చుందును.

వ్యాఖ్య

పొందుట యోగముకాగా, పొందిన దానిని రక్షించు కొనుట క్షేమ మనబడినది. భక్తిని నింపుకొనుట, దానిని కారిపోకుండా కాపాడుకొనుట యనెడి యోగ క్షేమములు రెండును పరమేశ్వరుడే చూచుచున్నాడు. అందుచేత భక్తుడు ధన్యుడు.

"యోగక్షేమం వహామ్యహమ్"

అని శ్రీకృష్ణుడు గీతయందు తెలియ జేయగా

"నమః శంభవే చ మయో భవేచ"

అని రుద్రము శ్లాఘించినది. కనుక పరమేశ్వరుడే సర్వ శుభముల నొన గూర్చు వాడై యున్నాడు. పరమాత్మ నీకు ఆంతరంగిక అప్తుడు. కనుక ఒక చోట ఆసీనుడవై నీవు పరమాత్మను ధ్యానించ నవసరములేదు. భగవన్నామము నుచ్చరిస్తూ, కరచరణాదులు కర్మలో కదులునపుడు కూడా నీవు పరమాత్మను చింతించగలవు. అప్పుడే నీవు పరమేశ్వరుని సర్వజ్ఞత్వమును గ్రహించ గలుగుదువు. అప్పుడు నీవు చేయు కర్మలన్నియు భగవానుని కర్మలుగా మారగలవు. ఈ స్థితి రాగానే పరమేశ్వరుని కృప మనకు లభించగలదు. మహేశ్వరుడు కరుణామయుడు. ఆయన చైతన్య దీప్తినామ రూపాత్మకమైన ప్రపంచమంతయు వ్యాపించి యున్నది. కనుక భగవత్కృపను అనుభవించుట వలన సర్వజ్ఞత్వము, విశ్వరూప దర్శనము రెండును లభ్యమగుచున్నవి. విశ్వాత్మ భావము కలుగుచున్నది. అందుచేత శుభకర స్థితిని ప్రసాదించి రక్షించు పరమశివుని సదా ధ్యానింపవలెను.

"త్వదంగీ కృతాశ్చర్య! సర్వేఽపి ధన్యాః"

"శర్వదేవా! శంకరా! నీవు అంగీకరించి, అనుగ్రహించి కలుపుకొనిన సర్వులూ ధన్యులే" యని శ్రీ ఆదిశంకరుల వారు శ్రీ శివ భుజంగ స్తోత్రము నందు తెలిపి యున్నారు.

భక్తో భక్తి గుణావృతే ముదమృతాపూర్ణే ప్రసన్నే మనః
కుంభే సాంబ తవాంఘ్రి పల్లవయుగం సంస్థాప్య సంవిత్ఫలమ్
సత్త్వం మంత్రముదీరయన్ నిజశరీరాగార శుద్ధిం వహన్
పుణ్యాహం ప్రకటీ కరోమి రుచిరం కల్యాణ మా పాదయన్ 36

సాంబ = శంకరా!, భక్తః = భక్తుడైన నేను, నిజ శరీర = నా శరీరమనెడి, అగార శుద్ధిం= గృహశుద్ధిని, వహన్ = వహించువాడనై, రుచిరం = ఇంపైన, కల్యాణం = కళ్యాణమును, ఆపాదయన్ = పాధింప, భక్తి గుణావృతే = భక్తి యనెడి పోగులతో చుట్టబడిన, ముదమృతా పూర్ణే = సంతోషమనెడి జలముతో పూరించి, ప్రసన్నే = ప్రసన్నమైనది యగు, మనః కుంభే = మనస్సనెడి కలశమునందు, తవ = నీయొక్క, అంఘ్రి పల్లవ యుగం = చరణములనెడి రెండు పల్లవములు, సంవిత్ఫలం = కొబ్బరి బొండంబును, సంస్థాప్య = ఉంచి, వత్త్వం = సత్త్వగుణ ప్రధానమైన, మంత్రం = తారక మంత్రమును, ఉదీరయన్ = ఉచ్చరించుచు, పుణ్యాహం = పుణ్యాహ వాచనమును, ప్రకటీ కరోమి = ప్రకాశింప జేయుదును.

భావము :- సాంబా! భక్తుడనగు నేను రుచిరమును, కళ్యాణ ప్రదమగు మోక్ష ప్రాప్తిని పొందుటకుగాను ప్రతి దినము నా దేహమును గృహమును శుద్ధి చేసుకొనుటకు పుణ్యాహ వాచనమును గావించు కొందును. అందులకు నా మనస్సనెడి కలశమును భక్తి యనెడి దారపు పోగులతో చుట్టెదను. సంతోష మనెడి జలముతో మనో కలశమును పూరింతును. దాని యందు నీ చరణ ద్వయ మనెడి మామిడి పల్లవములను ఉంచెదను. జ్ఞానమను కొబ్బరి బొండమును ఉంచెదను. ఈ విధముగా కలశ స్థాపన మొనరించి శుద్ధ సాత్త్వికమగు పంచాక్షరి నుచ్చరించి పుణ్యాహ వాచనము నెరవేర్తును.

వ్యాఖ్య

గృహము నందు ప్రవేశించునపుడు గాని, లేదా కళ్యాణాది శుభ కార్యములు సాగించుటకు ముందుగాని, లేదా అశుభమును పోగొట్టు కొనుటకు గాని పుణ్యాహ వాచనము అనెడి కర్మను అనుష్ఠించు చుందురు. అలాగే మోక్షార్థియైన సాధకుడు పరమాత్మను హృదయములో దర్శించి తరించుటకు గాను పుణ్యాహ వాచనాది కార్యక్రమమును సాగించ వలసియున్నది. ఈ విషయమును అత్యంత రమ్యముగా, రమణీయముగా ఈ శ్లోకమునందు శ్రీశంకరులు తెలియజేసినారు.

పుణ్యాహ వాచనము అనెడి శుద్ధి క్రియ యందు ముందుగా గృహమును శుభ్రపరచుదురు. అలాగే సాధకుడు తన దేహ మనెడి గృహమును శుద్ధి పరచుకొనవలెను. తరువాత గృహమునందు కలశము నుంచెదరు. సాధకుడు తన మనస్సనెడి కలశమును శుద్ధి చేసి పెట్టవలెను. కలశమును గృహస్థులు దారపు పోగులతో చుట్టెదరు. అలాగే భక్తి యనెడి దారపు పోగులతో మనస్సనెడి కలశమును సాధకుడు చుట్టవలెను. గృహమునందు కలశమును జలముతో నింపవలెను. కలశమునందు రెండు మామిడి మండలనుంచునట్లు, మనోకలశమునందు పరమేశ్వరుని పాదము లనెడి మామిడి మండల నుంచవలెను. తదుపరి పల్లవములపై కొబ్బరి బొండంబు నుంచవలెను. ఈ విధముగా శుద్ధి కర్మ మాచరించి "పుణ్యాహమ్" అనెడి మంత్రోచ్చారణతో ఆ జలమును అభిమంత్రించెదరు. అలా శుద్ధియైన జలమును యజమాని శిరస్సు మీదను, ఇంటియందును చల్లుకొనును. ఇట్లు పుణ్యాహ వాచనము చేయుట వలన సర్వ శుభములు చేకూరును.

సాధకుడు మనోకలశము నందు నిండిన సంతోష జలమును "ఓం నమశ్శివాయ" అనెడి మంత్రమును చదివి అభిమంత్రణ మొనర్చును. అలా శుద్ధి పడిన చిత్తముతో సదా నిరంజనుడైన నీలకంఠునే ధ్యానించి తరించును. ఈ విధమైన ఆధ్యాత్మిక పుణ్యాహ వాచనము వలన సాధకుడు మోక్షప్రాప్తి

నొంది తరించును. పుణ్యాహ వాచనములోని ఆధ్యాత్మిక సౌందర్యమును తిలకించి తృప్తి చెందితిమి. అలాగే క్షీరసాగర మథనములోని శివభక్తి యుతమగు ఆధ్యాత్మిక సౌందర్యమును రాబోవు శ్లోకమున దర్శించి భక్తిని వృద్ధి పరచు కొనెదము గాక!

ఆమ్నాయాంబుధి మాదరేణ సుమన స్సంఘా స్సముద్యన్మనో
మంథానం దృఢభక్తి రజ్జు సహితం కృత్వా మథిత్వా తతః
సోమం కల్పతరుం సుపర్వ సురభిం చింతామణిం ధీమతాం
నిత్యానంద సుధాం నిరంతర రమా సౌభాగ్య మాతన్వతే 37

సుమన స్సంఘాః = పండితమన్యులు, సముద్యత్ = సుగుణవంతమైన, మనః = మనస్సును, దృఢభక్తి = దృఢభక్తి యనెడి, రజ్జు సహితం = త్రాడుతో కట్టిన, మంథానం= కవ్వముగా, కృత్వా = చేసి, అమ్నాయాంబుధిం = వేదసాగరమును, ఆదరేణ = ఆదరముతో, మధిత్వా = మథించి, తతః = దానివలన, సోమం = చంద్రుని, కల్పతరుం= కల్ప వృక్షమును, సుపర్వసురభిం = కామధేనువును, చింతామణిం = చింతామణిని, ధీమతాం = బుద్ధికి సంబంధించిన, నిత్యానంద సుధాం = నిత్యానంద పీయూషమును, నిరంతర = నిత్యమైన, రమాసౌభాగ్యం = లక్ష్మీసంపదను, ధీమతాం = బుద్ధిమంతులు, ఆతన్వతే = పొందుచున్నారు.

భావము :- పండిత మన్యులు సుగుణ సంపదతో నొప్పుచున్న మనస్సును దృఢభక్తియును త్రాటితో కూడిన కవ్వముగా చేసి, వేదమను సాగరమును ఆసక్తితో మథించి, తత్ఫలితముగా చంద్రుని, కల్పవృక్షమును, కామధేనువును, చింతామణిని, ధీమంతులకు అవిచ్ఛిన్నమైన లక్ష్మీ సంపద వంటివాడును అగు నిత్యానంద స్వరూపుడను అగు సోమేశ్వరుని బొందు చున్నారు.

వ్యాఖ్య

విష్ణుపురాణము నందలి క్షీరసాగర మథనము సాధకుని జీవితములోని ఆధ్యాత్మిక సాధనా క్రమమునకు ప్రతిరూపమై ఉన్నది. దేవతలు మందర

పర్వతమును కవ్వముగాను, వాసుకి యనెడి సర్పమును త్రాడుగాను ఉపయోగించి క్షీరసాగరమును మథించిరి. తత్ఫలితముగా వారికి చంద్రుడు, కల్పవృక్షము, కామధేనువు, చింతామణి, లక్ష్మీదేవి, అమృతము నొంది సుఖించిరి. అలాగే పండితులు జ్ఞాన నిర్మథనాభ్యాసమనెడి సాగర మథనమును సాగించి సాంబశివుని పొందిరి.

సుగుణ సంపదతో నిండిన మనస్సును త్రాటితో గట్టిన కవ్వముగా చేసి వేదము లనెడి సముద్రమును మథించిరి. వేదములను మథించినచో సర్వము లభించును. అయితే భక్తి నిండిన హృదయము కావాలి. భక్తిలేని వారు వేద సారమును గ్రహించలేరు.

భక్తితో వేదసాగరమును మథించిన పండితులకు సాంబశివుడు లభించెను. అతడు భక్తుల అభీష్టములను తీర్చు కల్పవృక్షము వంటివాడు. కర్మ సంచితమును పోగొట్టుటలో కామధేనువు వంటివాడు. మనో రుగ్మతలను నశింపజేసి ఆధ్యాత్మికారోగ్యమును ప్రసాదించుటలో చింతామణి వంటివాడు. జ్ఞానము నందించి బ్రతుకు మొగ్గను వికసింప జేయుటలో లక్ష్మీ దేవి వంటివాడు. చివరగా మోక్షమనెడి అమృతమును ప్రసాదించి తరింప జేయువాడు సాంబశివుడే. కనుక గతంలో పండితులు ఏవిధముగా సాధనలో ఆంతరంగిక మననము ద్వారా సాంబశివుని పొంది సుఖించిరో అలాగే మనముకూడా జ్ఞాన నిర్మథనాభ్యాసము ద్వారా సాంబశివుని పొందవలెను.

"జ్ఞాన నిర్మథనా భ్యాసా త్పాశం దహతి పండితః"

"జ్ఞాన నిర్మథనాభ్యాసము వలన పండితులు అజ్ఞాన పాశమును ఛేదించిరి" అని అథర్వణ వేదము తెలిపినది.

ప్రాక్పుణ్యాచల మార్గ దర్శిత సుధామూర్తిః ప్రసన్నశ్శివః
స్సోమ స్సద్గణ సేవితో మృగధరః పూర్ణస్తమో మోచకః
చేతః పుష్కర లక్షితో భవతి చే దానంద పాథోనిధిః
ప్రాగల్భ్యేన విజృంభతే సుమనసాం వృత్తి స్తదా జాయతే 38

ప్రాక్పుణ్యాచల = పూర్వ జన్మము నందలి పుణ్యముల గుట్టయొక్క, మార్గ = మార్గమున, దర్శిత = చూపబడిన, సుధామూర్తిః = అమృతమయ శరీరము గలవాడు, ప్రసన్నః = ప్రసన్నమైనవాడు, శివః = శుభకరుడు, సద్గణసేవితః = సత్పురుష సమూహముచే సేవింపబడినవాడు, మృగధరః = లేడిని ధరించినవాడు, పూర్ణః = అంతట నిండినవాడు, తమో మోచకః = అజ్ఞానమును బాపువాడు, సోమః = సోమునివంటివాడు, ప్రాగల్భ్యేన= ప్రాభవముతో, చేతః = పుష్కర, లక్షితః = చిత్తమునందు చూడబడిన వాడు, భవతి చేత్ = అగునేని, ఆనంద పాథోనిధిః = ఆనందసాగరము, విజృంభతే = ఉప్పొంగు చున్నది, తదా = అప్పుడు, సుమనసాం = చక్కని మనస్సుగల వారలకు, వృత్తిః = ప్రవృత్తి, జాయతే = పుట్టుచున్నది.

భావము :- అమృత మయ శరీరము గలవాడును, ప్రసన్న మూర్తి మత్త్వము గలవాడును, శుభకరుడును, మహర్షి గణముచే సేవింప బడినవాడును, మృగధరుడును, పూర్ణరూపుడును, అజ్ఞానము నంత మొందించువాడును, చంద్రునివలె చల్లని వాడును అగు సోమశేఖరుడు పురుషుడు. పూర్వజన్మముల యందు సంపాదించుకొనిన పుణ్య మనెడి పర్వత మార్గమున దర్శన మొసంగును. హృదయాకాశమున శివుడు ప్రత్యక్ష మగునేని ఆంతర్యము ఆనంద సాగర మగును. అప్పుడు శుద్ధ సత్త్వము గలవారి చిత్తములు పరవశించును.

వ్యాఖ్య

పుణ్యమనెడి పర్వత మార్గమున పరమశివుడు మనకు దర్శన మొసంగును. పుణ్యములేని వానికి మోక్షము రాదు అని భావము. అది కూడ పర్వత మంతటి పుణ్యమై ఉండవలెను. కనుక ప్రతి దినము పుణ్య కర్మముల నాచరింపవలెను. ప్రతి క్షణము పుణ్యమునకు సంబంధించిన సంకల్పములు మనస్సు నందు కదులునట్లు చూసుకొనవలెను. పుణ్యములేని వారలకు గురుబోధలు పనిచేయవు. పుణ్యహీనులైన వారు ప్రయత్నించినను ఫలితములను సాధించలేరు.

పుణ్యఫలముగా లభించు మహేశ్వరుడు అద్వయుడైనందున మలిన రహితుడై శుభకరుడని కీర్తించబడినాడు. మనస్సును దాటిన స్థితి యందున్నవాడై

మృగధరుడాయెను. ప్రకాశైక స్వరూపుడైనందున అజ్ఞానమును అంతమొందించువాడై ఉన్నాడు. కర్మత్రయ వివర్జితుడైనందున చంద్రుని వలెచల్లని వాడై తన భక్తుల హృదయ భూములపై చల్లని ప్రశాంత వెన్నెలను కురిపించువాడై యున్నాడు.

సూర్యుడు చీకట్లను పారద్రోలునట్లు, శివ దర్శనము హృదయాకాశము నందలి అజ్ఞాన చీకట్లను చెదర గొట్టును. అప్పుడా హృదయము ఆనంద సాగర మగును. నిరాశా మేఘములు చెదరిపోగా, జ్ఞానోదయము సమస్తమును నిత్యనూతన వెలుగులతో నింపిన ఆ శుభ సమయాన చిత్తములు పరవశించును. బుద్ధి శోభాయమానమగును. జీవన శకటము నూతన మలుపు తిరుగును.

పరమేశ్వరుడు మన హృదయ సింహాసనమున ఆసీనుడై జీవిత రాజ్యమును పాలించెనేని అట్టి జీవితము ధన్య జీవితమగును. అట్టి ధన్య జీవిత మెలా ఉండునో రాబోవు శ్లోకము వివరించుచున్నది.

ధర్మో మే చతురంఘ్రికస్సుచరిత: పాపం వినాశం గతం
కామక్రోధ మదాదయో విగళితాః కాలాస్సుఖావిష్కృతాః
జ్ఞానానంత్య మహౌషధి స్సుఫలితా కైవల్యనాథే సదా
మాన్యే మానస పుండరీక నగరే రాజావతంసే స్థితే 39

రాజీవతం సే = రాజపూజితుడును, మాన్యే = సర్వసంపూజ్యుడును, మే = నా యొక్క, మానస పుండరీక నగరే = కమలము వంటి మనస్సనెడి నగరము నందు, కైవల్యనాథే= కైవల్య ప్రభువై, స్థితే = ఉండగా, చతురంఘ్రికం = నాలుగు పాదములు గల, ధర్మః= ధర్మము, సుచరిత: = చక్కగ చరించు నదియై, పాపం = పాపము, వినాశం = వినాశమును, గతం = పొందినది, కామ క్రోధ మదాదయః = కామ, క్రోధ, మదాదులు, విగళితాః = తొలగిపోయినవి. కాలాః = పక్షము, మాసము, సంవత్సరము మొదలగు కాలములు, సుఖావిష్కృతాః = సుఖమును ఆవిష్కరించు చున్నవి, జ్ఞానానంత్య =

జ్ఞానానంత్యమను, మహౌషధిః = సిద్ధి సాధనమగు యౌషధి, సదా = ఎల్లప్పుడు, సుఫలితా= చక్కని ఫలితము, భవతి = అగుచున్నది.

భావము :- **ధర్మ ప్రభువైన రాజు నగరి యందుండి పాలించు చుండగా, దోషములు నశించి, భూమి ఫలవంతమై, సకలైశ్వర్యములు తులతూగునట్లు, రాజపూజితుడు, సర్వసంపూజ్యుడు నగు కైవల్య నాథుడు నా హృదయార వింద మనెడి పురమునకు అధిపతియై ఉండగా, ధర్మము చతుష్పాదములతో నడచు చున్నది. పాపములు తొలగి పోయినవి. జ్ఞానానందమున దివ్యమగు ఓషధులు ఫలించి సుఖము ప్రాప్తించినది.**

వ్యాఖ్య

నగరమున రాజున్నచో ఆ నగరము సురక్షితముగా యుండును. అలాగే హృదయమున పరమేశ్వరుడున్నచో జీవితము ఆనంద ప్రదమై యుండును. సత్యము, శౌచము, దయ, దానము లనెడి నాలుగు పాదములతో శోభించు చుండును.

"తత్రశ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతి ర్మతిర్మమ"

భగవంతు డున్నచోట సంపదయు, విజయము, ఐశ్వర్యము, సుస్థిరమగు నీతి యండునని భగవద్గీత తెలుపుతున్నది.

వెలుతురున్నచోట అంధకారము ప్రవేశించుటకు వీలులేనట్లు, పరమాత్మ నివసించు హృదయములో కామక్రోధాదులు ప్రవేశించలేవు. పాపములు ప్రక్షాళన మగును. ఆనందము వృద్ధి చెందుచుండును. జీవితము సుఖ శాంతులతో తులతూగుచుండును. జ్ఞానానంద మహౌషధులు మొలకెత్తును.

నైతిక శిక్షణ కలిగి, ధర్మాత్ములైన వారిని ప్రభువు అనుగ్రహించి, సన్మానించునట్లు, ధార్మిక చింతన కలిగిన మనుజుని మహేశ్వరుడు ఆశీర్వదించి ఆనందింప జేయును. రాజు లేని రాజ్యము చోరులకు నిలయమై, అశాంతి

ఆవేదనలకు ఆలయమై గోచరించును. ఎవరి హృదయములో పరమేశ్వరుడు ప్రభవించడో అట్టి వారు కామ క్రోధాది చోరులచే బంధింపబడి శాంతిని, సుఖమును కోల్పోవుదురు. కనుక పరమాత్మ నిలిచిన హృదయమే ఆనందాలయము హృదయక్షేత్రములో పరమాత్మను ధరించి జ్ఞాన పంటను పండించుకొను ఆధ్యాత్మిక కర్షకులే సాధకులు. మరి ఫలితము ఎలాంటిది? తరువాత శ్లోకమును పరిశీలింపుడు.

ధీయంత్రేణ వచో ఘటేన కవితా కుల్యోప కుల్యాక్రమై
రానీతైశ్చ సదాశివస్య చరితాంభో రాశిదివ్యామృతైః
హృత్కేదారయుతా శ్చ భక్తి కలమా స్సాఫల్య మాతన్వతే
దుర్భిక్షా న్మమ సేవకస్య భగవ న్విశ్వేశ భీతిః కుతః 40

భగవన్ = భగవంతా!, విశ్వేశ = విశ్వనాథా!, ధీయంత్రేణ = బుద్ధియను యంత్రముతో, వచోఘటేన = వాక్కనుకుండతో, కవితా = కవిత్వమనెడి, కుల్యోప కుల్యాక్రమైః = కవిత్వమనియెడి కాలువలు, పిల్లకాలువలు మొదలగు వాని ద్వారా, ఆనీతైహి = కొని రాబడిన, సదా శివస్య = శివునియొక్క, చరితాంభో రాశి = కథలనెడి సముద్రముయొక్క, దివ్యామృతైః = దివ్యామృతములచే, హృత్కేదారయుతాః = హృదయంబను పొలమున గూడియున్న, భక్తి కలమాః = భక్తియనెడి వరిపైరులు, సాఫల్యం = ఫలితమును, ఆతన్వతే= విస్తరించు చున్నవి. సేవకస్య = నీ సేవకుడనైన, మమ = నాకు, దుర్భిక్షాత్= దుర్భిక్షమువలన, భీతిః = భయము, కుతః = ఎక్కడిది?

భావము :- హే భగవాన్! విశ్వేశ్వరా! నీ చరిత్ర యనెడి సాగరములోని దివ్యామృతము బుద్ధియను యంత్రముచే వాక్కు అను కుండతో, కవిత్వమును కాలువల, పిల్లకాలువల ద్వారా తీసికొని రాబడి నా హృదయ క్షేత్రములోనికి ప్రవహించి భక్తియనెడి వరిపంటను విస్తృత మొనర్చు చున్నది. నీ సేవకుడనైన నాకు కరువు వలన భయ మెట్లు కలుగును.

వ్యాఖ్య

ఈ శ్లోకమున పరమేశ్వరుని "భగవన్" అని సంబోధించడము జరిగినది. "భగవన్" అనగా షడ్గుణైశ్వర్య సంపన్నుడు అని భావము. జ్ఞానము, ఐశ్వర్యము, శక్తి, బలము, వీర్యము, తేజము అను ఆరింటిని భగము అందురు. ఈ ఆరు లక్షణములను కలిగియున్న వాడు భగవంతుడు. గడచిన శ్లోకములో కామక్రోధాది అరిషడ్వర్గములను జయించు ఉపాయమును తెలిపిరి. ఈ శ్లోకమునందు షడ్గుణైశ్వర్యములను కలిగించు కొనుటను వివరించు చున్నారు.

అంభోరాశి యనగా సాగరమనియె గాక, మంచినీటితో నిండిన తటాకమని కూడాభావించవచ్చును. అంభోరాశి యందలి నీటిని, యంత్రముల సహాయముతో, కుండల ద్వారా తోడి,కాలువల ద్వారా, పిల్లకాలువల ద్వారా తమ తమ పొలముల లోనికి మళ్ళించి, పైరులను పండించి ఆ ధాన్యము ద్వారా ఆకలి తెలియని జీవితమును రైతులు అనుభవించు చుందురు. అలాగే ఆధ్యాత్మిక సాధకులు కూడా జ్ఞాన పంటను పండించు కొని తృప్తితో జీవింతురు.

శివ చరితమే ఇచ్చట అంభోరాశి. అట్టి దివ్యామృతమును బుద్ధి యను యంత్రము యొక్క సహాయముచే వాక్కు అను కుండ ద్వారా, కవిత్వ మనెడి కాలువల ద్వారా ప్రవహింపజేసి, హృదయ క్షేత్రమునకు మళ్ళించగా అందు భక్తి యనెడి పంట విస్తృత మగునని ఆచార్యులు తెలియజేయుచున్నారు.

భక్తి యనెడి సస్యము తయారు కావలెనన్నచో శివుని కథలను తనివితీరా ఆలకించవలెను.

"కథా దిష్వితి గర్గః"

"కథా శ్రవణము భక్తి యనబడును" అని గర్గమహర్షి తెలిపియున్నాడు. బుద్ధి పని చేయునపుడే వాక్కు పుష్టికరముగా యుండును. మొదట బుద్ధిలో శివ చరితమును నిలుపుకొని, అట్టి దివ్యామృతమును వాక్కు అను కుండ

నుండి కవిత్వ మనెడి కాలువల ద్వారా ప్రవహింపజేయవలెను. శివ చరిత్ర యనెడి చల్లని జలము హృదయ క్షేత్రమును చేరగనే భక్తి యనెడి పంట విస్తృత మగును. భక్తి నిండిన హృదయానికి కొఱత ఏమి ఉండును?

మనస్సులోని అసుర సంపద నెలా అంతమొందించు కోవలెనో ముప్పది తొమ్మిదవ శ్లోకమున తెలిపి, దైవీ సంపద నెలా ఆవిష్కరించు కొనవలెనో ఈ శ్లోకము నందు తెలిపి, మనస్సువలెనే ఇంద్రియములను జయించు ఉపాయమును రాబోవు శ్లోకమున తెలుపు తున్నారు.

పాపోత్పాత విమోచనా య రుచి రైశ్వర్యాయ మృత్యుంజయ
స్తోత్ర ధ్యాన నతి ప్రదక్షిణ సపర్యాలోక నాకర్ణనే
జిహ్వా చిత్త శిరోంఘ్రి హస్త నయన శ్రోత్రైరహం ప్రార్థితో
మా మాజ్ఞాపయ త న్నిరూపాయ ముహు ర్మామేవ మామేఽవచః

మృత్యుంజయ = మృత్యువును జయించినవాడా!, పాపోత్పాత = పాపంబను ఉత్పాతమును, విమోచనాయ = పోగొట్టుట కొఱకు, రుచిరైశ్వర్యాయ = అభీష్ట సంపద కొఱకు, స్తోత్ర= స్తోత్రము చేయుట, ధ్యాన = ధ్యానించుట, నతి = నమస్కరించుట, ప్రదక్షిణ = ప్రదక్షిణము చేయుట, సపర్యా = సేవచేయుట, ఆలోకన = దర్శించుట, ఆకర్ణనే = ఆలకించుట, జిహ్వా = నాలుక చేతను, చిత్త = మనస్సు చేతను, శిర = శిరస్సు చేతను, అంఘ్రి = పాదములచేతను, హస్త = హస్తములచేతను, నయన = కన్నుల చేతను, శ్రోత్రైః = చెవులచేతను, అహం = నేను, ప్రార్థితః = ప్రార్థింపబడితిని, మాం = నన్ను, ఆజ్ఞాపయ = ఆజ్ఞాపింపుము, తత్ = దానిని గూర్చి, మాం = నన్ను, ముహుః = మాటిమాటికి, నిరూపయ = పురికొల్పుము, మే =నాకు, అవచః = మూగతనము, మైవ= కలుగ నీయకుము.

భావము :- హే మృత్యుంజయా! పాపంబులు నశించి, అభీష్టము సిద్ధించుటకుగాను పరమేశ్వరుని స్తుతింపుమని నాలుకయు, ధ్యానింపు మని మనస్సును, నమస్కరింపుమని శిరస్సును, ప్రదక్షిణము చేయుమని పాదములును, అర్చింపుమని చేతులును, దర్శింపుమని నేత్రములును, కథాశ్రవణ మొనర్పు మని చెవులును నిన్ను కోరుచున్నవి. అట్లు చేయుమని నన్ను ఆజ్ఞాపింపుము.

ఆ స్తోత్రాదికమును గూర్చి నన్ను మాటి మాటికి పురికొల్పుము. నన్ను మూగవానిని జేయకుము.

వ్యాఖ్య

సర్వేశ్వరుని సేవలో సర్వేంద్రియములు లయము కావలెను. భగవంతుని కీర్తించే అవకాశము మానవునకు భగవంతుడు ప్రసాదించిన దివ్యమైన వరము. నాలుక ప్రతి ప్రాణికి ఉన్నది. కానీ వచించి, కీర్తించగలిగే నైపుణ్యము మానవుని జిహ్వకే పరిమితమై యున్నది. అట్టి నాలుక చాడీలు చెప్పుటకు, అసత్య భాషణములకు, భిన్నరుచుల నాస్వాదించుటకు కాదు. నోరార పరమాత్మని కీర్తించుటకే పరమాత్మ మనకు నాలుకను ప్రసాదించినాడు.

నాలుకతో పరమేశ్వరుని కీర్తింప వలెనన్నచో మనస్సులో ఆ పరమేశ్వరుని భక్తి ప్రగాఢముగా నిలిచియుండవలెను. కనుక మనస్సులో ప్రాపంచిక విషయములకు తావీయక సదా భగవంతునే మననము చేయు చుండవలెను. శిరము వంచి పరమాత్మకు నమస్కరింపవలెను. ఇదియే శరణాగతి. అహంకారి తలవంచడు. అహం తొలగిన మనిషే పరమాత్మ కొరకు శిరము వంచి నమస్కరించ గలడు. భగవానుని దివ్య మందిరాని కేగుటకు పాదములు, అర్చించుటకు హస్తములు ఉపయోగ పడవలెను. అలాగే భగవంతుని దర్శించుటకునేత్రములు, కధా శ్రవణము చేయుటకు వీనులు ఉపయోగ పడవలెను.

"భద్రం కర్ణేభిః శ్రుణు యామ దేవాః
భద్రం పశ్యేమా క్షభిర్య జత్రాః

"మా వీనులు ఎప్పుడూ శుభమునే ఆలకించుగాక! మా నేత్రములు సదా శుభమునే గాంచుగాక! అని వేదమునందు ఋషుల యొక్క ప్రార్థనను తెలిపి యున్నారు. కనుక ఇంద్రియము లన్నియు పరమేశ్వరుని అర్చింపుమని తనను ప్రార్థించు చున్నట్లు రచయిత తెలుపుతున్నారు. అనగా తన

దేహేంద్రియ మనో బుద్ధులు పరమేశ్వరుని కన్నను అన్యమైన విషయముల జోలికి పోవుట లేదని భావము. అట్టి స్థితి ప్రాప్తించగనే మన హృదయమే కైలాసమగును. ఈ విషయమును తదుపరి శ్లోకమున దర్శింపుడు.

గాంభీర్యం పరిఖాపదం ఘనధృతిః ప్రాకార ఉద్యద్గుణ
స్తోమ శ్చాప్తబలం ఘనేంద్రియ చయో ద్వారాణి దేహస్థితః
విద్యా వస్తు సమృద్ధి రిత్యఖిల సామగ్రీ సమే తే సదా
దుర్గాతిప్రియ దేవ మామక మనో దుర్గే నివాసం కురు42

దుర్గాతి ప్రియ = పర్వత దుర్గమందు ప్రీతిగల, దేవ = శివా!, పరిఖాపదం = అగడ్తగను, గాంభీర్యం = గంభీరమైన, ఘన = గొప్పదియగు, ధృతిః = ధైర్యము, ప్రాకారః = ప్రాకారమును, ఉద్యద్గుణస్తోమః = జనించు సద్గుణ పుంజము, ఆప్తబలం = విశ్వసనీయమగు బలము, దేహస్థితః = దేహము నందున్న, ఘనేంద్రియ చయః = నేత్రాది జ్ఞానేంద్రియములు, ద్వారాణి = ద్వారములును, విద్యా = పరమాత్మ జ్ఞానమును, వస్తు సమృద్ధిః = పదార్థ సంపదయు, ఇతి = ఇట్టి, అఖిల సామగ్రీ సమేతే = సమస్త సామగ్రితో కూడిన, మామక= నా యొక్క, మనో దుర్గే = మనస్సను దుర్గము నందు, సదా = నిరంతరము, నివాసం= నివాసమును, కురు = చేయుము.

భావము :- గమించుటకు వీలుగాని కైలాస పర్వతమున వసించు చున్న ఓ శంభో ! నా మనస్సు గంభీరమైన అగడ్తగను, ధైర్యము ప్రాకారముగను, ఉదయించు సుగుణంబులు జలముగను, చక్షురాదీంద్రియములు ద్వారముగను, సర్వపదార్థ సంపద యనెడి పరమేశ్వర జ్ఞానము పుష్కలముగా యున్న గొప్ప దుర్గము నావద్ద నున్నది. కనుక నా హృదయమను దుర్గమున సదా వసింపుము.

వ్యాఖ్య

పరమ శివుని మనమున స్థిరముగా నిలుపుకొని ధ్యానించి తరించు పద్ధతిని ఈ శ్లోకమున తెలియజేయు చున్నారు. ఈ శ్లోకమున రూపకాలంకారమును అత్యద్భుతముగా ప్రయోగించి పరమ శివుని "దుర్గాతిప్రియ" అని

సంబోధించుచూ ప్రారంభించినారు. దుర్గాతిప్రియ అనగా కైలాస దుర్గము నందు ప్రీతి గలవాడని ఒక అర్థము. దుర్గాదేవి యందు ప్రియము గలవాడని కూడా భావము.

పరమ శివుడు కైలాస దుర్గముపై వసించు చుండును. భక్తుని హృదయము కూడా దుర్గము వలె సురక్షితమైన ప్రదేశమని రచయిత తెలుపుతున్నాడు. తన మనస్సు భయంకరమైన అగడ్త యని తెలుపు తున్నాడు. భక్తి విషయమున భక్తుని హృదయము విశాలమైనది యని భావము. దానికి ధైర్యమే కోట గోడ అంటున్నారు. కోటలోనికి ప్రవేశమును నిషేధింప వలెనన్నచో ప్రాకారము ఎత్తుగా ఉండవలెను. కఠోప నిషత్తులో తెలిపినట్లు సాధకులు ధీరపురుషు లైనందున ఎత్తయిన ప్రాకారము వలె ధైర్యవంతులై కామ క్రోధాది బందిపోట్లను ప్రవేశింప నీయక నిషేధించు వారై యున్నారు. తమలో ఉత్పన్నమయ్యే సుగుణములే జలములు. ఈ సుగుణములు అగాధములై అరిషడ్వర్గములను దాటనీయక అడ్డు పరచును. కోటలోనికి ప్రవేశించుటకు ద్వారములే మార్గములు. భక్తుని కోటకు ఇంద్రియములే ద్వారములై ఉన్నవి. ఇంద్రియములన్నియు పరమేశ్వర ప్రీతికై ఉత్సాహ పడుచున్నవని గడచిన శ్లోకములో గ్రహించితిమి. అందువలన అజ్ఞాన రాక్షసిని కోటలో ప్రవేశింప నీయవు. శత్రువు కోట వద్దకు చేరినపుడు వెలుపలకు రాకుండా లోపలనే ఉండవలె నన్నచో సమస్త పదార్థములు లోపలే యుండవలెను. సాధకుని హృదయ దుర్గములో ఈశ్వర జ్ఞానమనెడి సర్వ పదార్థ సంపద పుష్కలముగా యున్నదట. కనుక ఏవిధముగా చూసినను భక్తుని హృదయ దుర్గము కైలాస పర్వతమునకు తీసి పోవుటలేదు. అందుచేత కైలాసమునకు బదులుగా తన హృదయములోనే వసింపుమని శివుని ప్రార్థించుట జరుగుచున్నది.

భక్తుని హృదయము దుర్గమైనచో శివుడు రాజులా నివసింపవచ్చును. ఒకవేళ ఆ హృదయము అరణ్యమైనచో? అప్పుడూ అది శివాలయమే కాగలదు. ఎలా? రాబోవు శ్లోకమును గాంచుము.

మా గచ్ఛ స్త్వమిత స్తతో గిరిశ భో మయ్యేవ వాసం కురు
స్వామి న్నాది కిరాత మామక మనః కాంతార సీమాంతరే
వర్తన్తే బహుశో మృగా మదజుషో మాత్సర్య మోహాదయ
స్తాన్హత్వా మృగయా వినోద రుచితా లాభం చ సంప్రాప్స్యసి 43

ఆది కిరాత = ఓ ఆది కిరాతమూర్తీ, గిరిశ = కైలాస పతీ!, స్వామిన్ = స్వామీ, త్వం= నీవు, ఇతస్తతః = ఇటు నటు, మాగచ్ఛః = వెళ్ళకుము, మయ్యేవ = నాయందే, వాసం= నివాసమును, కురు = చేయుము, మామక మనః = నా మనస్సనెడి, కాంతార సీమాంతరే= అరణ్యప్రాంతమున, మదజుషః = గర్వముతోకూడిన, మాత్సర్య మోహాదయః= మాత్సర్య మోహాదులు, మృగాః = మృగములు, బహుశః = అనేకములుగ, వర్తంతే = తిరుగు చున్నవి, తాన్ = వానిని, హత్వా = వధించి, మృగయా వినోద = మృగములను వేటాడుట యందలి, రుచితా లాభం చ = కోరిక యొక్క ఫలితమును, సంప్రాప్స్యసి= పొందగలవు.

భావము :- ఓ ఆది కిరాత మూర్తీ! కైలాస పతీ! నీ వటు నిటు తిరుగకుము. నాయందే వసింపుము. నా మనస్సనెడి అరణ్యమున గర్వముతో కూడిన మాత్సర్యమోహాదు లనెడి క్రూర మృగములు అనేకములు తిరుగుచున్నవి. నీవు వాటిని చంపి వేటాడుట యందలి నీ యానందమును దీర్చుకొనుము.

వ్యాఖ్య

పరమశివుని ఆది కిరాతమూర్తి యని శ్రీశంకరులు కీర్తించు చున్నారు. సాంబశివుడు కిరాత వేషమున గోచరించు రెండు సంఘటనలు మనకు తెలియు చున్నవి. అర్జునునకు పాశుపతాస్త్రమును అనుగ్రహించు సందర్భమున పార్థుని శక్తి సామర్థ్యములను పరీక్షించుటకు కైలాసపతి కిరాత వేషమును ధరించెను. మరొక సందర్భమును తెలుపు ఒక కథ కలదు. లేడియైన సరస్వతీదేవిని జింక వేషమును ధరించి బ్రహ్మ దేవుడు వెంటాడినపుడు మహేశ్వరుడు కిరాత రూపమును ధరించెనని చెప్పుదురు. ఈరెండు సంఘటనల కారణముగా శివుని ఆది కిరాత మూర్తి యని పిలువడము జరిగినది.

కిరాతుడు అరణ్యములలో సంచరించును. మనుజుని మనస్సే భయంకర అరణ్యమని శ్రీశంకరులు తెలుపుతున్నారు. ఇందు మమ్మెవ్వరు జయింప లేరు అనెడి గర్వముతో మోహము, మాత్సర్యము లనెడి క్రూర మృగములు తిరుగాడు చున్నవి. ఇరువదియవ శ్లోకమున కామ జయమును, ఇరువది రెండవ శ్లోకమున లోభ జయమును గూర్చి తెలిపిన ఆచార్యులు ఈ శ్లోకములో మాత్సర్యమోహాదులను జయించు తరుణోపాయమును తెలుపు తున్నారు.

కిరాతకునికి వేటాడుట యందు ఉత్సాహముండును. కనుక తన మనస్సనెడి అరణ్యములో ప్రవేశించి మాత్సర్యమోహాదులనెడి క్రూరమృగములను వేటాడి ఆనందించమని ఆది కిరాతమూర్తియైన సాంబశివుని ప్రార్థించు చున్నారు.

అరణ్యములో దారి తెలియుట కష్టము. అదియే మోహమనబడినది. సత్యమును అసత్యముగా, అసత్యమును సత్యముగా చూచుట యేదియో అదియే మోహము. పశుపతి హృదయములో ప్రవేశించగనే మోహ మాత్సర్యాదులు అంతరించును. ఆది దేవుని కృప లభింపనిదే అరిషడ్వర్గములు అంతరించవు.

ఆది కిరాతమూర్తి హృదయారణ్యములో విహరించునపుడు మోహ మాత్సర్యాదులనెడి క్రూరమృగముల వలన ఆపద ఆయనకు సంభవించదా? అలా సంభవించదు. ఎందుకని? ఆయన మృగరాజు గనుక. ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

**కర లగ్న మృగః కరీంద్ర భంగో
ఘన శార్దూల విఖండనోఽస్త జంతుః
గిరిశో విశదా కృతిశ్చ చేతః
కుహరే పంచ ముఖోఽస్తి మేకుతో భీః** 44

కరలగ్న మృగః = చేతియందు మృగమును ధరించిన వాడును, కరీంద్ర భంగః = గజాసురుని భంగ పరచిన వాడును, ఘన శార్దూల విఖండనః = గొప్పదియగు వ్యాఘ్రమును ఖండించిన వాడును, అస్త జంతుః = తనయందు లీనమగు ప్రాణకోటి

గలవాడును, గిరిశః = పర్వతముల యందు శయనించు వాడును, విశదాకృతిః = తెల్లని శరీరకాంతి గలవాడును, పంచముఖః = పంచ ముఖములు గలవాడును, మే = నా యొక్క, చేతః కుహరే = చిత్తమను గుహ యందు, అస్తి = కలదు, భీః = భయము, కుతః = ఎక్కడిది?

భావము :- సింహమునకు మృగములు చేజిక్కియుండును. శివుడు కరమున మృగమును ధరించి యుండును. సింహము గజములను వధించును. శివుడు గజాసురుని వధించెను. సింహము వ్యాఘ్రములను చంపును. శివుడు వ్యాఘ్రాసురుని జంపెను. సింహమును గాంచి జంతువులన్నియు పారిపోవును. శివునియందు సమస్త జీవులు లయమగుదురు. వీరిరువురునకు పర్వతములే నివాస స్థానములు. ఇరువురును తెల్లటి శరీరమును ధరించి యుందురు. పంచముఖిత్వము ఇరువురికిని గలదు. అట్టి మహా దేవుడు సింహము వలె నా హృదయ కుహరమున యుండగా నాకు భయ మెలా కలుగును?

వ్యాఖ్య

భయంకరమైన అరణ్యమున క్రూరమృగములున్నను సింహము యొక్క అండ దొరికినచో భయపడ నవసరము లేదు గదా! అట్టి సింహమే పరమేశ్వరుడని శ్రీశంకరులు తెలుపుచున్నారు. సింహమునకు, శివునకు అనేక సామ్యములను చూపుచున్నారు.

పంచముఖ శబ్దము శివునకు, సింహమునకు అన్వయించును. శివునకు సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశాన యను ఐదు ముఖములు గలవు. సింహమునకు కూడా పంచముఖ మనెడి పేరు వచ్చినది. పంచాస్యము గలది యగుట వలన సింహము పంచముఖమని పేరు పొందెను. పంచాస్యము అనగా వెడల్పైన ముఖము గలది యని భావము.

సింహము గజములను వధించగా, శివుడు గజాసురుని వధించెను. సింహము వ్యాఘ్రములను చంపగా, పరమశివుడు వ్యాఘ్రాసురుని వధించెను. సింహమును చూడగనే జంతువులన్నియు పలాయన మగునట్లు సర్వ జీవులు

శివుని యందే లయించుచున్నారు. సింహము పర్వత గుహలలో వసించు చుండగా పరమేశ్వరుడు కైలాస పర్వతమున వసించుచున్నాడు. ఇరువురును ధవళ శరీర ధారులై, పంచముఖులై యున్నారు.

కనుక పరమశివుడు తన హృదయ కుహరమున సింహమువలె వసించు చుండగా కామక్రోధాది మృగముల వలన తమకు భీతి లేదని తెలుపు చున్నారు. సింహము వసించు చోట అన్య మృగములెలా సంచరించలేవో, సాంబశివుడు నిలిచిన చోట కామక్రోధాదులు చరించలేవు. అదియును గాక శివుడు అద్వయ సత్తా స్వరూపము. అద్వైత జ్ఞానమును మనకు ప్రసాదించును. అద్వైతము నందు రెండు వస్తువులకు ఉనికియే లభించ నందున అది భయరహిత స్థితియై యున్నది. కనుక శివుని సాయుజ్యమును విడువరాదు. అదియే మనకు ఆశ్రయస్థానము. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

చంద శ్శాఖి శిఖాన్వితై ర్ద్విజవరై స్సంసేవితే శాశ్వతే
సౌఖ్యాపాదిని ఖేద భేదిని సుధాసారైః ఫలైర్దీపితే
చేతః పక్షి శిఖామణే త్యజ వృథా సంచార మన్యైరలం
నిత్యం శంకర పాదపద్మ యుగళీ నీడే విహారం కురు 45

చేతః = చిత్తమనియెడి, పక్షి శిఖామణే = పక్షి శ్రేష్ఠమా!, ఛందః = వేదములనెడి, శాఖి శిఖాన్వితైః = వృక్షముల యొక్క కొమ్మల చివర, అన్వితైః = సంబంధించిన, ద్విజవరైః= ద్విజవరుల చేత, సంసేవితే = ఆశ్రయింప బడి నదియు, శాశ్వతే = శాశ్వతమైనదియు, సౌఖ్యాపాదిని = సుఖమును సంపాదించు నదియు, సుధాసారైః = అమృత సారము గల, ఫలైః = ఫలములతో, ఖేదభేదిని = సంసార దుఃఖమును పోగొట్టునదియు, దీపితే= ప్రకాశవంతమైన, శంకర పాదపద్మ యుగళీ నీడే = ఈశ్వరుని యొక్క పాదపద్మము లనెడి గూటియందు, విహారం = విహారమును, కురు = చేయుము, అన్యైః = ఇతరములతో, అలం = చాలును, వృథా = నిష్ఫలమగు, సంచారం = సంచారమును, త్యజ = త్యజింపుము.

భావము :- ఓ చిత్త విహంగ రాజమా. అటు నిటు తిరుగుచు ఏల శ్రమ పడెదవు. శంకరుని పాద ద్వంద్వము చక్కని గూడుయై ఉన్నది. అది శాశ్వతమైనది. అందు చక్కని ప్రకాశము కలదు. అది సుఖ ప్రదాయిని. అమృత రసము గల ఫలములతో సంసార దుఃఖమును పోగొట్టును. అది వేదములనెడి మహా వృక్షపు కొమ్మల చివరి భాగమున ఉన్నది. ద్విజ శ్రేష్ఠులచే సేవింప బడుచున్నది. కనుక వృథా సంచారమును త్యజించుము.

వ్యాఖ్య

మానవుని చిత్తము పక్షి లాంటిది. ఆహార సంపాదనకై పక్షి విహరించులాగున, ఆనందమును పొందేందుకు మనస్సు బాహ్య ప్రపంచములో విహరిస్తుంది. రెండు రెక్కలతో పక్షి ఎగురులాగున రాగ ద్వేషములతో చిత్తము చలించు చుండును. పక్షి ఎగురుటకు తోక ఆధారము. చిత్తము చరించుటకు అహంకారమే ఆధారము. పక్షి గూటికి చేరినపుడే శాంతి నొందును. చిత్త విహంగము పరమేశ్వరుని పాద పద్మము లనెడి గూటిని చేరినపుడే నిత్య సుఖము ననుభవించును.

పక్షిగూడు రాలిపోతుంది. కాని పరమేశ్వరుని పాదపద్మము లనెడి గూడు శాశ్వతమైనది. పక్షి గూడు చీకటి మయము. కానీ పరమాత్మ స్థానము ప్రకాశైక స్వరూపము. చెడిపోయే గూడు పక్షికి ఏనాటికైనా దుఃఖమునే ప్రసాదించును. శాశ్వత స్థానమైనందున పరమాత్మ చరణ కమలములు మనల నుద్ధరించును. అందు అమృతరసముల నొసంగు ఫలము లున్నవి. అవి సంసార దుఃఖమును పోగొట్టును.

మృతమయ్యేది శరీరము. అమృతమయమైనది ఆత్మ ఒక్కటియే. కనుక దేహమనెడి గూటిని నమ్ముకొని వమ్ము గాకుండా, పరమాత్మ పాద పద్మము లనెడి గూటిని నమ్ముకొని తరించాలి. మరి అట్టి గూడు ఎక్కడ లభిస్తుంది? వేదము లనెడి మహావృక్షపు కొమ్మల చివరన లభిస్తుంది. వేదముల

చివరి భాగము వేదాంతము. అనగా ఉపనిషత్తులు అని అర్ధము. ఉపనిషత్తుల యందు ఆత్మ జ్ఞానము లభించునని భావము. ద్విజవరులైన వారు దానిని సేవించు చుందురు. ద్విజులనగా బ్రహ్మ జ్ఞానము గల వారని అర్థము."ద్విజ" శబ్దమునకు బ్రాహ్మణుడనియు, పక్షి అనియు అర్థము కలదు.

కనుక వృథా సంచారమును మాని పరమాత్మ పాద పద్మముల నాశ్రయించి సంతృప్తి నొందుమని చిత్తమునకు చేసిన ఈ బోధ తరువాత శ్లోకము నందు కూడా కొనసాగు చున్నది.

ఆకీర్ణే నఖరాజికాంతి విభవై రుద్య త్సుధా వైభవై
రాధౌతేఽపి చ పద్మరాగ లలితే హంసవ్రజై రాశ్రితే
నిత్యం భక్తి వధూ గణైశ్చ రహసి స్వేచ్ఛా విహారం కురు
స్థిత్వా మానస రాజహంస గిరిజా నాథాంఘ్రి సౌధాంతరే 46


మానస రాజహంస = ఓ మనస్సనెడి రాజహంసమా!, నఖ రాజి కాంతి విభవైః = గోటి వరుసల యొక్క కాంతి వైభముల చేత, ఆకీర్ణే = నిండియున్నదియు, ఉద్యతే = ఉద్యమించుచున్న, సుధా వైభవైః = చంద్రుని వైభవముచే, ఆధౌతే = శుభ్రపడినదియు, అపిచ = మఱియును, పద్మరాగ లలితే = పద్మముల ఎఱుపువంటిదియు, హంసవ్రజైః= పరమహంసల సమూహముల చేత, ఆశ్రితే =సేవింపబడి నదియునగు, గిరిజానాథ = గిరిజాపతి యొక్క, అంఘ్రి సౌధాంతరే = పాద పద్మములను సౌధము లోపల, రహసి= రహస్యమందు, భక్తి వధూగణై స్సహ = భక్తియను భార్యలతో గూడ, నిత్యం = నిరంతరము, స్వేచ్ఛా విహారం = స్వేచ్ఛా విహారమును, కురు = చేయుము.

భావము :- ఓ నా మానస రాజహంసా! గిరిజాపతి యొక్క పాదంబను మేడ లోపల ఏకాంతముగా భక్తి యనెడి భార్యతో గూడి స్వేఛ్ఛా విహారము సాగించుము. ఆ పాద సౌధము గోళ్ళపై నుండి ప్రసరించు కాంతులచే దీప్తిమంతమై యున్నది. పార్వతీ నాథుని శిరముపై నుండి వెల్లివిరియు చంద్రుని అమృత కిరణ ప్రసారము ఆ సౌధమునకు సున్నపు పూతయై ఉన్నది. పద్మములను బోలు రక్తిమ పద్మ రాగములు పొదిగినటుల ప్రకాశించు చున్నది. అది పరమ హంసలచే

సేవించబడునదియై ఉన్నది. అట్టి పార్వతీ పతి చరణ సౌధమున నీకు సర్వసౌఖ్యములు సమకూర్చబడి యున్నవి.

వ్యాఖ్య

పరమేశ్వరుని పాద పద్మములనెడి గూటి యందు సుఖముగా జీవించమని గడచిన శ్లోకములో తెలిపి,ఈ శ్లోకము నందు ఆ గూటి యొక్క సౌందర్యమును వర్ణించు చున్నారు. అది మామూలు పక్షి గూడు లాంటిది కాదనియు రత్నఖచితమైన మనోహర సౌధమనియు తెలియ జేయుచున్నారు. పరమశివుని గోటి వరుసలయొక్క కాంత్యాశయములచే ఆ దివ్య సౌధము దేదీప్యమానముగా ప్రకాశించు చున్నదని తెలుపు చున్నారు. గోళ్ళు పాదము నందుండును. పాదము నడకను సూచించును. ఆధ్యాత్మిక జీవన నడక యందలి వైభవమే గోళ్ళ కాంతి యొక్క ప్రాభవమని గ్రహించవలెను. చంద్రశేఖరుని శిరముపై నున్న చంద్రుని అమృత కిరణ ప్రసారము ఆ సౌధమునకు వేసిన సున్నపు పూతయై ఉన్నది. సుధయను పదమునకు సున్నము అను అర్థము కూడా కలదు. పద్మముల వంటి రంగు గల పద్మరాగములను పొదిగినట్లు ఆ సౌధము ప్రకాశించు చున్నది. పద్మము జ్ఞానమునకు సంకేతము. కనుక ఆ సౌధము జ్ఞాన ప్రకాశముతో శోభాయమానముగా నున్నది అని భావము. అట్టి హర చరణ సౌధము పరమహంసలచే సేవింపబడు నదియై ఉన్నది. "సోహం" మంత్రమును మననము చేసి తరించిన దివ్యాత్ములే పరమహంసలు. ఈ విధమైన సాంబుని చరణ సౌధము సర్వ సౌఖ్యముల నొనగూర్చునదియై యున్నది యని అంటున్నారు శ్రీశంకరులు. సుఖప్రదమైన ఆ నిత్యానంద మందిరము ఆవేదనలు తెలియనిదియై, అలజడులు అర్థము కానిదియై యున్నది. శయన మందిరము ఎంత వైభవోపేతమైనను, భార్యలేనిదే భ్రాజితము కానేరదు. శుభకరుడైన పార్వతీ వల్లభుని చరణ సౌధమున హాయిగా విహరింపవలెనన్నచో భక్తి యనెడి కాంత [illegible]



**శంభు ధ్యాన వసంత సంగిని హృదారామేఘ జీర్ణచ్ఛదా
స్రస్తా భక్తి లతా చ్ఛటా విలసితా పుణ్యప్రవాళ శ్రితాః
దీప్యంతే గుణకోరకా జపవచః పుష్పాశ్చ సద్వాసనాః
జ్ఞానానంద సుధా మరంద లహరీ సంవిత్ఫలాభ్యున్నతిః 47**

శంభు ధ్యాన = శంభుని ధ్యానమను, వసంత సంగిని = వసంత కాలముగా, హృదారామే= హృదయంబను పూలతోటలో, స్రస్తాః = రాలిపోయిన, అఘ జీర్ణచ్ఛదాః = పాపములను పండుటాకులను, విలసితాః = విలసితమైన, పుణ్య ప్రవాళశ్రితాః = పుణ్యములను చిగురు టాకులను గల, గుణ కోరకాః = సద్గుణములను మొగ్గలు గలవియు, జప వచః పుష్పాః= జప వచనము లనెడి పుష్పములు గలవియు, సద్వాసనాః = సద్వాసనలును, భక్తి లతాచ్ఛటాః = భక్తియను తీగలును, జ్ఞానానంద = జ్ఞానానందములను, సుధా మరంద లహరీ = అమృత మకరందముల యొక్క ప్రవాహము, సంవిత్ = సమ్యక్ జ్ఞానము, ఫలాభ్యున్నతిః = ఫలాభి వృద్ధియును, దీప్యంతే = ప్రకాశించు చున్నవి.

భావము :- హే పరమేశ్వరా, నా హృదయ మనెడి పూల తోటలో వసంత ఋతువు ప్రవేశించినది. పాపములనెడి పండు టాకులు రాలి పోయినవి. పుణ్యము లనెడి చిగురుటాకులు మొలక లెత్తినవి. వానిపై సద్గుణ మొగ్గలు బయలు దేరినవి. అందు జప వచనములు పుష్పములుగా మొలక లెత్తినవి. సత్కర్మ సంస్కారముల సువాసనలు వెద జల్లుచున్నవి. జ్ఞానా నందములు అమృత మకరందములుగా ప్రవహించు చున్నవి. బ్రహ్మజ్ఞాన మను ఫలము ఫలించినది. జీవితము ధన్యమైనది.

వ్యాఖ్య

హృదయమును ఉద్యానవనముతో పోల్చి భక్తి ద్వారా ముక్తి సౌధమును ప్రవేశించవలసిన విధమును ఈ శ్లోకమున శ్రీశంకరులు అత్యంత రమణీయముగా వర్ణించినారు.

మానవ హృదయమే ఉద్యానవనము. శివధ్యానమే వసంత ఋతువు. వసంత ఋతువు నందు పండుటాకులు రాలిపోవునట్లు, శుభకరుడగు శివుడు

హృదయములో ప్రవేశించగనే పాపము లనెడి పండుటాకులు రాలిపోవును. శివ ధ్యానము సాగుతున్న కొలది వ్యక్తిలో నూతన పరివర్తనము జరుగును. పుణ్యము లనెడి చిగురుటాకులు మొలకలెత్తును. ఆరామము నందు నూతన పల్లవములు మొగ్గలను తొడుగునట్లు, పుణ్యకర్మలాచరించిన దానికి ఫలముగా హృదయ వనమున సద్గుణము లనెడి మొగ్గలు మొలకలెత్తును. (Virtue) సుగుణ సంపద రానిదే భక్తి కుదరదు. నిలువదు. సదాచారము సద్భక్తి నందించును. ఉద్యాన వనమున మొగ్గలు పుష్పములగును. హృదయ వనమున సద్గుణ మొగ్గలు జప వచనము లనెడి సుమములను అందించును. సుమములు సౌరభమును వెదజల్లునట్లు వ్యక్తిలో విరబూసిన జప వచనము లనెడి సుమములు సత్కర్మ లనెడి సౌరభములను వెదజల్లినవి. చెట్ల నుండి తేనెలూరునట్లు, వ్యక్తి హృదయములో జ్ఞానానంద మకరందములు ప్రవహింప సాగినవి. చివరిగా వృక్షము యొక్క ముఖ్య ప్రయోజనమైన ఫలము లభించునట్లు వ్యక్తిలో బ్రహ్మ జ్ఞాన ఫలము లభించినది. కనుక భక్తుని హృదయము చక్కని ఉద్యానవనము. అచ్చట జరిగే శివధ్యానమే వసంత ఋతువు.

ఉద్యాన వనములో ఏ మొక్కను నాటితే అదియే ఫలిస్తుంది. హృదయ వనవాటికలో ఏ భావము స్పందిస్తే అదియే అనుభూతిగా మిగులుతుంది. బ్రహ్మ జ్ఞాన ఫలమునిచ్చే ఉత్కృష్టమైన పంటను పండించుకోవాలి. అరి షడ్వర్గము లనెడి కలుపు మొక్కలను తొలగించు కోవాలి. అవగాహన యనెడి జలము పోసి, వివేకము అనెడి ఎరువును వేసి, అభిమాన పక్షులు, అహంకార మృగాలు పాడుచేయకుండా చూసుకోవాలి. బీజము నాటిన నాటి నుండి అది ఫలించువరకు తోటమాలి ఏ విధమైన శ్రద్ధను కలిగి యుండునో, ఆధ్యాత్మిక బీజము హృదయ ఉద్యాన వనమున పడిన నాటి నుండి అమృతానంద ఫలము అందునంతవరకు సాధకుడు జాగరూకుడై ఉండాలి. కనుక అన్యదేవతా రాధనమును విస్మరించి శివధ్యాన తత్పరులై తరించాలి. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

నిత్యానంద రసాలయం సురముని స్వాంతాంబుజా తాశ్రయం
స్వచ్ఛం సద్విజసేవితం కలుషహృ త్స ద్వాసనా విష్కృతమ్
శంభు ధ్యాన సరోవరం వ్రజమనో హంసావ తంస స్థిరం
కిం క్షుద్రాశ్రయ పల్వల భ్రమణ సంజాత శ్రమం ప్రాప్స్యసి 48

మనో హంసావతంస = ఓ మానస రాజహంసా!, నిత్యానంద = శాశ్వతానందమును, రస = జలమునకు, ఆలయం = నిలయమును, సుర = దేవతల యొక్క, ముని = మునుల యొక్క, స్వాంత = హృదయములను, అంబుజాత = పద్మములకు, ఆశ్రయం= ఆధారమును, స్వచ్ఛం = నిర్మలమైన. సద్విజ = సద్బ్రాహ్మణులచే, సేవితం = సేవింపబడినదియు, కలుషహృాత్ = కలుషహరమును, సద్వాసనా = సద్వాసనల చేత, ఆవిష్కృతం = ఆవిష్కరింప బడినదియును, శంభుధ్యాన = ఈశ్వర ధ్యానంబను, సరోవరం = సరోవరమును, స్థిరం = స్థిరమైన దానిని, వ్రజ = పొందుమా!, క్షుద్రాశ్రయ= అల్పుల నాశ్రయించుట, పల్వల భ్రమణ = బురద గుంటల కొరకు తిరుగుటచేత, సంజాప = పుట్టిన, శ్రమం = శ్రమను, కిం ప్రాప్స్యసి = ఏల పొందెదవు?

భావము :- ఓ మానస రాజ హంసమా . క్షుద్ర దేవతలు బురద గుంటల కొఱకు తిరుగును. శ్రమ పడెదవేల? శాశ్వతానంద మనెడి జలముతో నిండినదియు. మునుల హృదయ పద్మములకు నిలయమైనదియు. నిర్మలమై సద్విప్రులను హంస శ్రేష్ఠములచే సేవింప బడుచు. పాపములెల్లను పారద్రోలుచు. సద్వాసనలను వెదజల్లుచు సత్యమై. సుస్థిరమై యున్న శివపాద ధ్యానమను గొప్ప సరోవరమును జేరి హాయిగా విహరింపుము.

వ్యాఖ్య

శివుని పాదారవింద ధ్యానము సర్వోత్కృష్టమైనది. అదొక నిర్మలమైన శాంతి సరోవరము అంటున్నారు శ్రీ శంకరులు. అందులోని జలము నిత్యానంద రసము. సరోవరములలో స్వచ్ఛమైన జలము లుండునట్లు, శివ భక్తుని హృదయములో శాశ్వతానందము తాండవించు చుండును. సరోవరములో పద్మము లుండును. అవి యుండుట వలన బురద విరిగిపోవు చుండును.

శివ పాద ధ్యాన సరోవరము చెంత మునుల హృదయ పద్మము లుండును. పద్మము జ్ఞానమునకు సంకేతము. ముని వర్యుల జ్ఞాన ప్రబోధముచే అజ్ఞాన పంకిలము దూరముకాగా, స్వచ్ఛమైన శాంతి వెల్లివిరియు చుండును. పద్మము లుండుట వలన సరోవరములు నిర్మలముగా ఉండును. జ్ఞానము కలుగుట వలన అవస్థాత్రయము నుండి విడిపడి శుద్ధ సత్తా స్వరూపమును దర్శించ వచ్చును. ఆ శివపాద ధ్యాన సరోవరము సద్విప్రులనెడి హంసలచే సేవింప బడుచుండును. దాని నుండి సదా సత్కర్మ సద్వాసనా సౌరభములే కదులు చుండును. అట్టి సరోవరమును జేరిన మానస రాజహంస మలినము నంటక మహిమాన్విత జీవితమును సాగించును. ఈ రహస్యమును తెలియలేక కొందరు క్షుద్ర దేవతా ఆరాధన లనెడి బురద గుంటల చుట్టు పరిభ్రమించు చుందురు. పందులు బురదలో దొర్లుచుండును. హంసలు సరోవరములలో విహరించు చుండును. పరమ హంసలు శివపాద స్మరణ సరోవరము నందు విహరించుచు సుఖించు చుందురు. భక్తి పెరిగిన కొలది శివానుగ్రహము లభించు చుండును. మరి శివభక్తి యనెడి వల్లరి ఎలా ప్రాకి విస్తరించును? ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

ఆనందామృత పూరితా హర పదాంభోజాలవాలో ద్యతా
స్థైర్యో పఘ్న ముపేత్య భక్తిలతికా శాఖోప శాఖాన్వితా
ఉచ్చైర్మానస కాయమాన పటలీ మాక్రమ్య నిష్కల్మషా
నిత్యాభీష్ట ఫలప్రదా భవతు మే సత్కర్మ సంవర్ధితా 49

ఆనంద = ఆనందమను, అమృత = జలముతో, పూరితా = పూరింప బడినదియు, హర= హరుని యొక్క, పదాంభోజ = పాదకమలమును, ఆలవాల = పాదుమండి, ఉద్యతా= ఉద్యమించు నదియు, స్థైర్య = స్థైర్య మనెడి, ఉపఘ్నం = ప్రాకును, ఉపేత్య= పొంది, శాఖోప శాఖాన్వితా = శాఖోప శాఖలైనదియు, ఉచ్చైః = ఉన్నతమైన, మానస= మనస్సను, కాయమాన = పందిళ్ళ యొక్క, పటలీం = గుంపును, ఆక్రమ్య = ఆక్రమించుకొని, నిష్కల్మషా = కల్మషము గాకుండా, సత్కర్మ = పుణ్యకర్మలచే,

సంవర్ధితా = వృద్ధి చెందింపబడి, భక్తిలతికా = భక్తియను వల్లరి, మే = నాకు, నిత్యాభీష్ట ఫలప్రదా = శాశ్వతమైన కోర్కెల ఫలము నిచ్చునది, భవతు = అగుగాక!

భావము :- ఆనంద మనెడి జలముతో నిండిన శివ పాదపద్మ మనెడి పాదునుండి పుట్టిన భక్తియను తీగచిత్తస్థైర్యమనెడి పట్టుగొమ్మ పైకెగబ్రాకి శాఖోపశాఖలుగా విస్తరించి, ఎత్తైన నా మనస్సనెడి పందిరినెక్కి అంతట వ్యాపించినది. చీడ మొదలగు కల్మషములచే శిథిలము గాకుండా, పురాకృత పుణ్యకర్మలచే వృద్ధినొందుచున్నది. ఆ భక్తి వల్లరి నా మనోభీష్టమగు నిత్యానంద ఫలమును ప్రసాదించు గాక!

వ్యాఖ్య

భూమిలో విత్తనమును నాటుదుము. అది పెరుగుటకు వీలుగా నీరు నింపుటకు పాదును చేయుదుము. కొంత కాలమునకు అది మొలకెత్తును. తరువాత మొక్క యగును. దాని నుండి తీగలు కదులును. అవి భూమిపై ప్రాకకుండా ఊర్ధ్వముగా ప్రాకుటకు గాను ఒక ప్రాకుడు కొయ్యను నాటుదుము. దానిద్వారా ప్రాకెడు తీగలు ఒక దశలో శాఖోపశాఖలగును. అవి నిలుచుటకు నాధారముగా పందిరి నమర్చెదము. ఆ తరువాత అది పుష్పించి ఫలించును. అలాగే మనలోని భక్తి యనెడి తీగ పుష్పించి ఫలించ వలెను.

శివ భక్తి యనెడి బీజము శివుని చరణ కమలము లనెడి పాదు నుండి పెరుగును. దానిని ఆనందము అనెడి జలముతో నింపవలెను. భక్తి వృద్ధి చెందవలె నన్నచో దానికి పట్టుగొమ్మ యుండవలెను. చిత్త స్థైర్యమే భక్తి లత పెరుగుటకు పట్టు గొమ్మయై ఉన్నది. ఇలా వృద్ధి చెందుతున్న భక్తి శ్రవణము,కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మ నివేదనము అనెడి శాఖోపశాఖలుగా విస్తరించును. హృదయము నుండి కదిలిన ఈ భక్తి బీజము మనస్సనెడి పందిరిని అల్లుకొనును. ప్రారంభదశలో పందిరి నంటుకొని ప్రాకుచుండును. పరిపక్వ

దశలో అది పందిరి యంతటిని వ్యాపించగా అసలు పందిరియే కనుపించదు. అలాగే మనలోని భక్తి మనస్సనెడి పందిరిని అల్లుకొనగా, మనస్సంతయు భక్తితో నిండిపోవును.

భక్తి వృద్ధి చెందు దశలో దురవగాహన, దురలవాట్లు యనెడి చీడ చేరినచో భక్తి వక్రించును. వ్యక్తి పతన మగును. కానీ శివ చరణ భక్తి అలాంటి కల్మషములను దరిచేరనీయదు. అట్టి భక్తి పుష్పించగనే జ్ఞాన సౌరభము వెదజల్లబడును. విరబూసిన భక్తి సుమము నుండి శాశ్వతానంద ఫలము లభించును. అదియే మోక్ష ఫలము. భక్తుడు వల్లరివలె అల్లుకొనునట్లు భగవంతుడు కూడా అల్లుకొనును. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

సంధ్యారంభ విజృంభితం శ్రుతి శిర స్థానాంతరాధిష్ఠితం
సప్రేమ భ్రమరాభిరామ మసకృత్స ద్వాసనా శోభితమ్
భోగీంద్రాభరణం సమస్త సుమనః పూజ్యం గుణా విష్కృతం
సేవే శ్రీగిరి మల్లికార్జున మహాలింగం శివాలింగితమ్ 50

సంధ్యారంభ = సాయంకాలమందు, విజృంభితం = విజృంభించునట్టియు, శ్రుతి శిరస్థానాంతర = వేదములకు శిరస్థానములైన ఉపనిషత్తులను స్థలముల యందు, అధిష్ఠితం = అధిష్ఠానమైనదియు, సప్రేమ = ప్రేమతోగూడిన, భ్రమర = తుమ్మెదలచేత, అభిరామం = మనోహరమైన, అసకృత్ = సదా, సద్వాసనా = మంచి వాసనచేత, శోభితం= శోభించునట్టియు, భోగీంద్ర = వాసుకి, ఆభరణం = ఆభరణము గాగల, సమస్త = సమస్తములైన, సుమనః = ఎల్ల దేవతలచేత, పూజ్యం = పూజింపదగిన, గుణ = గుణముచే, ఆవిష్కృతం = ఆవిష్కరింప బడిన, శివాలింగితం = పార్వతీదేవిచే ఆలింగన మొనర్పబడిన, శ్రీగిరి = శ్రీశైలమందున్న, మల్లికార్జున = మల్లెతీగ అల్లుకొన్న మద్దిచెట్లను బోలిన,మహాలింగం = మహాలింగమును, సేవే = సేవించు చున్నాను.

భావము :- శ్రీశైలము నందు వెలసి యున్న మల్లికార్జున మహాలింగమును మల్లెతీగ అల్లుకొన్న మద్దిచెట్టుతో పోల్చబడమైనది. మల్లి కార్జునుడు సాయంకాలమున

తాండవ నృత్యముతో భక్తుల నానంద పరచును. మల్లికా తీగ సాయంకాల సమయాన వికసించును. శివుడు శ్రుతిశిరములగు ఉపనిషత్తుల యందుండును. పుష్పములు కర్ణముల యందును, శిరసుల మీదను అలంకారములుగా నుండును. మల్లికార్జునుడు భ్రమరాంబ సమేతుడై ఉండును. మద్దిచెట్టు భ్రమరములతో గూడి యుండును. శివుడు సద్వాసనా సంస్కారముతో శోభిల్లుచుండగా మల్లెకావల్లి సువాసనతో గూడియుండును. భోగీంద్రుడు శంకరునికి ఆభరణము. భోగములనుభవించు వారలకు సుమములు అలంకారములు. పరమశివుడు సర్వదేవతలచేపూజింపబడు చుండును. దానిపూలు అన్ని సుమముల కన్నను శ్లాఘనీయములు. మహేశ్వరుడు సత్త్వము వలన తెలియ బడును. పూలు సత్పరిమళము వలన తెలియ బడును. భ్రమరాంబికచే శివుడు కౌగలించబడగా, మల్లె తీగ మద్దిచెట్టును అల్లుకొని యున్నది.

వ్యాఖ్య

సాయం సమయమున శంకర భగవత్పాదుల వారు శ్రీశైల శిఖరమున ప్రవేశించి అక్కడ మల్లెతీగతో చుట్టబడి యున్న మద్ది చెట్టును గాంచెను. వెంటనే భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి మదిలో కదిలెను. మల్లి కార్జునునకు మల్లికార్జున వృక్షమునకు సామ్యమును చూపుతూ శ్లేషాలం కారముతో ఈశ్లోకమును రచించిరి.

సాధారణముగా మద్దిచెట్టును శివుని విభూతిగా భావించు చుందురు. రుద్రము నందు కూడా "నమో వృక్షేభ్యః" అని ఉన్నది. అనగా గొప్ప చెట్ల మధ్య నున్న వాడు అని భావము. మల్లికార్జున లింగమునకు సమీపమున పెద్ద మద్ది చెట్టు కూడా కలదు.

ఈ శ్లోకమునందు "భ్రమర" యనగా తుమ్మెద యనియు, భ్రమరాంబికాదేవి యనియు గ్రహించాలి. "సద్వాసన" యనుచోట సత్త్వ

సంపద గాను, సత్పరిమళముగాను గ్రహింప వలసి యున్నది. "భోగీంద్ర" అను పదమును "వాసుకి" యనెడి సర్పమునకు, భోగజీవులకు అన్వయపరచు కోవాలి. సాయం సంధ్యా సమయమున శివుడు తాండవ నృత్యము చేయును. అది సంధ్యాసమయము. అలాగే రెండు సంకల్పముల సంధి సమయములో భగవంతుడు ప్రత్యక్షమగునని గ్రహించాలి. ఈ శ్లోకమున భ్రమర మనెడి పదమును భ్రమరాంబికా అని వర్ణించిన శ్రీశంకరులు రాబోవు శ్లోకమున పరమశివుని భ్రమర పతిగా వర్ణించు చున్నారు.

భృంగీ చ్ఛానటనోత్కటః కరిమద గ్రాహీ స్ఫుర న్మాధవా
హ్లాదో నాదయుతో మహాసిత వపుః పంచేషుణా చాదృతః
సత్పక్ష స్సుమనో వనేషు స పున సాక్షా న్మదీయో మనో
రాజీవే భ్రమరాధిపో విహరతాం శ్రీశైల వాసీ విభుః 51

భృంగీ = భృంగియొక్క, ఇచ్ఛా = ఇష్టముచే, నర్తన = నటించుటయందు, ఉత్కటః= నిమగ్నమైనట్టియు, కరిమద = గజాసురుని బలగర్వమును, గ్రాహీ = అణచినట్టియు, స్ఫురత్ = ప్రకాశించుచున్న, మాధవ = మాధవుని యందు, ఆహ్లాదః = ఆహ్లాదము గలిగినట్టియు, నాదయుతః = నాదయుతుడైన, మహత్ = గొప్ప, సితవపుః = శ్వేతవర్ణ దేహుడై, పంచేషుణా = కామునిచేత, ఆదృతః = ఆదరింపబడి నట్టియు, సుమనః = విద్వాంసులయొక్క, అవనేషు = సంరక్షణము నందు, సత్పక్షః= అభిమానముగల, సాక్షాత్= ఎదుటనున్న, శ్రీశైలవాసీ = శ్రీశైలమునందువెలసియున్న, విభుః = విభుడును, భ్రమరాధిపః = భ్రమరపతి, మదీయే = నాయొక్క, మనో రాజీవే = మనోపద్మమునందు, విహరతాం = విహరించు గాక !

భావము :- హే పరమేశ్వరా, నీవు భ్రమర పతివి! భ్రమరాంబాధి పతీ. తుమ్మెదకు పతివియైన నీవు నా చిత్త కమలము నందు విహరింపుము. భ్రమరము యొక్క భృంగికి భ్రమరాంబ పతివగు నీకు దగ్గర సామ్యము కలదు. నీవు భక్తుడగు భృంగియొక్క అభీష్టము ననుసరించి, ప్రవర్తింతువు. ఆడ తుమ్మెద ఇష్టానుసారము భ్రమతేడు ప్రవర్తించును. నీవు గజాసురుని మద మణచితివి. అది గజముల మదజలమును గ్రహించును. నీకు మోహినీరూపము ధరించినమాధవునియందు ఆహ్లాదము

జనించెను. మాధవ మనగా వసంతమని భావము. కనుక భృంగికి మాధవము నందు అహ్లాదముండెను. నీవు ప్రణవ నాదముతో గూడి యుందువు. అది ఝుంకారముతో కూడి యుండును. నిన్ను మన్మథుడు పుష్ప బాణముతో నాదరించెను. భృంగి మన్మథుని పరివారము నందుండును. నీకు విబుధులయందు అభిమానముండగా దానికి వనమునందు అభిమాన ముండును. నీవు సచ్చిదానంద స్వరూపుడవు. భృంగి సదా ఆనందముతో విహరించు చుండును. నీవు తెల్లని శరీరము కలిగియుండ. అది నల్లని శరీరమును కలిగి యున్నది.

వ్యాఖ్య

భ్రమరాంబ నాథుడగు మల్లికార్జునస్వామికి, భ్రమరపతి యగు భృంగికి చక్కని సామ్యమును ఈ శ్లోకమున కనపరచి, తన చిత్త కమలమున విహరించమని ప్రార్థించు చున్నారు. కమలమువలె తన చిత్తము నిర్మలమై యున్నదని తెలుపుతున్నారు. పద్మ సౌందర్యమువలె తన హృదయ సౌందర్యము ఆహ్లాదము నొనగూర్చ గలదట. పద్మము జ్ఞానమునకు సంకేతము కనుక తన హృదయ పద్మము జ్ఞానముకన్న అన్యమైన దానిని అభిలషించుట లేదని అర్థము. పద్మము నందు మకరందము దాగి యుండులాగున తన హృదయ కమలమున భక్తి రసము తొణికిసలాడు చున్నదని భావము.

శ్రీశైలమునందలి మల్లికార్జున జ్యోతిర్లింగము యొక్క దివ్య ప్రశస్తమును అత్యంత రమణీయముగా అలంకార భూయిష్టముగా ఆచార్యులు వర్ణించినారు. అత్యంత శ్రద్ధా భక్తులతో మల్లికార్జున జ్యోతిర్లింగమును ధ్యానించు వారలు తప్పక తరించగలరు.

భగవంతుని కొరకు భక్తుని హృదయము తీవ్రంగా పరితపించి నపుడే భగవదనుగ్రహము మనకు లభించును. మేఘమును దర్శించి జలమునకై నిరీక్షించు చాతకము వలె భక్తుడు పరమాత్మకై నిరీక్షించాలి. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

కారుణ్యామృత వర్షిణం ఘన విపద్గ్రీష్మచ్ఛిదా కర్మఠం
విద్యాసస్య ఫలోదయాయ సుమన స్సంసేవ్య మిచ్ఛా కృతిమ్
నృత్యద్భక్త మయూర మద్రి నిలయం చంచజ్జటా మండలమ్
శంభో వాంఛతి నీలకంధర సదా త్వాం మే మనశ్చాతకః 52

శంభో = హేశివా!, నీలకంధర = నీలకంఠా, మే = నాయొక్క, మనశ్చాతకః = మనస్సనెడి చాతకపక్షి, కారుణ్యామృత వర్షిణం = దయామృతమును వర్షించు నట్టియు, ఘన = గొప్పదియగు, విపత్ = ఆపదయను, గ్రీష్మ = తాపమును, ఛిదా = ఛేదించుటకు, కర్మఠం = సమర్థమైన, విద్యాసస్య = విద్యయను పైరు యొక్క, ఫలోదయాయ = ఫలము కొరకు, సుమనః = దేవతలయొక్క, సంసేవ్యం = సేవింప దగినట్టియు, ఇచ్ఛాకృతిం = కామరూపమైనట్టియు, నృత్యద్భక్తమయూరం = నాట్యము చేయుచున్న భక్తులనెడి మయూరములు గల, అద్రి నిలయం = పర్వతము నివాస స్థలముగా గల, చంచత్ = చలించుచున్న, జటా = జడల యొక్క, మండలం = సమూహము, త్వాం= నిన్ను, సదా = ఎల్లప్పుడు, వాంఛతి = కోరుచున్నది.

భావము :- శంభో! నీలకంఠా. నా చిత్త చాతకంబు వాంఛిత సిద్ధికై నీల మేఘము వంటి నిన్ను దర్శింప నిరీక్షించు చున్నది. మేఘము జలమును వర్షించును. నీవు కరుణామృతమును వర్షింతువు. సస్యాదులను ఎండింప జేయు గ్రీష్మమును మేఘము తొలగించ గలదు. నీవు గొప్పవి యగు ఆపదలను తొలగింతువు. మేఘము సస్యములను ఫలింప జేయును. నీవు విద్యయనెడి సస్యమునకు బ్రహ్మానంద ఫలము నొసంగెదవు. కర్షకు లెల్లరు మేఘమును వాంఛించగా, దేవతలు, వందితులు నిన్ను భజించుదురు. మేఘములను గాంచి మయూరములు నాట్యము చేయును. నిన్ను గాంచి భక్తులు పరవశించి నాట్యము చేయుదురు. మేఘము పర్వతములపై విహరించును. నీవు కైలాస గిరిపై సంచరించెదవు. ఇరువురికి జడలు గలవు.

వ్యాఖ్య

చాతకపక్షి మేఘ జలమును పానము చేయ నుద్దేశ్యముతో ఆకాశము వైపు చూచుచుండును. అలాగే భక్తుడు బ్రహ్మానంద రసపానము చేయవలెననిన భగవంతుని వైపే దృష్టి నిలిపి యుండును.

కంధర శబ్దమునకు మెడ గలవాడనియు, జలమును ధరించునది అనియు అర్థము. నీల కంధర యనగా నల్లని కంఠముగల ఈశ్వరుడనియు, జలమును ధరించిన మేఘము అనియు భావము వచ్చును.

చాతకపక్షి భూమిపై బడిన నీటిని పానము చేయక మేఘము నుండి జాలువారే జలమునే పానము చేయును. అలాగే భక్తుని మనస్సు ప్రాపంచిక విషయముల నుండి లభించే ఆనందమును వాంఛింపక పరమేశ్వరుని ధ్యానించి బ్రహ్మానందము ననుభవింప కుతూహల పడుచున్నది.

మేఘము వర్షించి గ్రీష్మము వలన ఏర్పడిన తాపమును పోగొట్టు చున్నది. పరమేశ్వరుడు తన కృపారసమును భక్తులపై కురిపించి తాపము లనెడి గ్రీష్మమును చల్లార్చును. మేఘములు రూపములను మార్చుచుండును. అలాగే పరమేశ్వరుడు కోరిన రూపమును ధరించు చుండును.

మేఘములు ఆకాశమున గోచరింపగనే నెమళ్ళు నాట్యముచేయును. పరమేశ్వరుని దర్శనముతో భక్తులు పరవశించి నాట్యము చేయుదురు. శివుడు జడలను ధరించి యుండును. జడలు అను పదమునకు మెఱుపులు అని కూడా భావము. మెఱుపులు గలిగిన మేఘము జడలను ధరించి యున్నదని అన్వయము. కనుక భక్తుని హృదయ మనెడి చాతకము పరమేశ్వరుడు అను మేఘమునకై నిరీక్షించు చున్నది అని భావము.

ఆకాశేన శిఖీ సమస్త ఫణినాం నేత్రా కలాపీ నతా
నుగ్రాహి ప్రణవోపదేశ నినదైః కేకీతి యో గీయతే
శ్యామాం శైల సముద్భవాం ఘన రుచిం దృష్ట్వా నటంతం ముదా
వేదాంతోప వనే విహార రసికం తం నీలకంఠం భజే 53

యః = ఎవడు, ఆకాశేన = ఆకాశము చేత, శిఖీ = శిఖియు, సమస్త ఫణినాం = సకల సర్పములకు, నేత్రా = నాయకుడైన, కలాపీ = కలాపము గలిగి, నత = నమ్రత గలవారికి, అనుగ్రాహి = అనుగ్రహించు, ప్రణవ = ప్రణవ మంత్రము యొక్క,

ఉపదేశః = ఉపదేశము నందలి, నినదైః =ధ్వనుల చేత, కేకీతి చ = కేకాధ్వని గలవాడు, గీయతే= గానము చేయబడు చున్నాడు, శ్యామాం = నీలి వర్ణము గల, ఘన రుచిం = మేఘ కాంతిగల, శైల సముద్భవాం = పర్వతము నుండి పుట్టిన, దృష్ట్వా = చూచి, నటంతం= నాట్యముచేయు, వేదాంతో పవనే = వేదాంతమను ఉద్యాన వనమునందు, విహార రసికం= విహరించుటకు రసికుడైన, తం = ఆ , నీలకంఠం = నీలకంఠుని, ముదా= సంతోషముతో, భజే = సేవించు చున్నాను.

భావము :- తలపై శిఖండము కలిగి యున్నందున నెమలి శిఖి యని పిలువ బడినది. ఆకాశము శిఖ గలిగియున్న శివుడు కూడా శిఖి ఆయెను. కలాపము గలిగి నెమలి కలాపి యని పిలువ బడినది. వాసుకిచేత శివుడు కలాపి ఆయెను. నెమలి కేకా ధ్వని చేయుటచే కేకి యనబడినది. భక్తుల ననుగ్రహించు ప్రణవ ధ్వనిచే శివుడు కేకి యాయెను. గిరులపై తెలిసెడి మేఘుకాంతిని గాంచి నెమలి నృత్యము చేయును. శివుడు హిమవత్పర్వతముపై నుదయించిన మేఘ కాంతితో మెఱయు శ్యామలాంబను గాంచి ఆనంద తాండవము చేయును. నెమలి ఉద్యానవన సంచార మొనరించును. శివుడు ఉపనిష ద్దుద్యానవనమున విహరించును.

వ్యాఖ్య

శిఖండము అనగా జుట్టు అని అర్థము. తలపై శిఖండము ఉన్నందున నెమలి శిఖి ఆయెను. ఆకాశమును శిఖగా గలిగి శివుడు శిఖి యాయెను. నెమలికి పరమ శివునకు గల సామ్యమును ఈ శ్లోకమున చూపుతూ శ్రీశంకరులు ప్రార్థించు చున్నారు.

కలాపీ అనగా భూషణవంతుడు అని భావము. పింఛము కలిగి యున్నందున నెమలి కలాపీ ఆయెను. శివుడు వాసుకి యను సర్పముచే అలంకరించబడిన వాడై కలాపీ ఆయెను. ఆయన నాగాభరణ భూషితుడు.

కేకా ధ్వని చేయునదియై నెమలి "కేకి" ఆయెను. భక్తుల ననుగ్రహించెడి ఓంకార ధ్వనిచేత శివుడు "కేకి" ఆయెను. ఇచ్చట "అనుగ్రాహి" అనెడి

పదమునకు అనుగ్రహించు వాడు అని అర్థము. వంగిన వారికి నెమలి దొరకును. శిరము వంచి నమస్కరించువారిని శివుడు అనుగ్రహించును.

గిరులపై నల్లని మేఘకాంతిని గాంచి మయూరము నాట్యము చేయును. హిమవత్పర్వతముపై నుదయించిన మేఘకాంతితో మెఱయుచున్న పార్వతిని గాంచి శివుడు ఆనంద తాండవము చేయును. నెమలి ఉద్యాన వనమున సంచరించును. శివుడు ఉపనిషత్తులనెడి ఉద్యానవనమున విహరించువాడై శ్రుతి శిఖర సంచారుడాయెను.

నెమలి కంఠమున నల్లని మచ్చగలదు. అందుచే నెమలి నీలకంఠ మగును. కంఠము నీలముగ గలవాడై శివుడు నీలకంఠుడాయెను.

"నమో నీల గ్రీవాయ"

అని రుద్రము నందు శివుని స్తుతించుటయు కలదు. నీలకంఠునికి నెమలికి సామ్యమును చూపుతూ పరమేశ్వరుని భజించిన శ్రీశంకరులు రాబోవు శ్లోకమునందు సాయం సంధ్యా సమయమున పార్వతీ పరమేశ్వరులు చేయు నృత్యమును ఆడు నెమలి, మగ నెమలి చేయు నృత్యముగ వర్ణించు చున్నారు.

సంధ్యాఘర్మ దినాత్యయో హరికరాఘాత ప్రభూతానక
ధ్వానో వారిద గర్జితం దివిషదాం దృష్టిచ్ఛటా చంచలా
భక్తానాం పరితోష బాష్ప వితతి ర్వృష్టి ర్మయూరీ శివా
యస్మిన్నుజ్జ్వల తాండవం విజయతే తం నీలకంఠం భజే 54

సంధ్యా = సంధ్యాసమయము, ఘర్మ దినాత్యయః = వర్షారంభకాలము, హరిః = శ్రీహరి యొక్క, కర = హస్తములచే, ఆఘాత = దెబ్బచే, ప్రభూత = జనించిన, ఆనక = మద్దెల యొక్క, ధ్వానః = ధ్వని, వారిజ గర్జితం = ఉఱుముగను, దివిషదాం = దేవతలయొక్కదృష్టిచ్ఛటా = చూపుల పరంపర, చంచలా = మెఱపుగను, భక్తానాం = భక్తుల యొక్క, పరితోష = సంతోష మనెడి, బాష్ప వితతిః = అశ్రుధార,

వృష్టిః = వర్షముగను, శివ = పార్వతీ దేవి, మయూరీ = ఆడనెమలిగను, యస్మిన్= అందు, ఉజ్జ్వల = ప్రకాశమానమైన, తాండవం = తాండవ నృత్యము, విజయతే = విజయమై నొప్పుచున్నదో, తం = ఆ , నీలకంఠం = శివుని, భజే = భజించు చున్నాను.

భావము :- సాయం సంధ్యాసమయము గ్రీష్మతాపమును హరియించు వర్షాకాలము, శ్రీహరివాయించుమృదంగ ధ్వనులు ఉఱుములు, అకాశము నుండి చూచుచున్న దేవతల చూడ్కులు మెఱుపులు. భక్తుల ఆనందాశ్రువులు వర్షధార. పార్వతీదేవి ఆడు నెమలి. ఈ విధముగా ప్రదోష కాల తాండవమును చేయు నీలకంఠుడగు ఆ పరమ శివుని సద్భక్తితో చిత్తము నందు భజించు చున్నాను.

వ్యాఖ్య

ఈ శ్లోకమున పార్వతీ పరమేశ్వరులు మయూరీ మయూరములుగ వర్ణింపబడినారు. వారు చేయు ప్రదోషకాల తాండవము తొలకరి సమయమున మయూరీ మయూరములు చేయు నృత్యముతో పోల్చబడినది.

వర్షాకాలము ప్రారంభము కాగానే ఆకాశమున మేఘములు క్రమ్ము కొనును. ఉఱుములు ఉఱుము చుండును. మెఱుపులు మెఱయు చుండును. వర్షధారలు పడుచుండును. అట్టి సమయము చాలా ఆహ్లాదమును, ఆనందమును కలుగజేయును. అట్టి ఔత్సాహిక వాతావరణము నందు మయూరము మయూరిని గాంచి పరవశించును. హృదయమున ఆనందము పొంగి పొరలు చుండగా ఆడునెమలితో కూడి మగనెమలి నాట్యము చేయును. కన్నుల పండుగను గూర్చు ఈ నృత్యము మయూరీ మయూర నృత్యము.

తొలకరి సమయమున జరిగే ఈ మయూరీ మయూర నృత్యములను పరిశీలించగా శంకరులకు అంబాసమేతుడగు పరమశివుడు సంధ్యాసమయమున సాగించు ప్రదోషకాల తాండవము మనస్సున మెదిలెను.

గ్రీష్మ తాపమును వర్షాకాలము హరించును. అలాగే పగటి సమయము నందలి వేడిని సాయం సంధ్యా సమయము హరించును. వాతావరణమును

చల్లబరచును. వర్షాకాలమున ఆకాశమున ఉఱుములు ఉఱుమునట్లు శ్రీమహావిష్ణువు ఆనకము అనెడి మృదంగమును వాయించును. మేఘము గర్జించును. ఆ తరువాత మెఱుపులుదయించును. విష్ణుదేవుడు ఆనకమును మ్రోగించగనే దేవతలు ఆకాశమున నిలబడి శివతాండవమును దర్శింతురు. విద్యుల్లతల వలె తెలియు సురుల చూడ్కులు మేఘగర్జనములోని మెఱుపుల వలె తెలియుచున్నవి. వర్షాకాలము మేఘములు వర్షించును. పార్వతీ పరమేశ్వరుల తాండవ నృత్యమును గాంచి ఆనందముతో పరవశించిన భక్తులు పులకాంకితులై ఆనంద బాష్పములను రాల్తురు. కనుక భక్తుల హృదయములలో అనూహ్యమై అనిర్వచనీయమైన భక్తిని నింపే పార్వతీ పరమేశ్వరుల తాండవ నృత్యమును మదిలో నుంచుకొని శ్రీశంకరులు సాంబ శివుని స్తుతించు చున్నారు.

ఇంతవరకు పరమశివుని వైభవమును అనేక ఉపమానములతో కీర్తించిన శ్రీశంకరులు రాబోవు శ్లోకమునందు హృత్పూర్వకముగా ప్రణామము లర్పించు చున్నారు.

ఆద్యా యామిత తేజసే శ్రుతిపదై ర్వేద్యాయ సాధ్యాయతే
విద్యానంద మయాత్మనే త్రిజగత స్సంరక్షణో ద్యోగినే
ధ్యేయా యాఖిల యోగిభి స్సురగణై ర్గేయాయ మాయావినే
సమ్యక్తాండవ సంభ్రమాయ జటినే సేయం నతి శ్శంభవే 55

ఆద్యాయ = ఆదియైన వాడును, అమిత తేజసే = గొప్ప ప్రకాశవంతుడును, శ్రుతి పదైః = వేద వాక్యములచే, వేద్యాయ = తెలియ దగినవాడును, సాధ్యాయ = సాధ్యరూపుడైన వాడును, విద్యానంద మయాత్మనే = జ్ఞానానంద స్వరూపుడును, త్రిజగతః= ముల్లోకముల యొక్క, పంరక్షణ = రక్షించుటయందు, ఉద్యోగినే = ప్రవృత్తి గలవాడు, అఖిల = సమస్తమైన, యోగిభిః = యోగులచే, ధ్యేయాయ = ధ్యానింపదగిన వాడును, సురగణైః = దేవగణములచే, గేయాయా = కీర్తింప బడినవాడును! మాయావినే= మాయావియు, సమ్యక్ = చక్కని, తాండవ సంభ్రమాయ = తాండవ నృత్యము నందు తొందర గలవాడును, జటినే = జడలు దాల్చిన వాడును, శంభవే = శంభుడును, తే = నీకొఱకు, సా = ఆ, ఇయం = ఈ , నతిః = నమస్కారము.

భావము :- ఆద్య పురుషుడును, గొప్ప తేజోవంతుడును, వేదవేద్యుడును, సాధ్యరూపుడైన వాడును, జ్ఞానానంద స్వరూపుడును, ముల్లోకములను రక్షించు వాడును, యోగులచే ధ్యానింప బడువాడును, దేవతలచేకీర్తింప బడువాడును, మాయయను శక్తితో కూడిన వాడును, చక్కని తాండవ నృత్యము చేయువాడును, జడలు ధరించిన శంభునకు నమస్కారము.

వ్యాఖ్య

ఆధేయములైన జగత్తులకు ఆధారమైనవాడు శివుడు. అందుచేత తాను సృష్టికి పూర్వమునందున్నవాడై ఆద్యపురుషుడు అని కీర్తించబడినాడు.

"సదేవ సౌమ్య ఇదమగ్ర మాసీత్"

'ఓ సౌమ్యా! ప్రారంభమునందు సత్పదార్థ మొక్కటియే యుండెను.' అని ఋషి తెలుపుతాడు. అట్టి సత్తారూప పరబ్రహ్మము పరమ శివుడే. తన యందు ఈ ప్రపంచము మాయవలన గోచరించెను. కనుక మాయకు ఆధారమైనవాడు కూడా తానే.

"బ్రహ్మాశ్రయ సత్త్వ రజస్తమో గుణాత్మికా మాయా అస్తి"

"సత్త్వరజస్తమో గుణములతో కూడిన మాయ బ్రహ్మము నాశ్రయించుకొని యున్నది." మాయ ఆధేయ వస్తువు గనుక ఛాయయొక్క ప్రభావము వ్యక్తిపై లేనట్లు, మాయయొక్క ప్రభావము ఈశ్వరునిపై లేదు. ఆయన మాయను అదుపులో నుంచుకొనినవాడై మాయావి అయెను. కనుక మాయ యందలి గుణములు ఆయన యందులేవు. ఆయన మాయాతీతుడు. గుణాతీతుడు. కనుక జ్ఞాన స్వరూపుడై ఆనంద రూపుడాయెను. కనుక ధ్యేయ స్వరూపుడై మహర్షులచేత ధ్యానింపబడి, దేవతలచే కీర్తించ బడినాడు.

"వసిష్ఠ కుంభోద్భవ గౌతమార్య
మునీంద్ర దేవార్చిత శేఖరాయ"

"వసిష్ఠుడు, అగస్త్యుడు, గౌతముడు మొదలగు ఆర్యులైన మహర్షుల చేతను, దేవతలచేతను పూజలందుకొనువాడు" అని శివుని వైభవమును శ్రీ శివ పంచాక్షర స్తోత్రము నందు ఆచార్య శంకరులు తెలిపి యున్నారు. అట్టి పరమ శివుడు సుఖమును వృద్ధి చెందించువాడై ఉన్నాడు. అనగా అమంగళము హరించువాడై ఉన్నాడు.

"నమశ్శివాభ్యా మశుభాఽపహాభ్యాం"

"పార్వతీ పరమేశ్వరులు అశుభముల నంతమొందించువారు" అని శ్రీ శంకరులవారు ఉమామహేశ్వర స్తవము నందు తెలిపి యున్నారు. అట్టి పరమ శివుని స్తుతించుటను రాబోవు శ్లోకము నందు కూడా కొనసాగించు చున్నారు.

నిత్యాయ త్రిగుణాత్మనే పురజితే కాత్యాయనీ శ్రేయసే
సత్యాయాది కుటింబినే ముని మనః ప్రత్యక్ష చిన్మూర్తయే
మాయా సృష్ట జగత్త్రయాయ సకలామ్నాయాంత సంచారిణే
సాయం తాండవ సంభ్రమాయ జటినే సేయం నతి శ్శంభవే 56

నిత్యాయ = నిత్యుడును, త్రిగుణాత్మనే = త్రిగుణములు తొడుగుగా గలవాడును, పురజితే = పురములను జయించిన వాడును, కాత్యాయనీ = పార్వతీదేవి యొక్క, శ్రేయసే= శ్రేయము నైనవాడు, సత్యాయ = సత్యస్వరూపుడును, ఆది కుటింబినే = మొట్టమొదటి సంసారియు, ముని మనః = మహర్షుల మనస్సులకు, ప్రత్యక్ష = తెలియ దగిన, చిన్మూర్తయే = జ్ఞాన స్వరూపుడును, మాయా = మాయా శక్తిచేత, సృష్ట = సృజింపబడిన, జగత్త్రయాయ = ముల్లోకములు గల వాడును, సకల = సమస్తమైన, ఆమ్నాయాంత = ఉపనిషత్తుల యందును, సంచారిణే = సంచరించు వాడును, సాయం= సాయంకాలమున, తాండవ సంభ్రమాయ = తాండవ నృత్యము చేయుటయందు ఆసక్తి గలవాడు, జటినే = జడధారియును, శంభవే = శంభుడు, సా=ఆ, ఇయం = ఈ నతిః = నమస్కారము.

భావము :- నిత్యుడును, త్రిగుణము లను తొడుగు గలవాడును, పురములను జయించిన వాడును, పార్వతీదేవి శుభము లొనగూర్చువాడును, సత్య స్వరూపుడును,

మొదటి సంసారియు. మహర్షులకు ప్రత్యక్ష గోచరుండును. మాయా శక్తిచే ముల్లోకములను సృజించిన వాడును. సమస్తమైన ఉపనిషత్తుల యందు సంచరించు వాడును. సాయం సంధ్యాసమయమున తాండవనృత్యము చేయుటయందు ఆసక్తి గలవాడును. జడధారియును అగు శంభునకు నమస్కారము.

వ్యాఖ్య

ఆత్మ స్వరూపుడైనందున శివుడు నిత్యుడు. కనుక గుణ రహితుడు. గుణాతీతుడైన తాను సృష్టి కళ్యాణ కార్యమునకై త్రిగుణములను తొడుగును ధరించి యున్నట్లు తెలుపుటకు త్రిశూలమును ధరించి యున్నాడు. త్రికాలములందును నిలుచువాడై, కాలాతీతుడై, కాలపరిధిలో చిక్కని వాడైనందున సత్య స్వరూపుడని పిలువబడినాడు. సత్య స్వరూపుడైన శివుని యందు మాయ చోటు చేసుకొనగా కారణమైన మాయనుండి కార్యమైన జగత్తు ఉద్భవించినది. జగత్తులో తెలిసెడి సంసారములకు కారణమైన సంసారి యనియు, ఆది భిక్షువు అనియు పిలువబడినాడు. గుణాతీతుడైన శివుడు గుణత్రయమును దాటిన మహర్షులకు దర్శనీయుడై ఉన్నాడు. ఉపనిషత్తుల సారము తానైనవాడు. అట్టి జడధారియగు శివునకు శ్రీశంకరులు నమస్కరించు చున్నారు.

శ్రీమదాత్మనే గుణైక సింధవే నమశ్శివాయ
ధామలేశ ధూత కోక బంధవే నమశ్శివాయ
నామశేషితా నమభవాంధవే నమశ్శివాయ
పామరేతర ప్రధాన బంధవే నమశ్శివాయ

ఆత్మ స్వరూపుడును, సుగుణాల రాశియు నగు పరమశివునకు నమస్కారము. తన ప్రభావముచే సూర్యుని ధిక్కరించిన శివునకు నమస్కారము. తన నారాధించువారికి సంసారమును నామమాత్రము చేయు శివునకు నమస్కారము. సజ్జనులకు బంధువైన శివునకు నమస్కారము అని శ్రీశంకరుల వారు శ్రీ శివ పంచాక్షర నక్షత్రమాలా స్తోత్రము నందు తెలిపి యున్నారు.

నిత్యం స్వోదర పోషణాయ సకలా నుద్దిశ్య విత్తాశయా
వ్యర్థం పర్యటనం కరోమి భవత స్సేవాం న జానే విభో
మజ్జన్మాంతర పుణ్యపాక బలత స్త్వం శర్వ సర్వాన్తర
స్తిష్ఠస్యేవహి తేనవా పశుపతే తే రక్షణీయోఽస్మ్యహమ్ 57

నిత్యం = అనుదినమును, స్వోదరపోషణాయ = కుక్షింభరిత్వమునకు, విత్తాశయా = ధనలోభముతో, సర్వాన్ = ధనముగల వారినందరిని, ఉద్దిశ్య = గురించి, వ్యర్థం = వ్యర్థముగా, పర్యటనం = సంచారమును, కరోమి = చేయుచున్నాను, విభో = విభుడా!, భవతః = నీయొక్క, సేవాం = సేవను, న జానే = ఎఱుగను, పశుపతే = శివా!, శర్వ = శర్వుడా!, మజ్జన్మాంతర పుణ్య = నా పూర్వ జన్మ పుణ్యము యొక్క, పాకబలతః= పరిపాకముచే, త్వం = నీవు, సర్వాన్తర = సర్వాంతర్యామిగ, తిష్ఠస్యేవహి= తిష్ఠవేసి యున్నావు గదా!, తేనవా = ఆ కారణముగానైనను, తే = నీకు, అహం = నేను, రక్షణీయ = రక్షింప దగినవాడను, అస్మి = అగుదును.

భావము :- పొట్ట నింపుకొనుటకై ధనలోభముతో ధనము గలవారి నాశ్రయించి తిరుగు చుంటినే గాని నిన్ను సేవించుట ఎఱుగ కుంటిని. హే పరమశివా! పూర్వ జన్మములో నేను చేసుకొనిన పుణ్య ఫలముచే నీవు నాయందు అంతర్యామివై ఉన్నావు. ఈ కారణముగా నన్ను రక్షించు బాధ్యత నీపై యున్నది.

వ్యాఖ్య

కర్మ వలయము నుండి బయటపడలేక ప్రారబ్ధాధీనుడనై ఈ జన్మమును తెచ్చుకొంటిమి. పొట్టనింపుకొనుటకై మఱల కర్మ నాచరించుచునే యున్నాము. అన్నము కోరు ఆర్జన కదిలింది. ఆర్జనకై సంపదలు గల వారిని సేవించు చున్నాము. ధన మనెడి సంపద ఆపదలను తీర్చునా? అదియే నిజమైనచో ధనముగల వారంతా సుఖముగా జీవించవలెను కదా! ఆశయే మానవుని అగచాట్లకు గురిచేయు చున్నది. ఆశాపాశమునకు అంతము లేదు. సత్య సౌధములో ప్రవేశించుటకు కామక్రోధ లోభాలు ఛేదించలేని ఇనుపగోడలై

ఉన్నవి. ఈ సత్యమును గ్రహించలేని మానవుడు అసత్య దారులలో పయనించు చున్నాడే గాని సత్యమార్గమును తెలియ లేకున్నాడు.

తన ఆనందమునకు డబ్బు అవసరమని మనిషి భ్రమ. డబ్బును సంపాదించేందుకు వ్యాపారము చేయాలి. సక్రమ మార్గములో జీవిస్తే ధనము నధికముగా సంపాదించలేరు. కనుక ధన సంపాదనకై అడ్డు దారులలో నడవాలి. ఈ విధంగా మనము బాహ్య వస్తువుల ద్వారా పొందే తాత్కాలిక సుఖములన్నియు దుఃఖ మిశ్రితములే.

కనుక అంతర్యామియైన పరమాత్మ నాశ్రయించాలి. ఆయన కృప మనలను ఉద్ధరించును. అంతేగాని ధనికులను సేవించుట వలన ధనము లభించునేమో గాని ఆనందము లభించదు.

రాజుల్ మత్తులు వారిసేవ నరకప్రాయంబు వారిచ్చునం
భోజాక్షీ చతురంతయాన తురగీ భూషాదులాత్మవ్యథా.
బీజంబుల్ తదేఽపక్ష చాలు బరి తృప్తి బొందితిన్ జ్ఞాన
లక్ష్మీ జాగ్రత్పరిణామ మిమ్ము దయతో శ్రీకాళహస్తీశ్వరా!

అని ధూర్జటి మహాకవి శ్రీకాళహస్తీశ్వర శతకము నందు తెలుపుతారు.

ఏకో వారిజ బాంధవః క్షితినభో వ్యాప్తం తమో మండలం
భిత్వా లోచన గోచరోఽపి భవతి త్వం కోటి సూర్యప్రభః
వేద్యం కిం నభవస్యహో ఘనతరం కీ దృగ్భవే న్మత్తమ
స్తత్సర్వం వ్యపనీయ మే పశుపతే సాక్షాత్ప్రసన్నోభవ 58

పశుపతే = భూతనాథా!, వారిజ బాంధవః = కమల బాంధవుడైన సూర్యుడు, ఏకః = ఒక్కడయ్యును, క్షితి నభోవ్యాప్తం = భూమ్యాకాశములునిండిన, తమోమండలం = అంధకార రాశిని, భిత్వా = ఛేదించి, లోచన గోచరోఽపి = కన్నులకు గోచరించు వాడును, భవతి = అగుచున్నాడు, త్వం = నీవు, కోటి సూర్య ప్రభః = కోటి సూర్యుల ప్రకాశము గలవాడవు, వేద్యః = తెలిసికొన దగిన వాడవు, కిం న భవసి = ఏల కావు?

అహో = ఆహా, ఘనతరం = మిక్కిలి దట్టమైన, మత్తమః = నా యజ్ఞానాంధకారము, కీదృక్ = ఏపాటిది?, భవేత్ = అగును, తత్ = కనుక, సర్వం = సమస్తమును, వ్యపనీయ= తొలగించి, సాక్షాత్ = ప్రత్యక్షమై, ప్రసన్నః = అనుగ్రహించువాడవు, భవ = కమ్ము!

భావము :- కమల బాంధవుడగు సూర్యుడు ఒక్కడే యైనను, భూమ్యాకాశముల నావరించిన అంధకారమును పారద్రోలి కన్నులకు కనుపించు చున్నాడు. నీవు కోటి సూర్యుల ప్రకాశమును కలిగి యున్నావు. కానీ నీ వెందులకు కనుపించుటలేదు. మిగుల దట్టమైన దైనను నా యజ్ఞానమును ఛేదించుట నీకు ఒక లెక్కయా! కావున నా అజ్ఞానమును తొలగించి, నాకు ప్రత్యక్షమై అనుగ్రహింపుము.

వ్యాఖ్య

అంధకారమును ఆదిత్యుడు పోగొట్ట గలడు. అజ్ఞానమును ఆది దేవుడే పోగొట్ట గలడు. సూర్యుడు ఉదయించనంతవరకు చీకట్లు వ్యాపించి యుండును. సూర్యుడు ఉదయించగానే చీకట్లు అంతరించును. జ్ఞానోదయమగు నంత వరకే అవిద్య నిలిచియుండును. జ్ఞాన జ్యోతి ఉదయించగనే అజ్ఞానతిమిరము లంతరించును. చీకట్లను పోగొట్టు సూర్యుడు ఒక్కడే. అజ్ఞానమునంతరింపజేయు పరమాత్మ కూడా అద్వయుడే.

సూర్యుడు కమల బాంధవుడు. కమలము సరోవరము నందుండును. సూర్యుడు ఆకాశమున ఉండును. అయినను పద్మమును సూర్యుడు వికసింప జేయును. దూరమున నున్నదని తలంచక సూర్యుడు పద్మమును విరబూయు నట్లు చేయును. మోహ సుడిగుండములో పడి పరమాత్మకు దూరమైన మమ్ములను నీవు ఎందులకు ఉద్ధరించవు? అని ప్రశ్నించు చున్నారు.

పద్మము బురదలో ఉండును. అలాగని సూర్యుడు దానిని ఉపేక్షించుటలేదు. హే పరమశివా! మేము పాప పంకిలము నందు దిగబడి యున్నారము. అలాగని మమ్ములను ఉపేక్షింపకుము. భూమ్యాకాశముల యందావరించి యున్న తిమిరమును భానుడు పోగొట్టునట్లు, మాలో దట్టముగా

వ్యాపించియున్న అజ్ఞాన తిమిరమును పోగొట్టి మమ్ము రక్షింపుము. భూమి క్రింద యుండును. ఆకాశము పైన ఉండును. కానీ చీకటి అంతటా వ్యాపించును. అయినను సూర్యుడు అంధకారమును పోగొట్టుచునే యున్నాడు. అలాగే క్రింద నున్నది హృదయము. పైనున్నది మనస్సు. కానీ అజ్ఞానము నాలో అంతటా వ్యాపించి యున్నది. నీవు కూడా నా మనోహృదయాలను ప్రకాశవంతము జేసి నన్ను కాపాడుము. ఎందుకు కాపాడాలి? నా చిత్తము పరమశివుని యందే లగ్నమై యున్నది గనుక. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

హంసః పద్మవనం సమిచ్ఛతి యథా నీలాంబుదం చాతకః
కోకః కోకనదప్రియం ప్రతిదినం చంద్రం చకోర స్తథా
చేతో వాంఛతి మామకం పశుపతే చిన్మార్గ మృగ్యం విభో
గౌరీనాథ భవత్పాదాబ్జ యుగళం కైవల్య సౌఖ్యప్రదమ్ 59

పశుపతే = భూతనాదా!, విభో = విభుడా!, గౌరీనాథా = గౌరీపతీ, హంసః = హంస, పద్మవనః = పద్మవనమును, చాతకః = చాతకపక్షి, నీలాంబుదం = నీలిమబ్బును, కోకః= చక్రవాకము, కోకనదప్రియం = సూర్యుని, చకోరః = చకోరము, ప్రతి దినం = ప్రతిదినమును, చంద్రం = చంద్రుని, యథా = ఏ ప్రకారముగా, సమిచ్ఛతి = కోరుచున్నదో, తథా = ఆ ప్రకారముగా, మామకం = నా సంబంధమైన, చేతః = చిత్తము, చిన్మార్గ మృగ్యం = జ్ఞానమార్గమున వెదుక దగిన, కైవల్య సౌఖ్యప్రదం = కైవల్య సౌఖ్యమునొసంగునట్టి, భవత్ = నీయొక్క, పాదాబ్జ యుగళం = పాదపద్మములను, వాంఛతి = కోరుచున్నది.

భావము :- **పశుపతీ! పార్వతీ వల్లభా! హంస పద్మవనమును, చాతకము వర్షాకాల మేఘమును, చక్రవాకము సూర్యుని, చకోరము చంద్రుని ప్రతి దినము అభిలషించునట్లు, జ్ఞాన మార్గమున చరించి పొంద దగిన కైవల్యము నొసంగెడి నీ పాద పద్మములను నా చిత్తము వాంఛించు చున్నది.**

వ్యాఖ్య

హంస మానస సరోవరము నందు పద్మముల మధ్య ఈదులాడు చుండును. చాతక పక్షి నీటిని దాకిన జలమును పానముచేయదు. మేఘము

నుండి వచ్చెడి జలమును పానము చేయుటకు వేచియుండును. చక్రవాకము సూర్యునికై నిరీక్షించు చుండును. చంద్రుని వెన్నెలను జుర్రుకొని త్రాగి జీవించు చకోరము చంద్రునికై ఎదురు చూచుచుండును. అలాగే భక్తుని చిత్తము భగవానుని పాద పద్మములను వాంఛించుచున్నది.

హంస యనెడి మనస్సు, చాతక మనెడి బుద్ధి, చక్రవాక మనెడి చిత్తము, చకోర మనెడి అహంకారము - అంతఃకరణము సంపూర్ణముగా నీలకంఠుని దర్శనమునకే తపించు చున్నదని భావము. హంస, చక్రవాక, చకోర, చాతకములను గూర్చి మనము వినుచున్నామే గాని వాటిని మనము చూడలేదు. అలాగే అంతఃకరణము కూడా కంటికి గోచరించనదియై యున్నది.

భగవంతుని పాద పద్మములు పద్మవనము నందలి కమలములు వలె సుకుమారములు. మనోహరములు. జ్ఞాన ప్రదములు. సూర్యుని వలె ప్రకాశ యుతములు. జ్ఞాన మయములు. చంద్రుని వలె హృదయమును చల్లబరచు శాంతి రూపములు. ప్రసన్నతకు స్థానములు. మేఘము జలపూర్ణమైనట్లు, పశుపతి పాదపద్మములు కరుణాపూరితములు. దయామృత రసవాహినులు.

అమోఘమైన పార్వతీశుని పాదపద్మములు ఎచ్చట లభించును? పశుపతి శ్రుతిశిఖర సంచారి గాన ఆయన పాద పద్మములు శ్రుతి శిఖరములనెడి ఉపనిషత్తుల యందు దర్శనీయములు. అవి కైవల్య ప్రదములు. భక్తునిలోని వైకల్యములను తొలగించి కైవల్యమును ప్రసాదించు జ్ఞాన స్వరూపములు. అట్టి దివ్యపాదపద్మములను భక్తుని హృదయము వాంఛించు చున్నది. అంతకన్నను అన్యమైన శరణ్యము తనకు లేదని భక్తుని ఆంతర్యము. ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

రోధ స్తోయ హృతశ్శ్రమేవ పథికశ్ఛాయం తరోర్వృష్టితో
భీత స్స్వస్థ గృహం గృహస్థ మతిథిః దీనః ప్రభుం ధార్మికమ్
దీపం సంత మసా కులశ్చ శిఖినం శీతావృత స్త్వం తథా
చేత స్సర్వ భయాపహం వ్రజసుఖం శంభోః పదాంభోరుహమ్

చేత: = చిత్తమా!, తోయహృత: = నీటిలో కొట్టుకొని పోవువాడు, రోధ: = తీరమును, పథిక: = బాటసారి, శ్రమేణ = అలసట చేత, తరో: = చెట్టు యొక్క, ఛాయాం= నీడను, వృష్టిత: = వర్షము వలన, భీత: = భయపడినవాడు, స్వస్థ గృహం = సుఖమైన ఇంటిని, అతిథి: = అతిథి, గృహస్థం = సంసారిని, దీన: = దీనుడు, ధార్మికం = ధర్మాత్ముడైన, ప్రభుం = ప్రభువును, సంత మసా కుల: = అంధకారమున పరిభ్రమించువాడు, దీపం = దీపమును, శీతావృత: = చలిచే బాధపడువాడు, శిఖినంచ= అగ్నిహోత్రమును, యథా = ఏవిధముగా, తథా = అలాగుననే, త్వం = నీవు, సర్వభయాపహం = ఎల్ల భయములను బాపు నదియు, సుఖం = సుఖ కరమైనదియునగు, శంభో: = శివుని యొక్క, పాదాంభోరుహం = పాదపద్మమును, వ్రజ = ఆశ్రయింపుము.

భావము :- ఓ మనసా, నీటియందు కొట్టుకొని పోవు వాడు తీరమును, అలసట చెందిన బాటసారి చెట్టునీడను, వర్షము వలన భయ పడినవాడు సుఖమైన గృహమును, అతిథి గృహస్థుని, దరిద్రుడు ధార్మికుడగు ప్రభువును, అంధకారమున అలమటించువాడు దీపమును, చలిచే బాధపడు వాడు అగ్నిని ఏ విధముగా ఆశ్రయింతురో అలాగే ఎల్ల భయములను పోగొట్టు నదియు, సుఖ కరమైనదియు నగు శంభుని పాద పద్మముల నాశ్రయింపుము.

వ్యాఖ్య

నీటిలో కొట్టుకొని పోవువాడు తీరమును జేరి తృప్తి చెందును. సంసారజలములో కొట్టుకొనిపోవు మానవుడు పరమాత్మ యనెడి శాంతి తీరమును చేరి సంతృప్తి చెందును.

తిరిగి తిరిగి అలసట నొందిన బాటసారి వృక్షఛాయలో విశ్రమించి ఊరట నొందును. జనన మరణ రహదారిలో పరిభ్రమించి అలసట చెందిన జీవుడు పరమాత్మ యనెడి వృక్ష ఛాయలో విశ్రమించి సుఖించును.

వర్షము వలన భీతి నొందిన వాడు సుఖమైన గృహము నాశ్రయించి భయ రహితుడగును. దురదృష్ట మనెడి అతివృష్టిలో తడిసి వ్యధ చెందు జీవుడు భగవానుని పాదపద్మము లనెడి ఆశ్రయ స్థానమును జేరి భయమును వీడి నిర్భయముగ జీవించును.

పొరుగూరు నుండి వచ్చిన అతిథి గృహస్థుని ఆశ్రయించి, ఆతిథ్యమును స్వీకరించి తృప్తి చెందును. గత జన్మ నుండి ఈ నూతన జన్మను స్వీకరించిన జీవుడు సర్వ గృహములకు యజమాని యగు పరమశివుని శరణు జొచ్చి, శాంతి ప్రసాదమును గ్రహించి తృప్తి చెందును.

దరిద్రుడైన వాడు ధార్మికుడైన ప్రభువు దరిజేరి దారిద్ర్యమును బాపుకొనును. పుణ్య మనెడి సిరిలేక అవస్థల పాలగు జీవుడు నీలకంఠుడనెడి ధార్మిక ప్రభువు నాశ్రయించి జన్మ దారిద్ర్యమును పోగొట్టుకొని సుఖించును.

అంధకారమున అలమటించువాడు దీపము నాశ్రయించి చక్కగా చూడగలుగును. అజ్ఞానాంధ కారమున అలమటించు మానవుడు శివపాద మనెడి జ్ఞాన దీపము నాశ్రయించి, సమదర్శనము గల వాడై శోభిల్లును.

చలి బాధచే వణుకు వాడు అగ్నిని సమీపించి, చలి కాచుకొని ఆనందించును. తాపత్రయములనెడి చలి బాధచే వణుకు జీవుడు రుద్రుడనెడి అగ్నిని సమీపించి తాపత్రయ చలి నుండి విముక్తుడగును.

అలాగే సర్వ భయములను పోగొట్టి సమస్త శుభములను చేకూర్చు శంభుని పాదపద్మములను ఆశ్రయించమని శ్రీశంకరులు మనస్సుకు తెలుపుతున్నారు.

ఇచ్చట ఒక ముఖ్య విషయమును గ్రహింపవలెను. పైన తెలిపిన ప్రయోజనకరములగు విషయములన్నియు ఒక్కొక్క బాధను పోగొట్టి ఒక్కొక్క విధమైన సుఖమును అందించును. కానీ ఈశ్వర పాదపద్మ సేవనము వలన సమస్త దుఃఖములు ఉపశమించును. సర్వ శుభములు కలుగును కనుక శివుని పాదపద్మముల యందు సుస్థిరముగా చిత్తము నిలిచియుండుటయే భక్తి యనబడును. ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

అంకోలం నిజ బీజ సంతతి రయస్కాంతో పలం సూచికా
సాధ్వీ నైజవిభుం లతా క్షితిరుహం సింధు సరిద్వల్లభమ్
ప్రాప్నోతీహ యథా తథా పశుపతేః పాదార వింద ద్వయం
చేతోవృత్తి రుపేత్య తిష్ఠతి సదా సా భక్తి రిత్యుచ్యతే 61

పశుపతే = పశుపతీ!, ఇహ = ఈలోకమందు, నిజ బీజ సంతతిః = తన బీజ సమూహము, అంకోలం = ఊడుగుచెట్టును, సూచికా = సూది, అయస్కాంతో పలం = సూదంటు జాయిని, సాధ్వీ = పతివ్రత, నైజ విభుం = తన భర్తను, లతా = తీగను, క్షితిరుహం= వృక్షమును, సింధుః = నది, సరిద్వల్లభమ్ = సముద్రమును, యథా = ఏ ప్రకారముగ, ప్రాప్నోతి = పొందుచున్నదో, తథా = ఆ ప్రకారముగా, చేతోవృత్తిః = చిత్తవృత్తి పాదార వింద ద్వయం = పాద కమల యుగళమును, సదా = ఎల్లప్పుడును, ఉపేత్య = పొంది, తిష్ఠతి = ఉండునో, సా = అది, భక్తిరితి = భక్తియని, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

భావము :- ఊడుగు విత్తనములు నేలమీద రాలి తిరుగ అవియే చెట్టును అంటుకొను చున్నవి. సూది సూదంటు రాయిని చేరుచున్నది. పతివ్రత తన భర్త ననుసరించు చున్నది. తీగ వృక్షము నాశ్రయించి యున్నది. నది సముద్రము వైపు నడుచు చున్నది. అలాగే చిత్తము పశుపతి యొక్క పాదపద్మములను చేరి యుండునో దానినే భక్తి యందురు.

వ్యాఖ్య

మనస్సు ఆంతరంగిక స్పందనచే ఉద్యుక్తమై విషయముల మీదికి పరుగులిడు చుండును. ఇదియే ఆకర్షణ. ఊడుగు చెట్టునుండి రాలిన బీజములు తిరుగ ఊడుగు చెట్టునే అంటుకొనుచున్నవి. పరమాత్మనుండి విడిపడి వచ్చిన జీవుడు తిరుగ పరమాత్మనే చేరాలి. ఎక్కడ నుంచి వచ్చిన వస్తువు అక్కడికి చేరడము అనివార్య జీవన సూత్రము. సూది సూదంటు రాయిచే ఆకర్షింపబడుచ్నది. ప్రతి వ్యక్తీ తెలిసో, తెలియకనో భగవంతుని వైపునకే ఆకర్షింపబడుతున్నాడు.

"మమ వర్త్మాను వర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః"

పర్వులు తన మార్గమునే అనుసరించు చున్నట్లు శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో తెలిపియున్నారు.

పతివ్రత తన ప్రేమ పూర్ణంగా భర్త మీదనే యున్నందున ఆమె భర్తనే అనుసరించు చున్నది. నది సముద్రము నుండి కదిలినది. సముద్రము వైపునకే పరుగులిడుచున్నది. ఇదియే ప్రేమ. నివారించుటకు వీలులేని ఆకర్షణ.

"సా త్వస్మిన్ పరమ ప్రేమరూపా"

భగవంతుని యందలి ప్రగాఢమైన ప్రేమయే భక్తి యని నారద మహర్షి భక్తి సూత్రాలలో తెలియజేస్తాడు. కనుక నది సాగరము వైపు పరుగులిడునట్లు ఎవరి చిత్తము సదా పరమాత్మ పాద పద్మముల వైపు నడుచునో అట్టి చిత్తమునకు భక్తి అలవడినది అని భావము. భక్తి పరాప్రేమయైనందున అచ్చట రెండవ విషయం తెలిసిరాదు. భక్తి భక్తుని కనికరించును. ఉద్ధరించును. ప్రేమ మయునిగా మార్చును. తల్లి బిడ్డను తీర్చిదిద్దునట్లు, భక్తి బ్రతుకును భ్రాజిత మొనర్చును. ఈవిషయమును రాబోవు శ్లోకము వివరించును.

ఆనందాశ్రుభి రాతనోతి పులకం నైర్మల్యత శ్ఛాదనం
వాచాశఙ్ఖ ముఖస్థితైశ్చ జఠరా పూర్తిం చరిత్రామృతైః
రుద్రాక్షై ర్భసితేన దేవ వపుషో రక్షాం భవద్భావనా
పర్యఙ్కే వినివేశ్య భక్తి జననీ భక్తార్భకం రక్షతి 62

దేవ = దేవా!, భక్తి జననీ = భక్తి యనెడి తల్లి, ఆనందాశ్రుభిః = ఆనందబాష్పములచే, పులకం = రోమాంచమును, ఆతనోతి = విస్తరింప జేయును, నైర్మల్యతః = నిర్మలత్వము చేత, ఛాదనం = ఆచ్ఛాదనమును, వాచా శంఖ ముఖస్థితైః = వేదవాక్కను శంఖము యొక్క ముఖ మందున్నట్టి, చరిత్ర = నీ చరిత్రము లనియెడు, అమృతైః = పాలతో, జఠరాపూర్తిం = పొట్టనింపును, రుద్రాక్షైః = రుద్రాక్షల చేతను, భసితేన = విభూతి చేతను, వపుషః = శరీరము యొక్క, రక్షాం = సంరక్షణము చేయును, భవత్ = నీయొక్క, భావనా = భావన యనెడి, పర్యంకే = మంచమునందు, వినివేశ్య = పరుండబెట్టి, భక్తార్భకం = భక్తుడను శిశువును, రక్షతి = కాపాడును.

భావము :- దేవా! తల్లి ఆనంద బాష్పములను ఒలకబోస్తూ బిడ్డను చేరదీసి పులకింప జేయునట్లు, భక్తి యనెడి తల్లి భక్తునికి ఆనంద బాష్పముల నొలకించి రోమాంచిత గాత్రుని చేయుచున్నది. ఈగలు, దోమలు, చలి మున్నగు బాధలేకుండా తల్లి బిడ్డకు బట్ట కప్పినట్లు, భక్తి నిర్మల భావమును ఆవరింప జేయును. తల్లి బిడ్డకు పాలను శంఖములోపోసి కడుపారా త్రాగించునట్లు, భక్తి వేదము ద్వారా నీ చరిత్రలను అమృతమును త్రాగించును. తల్లి విభూతి పెట్టించి, రుద్రాక్షలు ధరింపజేసి అంగరక్ష గావించినట్లు, భక్తి భస్మ రుద్రాక్షమాలలను ధరింప జేయును. తల్లి మంచమున పరుండబెట్టి కాపాడినట్లు, భక్తి ఈశ్వర భావన యనెడి మంచమున పరుండ బెట్టును.

వ్యాఖ్య

భక్తి తల్లి వంటిది. భక్తుడు బిడ్డ వంటి వాడు. తల్లి యొడిలో బిడ్డ తన బాధలను మరచి ఆనంద పరవశుడగునట్లు, భక్తిలో భక్తుడు తన్మయుడగు చుండును. బిడ్డకు తల్లి రక్షణను కల్పించును. భక్తి భక్తుని రక్షించును. బిడ్డకు ఏ విధమైన ఆపద రాకుండా తల్లి శిశువును మంచముపై పరుండ బెట్టును. ఈగలు, దోమలు, చీమలు, చలి మున్నగు వాని బాధ లేకుండా తల్లి బిడ్డకు బట్ట కప్పును. అలాగే భక్తి యనెడి తల్లి భక్తుడైన బిడ్డను ఈశ్వర చింతనము అనెడి మంచముపై పరుండబెట్టును. విషయ వాసన లనెడి ఈగలు, అరిషడ్వర్గము లనెడి దోమలు,మోహమనెడు మంచు యొక్క బాధలేకుండా, నిర్మలత్వ మనెడి దుప్పటిని కప్పును. తల్లి బిడ్డ ఆకలిని పోగొట్టుటకు పాలను త్రాగించును. అలాగే భక్తి యనెడి తల్లి వేదవచనములు, పురాణ ప్రవచనములు అనెడి అమృతమును కడుపారా త్రాగించును. బిడ్డకు కీడు జరుగునని భావించి దిష్టిని తొలగించు ప్రయత్నములో విభూతి పెట్టించును. రుద్రాక్షలను ధరింపజేయును. అలాగే భక్తి యనెడి తల్లి అంగరక్ష గావించును.

తల్లి వలన బిడ్డకు బాధలు తీరును. భయములు తొలగును. సుఖములు కలుగును. శాంతి మిగులును. అలాగే భక్తి జన్మలోని బాధలను తీర్చును.

సంసార భయమును తొలగించును. ఆత్మ సుఖము నందించును. అమృత శాంతిని బ్రతుకులో నింపును. అందుచేతనే

"అమృత స్వరూపాచ"

"భక్తి అమృత స్వరూపము" అని నారద మహర్షి భక్తి సూత్రాలలో తెలిపినారు. మరి పై విధముగా భక్తి చేత ఉద్ధరింపబడిన మహాత్ములెవరు? తరువాత శ్లోకమును చూడుడు.

మార్గావర్తిత పాదుకా పశుపతే రంగస్య కూర్చాయతే
గండూషాంబు నిషేచనం పురరిపో ర్దివ్యాభిషేకాయతే
కించి ద్భక్షిత మాంస శేష కబళం నవ్యోప హారాయతే
భక్తిః కిం నకరోత్యహో వనచరో భక్తావతంసాయతే 63

పశుపతేః = శివునియొక్క, అంగస్య = అవయవమునకు, మార్గా వర్తిత పాదుకా = దారిన వడచిన చెప్పు, కూర్చాయతే = కనుబొమలమధ్య నిలిచినది, పురరిపోః = పురారికి, గండుషాంబు నిషేచనం = పుక్కిలించి ఉమ్మిన జలము, దివ్యాభిషేకాయతే = దివ్యమైన అభిషేకమైనది, కించిత్ = కొంచెము, భక్షిత = తినగా మిగిలిన, మాంస శేష కబళం= మాంసపు ముక్క, నవ్య = నూతనమైన, ఉపహారాయతే = క్రొత్త నివేదన పదార్థమైనది, వనచరః = బోయవాడు, భక్తావతంసాయతే = ఉత్తమభక్తుడగుచున్నాడు, భక్తిః = భక్తి కిం న కరోతి = ఏమి చేయదు?, అహో = ఎంత విచిత్రము?

భావము :- అహో! శివ భక్తి ఎంత విచిత్రమైనది. మార్గమున నడచుటచే చీకిపోయిన చెప్పును ఒక కిరాతకుడు శివుని భ్రూమధ్యమున నిలిపెను. పుక్కిలించి ఉమ్మివేసిన నీరు పరమ శివునకు దివ్యమైన అభిషేకమాయెను. కొంచెము తినగా మిగిలిన మాంసపు ముక్క శివునకు నూతన నైవేద్య మాయెను. వనము నందు చరించు బోయవాడు భక్తాగ్ర గణ్యుడాయెను.

వ్యాఖ్య

ఈ శ్లోకమునందు ఒక మహాభక్తుని జీవితము నందలి అనిర్వచనీయమైన భక్తి సన్నివేశమును శంకర భగవత్పాదులు వివరించుచున్నారు.

సువర్ణముఖీ నదీతీరమున శ్రీకాళహస్తి పట్టణమునకు దగ్గర ఉడుమూరు అను బోయపల్లె ఉండెడిది. ఆ గ్రామమున తిన్నడు అను బోయవాడు వసించు చుండెను. ప్రతి దినము వనమునకేగి జంతువులను వేటాడి ఆ మాంసమును కొంత అమ్ముకొని, కొంత భుజించి జీవించుచుండెడివాడు.

ఒకనాడు తిన్నడు అడవికి వేటాడుటకై బయలుదేరెను. వనమును చేరెను. కానీ అతనికి ఆనాడు ఒక్క జంతువైనను కనుపించలేదు. తిరిగి తిరిగి వేసారిపోయెను. గృహోన్ముఖుడగుటకు సిద్ధపడు చుండగా అల్లంత దూరమున అతనికి ఒక అడవిపంది గోచరించెను. తిన్నడు ఆశాజీవియై బాణమును చేత పట్టుకొని ఆ వరాహమును తరుముచూ పరుగెత్తెను. వరాహము పరుగులిడసాగెను తిన్నడుదానిని వెంబడించి పరుగులెత్తసాగెను. ఆ జంతువు పరుగులెత్తి ఒక గుహలో ప్రవేశించెను. ఇక దొరకక తప్పదు అని సంతసించుచు తిన్నడు ఆ గుహలో ప్రవేశించెను. కానీ విచిత్రము! అచ్చట అతనికి అడివిపంది కనుపించలేదు. పూజకు నోచుకోని శివలింగ మొకటి ధూళితో నిండి కనుపించింది. తిన్నడు శివలింగమును గాంచినాడు. తిన్నడిలోని భక్తి మొగ్గ విరబూసింది.

'శివయ్యా! నీవేనా! ఇలా ఒంటరిగా ఉన్నావా? అదేమిటి శివయ్యా! నీ దేహమంతయు దుమ్ముతో నిండియున్నది? అయ్యో! నిన్ను శుభ్రపరచేవారే లేకపోయారా? అందరికి దిక్కయైన నీకు ఈ చిక్కు లెలా వచ్చాయి? శివయ్యా! ఎన్ని రోజులైనదో కదా నీవు భుజించి. శివయ్యా! ఎన్ని బాధలనుభ వించితివో కదా! ఇక పరవాలేదులే! నేవచ్చానుగా!నీకు అన్నీ అమర్చుతాను.' అన్నాడు తిన్నడు.

తిన్నడు ఆలోచించాడు. దగ్గరలో నున్న సరస్సునుండి దోసిళ్ళతో జలము తెచ్చి శివునికి అభిషేకము చేయించసాగినాడు. ఎక్కువ జలమును సేకరించే ప్రయత్నములో తన దగ్గర పాత్రలేనందున కొంత నీటిని నోటిలో

కూడా నింపుకొని వచ్చి ఆ నీటిని శివలింగముపై ఉమ్మివేయ సాగినాడు. కానీ ఆవిధమైన నికృష్టపు సేవ శివునకు ఉత్కృష్టమైన అభిషేకమైనదట.

"శివయ్యా! ఆకలిగా ఉందా? నాదగ్గర నేను తినగా మిగిలి యున్న మాంస మున్నది. దానిని తిని తృప్తి చెందు" అని పలికి తిన్నడు మాంసమును పరమ శివునకు నైవేద్యముగా సమర్పించెను. కానీ నూతనమైన ఈ నైవేద్యమునకు శివుడు సంతసించి ఆరగించెనట.

ఇంతలో ఒక విచిత్రము జరిగెను. శివుని నేత్రమునుండి జలము స్రవించసాగెను. "అయ్యో! శివుని నేత్రము నుండి నీరు కారుచున్నది" అని తిన్నడు బాధపడి తన నేత్రమును దీసి శివలింగమునకు అమర్చెను. ఇంతలో రెండవ కంటినుండి కూడా నీరు కారుచుండెను. రెండవ కన్ను గూడా చెడిపోయినదేమో నని భావించి తన రెండవ కంటిని కూడా తీసి శివునకు సమర్పించ బోయెను. మరి తన రెండవ కంటినికూడా పీకివేసినచో తిన్నడు శాశ్వతముగా అంధుడగును. మరి పెకలించిన ఈ రెండవ నేత్రమును శివుని నేత్రము వద్దకు చేర్చుట ఎట్లు? తిన్నడు చెప్పు తొడిగి యున్న తన పాదమును శివుని భ్రూమధ్యము నందు నిలిపి గుర్తు పెట్టుకొనెను. రెండవ కన్నును శరముతో పెకలించ బోయెను.

"శివయ్యా! నా కన్ను నీకు సమర్పించాను. నీ రెండవ కంటి నుండి రక్తము స్రవించు చున్నది. శివయ్యా! అందరినీ అనుగ్రహించే నేత్రాలు నీవి. నీ నేత్రాలు బాగుంటేచాలు. నాకు నేత్రాలు లేకపోయినా ఫరవాలేదు. శివయ్యా! ఈ రెండవ నేత్రమును నీకు సమర్పించగనే నేను అంధుడ నవుతాను. నాకు ఏమీ కనుపించదు. నీవు తప్ప. నిన్ను నా మనస్సులో సదా దర్శించు కుంటాను. అర్చించు కుంటాను" అని పరవశించి పలుకుతూ రెండవ కంటిని పెకలించ బోయెను. ఇంతలో శివుడు ప్రత్యక్ష మాయెను. శివలింగము నందు అవ్యక్తముగా యుండిన పరమేశ్వరుడు ప్రత్యక్షమై ఆ బోయవానిని కౌగలించుకొనెను.

"తిన్నా! నీ భక్తి అపారము! నీ సేవ అసమానము. నీ త్యాగము అప్రమేయము. నా అనుగ్రహముతో నీవు తరిస్తావు. నీ చరిత్రను భక్తులు సదా కొనియాడుతూ ఉంటారు. గొప్ప త్యాగివై నీ కన్నును నాకు సమర్పించావు. ఇకమీదట కన్నప్పవై యుండు. శ్రీకాళహస్తీశ్వర క్షేత్రంలో మొదట నీకు సేవ లందుతాయి. తరువాత నాకు అందుతాయి" అని చెప్పి పరమ శివుడు అంతర్హితు డయ్యెను.

భగవంతుడు భక్త సులభుడు. భక్తాధీనుడు. తాను మన్ననలను చూడడు. మహిమలను గాంచడు. ధనిక దరిద్రు లనెడి తారతమ్యములు, పండిత పామరు లనెడి భేదములు భగవత్సాన్నిధ్యములో అనూహ్యములు.

నాస్తి తేషు జాతి విద్యా రూప కుల ధన క్రియాది భేదః

"భగవద్భక్తుల యందు జాతి, విద్య, రూప, కుల, ధన, క్రియాది భేదములు లేవు" అని నారదమహర్షి భక్తి సూత్రాలలో తెలియ జేస్తారు.

తిన్నడు విద్యావంతుడా? అగ్రకులజుడా! వేదమును చదివెనా? వాదమును నేర్చెనా? ఇవి ఏవి లేకున్నను అతడు ఉద్ధరించబడెను. శివానుగ్రహమును పొందుటకు అవసరమైన భక్తి తిన్నని వద్ద పుష్కలముగా యుండెను. తిన్నడు అర్పించిన మాంసాహారమును శివుడు అవసరమై ఆరగించెనా? భక్తునికి స్థానమును కల్పించే ప్రయత్నమే ఈ మహత్కార్యమునకు నాంది పలికింది. శ్రీ ధూర్జటి మహాకవి శ్రీకాళహస్తీశ్వర శతకము నందు ఈ విషయమును అత్యద్భుతంగా వర్ణిస్తారు.

నీకున్ మాంస వాంఛయేని గరవా? నీ చేత లేడుండగా!
జోకైనట్టి కుఠారముండ ననల జ్యోతుండ నీరుండగా!
బాకం బొప్ప ఘటింప జేతి వునుకన్ భక్షింప కా బోయచే
జేకొంటెంగిలి మాంస మిట్లు దగునా శ్రీకాళహస్తీశ్వరా!

"హే పరమశివా! నీకు మాంసమునకు ఏమి కొదువ? నీ చేతి యందే లేడి యున్నది గదా! వాడియైన గండ్ర గొడ్డలి యున్నది. పైగా అగ్ని జ్వాల యున్నది. తలపై గంగ యున్నది. చక్కగా వంట చేసుకొని, తినుటకు ఎలాగూ కపాలము చేతిలోనేయున్నది గదా! దానిలో పెట్టుకొని హాయిగా భుజించ వచ్చును గదా! ఈ బోయవాడు అర్పించిన ఎంగిలి మాసంమును తిన తగునా?" అనెను.

భక్తుడు అర్పించినది ఏదైనను అది పరమేశ్వరునికి అమృతమే. ఆయన భక్త పరాధీనుడు.

ఈ కన్నప్ప చరిత్ర నాకు అత్యంత ప్రీతి కరమైనది. నేను ఉన్నత పాఠశాలలో చదివే రోజుల్లో శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుటకు వెళ్ళినాను. కన్నప్ప కొండ నెక్కి కన్నప్పను దర్శించినాను. ఆ ఆలయంలో ఈ శ్లోకము వ్రాసి యుంచబడి యుండినది. దానిని పలుమార్లు చదివి అక్కడే కంఠస్థము చేసినాను. ఆ సమయంలో నేను పాడుకొనిన రాగమే ఈనాడు వేదికలపై కన్నప్ప చరిత్రను వివరించేటప్పుడు నేను శ్లోకమును పాడే రాగము.

మెల్లగా కొండ దిగుతున్నాను. ఏదో తెలియని ఆర్ద్రత, అంతు చిక్కని బాధ హృదయాన్ని పిండుతున్నాయి. పారలివచ్చే కన్నీటిని తుడుచుకొంటూ కొండదిగి ఆలయములో ప్రవేశించుటకు నడుస్తున్నాను.

ఆ సమయానికి రాయలు వారి మంటపములో కూర్చొని పండితులు జమదగ్ని శర్మగారు పురాణ ప్రవచనం చేస్తున్నారు. నేనూ వెళ్ళి భక్తుల మధ్య ఆసీనుడనయ్యాను. ఆయన కన్నప్పను గూర్చియే వివరిస్తున్నారు. నాకు దుఃఖం ఆగింది కాదు. ప్రక్కవారు గుర్తించే రీతిలో నేను ఏడ్వ సాగాను. ఆ అనుభూతి నా హృదయంలో అలా ఉండిపోయింది. నేను ఉపన్యాసములు ప్రారంభించిన తరువాత ఒకనాడు కన్నప్పను గూర్చి నేను ప్రవచించిన తీరును గాంచి పులకాంకితుడైన జమదగ్ని శర్మగారు, "నాయనా! కన్నప్పను కంటిముందు నిలిపావు. కన్నీటిని ఆపుకొనే శక్తిని నాకు దూరం చేశావు" అన్నారు. "శర్మగారూ!

ఒకనాడు మీరు చెబుతుంటే నేను ఏడ్చాను. ఈనాడు నా ఉపన్యాసం మిమ్ములను ఏడిపించినది. చెల్లు వ్రాసినట్లే. బాకీ తీరిపోయింది" అన్నాను. ఈనాడు కూడా "మార్గా వర్తిత పాదుకా" అనే ఈశ్లోకాన్ని పాడి నేను వివరిస్తూ వుంటే భక్తులైన వారు కన్నీళ్ళు కారుస్తూనే ఉంటారు. అవును మరి! భక్తుల దివ్య గాధలు హృదయాలను ఎందుకు ద్రవింప జేయవు?

భగవంతుని భక్తిచే హృదయమున బంధించువాడే భక్తుడు. అట్టి వారికే భగవంతుడు లభించును. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

వక్షస్తాడన మంతకస్య కఠినా పస్మార సంవర్దనం
భూభృత్పర్యటనం నమత్సుర శిరః కోటీర సంఘర్షణమ్
కర్మేదం మృదులస్య తావక పద ద్వంద్వస్య గౌరీపతే
మచ్చేతో మణి పాదుకా విహరణం శంభో సదాంగీకురు 64

గౌరీపతే = పార్వతీ వల్లభా!, శంభో = శివా, అంతకస్య = యముని యొక్క, వక్షస్తాడనం= వక్షస్థలమును తన్నుటయు, కఠిన = కఠినమై, అపస్మార = స్వరూప జ్ఞానము యొక్క, సంవర్దనం = నిగ్రహించుటయు, భూ భృత్పర్యటనం = వెండికొండ యందు సంచరించుటయు, నమత్ = నమస్కరించు చున్న, సుర = సురులయొక్క, శిరః = శిరముల యందలి, కోటీర = కిరీటముల యందు, సంఘర్షణం = సంఘర్షణమును, ఇదం = ఈ నాలుగును, మృదులస్య = కోమలమైన, తావక = నీయొక్క, పదద్వంద్వస్య= నీ పాద ద్వయము యొక్క, కర్మ = వ్యాపారము, మత్ = నాయొక్క, చేతః = చిత్తమనియెడు, మణి పాదుకా విహరణం = మణిమయమైన, పాదుకా విహరణం= పాదుకలతో సంచారమును, సదా = ఎప్పుడు, అంగీకురు = అంగీకరింపుము.

భావము :- హే శివా! నీ పాదములు అతికోమలములు. కానీ అవి యముని రొమ్మును తన్న వలెను.అతి కఠినుడైన అపస్మారాసురుని అణగద్రొక్క వలెను. గిరులపై సంచరించవలెను. నమస్కరింప వచ్చిన దేవతలయొక్క కిరీటముల రాపిడిని భరింపవలెను. ఇవి అన్నియు మిక్కిలి కఠినమైన కృత్యములు. కనుక నా చిత్త మనెడి స్వచ్ఛమైన మణిపాదుకలను తొడిగెకొని సదా ఆనంద విహారము గావింపుము.

వ్యాఖ్య

శివ భక్తులైన వారికి యమ చెఱ లేదు. యముడు మృత్యువు నందించును. కానీ శివుడు మృత్యుంజయుడు. మృత్యుంజయుని సాయుజ్యము లభించిన వారికి మృత్యు భయముండదు. భక్తుడైన మార్కండేయుని ప్రాణములను కబళించుటకు వచ్చిన యమునికి బుద్ధి చెప్పి శివుడు మార్కండేయుని రక్షించెను. కనుక భక్తులను కబళించుటకు వచ్చెడి యమ ధర్మరాజు ఱొమ్మును శివుడు కాలుతో తన్నవలెను. సుకుమారమైన పరమ శివుని పాదములు ఈ కఠిన కార్యము నాచరించుటలో ఎంతగా కందిపోవునోకదా!

దుష్టులైన అసురులను అణగ ద్రొక్కు సమయాన కోమలమైన శివుని పాదములు ఎంతగా కమిలిపోవునో కదా! హిమగిరి శిఖరాలపై చరించవలెను. అంతియే గాక పరమ పురుషార్థమైన మోక్షము ననుగ్రహించు శివుని పాదపద్మములను సేవించుటకు దేవత లరుదెంచుదురు. వారు కిరీటిధారు లైనందున ఆ కిరీటముల యొక్క రాపిడికి అతి మనోహరమై, మృదులమైన గౌరీపతి పాదములు క్లేశములకు గురియగునేమో! కనుక ఈ బాధల నుండి విముక్తి నొందుటకు స్వచ్ఛమై, మెత్తనివియైన, తన చిత్తమనెడి మణి పాదుకలను తొడిగికొని ఎదురయ్యే పై విధమైన క్లేశముల నుండి విముక్తి నొంది ఆనంద విహారమును సాగింపుమని భక్తుడు భగవంతుని ప్రార్థించు చున్నాడు.

తన చిత్తమనెడి మెత్తని పాదుకలను తొడిగికొని విహరించ మంటున్నాడు. సాత్త్వికమైన మనస్సే మెత్తగా యుండును. దయ, ప్రేమ, నిరహంకారత, సహనము, అహింస ఇత్యాది దైవగుణములచే మనస్సు మెత్తపడవలెను. అప్పుడే అవి శివుడు ధరించుటకు అర్హములగును. కామక్రోధాది దుర్గుణములచే కరుడు గట్టిన అంతఃకరణ శివసాయుజ్యమునకు అనర్హమగును. కనుక సుస్నిగ్ధమైన, మృదులమైన చిత్తమును భక్తుడు తయారు చేసుకొన వలెనని నిర్ణయించుకొనుటయే ఈ భావనలోని అంతరార్థము.

పాదుకలు వ్యక్తిని మోయుచుండును. సదా శివుని మోయు చిత్తమే శివపాదుక లగుటకు అర్హము లగునని భావము. పరమశివుని మదిలో నింపుకొని చరించువారు సర్వోపద్రవముల నుండి విడిపడి తరింతురు. ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

వక్షస్తాడన శంకయా విచలితో వైవస్వతో నిర్జరాః
కోటీరోజ్జ్వల రత్న దీప కలికా నీరాజనం కుర్వతే
దృష్ట్వా ముక్తివధూ స్తనోతి నిభృతా శ్లేషం భవానీ పతే
యచ్చేత స్తవ పాద పద్మ భజనం తస్యేహ కిం దుర్లభమ్ 65

భవానీపతే = పార్వతీపతీ!, యచ్చేతః = ఏచిత్తము, తవ = నీయొక్క, పాదపద్మ భజనం= పాగపద్మముల సేవనమును చేయునో, దృష్ట్వా = వానిజూచి, వైవస్వతః = యముడు, వక్షస్తాడన శంకయా = వక్షస్థలమును తన్ను ననెడి సంశయముతో, విచలితః = పరుగులిడు చున్నాడు, నిర్జరాః = దేవతలు, కోటీర = కిరీటముల యందు, ఉజ్జ్వల= ప్రకాశించు చున్న, రత్నదీప = రత్నదీపముల యొక్క, కలికా = అంకురములచే, నీరాజనం = నీరాజనమును, కుర్వతే = చేయుచున్నారు, ముక్తివధూః = ముక్తికాంత, నిభృతా శ్లేషం = గాఢాలింగనమును, తనోతి = చేయుచున్నది,తస్య = ఆభక్తునికి, ఇహ = ఈ లోకము నందు, దుర్లభం = దుర్లభమైనది, కిం = ఏది ఉన్నది?

భావము :- పార్వతీ వల్లభా! నీయొక్క పాదపద్మములను ఏవ్యక్తి యొక్క మనస్సు సేవించు చుండునో అట్టివానిని జూచి గతము వలె త్రొమ్మున తన్నుదువేమోయని భయపడి యముడు పాటిపోవుచున్నాడు. దేవతలు ప్రకాశమానమైన కిరీటముల యందలి మణిదీపములతో నీరాజనము లిచ్చి, భక్తుని పాదములపై బడుదురు. ముక్తికాంత పిలువకనే వచ్చి గాఢాలింగన మొనర్చుకొనును. ఇక నీ భక్తునికి లభ్యముకాని దేమున్నది?

వ్యాఖ్య

భక్తునిపై భవానీ శంకరుని యొక్క కృప అపారముగా యున్నందున అతనిని సమీపించుటకు యముడు కూడా భయపడును. ఏమియును

చేయలేని అశక్తతయే ఈ భయమునకు కారణమై యున్నది. భక్తుని చిత్తము సదా మృత్యుంజయుని పాద పద్మముల నాశ్రయించి యుండుటచే అది మృత్యుభయము నెరుగదు.

భగవత్కృపకు పాత్రుడైన భక్తుని గాంచి దేవతలు కూడా శిరమొడ్చి నమస్కరించెదరు. కిరీటముల యందలి మణిదీపములతో హారతులిచ్చి పాదములపై బడెదరు. రాజుకు ఆంతరంగిక సేవకుడైన వానిని మంత్రులు కూడా గౌరవించునట్లు గౌరీపతికి ఆంతరంగిక భృత్యుడైన భక్తుని జూచి దేవతలు కూడా నమస్కరింతురు.

"నృత్యన్తి దేవతాః"

'నిజ భక్తుని గాంచి దేవతలు ఆనందించినవారై నృత్యము చేయుచున్నారు' అని నారదమహర్షి భక్తి సూత్రాలలో వివరించినారు.

ముక్తికాంత తనంత తానుగా వచ్చి భక్తుని వరించును. గాఢాలింగన మొనర్చుకొనును. భక్తుడు వరించి యున్నచో తానే ముక్తి కాంత వద్దకు వెళ్ళి యుండెడివాడు. అలా గాక ముక్తి కాంతయే తనను సమీపించు చున్నది. కనుక ముక్తిని కూడా నిజ భక్తుడు వాంఛించుట లేదు. భక్తుడైన వానికి సమస్తమూ భగవానుడే. ఆయన భజనయే సర్వము.

కనుక భక్తుడు పూర్ణ పురుషుడు. ముక్తిని కూడా ఆశించని భక్తునకు అలభ్యమైనది ఈ ప్రపంచము నందు ఏదియును లేదు. భక్తుని చేష్టలు పరమాత్మకు వినోద క్రీడలే గాని మరొకటి కానేరవు. ఈ విషయమును తరువాత శ్లోకమున దర్శింపుడు.

క్రీడార్థం సృజసి ప్రపంచ మఖిలం క్రీడా మృగాస్తే జనాః
యత్కర్మా చరితం మయాచ భవతః ప్రీత్యై భవత్యేవతత్
శంభో స్వస్య కుతూహలస్య కరణం మచ్చేష్టితం నిశ్చితం
తస్మాన్మామక రక్షణం పశుపతే కర్తవ్య మేవ త్వయా 66

శంభో = శివా!, అఖిలం = సమస్తమైన, ప్రపంచం = లోకమును, క్రీడార్థం = లీలా విశేషముగ, సృజసి = సృజించు చున్నావు, తే = నీకు, జనాః = జనులు,క్రీడామృగాః= విలాస జంతువులు, మయా = నాచేత, యత్ = ఏ, కర్మ = కర్మము, ఆచరితం= ఆచరింప బడినదో, తత్ = అది, భవతః = నీయొక్క, ప్రీత్యై = ప్రీతికొఱకు, భవత్యేవ= అగుచున్నది, మచ్చేష్టితం = నా వ్యాపారము, స్వస్య = నీ సంబంధమైన, కుతూహలస్య= ఇష్టమునకు,కరణం = సాధకమైనది, నిశ్చితం = నిశ్చయము, తస్మాత్ = కాబట్టి, పశుపతే= పరమశివా!, మామక రక్షణం = నా సంరక్షణము, త్వయా = నీచేత, కర్తవ్యమేవ= చేయదగినదియే.

భావము :- శివా, నీవు ఈ జగత్తును క్రీడార్థమై సృష్టించినావు. జనులందరు నీవినోదార్థము నిలిచియున్న మృగములు. కనుక నా చేష్ట లన్నియు నీ వినోదము కొఱకే గదా! నీ ప్రీతి కొఱకే గదా! కనుక నా సంరక్షణము నీ బాధ్యతయే సుమా! ఇది నీ ముఖ్య కర్తవ్యమే సుమా!

వ్యాఖ్య

ఈ సృష్టిని సృజించిన వాడు భగవానుడు. సృష్టి వెనుక తన హేతువేమిటి? ఏ ప్రయోజనమును వాంఛించి భగవంతుడు సృష్టి కార్యమును చేశాడు? సృష్టి కార్యము వెనుక హేతువు ఉన్నట్లయినచో భగవానుడు కూడా పరిమితుడే అగును. వెలితి గలవాడుగా మిగులును. కనుక సృష్టి కార్యము వెనుక నిర్హేతుక స్థితియే ఉన్నదని అంగీకరించాలి. అలాంటిది ఎలా సాధ్యము? హేతువు లేని కార్యము వినోధార్థమై యుండాలి. పరమాత్మ తన వినోదము కొరకే సృష్టిని సాగించినాడు. సృష్టి క్రీడార్థమైనపుడు సృష్టిలోని జనులందరు వినోదార్థము సృష్టింపబడిన మృగముల వంటి వారని శ్రీశంకరులు నిర్ణయించు చున్నారు.

వినోదార్థము మనము కుక్క, పిల్లి, చెవుల పిల్లి ఇత్యాది జంతువులను పెంచుదుము.అట్టి వాని చర్యలు మనకు వినోదము కొరకే యున్నవి. మన ప్రీతి కొరకై యున్నవి. అలాంటప్పుడు అవి చేయు మంచి చెడులను మనము

పట్టించుకోము. కుక్క అద్దమును పాడు చేయవచ్చు. పిల్లి వంటను మట్టిపాలు చేయవచ్చు. చెవుల పిల్లి వనములోని మొక్కలను పాడు చేయవచ్చు. అలాగని మనము వాటిని శిక్షించము. పైగా రక్షిస్తాము. ఎందుకని? అవి వినోదము కొరకు ఉన్నవి గనుక.

అలాగే జనులందరు విలాసార్థము సృష్టింపబడిన ఈ జగత్తులో పరమాత్మ వినోదము కొరకు చరించే జంతువులు. పరమేశ్వరా! నీ వినోదము కొరకు మేమున్నాము. తెలివి లేని వారము. తెలిపినా తెలుసుకోలేని వారము. క్షమించు తండ్రీ! మా మంచి చెడులను అలా ఉంచి మమ్ము రక్షింప వలసిన బాధ్యత నీపై ఉన్నది. ఇది నీ కర్తవ్యము. పమాత్మ కర్తవ్యమును ప్రస్తుతశ్లోకంలో వివరించినారు. కర్తవ్యమును రాబోవు శ్లోకములో వివరించ బోవుచున్నారు.

భహువిధ పరితోష బాష్పపూర
స్ఫుట పులకాంకిత చారుభోగ భూమిమ్
చిరపద ఫల కాంక్షి సేవ్యమానాం
పరమ సదాశివ భావనాం ప్రపద్యే 67

బహువిధ = అనేక విధములైన, పరితోష బాష్ప పూర = ఆనంద బాష్ప ప్రవాహమునకు, స్ఫుట = ప్రస్ఫుటమైన, పులకాంకిత = గగుర్పాటును కలిగించెడి, భక్తి చిహ్న = భక్తి యొక్క గుఱుతునకు, చారు = రమ్యమైన, భోగభూమిం = భోగస్థానమును, చిరపద= శాశ్వత పదమనెడు, ఫల = ఫలమును, కాంక్షి =కాంక్షించు వారిచే, సేవ్యమానాం = సేవింప బడునదియు, పరమ = ఉత్తమమైన, సదాశివ = సదాశివుని, భావానాం = స్మరణమును, ప్రపద్యే = శరణు బొందు చున్నాను.

భావము :- అనేక విధములగు ఆనంద బాష్ప ప్రవాహములను కలిగించు నదియు, రోమాంచమును కలిగించు భక్తికి అలవాలమై నదియును, పరమ పదమును, ముక్తిని కాంక్షించు వారిచే సేవింప బడునదియును అగు శ్రేష్ఠమైన శివ ధ్యానమునకు శరణాగతుడ నగుచున్నాను.

వ్యాఖ్య

శివ ధ్యానము పరమోత్కృష్టమైనది. అది అన్యరాగ విస్మారణము. అనన్య చింతనము. అందుచేత దివ్య పారవశ్యమును కలిగించునదియై యున్నది. మనస్సు శివుని ధ్యానము నందు లగ్నమైనపుడు కంఠము గద్గద మగును. పరిమిత స్థితి నధిగమించి జీవించు స్థితియైనందున ఆనంద బాష్పములను చిందించును. ఆంతరంగిక శివ ధ్యానము వలన కలిగెడి దివ్యా నందమును వర్ణింప ప్రయత్నించగనే దేహము పులకాంకితమగును. నిత్యా నందమునకు సంబంధించినది గనుక రమ్యమైన భోగస్థితియై ఉన్నది.

"కంఠావ రోధ రోమాంచ అశ్రుభిః"

"కంఠము గద్గదమగుట, రోమ హర్షణ మగుట, నేత్రముల వెంట ఆనంద బాష్పములు రాలుట భక్తికి వ్యక్త రూపము"లని నారద మహర్షి భక్తి సూత్రాలలో తెలియజేయడము జరిగినది. శ్రీకృష్ణార్జునుల సంవాదము కూడా అద్భుతమై, రోమహర్షణమును కలిగించు చున్నదని మహాత్ముడైన సంజయుడు భగవద్గీతలో తెలుపుతాడు.

శివధ్యానము సర్వోపద్రవ రహిత స్థితి యగు మోక్షమును ప్రసాదించును. అందుచేత ముముక్షువులైన వారు శివధ్యానమును అభిలషించు చుందురు. ఉత్కృష్టమైన మోక్ష ఫలము నిచ్చునది యైనందున శివధ్యానము పరమైనది యైనది. అట్టి శివధ్యానమును శరణు బొందిన వారలు ధన్యజీవులు. భక్తి ధ్యానములు కామధేనువులై భక్తుని పూర్ణ శాంతితో నింపును. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

అమిత ముదమృతం ముహు ర్దుహంతీం
విమల భవత్పద గోష్ఠ మావసంతీమ్
సదయ పశుపతే సుపుణ్య పాకాం
మమ పరిపాలయ భక్తి ధేను మేకామ్ 68

సదయ = దయతో గూడిన, అమిత ముదమృతం = అపరిమిత ఆనందమను పాలు, ముహుః = మాటిమాటికి, దహంతీం = పితుక నిచ్చునదియు, విమల = నిర్మలమైన, భవత్ = నీయొక్క, పద = పాదములనెడి, గోష్ఠం = గోశాలను, అవసంతీం = వసించు నదియు, సుపుణ్యపాకం = మంచి పుణ్యములకు ఫలమును, మమ = నాయొక్క, భక్తీ= భక్తి యనెడి, ధేనుం = గోవును, ఏకాం = ఒక్క, పరిపాలయ = పాలింపుము.

భావము :- హే పరమ శివా! భూతనాథా, నీవు అపారమైన దయగల వాడవు. నేచేసిన సత్పుణ్యఫలముగా నాకు భక్తి యనెడి గోవు లభించినది. ఈ గోవు అపరిమిత ఆనందమనెడి క్షీరమును మాటి మాటికి ఇచ్చును. నిర్మలమైన నీ పాదపద్మము లనెడి గోశాలలో అది వసించు చున్నది. నా యొక్క భక్తి యనెడి ఒక్క గోవును దయతో పాలింపుము.

వ్యాఖ్య

దయామయుడగు సదాశివుని ఈ శ్లోకమునందు భక్తిని పెంపొందించ మని శ్రీశంకరులు ప్రార్థించు చున్నారు. శివుని కృప అపారము. భక్తులను రక్షించుట యందు ఆ మహాత్ముని పాత్ర అనూహ్యము, అద్భుతము. అందుచేతనే ఈ శ్లోకము "సదయ" అనగా దయామయా అని సంబోధించ బడినాడు.

పుణ్యాత్ముడగు భక్తునికి భక్తియను ధేనువు లభించును. పూర్వ పుణ్య విశేషము లేని వారికి భక్తి కలుగదు. భక్తి యనెడి గోవు లభించిన వాని జన్మ ధన్యము. గోవు క్షీరము నొసగి దేహమునకు ఆరోగ్యమును కలిగించును. భక్తి యనెడి ధేనువు జ్ఞాన క్షీరము నొసంగి వ్యక్తికి నిత్యానందమును ప్రసాదించును. క్షీరము సమీకృత ఆహారము కాగా, జ్ఞాన క్షీరము సమదర్శన వీక్షణము నందించి బ్రతుకును తేజోవంతము గావించును.

సాధారణముగా ధేనువు నియమిత వేళలలో పాలిచ్చును. భక్తి యనెడి ధేనువు ఎప్పుడు పితికినను క్షీరము నందించుచునే యుండును. అనగా నీ ప్రయత్నము మీదనే ఆధారపడి యున్నదని భావము. ఆకలి వేసినప్పుడల్లా

ధేనువు క్షీరము నిచ్చునా? కానీ ఆవేదన కలిగినప్పుడల్లా నీవు భక్తి యనెడి గోవును సమీపించి చూడుము. ఆవేదన లంతరింపజేసి ఆనందము నొసంగు చుండును.

గోవు మైదానములలో ప్రవేశించి గడ్డిని మేసి క్షీరమును అందించును. భక్తి యనెడి ధేనువు శివ చరిత్ర మనెడి మైదానములో వేదాంత విషయ మనెడి సస్యమును తిని, నీకు జ్ఞాన మనెడి క్షీరము నందించును.

ఆవులు పశువుల చావడిలో కట్టివేయ బడుచుండును. పరమశివుని పాదపద్మము లనెడి పశువుల చావడిలో భక్తి యనెడి ధేనువు కట్టబడి యుండును. గోశాలలో గోవుకు రక్షణ యుండును. అది ఎండకు దెబ్బ తినకుండా, వర్షానికి తడువకుండా, చలికి వణుక కుండా గోశాల రక్షించును. అలాగే శివుని పాద పద్మము లనెడి గోశాల భక్తి ధేనువును రక్షించును. కామ వృష్టికి తడువకుండా, క్రోధాగ్నికి ఆహుతి కాకుండా, లోభ మనెడి చలితో బాధపడకుండా పరమేశ్వరుడు రక్షించును. కనుక ఈ భక్తి ధేనువు నొక్కదానిని రక్షించిన చాలునని శ్రీశంకరులు ప్రార్థించు చున్నారు.

ఉండ దగినది, రక్షణ పొందదగినది భక్తి యొక్కటే. అది మనకు అమృత క్షీరమును ప్రసాదించును. మనలను అమరులను గావించును. ఒకవేళ మనలో భక్తి లేనిచో ఏమగును? దోషములున్నచో? --- అయినను కరుణించి కాపాడుమని శివుని ప్రార్థించు చున్నారు. ఈ విషయమును తరువాత శ్లోకము నందు చూచెదము.

జడతా పశుతా కళంకితా
కుటిల చరత్వం చ నాస్తి మయి దేవ
అస్మి యది రాజమౌళే
భవదాభరణస్య నాస్మి కిం పాత్రమ్ 69

దేవ = మహాదేవా! రాజమౌళే = చంద్రశేఖరా! జడతా = జడత్వము, పశుతా = వివేకములేని, కళంకితా = కళంకము కలిగి యుండుట, కుటిల చరత్వం = కుటిలముగా చరించుట, మయి = నాయందు, నాస్తి = లేదు, అస్తి = ఉన్న ఎడల, భవదా భరణస్య= నీ అలంకారమునకు, పాత్రం = తగిన వాడను, నాస్మి కిం? = కానా?

భావము :- హే పరమ శివా! చంద్రశేఖరా! జడత్వము, పశుత్వము, కళంకము, కుటిల సంచారము నాకు లేవు. ఒకవేళ అవి యన్నియు ఉన్నచో నీకు ఆభరణ మయ్యెడి వాడను గానా?

వ్యాఖ్య

హే చంద్రశేఖరా! నాకు జడత్వము, పశుత్వము,కళంకము,కుటిల చరత్వము లేవు అంటున్నారు శ్రీశంకరులు. అనగా ఇవన్నియు చంద్రుని యందు గలవు. జలము నుండి పుట్టిన వాడగుటచే చంద్రుడు జడప్రాయుడు. గురుపత్నీ సంగమము కలవాడైనందున పశుత్వము గలవాడు. చెడు కార్యము లాచరించి కళంకితుడైనవాడు. వంకరగా నున్న నెలవంకగా చరించు వాడైనందున కుటిల చరత్వము గలవాడు. అట్టి దుర్గుణములు గల చంద్రుని నీవు భూషణము వలె ధరించినావు కదా! మరి నన్ను ఎందులకు అంగీకరించవు?

ఇచ్చట మరియొక భావమును కూడా గ్రహింపవచ్చును. 1. జడత్వము అనునది గంగకు అన్వయింపవచ్చును. జలము జడము అయినను గంగాదేవిని నీవు శిరమున ధరించినావు. 2 . పశుత్వము నందీశ్వరునికి అన్వయింప వచ్చును. పశువైన నందీశ్వరునికి తనను మోసే దివ్యమైన వరమును శివుడొసగినాడు. 3. కళంకమును చంద్రునకు అన్వయింప వచ్చును. గురుపత్నితో సంగమ మొనర్చుటయే కళంకము. 4. కుటిల చరత్వమును మెడలోని సర్పమునకు అన్వయింప వచ్చును. సర్పము వంకర టింకరగా నడచుచు కుటిల చరత్వమును కలిగియున్నది. అయినను ఈ నలుగురు శివానుగ్రహమునకు పాత్రులైనారని శ్రీశంకరులు తెలుపుచున్నారు.

నా వద్ద అలాంటి దోషము లేవియును లేవు. కనుక నన్ను కనికరించి కాపాడుము. ఒకవేళ అలాంటి దోషములున్నచో చంద్రుని ఆభరణముగా ధరించినట్లు నన్ను కూడా అనుగ్రహింపుము.

శివా! నీవు ఎంత దయామయుడవు. తండ్రీ! నీ దయయే నాలో వెలిగే ఆశాజ్యోతికి చమురుగా యున్నది. పరమశివా!కళంకము గల వారిని గొప్పవారు దరిజేరనీయరు. నీవు పురుషోత్తముడ వైనను కళంకితులగు వారికి నీ సన్నిధిలో ఆశ్రయము గల్పింతువు. వారి నుద్ధరించే బాధ్యతను స్వీకరింతువు. పూర్వము కామారణ్యములో పరిభ్రమించే దుశ్శీలుడగు రావణాసురుని, అహంకార సాగరములో ఈదులాడే దౌర్భాగ్యుడగు భస్మాసురుడు మొదలగు వారందరు నీ చేత ఉద్ధరించబడిన వారే గదా!

తండ్రీ! సత్యముచే నాకర్షింపబడని వాడనై అన్నపానాది విచిత్ర భోగాలతో కాలము గడిపి, ప్రకోపించే ఇంద్రియాలను స్వాధీన పరచుకోలేక కామారణ్యమున చరించి బ్రతుకును వ్యర్థము చేసుకొని అన్యుల సుఖములను గాంచి, ఓర్వలేక మాత్సర్యమును జూపి ఆంతర్యమున కళంకిత మొనర్చుకొనిన దుర్బలుడను. అట్టి నాకు నీ సామీప్యము లభించే అవకాశమే లేదు. అయినను నీవు దయామయుడవు. నాలాంటి వ్యర్థ జీవులను కూడా కరుణించి కాపాడు చుందువు. అదియే నా ఆశ. నా దోషము లెంచకు తండ్రీ!

భువకేళీ మదిరా మదంబున మహా పాపాత్ముఁడై వీడు న
న్ను వివేకింపఁ డటంచు-నేను నరకార్ణో రాశి పాలైనఁ బ
ట్టవు బాలుండొక చోట నాట చవితోడ న్నూతఁ గూలంగఁ దం
డ్రి విచారింపక యుండునా? కటకటా శ్రీకాళహస్తీశ్వరా!

"హే పరమశివా! శ్రీకాళహస్తీశ్వరా! సంసారార్ణవములో మునిగిన నేను నిన్ను గుర్తింపలేదని నీవు నన్ను కాపాడక యున్నవా? కుమారుడు ఆటల యందలి ఆసక్తితో బావిలో పడిన తండ్రి ఊరకుండునా?" అని శ్రీకాళహస్తీశ్వర శతకము నందు ధూర్జటి మహాకవి వర్ణించినారు.

కనుక దయామయుడైన సదాశివునే మదిలో నింపుకొనవలెను. శివుని పూజించుట అతి సులభము. ఎందుకని? అతడు మన హృదయము నందే యున్నాడు. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

అరహసి రహసి స్వతంత్ర బుద్ధ్యా
వరివసితుం సులభః ప్రసన్న మూర్తిః
అగణిత ఫలదాయకః ప్రభుర్మే
జగ దధికో హృది రాజశేఖరోఽస్తి 70

ప్రసన్నమూర్తిః = ప్రసన్న మూర్తియును, అగణిత = గణింప శక్యముగాని, ఫల = వాంఛితమునకు, దాయకః = దాతయును, ప్రభుః = ప్రభువును, జగదధికః = జగదీశ్వరుడును, రాజశేఖరః = చంద్రశేఖరుడును, మే = నాయొక్క, హృది = హృదయమునందు, అస్తి = కలడు, అరహసి = బహిరంగమునను, రహసి = ఏకాంతమందును, స్వతంత్ర బుద్ధ్యా = స్వతంత్ర బుద్ధితో, వరివసితుం = పరిచర్య గావించుటకు, సులభః = సులభమైనవాడు, భవతి = అగుచున్నాడు.

భావము :- ప్రసన్న వదనుడును, కోర్కెలను దీర్చుటలో అగణిత ఫల ప్రదాతయు, ప్రభువును, జగత్తుకన్న మిన్నయైనవాడు నగు చంద్రశేఖరుడు నా హృదయము నందే దర్శనీయు డగు చున్నాడు. కనుక అతనిని ఏకాంతముగను, బహిరంగము గను, స్వేచ్ఛగాను ఆయనను సేవించు కొనుటకు సులభుడై యున్నాడు.

వ్యాఖ్య

పరమేశ్వరుడు ప్రసన్నమూర్తి, అశాంతి నొసగే అవస్థాత్రయమునకు అతీతుడగుటచే ఆతడు ప్రశాంత మూర్తి. అలజడుల నధిగమించిన సత్తాస్వరూప స్థితి యందుండు వాడగుటచేత బంధముక్తులు అర్థముగాని వాడై అందముతో అలరారుచున్నాడు. అట్టి పరమాత్మ అభీష్టములను అద్భుత రీతులలో తీర్చువాడై యున్నాడు. జగత్తుకన్న మిన్నయైయున్నాడు. అతడు జగదానంద కారకుడు. జగత్తునందు లభించని ఆనందము నొసగు వాడై యున్నాడు.

జగత్తునందు లభించని సుఖము నొసగు సదాశివుని ఎక్కడ దర్శింపవలెను? దివ్యాత్ముడైన మహేశ్వరుడు హృదయ పద్మమున దర్శనీయుడై యున్నాడు.

మహర్షులు అరణ్య ప్రాంతములందు స్థిర నివాసము కలిగినవారై ఏకాంత భక్తులైన పరమ శివుని ధ్యానించిరి. కొందరు సంత్ పురుషులు బహిరంగముగ సంకీర్తనాదులు చేయుచు స్మరించిరి. మరికొందరు కొంత కాలము ఏకాంతములోను, కొంత సమయము బహిరంగముగను వారికి ఇష్టపడు రీతిన స్వేచ్ఛగా ధ్యానించిరి. శివుడు వారందరినీ అనుగ్రహించియే యున్నాడు. ఏకాంత భక్తులైన మహర్షులు గానీ, బహిరంగముగ అర్చించు సంత్ మహాత్ములుగాని, లేదా స్వేచ్ఛగా సేవించెడి గృహస్థులు గాని అందరూ శివానుగ్రహామునకు పాత్రులే. బాహ్యాభ్యంతరముల యందేగాక సర్వత్ర వ్యాపించియున్నవాడు పరమాత్మయే గనుక నీ ధ్యానము ఎక్కడ జరిగినను అతడు అనుగ్రహించుచునే యుండును. కనుక భక్తినికలిగి భగవంతుని పొందవలెను. రాజు రాజ్యలక్ష్మిని పొందునట్లు, భక్తుడు మోక్షలక్ష్మిని పొందవలెను. ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

ఆరూఢ భక్తి గుణ కుంచిత భావచాప
యుక్తై శ్శివ స్మరణ బాణ గణై రమోఘైః
నిర్జిత్య కిల్బిషరిపూ న్విజయీ సుధీంద్ర
స్సానంద మావహతి సుస్థిర రాజలక్ష్మీమ్ 71

సుధీంద్ర = బుద్ధిమంతులలో శ్రేష్ఠుడును, ఆరూఢ = పాదుకొనిన, భక్తి = భక్తి యనెడి, గుణ = అల్లెత్రాటిచే, కుంచిత = వంచబడిన, భావ = అంతఃకరణమును, చాప = ధనుస్సునందు, యుక్తైః = కూర్చబడిన, అమోఘైః = అమోఘములైన, శివ = శివునియొక్క, స్మరణ = స్మరణమను, బాణగణైః = బాణ పుంజములతో, కిల్బిష రిపున్= పాపంబు లనెడి శత్రువులను, నిశ్శేష = శేషము లేకుండా జయించి, విజయీ = విజయుడగుచు, సానందం = ఆనందముతో గూడువట్లుగా, సుస్థిర = సుస్థిరమైన, రాజలక్ష్మీం = రాజ్య లక్ష్మిని, ఆవహతి = పొందును.

భావము :- లోకమునందు వీరుడైన రాజు ధనుర్బాణములతో శత్రు రాజులను జయించి, రాజ్యలక్ష్మిని పొంది సార్వభౌముడగునట్లు, విద్వద్వరిష్ఠుడు ఆరూఢ భక్తిని అల్లెత్రాడుగను,అంతఃకరణమును ధనుస్సుగ సమర్చి, దానియందు శివస్మరణము అను బాణము నెక్కుపెట్టి, పాపములను శత్రువులను జయించి, పరమానందముతో శాశ్వత ముక్తి సామ్రాజ్యమును పొందును.

వ్యాఖ్య

లోకమున రాజైనవాడు శత్రువులను సంహరించినపుడే రాజ్యలక్ష్మిని పొందగలుగును. ధనుర్బాణములను చేబూని శత్రువులను సంహరించి తీరవలెను. అలాగే భక్తుడు కూడా శత్రువులను సంహరించి మోక్షలక్ష్మిని చేపట్టవలెను.

ధనుర్బాణములను ధరించి రాజు శత్రువులను సంహరించునట్లు ఆరూఢ భక్తి యనెడి అల్లెత్రాటితో వంచబడిన అంతఃకరణమను ధనుస్సు నుపయోగించి శివస్మరణ మనెడి బాణముల నుపయోగించి పాపములను జయింపవలెను. పాపము లున్నంతవరకు ముక్తి లభ్యము కాదు. పాప జీవనము అడుగంటినపుడే ముక్తి లభించును.

చిత్తమును శివుని యందుంచి నపుడే పాపప్రక్షాళనము జరుగును. అంతఃకరణ అంతతేలికగా లొంగదు. దానిని ఆరూఢ భక్తి యనెడి అల్లె త్రాటిచే వంచవలెను. భక్తి ద్వారా అంతఃకరణ మెత్తబడును. అలా వంగిన ధనుస్సనెడి అంతఃకరణము ద్వారా నామస్మరణము అనెడి బాణములు ప్రయోగింపవలెను. అప్పుడు పాపమనెడి శత్రువులు నశింతురు. మోక్షమనెడి రాజ్యలక్ష్మి మనకు లభించును.

శివనామ స్మరణము అత్యంత ఉపయుక్తమైన సాధన. నామ స్మరణము వలన మనస్సు అంతర్ముఖమగును. అంతర్భూతమై, అంతరాత్మలో లీనమగును. నామమును మనము పట్టుకొనుట గాకుండా నామమే మనలను పట్టుకొనాలి. మన ప్రయత్నముతో శ్వాస నడచుటలేదు. అంత అప్రయత్నముగా

నామస్మరణము సాగాలి. అప్పుడు మనము నామస్మరణమును విస్మరించలేము. ఇదియే దివ్యజీవనము.

భగవానుడు మనకు దూరంగాలేడు. ఆయనను ఎక్కడో వెతక వలసిన పనిలేదు. బిడ్డ పిలువగనే తల్లి పరుగులిడునట్లు, నీవు ఆర్తితో పిలువగానే భగవానుడు దర్శన మిస్తాడు. బయట నుండి రాడు. అంతర్యము నుండియే వ్యక్తమవుతాడు. అంతర్యములోని భగవానుని ఎలా వ్యక్త మొనర్చవలెను. రాబోవు శ్లోకమును చూడండి.

ధ్యానాంజనేన సమవేక్ష్య తమః ప్రదేశం
భిత్వా మహాబలిభి రీశ్వర నామ మంత్రైః
దివ్యాశ్రితం భుజగ భూషణ ముద్వహన్తి
యే పాదపద్మ మిహ తే శివ తే కృతార్థాః 72

శివ = శివా!, ధ్యానాంజనేన = ధ్యానమను కాటుకచేత, సమవేక్ష్య = లెస్సగా కనిపెట్టి, ఈశ్వరనామ = పరమేశ్వర నామమనెడి, మంత్రైః = ఈశ్వర నామము లనెడి మంత్రములచేత, మహాబలిభిః = మహాబలి యొనర్చి, తమః ప్రదేశం = అజ్ఞానమను స్థలమును, భిత్వా = త్రవ్వి, యే = ఏభక్తులు, దివ్యాశ్రితం = దేవతలచే ఆశ్రయింప బడిన, భుజగ భూషణం = సర్పము నాభరణముగా గలిగిన, తే = నీయొక్క, పాదపద్మం= పాదకమలమును, ఇహ = ఇచ్చట, ఉద్వహంతి = ఎత్తికొనుచున్నారు, తే = వారు, కృతార్థాః = కృతార్థులు.

భావము :- నిధుల నన్వేషించువాడు కన్నులకు కాటుకను పెట్టుకొని, నిధిని కనిపెట్టి, అచ్చట నిధులను రక్షించు దేవతలను పూజించి, త్రవ్వి యానిధిని గొని సంతసించునట్లు, భక్తుడు శివ ధ్యానమను కాటుకతో నీ పాద పద్మములనెడి సిరిని కనుగొని, నీ నామ మంత్రముతో మహాబలి యొనర్చి, అజ్ఞానమనెడి ఆవరణమును తొలగెంచి, దేవతలు ఆశ్రయించునవియు, భుజిత భూషితము నగు నీ చరణ కమలములను గొల్చి జన్మ సాఫల్యముగా పరమానందము ననుభవించును.

వ్యాఖ్య

భూమిలో పాతి పెట్టబడియున్న నిధి నిక్షేపములు కన్నులకు గోచరించవు. వాటిని కనుగొనుటకు కన్నులకు ప్రత్యేకమైన కాటుక నొకదానిని పెట్టుకొనుము. అలాగే శివుని పాదపద్మము లనెడి నిధిని కనిపెట్టవలెననిన ధ్యానమనెడి కాటుకను ధరించవలెను. శివుడు అంతర్యామి. బహిర్ముఖమయ్యే నేత్రములు అంతర్యామియైన శివుని ధ్యానించలేవు.

"ధ్యానం నిర్విషయం మనః"

"మనస్సులోని వృత్తి రహిత స్థితియే ధ్యానము" అని శాస్త్రము తెలుపుచున్నది. నిక్షిప్తమై యున్న నిధిని అంజనము ద్వారా గాంచునట్లు, అంతర్యామియైన శివుని పాదపద్మములను జ్ఞానాంజనము ద్వారా దర్శింపవలెను.

నిధిని దర్శించిన వాడు ప్రథమంగా నిధిని రక్షించు దేవతలను పూజించి ఆ తరువాత భూమిని త్రవ్వును. అలాగా శివ పాదపద్మ సిరిని దర్శించిన వాడు దానిని పొందేందుకు "ఓం నమశ్శివాయ" ఇత్యాది మంత్రోచ్చరణము ద్వారా మహాబలి యొనర్చును.

భూమిని త్రవ్వి, మట్టిని తొలగించి మనుజుడు నిధినిక్షేపములను గ్రహించులాగున, అజ్ఞాన మనెడి ఆవరణమును శివభక్తుడు తొలగించి, శివుని పాదపద్మములను దర్శించును.

నిధి నిక్షేపములు లభించిన వానికి కష్టములు తొలగిపోవును. సుఖము ప్రాప్తించును. శివుని పాదపద్మ సిరిని పొందిన శివభక్తుడు ఉపద్రవములను పోగొట్టుకొనువాడై, పరమానంద స్థితి ననుభవించును. కనుక శివ పాద భజనము సర్వులకు అనివార్యమైన సాధనమై ఉన్నది. ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

భూ దారతా ముదవహ ద్యదపేక్షయా శ్రీ
భూ దార ఏవ కి మత స్సుమతే లభస్వ
కేదార మాకలిత ముక్తి మహౌషధీనాం
పాదారవింద భజనం పరమేశ్వరస్య 73

సుమతే = ఓ మంచి మనసా!, యత్ = దేనియొక్క, ఆపేక్షయా = ఆపేక్షచేత, శ్రీ భూదార ఏవ = లక్ష్మియు, భూమియు, భార్యలుగా గల విష్ణుమూర్తి, భూదారతాం = వరాహ రూపమును, ఉదవహాత్ = దాల్చెనో, కిం = ఏమి? అతః = కనుక, ఆకలిత= అపేక్షితములైన, ముక్తి = ముక్తులనెడి, మహా = గొప్పదియైన, ఔషధీనాం = ఓషధులను, కేదారం = పంటపొలమైన, పరమేశ్వరస్య = పరమేశ్వరునియొక్క, పాదారవింద భజనం = పాదకమల సేవను, లభస్వ = పొందుము.

భావము :- ఓ సుబుద్ధి! శ్రీదేవి భూదేవి లనుభార్యలుగా గలిగిన శ్రీమహావిష్ణువే మహేశ్వరుని పాద దర్శనమునకై వరాహ రూపమెత్తి అనేక బాధల ననుభవించెను. నీవు పరమేశ్వరుని పాదారవింద భజన చేయుము. దాని వలన పంట పొలము నందు ఓషధులు లభించునట్లు సాలోక్యాది ముక్తులు లభించును.

వ్యాఖ్య

ప్రపంచములో దేనినైనను పొందవచ్చును. పొంద శక్యము గానిది పరమేశ్వర పాద పద్మములే. నిత్యమైన శివ పాదార విందమును పొందక ప్రపంచమున ఎన్ని లభించినను అవి అనిత్యములే. దుఃఖ దాయకములే. మనిషి అభిలషించు నిత్య సుఖము వస్తువులయందు, విషయముల యందు లభ్యము కాదు.

శ్రీహరికి శ్రీదేవి, భూదేవి అను ఇరువురు భార్యలు. వస్తువులను భూదేవి సమకూర్చగలదు. ధనమును శ్రీదేవి అందించగలదు. అయినను విష్ణుమూర్తి శివుని పాద దర్శనమునకై పరితపించెను. వరాహావతార మెత్తి పడరాని శ్రమ ననుభవించెను. విత్తము,వస్తువులు ఇవ్వలేని పరమోత్కృష్టము లైనందుననే

ఆతడు అలా శ్రమించెను. కనుక పరమశివుని పాదారవింద దర్శనమునే వాంఛింప వలెను.

అమృతమయమైన ఓషధులు పంట పొలములో లభించునట్లు, అమృతానందము నొసంగెడి సామీప్యాది చతుర్విధ ముక్తులు పరమశివుని పాద పద్మముల చెంత లభించును.

పాదారవిందమే ఆధారమని నేను
పట్టితి పట్టితి పట్టితి నీ దివ్య
చరణములే నమ్మితి - రామా

అని భద్రాచల రామదాసు భగవత్పాదారవింద దర్శన వైభవమును కీర్తించియున్నాడు. ఈశ్వర పాదారవింద దర్శనము హృదయములో ఏ విధమైన ప్రభావమును జూపును? ఈ విషయములను తరువాత శ్లోకము వివరించును.

ఆశాపాశ క్లేశ దుర్వాసనాది
భేదోద్యుక్తై ర్దివ్యగంధై రమన్దైః
ఆశాశాటీకస్య పాదార విందం
చేతః పేటీం వాసి తాం మే తనోతు 74

ఆశాశాటీకస్య = దిగంబరుడైన ఈశ్వరునియొక్క, పాదారవిందం = పాదపద్మము, మే= నాయొక్క, చేతఃపేటీం = చిత్తమను పెట్టెను, ఆశపాశ = ఆశ యనెడి పాశమును, క్లేశ = క్లేశము, దుర్వాసనాది = చెడ్డ సంస్కారములను, భేద = భేదించుటయందు, ఉద్యుక్తైః = ఉద్యుక్తములైన, అమందైః = కొలదిగాని, దివ్యగంధైః = దివ్యమైన పరిమళములచేత, వాసితాం = వాసనగల దానిగా, తనోతు = చేయుగాక !

భావము :- దిగంబరుడైన ఈశ్వరుని యొక్కపాదారవిందము నా హృదయ పేటిక యందలి ఆశాపాశములు, పంచ క్లేశములు అనెడి దుర్వాసనలను పోగొట్టి చక్కని సువాసనలతో నింపుగాక. పరమ శివుని పాదారవిందములు నా హృదయము నందు ఎడ బాయ కుండు గాక!

వ్యాఖ్య

మనుజుని చిత్తమనెడి పెట్టెలో ఆశలనెడి దుర్గుణములు చోటు చేసుకొని, బ్రతుకుకు చేటు చేయుచున్నవి. కాటేసే ఈ ఆశలను వాటేసు కోకుండా బ్రతుకును కాపాడుకోవాలి. సమస్త క్లేశములకు ఆశయే కారణమై యున్నది. వయస్సు గతించినా ఆశ నశించదు. ఆశా రాక్షసి అనుక్షణము కోఱలు చాచి బ్రతుకును కాటేస్తూనే వుంటుంది. ఆశకు అంతము లేదు.

చిత్తమనెడి పేటిక పంచ క్లేశములతో కూడి యున్నది. ఆశ, అవిద్య, రాగము, ద్వేషము, అస్మిత అను పంచక్లేశము లున్నవి. ఇవియే దుర్గుణములు. భగవంతుని పాదారవిందమును చిత్తమున ధరించినచో దుర్గుణములు పారి పోవును. పరమ శివుని పాద పద్మముల నుండి కదిలెడి పరిమళమను సద్వాసన చిత్తపేటికను గుభాళింప జేసి బ్రతుకును తేజోవంత మొనర్చును.

ఈ శ్లోకమునందు పరమశివుని దిగంబరుడని స్తుతించడము జరిగినది. దిక్కులే అంబరముగా గల వాడగుటచే శివుడు దిగంబరుడాయెను. పాపములను నశింపజేయు దివ్యపాదారవిందమును గల దిగంబరుడు పరమ శివుడు అనెడి ఈ శ్లోకమునే ధూర్జటి మహాకవి తమ శ్రీకాళహస్తీశ్వర శతకమునందు 97వ పద్యమున తెలిపినాడు.

కాల ద్వారకవాట బంధనము దుష్కాల ప్రమాణ క్రియా
లీలా జాలక చిత్రగుప్త ముఖ వల్మీకోగ్ర జిహ్వోద్ధృత
వ్యాళ వ్యాళ విలోధి మృత్యుముఖ దంష్ట్రాహార్య వజ్రంబు-ది
క్చేలాలంకృత! నీదు నామ మరయన్ శ్రీకాళహస్తీశ్వరా!

"దిగంబరా! నీ దివ్యనామము కలిదోషములను, పాపములను, మృత్యు భయమును, నరక భయమును పోగొట్టును" అని భావము. దిగంబరుడను మాటను "ఆశా శాటీకస్య" అని శ్లోకము పలుకగా, "దిక్చేలాలంకృత" యనెడి పదమును పద్యము తెలిపెను.

తన హృదయము నందు ఈశ్వర పాదారవిందము యుండుగాక యని ప్రస్తుత శ్లోకమున తెలిపిన ఆచార్యులు తమ చిత్తమును అంగీకరించ మని తరువాత శ్లోకమున పరమశివుని ప్రార్థించు చున్నారు.

కల్యాణినం సరసి చిత్రగతిం సవేగం
సర్వేంగి తజ్ఞ మనఘం ధ్రువలక్షణాఢ్యమ్
చేతస్తురంగ మధిరుహ్యా చర స్మరారే
నేత స్సమస్త జగతాం వృషభాధి రూఢ 75

వృషభాధి రూఢ = నంది వాహనారూఢుడా!, సమస్త జగతాం = సకలలోకములకు, నేతః= నాయకుడా!, స్మరారే = కామవైరీ, కల్యాణినం = కళ్యాణ లక్షణములు గల, సరస చిత్రగతిం = సరసమైన చిత్ర నడకలు గలదియు, సవేగం = వేగముతో గూడినదియు, సర్వ = సర్వులయొక్క, ఇంగితజ్ఞం = అందరి ఇంగితములు నెఱింగినదియు, అనఘం= నిర్దుష్టమైనదియు, ధ్రువ లక్షణాఢ్యం = స్థిరమైన లక్షణములు గలదియు, చేతస్తురంగం= చిత్తమను గుఱ్ఱమును, ఆరుహ్యా = ఎక్కి, చర = చరింపుము.

భావము :- వృషభ వాహన! జగన్నాయకా. నా మనస్సొక శుభలక్షణములు గల మంచి గుఱ్ఱము. అది సలక్షణ మైనది. సరసమైనది. చిత్ర విచిత్రములగు నడకలు గలది. వేగముతో కూడినది. అందరి ఇంగితముల నెరింగినది. పాపరహితమైనది. కావున నా మనస్సను మంచి గుఱ్ఱము నధిరోహించి చరింపుము.

వ్యాఖ్య

మనస్సును సంపూర్ణముగా భగవంతునికి సమర్పించి తృప్తి చెంద వలెనని భావించు భక్తుని ఆంతరంగిక ప్రార్థనను శ్రీశంకరులు ఈ శ్లోకము నందు అందించుచున్నారు. సదాశివుడు వృషభ వాహనుడు. స్వారిచేయుటకు, పయనించుటకు వృషభము కన్నను గుఱ్ఱము చాలా మెఱుగనియు, అట్టి గుఱ్ఱము తన వద్ద కలదనియు, దానిని స్వీకరింప వలసినదనియు శ్రీ శంకరులు భక్తుని ఆర్తిని వివరించు చున్నారు.

ఈ శ్లోకమునందు భక్తుని చిత్తము గుఱ్ఱముతో పోల్చబడినది. అది పంచ కళ్యాణి. పంచేంద్రియముల నాధారముగా గొని విషయ ప్రపంచమున లభించే శబ్దాది విషయములను అనుభవించునది యైనందున దానికి పంచ కళ్యాణి యనెడి పేరు వచ్చినది. ఇది చక్కని లక్షణములను కలిగి యున్నది. పుష్టిగా ఆలోచనలను సాగించ గలదు. సంతుష్టిగా జపధ్యానాది కార్యములను నిర్వహించగలదు. అనేక విషయములకు సంబంధించిన విజ్ఞానము దాని కున్నది. సరసమైనది. వృషభము వలెగాక గుఱ్ఱము నాట్యము కూడా చేయును. నటనలు ప్రదర్శించును.

వాయువు కన్నను వేగముగా పరుగులిడును. అతి శీఘ్రముగా గమ్యమును చేర్చును. ఆంతర్యములను పరిశీలించుచు ప్రవర్తించును. ఏ పాపము ఎఱుగదు. పాపరహితమైన మనస్సే శివుని మోయుటకు అర్హత గలది యగును. కనుక సల్లక్షణమైన తన మనస్సనెడి అశ్వము శివుని వాహనమైన వృషభము కన్నను యోగ్యమైనది యని తెలుపుతూ అట్టి చిత్తాశ్వముపై విహరింపుమని శివుని వేడుకొను చున్నాడు. శివుని మోసెడి చిత్తమునకే ఆనందము లభించును. ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

భక్తి ర్మహేశ పదపుష్కర మావసంతీ
కాదంబినీవ కురుతే పరితోష వర్షమ్
సంపూరితో భవతి యస్య మన స్తటాక
స్తజ్జన్మసస్య మఖిలం సఫలం చ నాన్యత్ 76

భక్తిః = భక్తి, మహేశ = మహేశ్వరుని యొక్క, పదపుష్కరం = పాదరూపమైన ఆకాశమున, ఆవసంతీ = స్థిరముగా నున్నదియై, కాదంబినీవ = మేఘమును బోలిన, పరితోష = ఆనందమనెడి, వర్షం = వృష్టిని, కురుతే = కలిగించుచున్నది, యస్య = ఎవనియొక్క, మనస్తటాకః = మనస్సను చెఱువు, సంపూరిత = పూరింపబడినది, భవతి= అగునో, తజ్జన్మ సస్యం = వాని జన్మమను పైరు, అఖిలం = పూర్ణముగ, సఫలం= ఫలవంతమైనది, తదితరంచ = అదిగాక తక్కినిది మాత్రము, న = కాదు.

భావము :- భక్తి మేఘమాలవలె మహేశ్వరుని పాదపద్మంబను ఆకాశమున వ్యాపించినదై ఆనంద వర్షము కురియును. ఎవని మనస్సు అనెడి తటాకము ఆ జలముతో పూరింపబడునది అగునో అట్టి వాని జన్మమనెడి పైరు పూర్ణముగా సఫలమైనది. అలాకానిది మాత్రం కానేరదు.

వ్యాఖ్య

మేఘము గగనమున వ్యాపించి, వర్షము కురియు చుండును. అలాగే భక్తి యనెడి మేఘము ఈశ్వర పాదార విందమను గగనమున వ్యాపించి యున్నది.

సూర్యుడు సాగరమును ఉడికించినపుడే మేఘము పుట్టును. జ్ఞాన భాస్కరుడు హృదయ సాగరమును ఉద్దీపింపజేసినపుడే భక్తి యనెడి మేఘము జనించును. మేఘము జలపూర్ణము. భక్తి ప్రేమ మయము. మేఘము దేనిమీదను ఆధారపడక చరించును. భక్తి కూడా స్వయముగా సరళముగా నడక సాగించును.

"స్వయం ఫలరూపతేతి బ్రహ్మకుమారాః"

"భక్తి స్వయం ఫల రూపమై ఉన్నదని" బ్రహ్మ మానస పుత్రులగు సనక సనందనాది మహర్షులు తెలిపినట్లు నారద మహర్షి భక్తి సూత్రాలలో తెలుపుతాడు.

మేఘము ఎత్తున చరించును. భక్తి యనెడి మేఘము విషయ ప్రపంచ వాసనల నధిగమించి ఎత్తున సంచరించును.

మేఘము ఆకాశమున చరించును. భక్తి యనెడి మేఘము పరమేశ్వర పాదం బనెడి గగనమున సంచరించును. ఆకాశము అనంతము. అమృత రూపమైన శంభుని పాదారవిందము కూడా అనంతము.

"పాదోఽస్య విశ్వాభూతాని త్రిపాదస్యామృతందివిః"

"భగవానుని ఒక్కపాదము మాత్రమే విశ్వముగా వ్యక్తముకాగా, మిగిలిన మూడు పాదములు దివినందు అమృత రూపమున ఉన్నవి" అని పురుష సూక్తము తెలిపినది.

చల్లని గాలికి మేఘము వర్షించును. కథా శ్రవణ మనెడి చల్లని గాలికి భక్తి మేఘము వర్షించును. వర్షించిన మేఘము తటాకములను నింపి, ఆ జలమును ప్రక్కనే యున్న పంట పొలములకు అందునట్లు చేయును. తటాక జలము నాధారముగా గొని భూమి సాగు చేయబడి ఫలసాయము నందించును. అలాగే ఎవని హృదయము భక్తి యనెడి మేఘము వర్షించెడి ఆనంద జలముతో నిండిపోవునో అట్టివాని జన్మ సాఫల్యము నొందినదని భావము. తటాకము తాను పూర్ణమగుటయే గాక ప్రక్కన యున్న పొలములను కూడా పండించినది. భక్తి వలన భక్తుని ఆంతర్యము శుద్ధియగుటయే గాక ఆ బుద్ధి పరిసరములను కూడా ప్రభావితమొనర్చును. భక్తి కలిగిన బుద్ధి పరమాత్మ స్మరణము, సేవనములేక మనుగడను సాగించలేదు. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

బుద్ధి స్థ్సిరా భవతు మీశ్వర పాదపద్మ
సక్తా వధూ ర్విరహణీవ సదాస్మరంతి
సద్భావనా స్మరణ దర్శన కీర్తనాది
సమ్మోహితేవ శివమంత్ర జపేన వింతే 77

ఈశ్వర = పరమేశ్వరా!, విరహణీ = విరహమునందున్న, వధూరివ = వధువువలె, పాద పద్మ సక్త = నీపాద పద్మములయందాసక్తి గలది, సదా = ఎల్లప్పుడును, స్మరంతి = స్మరించుచున్న, బుద్ధిః = బుద్ధి, శివమంత్ర జపేన = శివ మంత్ర జపము చేత, సమ్మోహితేవ = మోహపడినది యగుచు, స్థిరా = స్థైర్యము గలిగి, భవతు = అగుట, సత్ = సత్య రూపమైన, భావనా = ధ్యానము, స్మరణ = స్మరణము, దర్శన = దర్శనము, కీర్తన = కీర్తనము, ఆది = మొదలగు వానిని గూర్చి, వింతే = విచార పడుచున్నది.

భావము :- పరమేశ్వరా! నీ చరణ కమలముల యందు ఆసక్తి కలిగిన నా బుద్ధి యనెడి భార్య, భర్తృ వియోగమును పొందిన భార్యవలె ఎల్లప్పుడు "శివ" యనెడి

నీమంత్రమును జపించుచు, స్థైర్యము నొందుటకై నిన్ను ధ్యానించుచు, స్మరించుచు, దర్శించుచు, కీర్తించుచు సదా విచారము నొందు తున్నది.

వ్యాఖ్య

భర్త యందు గాఢానురక్తి గల భార్య భర్తృ వియోగము భరించ లేక బాధపడుచుండును. భర్త యందు అత్యంతాసక్తి కలిగి యుండుటచేత ఇతర విషయముల యందు అనురక్తి లేనిదియై అన్యరాగ విస్మారణ మొందుచున్నది. ఏ పనివి చేయను నిచ్చగించక, అన్యచింతలను వదలి సదా భర్తను గూర్చియే చింతించు చుండును. సదా అతని నామము నందే అభిరుచి గలిగియుండును. మనస్సు ఎల్లప్పుడు భర్తను గూర్చియే చింతించు చుండును. మరియొక స్మరణ ఆ మనస్సునకు తెలియకుండును. పలుక వలసి వచ్చినచో భర్త యొక్క విషయమునే ముచ్చటించు చుండును. దర్శింప వలసి వచ్చినచో భర్త యొక్క చిత్రపటమునే దర్శించును.

ఇచ్చట భక్తుని బుద్ధి భర్తృ వియోగము నొందిన భార్యతోను, ఈశ్వర పాదారవిందమును భర్తతోను పోల్చడము జరిగినది. భర్త భార్య యొక్క అవసరములను దీర్చుచు భరించునట్లు, భగవానుడు భక్తుని బరువులను తగ్గించి ఉద్ధరించును. భక్తుని మనస్సు సదా భగవంతుని గూర్చియే చింతించు చుండును. పరమ విరహాసక్తితో యుండును. సదా భగవానుని నామమునే జపించుచుండును. సదా భగవంతుని గూర్చియే ధ్యానించు చుండును. పరమాత్మనే స్మరించు చుండును. అందరిలోను పరమాత్మనే దర్శించు చుండును. భాషణము అవసరమైనచో, పరమాత్మను గూర్చియే భాషించును. సదా భగవద్వియోగములో విచారము నొందు చుండును.

విరహ భక్తి అత్యంత గణనీయమైనది. గట్టున విసిరి వేయబడిన చేపవలె పరితపించు విరహ భక్తులు ధన్యజీవులు. గోపికల పరమోత్కృష్టమైన ప్రేమ భక్తిలోని విశేష మదియే. అందుచేత విరహ భక్తిని గూర్చిన ప్రస్తావనలో సదా గోపికలనే ఉదహరిస్తూ ఉంటారు.

"యథా వ్రజ గోపికానాం"

"గోపికల భక్తియే ఆదర్శ విరహభక్తి" యని నారదమహర్షి భక్తి సూత్రాలలో వివరించినారు. తన బుద్ధిని విరహిణియైన వధువుతో పోల్చిన శ్రీశంకరులు రాబోవు శ్లోకమునందు వధువు కుండవలసిన సల్లక్షణములను గూర్చి వివరించు చున్నారు.

సదుపచార విధి ష్వనుబోధితాం
స వినయాం సుహృదం సముపాశ్రితాం
మమ సముద్ధర బుద్ధి మీమాం ప్రభో
వరగుణే నవోఢ వధూమివ 78

ప్రభో = ప్రభువా!, సత్ = సత్యరూపమైన, ఉపచార విధిషు = ఉపచార విధుల యందు, అనుబోధితాం = చక్కని శిక్షణ పొందినదియు, సువినయాం = విధేయ మైనదియు, సుహృదం = శుద్ధమైన హృదయము కలదియు, సదుపాశ్రితాం = చక్కని ఆశ్రయము గలదియు, మమ = నాయొక్క, ఇమాం = ఈ, బుద్ధిం = బుద్ధిని, వర = శ్రేష్ఠమైన, గుణ = గుణముచే, నవోఢ వధూమివ = క్రొత్తగా వివాహమైన భార్యవలె, సముద్ధర= ఉద్ధరింపుము.

భావము :- ప్రభూ! సత్యమగు మీ పాద పద్మములకు సేవ లొనర్చుట యందు చక్కని శిక్షణ గలదియు, విధేయురాలును, నిర్మలమైన హృదయము గలదియు, మంచి ఆశ్రయము గలదియు, సర్వలక్షణ సంపన్నురాలును అగు నా యొక్క బుద్ధి యనెడి నూతన వధువును ఉద్ధరింపుము..

వ్యాఖ్య

నూతన వధువు యొక్క జీవితము అతి విచిత్రముగా ఉండును. భార్యగా నుండుటకు వలయు లక్షణము లన్నియు ఆవిడ కలిగియుండును. ఇంటిని శుభ్రపరచుకొనుట, అత్తమామలను గౌరవించుట, అతిథులను సత్కరించుట భర్తకు సేవ చేయుట ఇత్యాది సల్లక్షణములను కలిగియుండును.

ఇలా శిక్షణ పొంది వచ్చిన వధువు గృహస్థ జీవనములో అడుగిడగనే గృహకృత్యములను సక్రమముగా నిర్వహించ గలుగుదునో లేనో, భర్తను ఆనందింప జేయుదునో, లేనో అని సందేహ పడుచుండును. అత్తటి సుగుణ వంతుడైన భర్త పాలించబోయే ముందు భార్యను లాలించి, ఆమెను ఉద్ధరించును. కొంతకాలము భర్త ప్రేమలో చరించిన పిమ్మట తనకు తానుగా గృహ కృత్యములను నెరవేర్చుకొనుటయే గాక నూతనమైన అవగాహనతో చరించి భర్తను సుఖపెట్టును.

ఈ శ్లోకము నందు సాధకుని బుద్ధి నూతన వధువుతో పోల్చబడినది. ఈ బుద్ధి పూజాది విషయములయందు చక్కని శిక్షణ పొందియున్నది. పెద్దలయెడ విధేయురాలై యున్నది. రాగద్వేషములనుండి విడిపడినదియై నిర్మలమైన హృదయమును కలిగియున్నది. అన్యాశ్రయములను త్యజించి అనన్య చిత్తముతో భగవామునే ఆశ్రయించి యున్నది. అమానిత్వాది సద్గుణములను నింపుకొని సర్వలక్షణ సంపన్నురాలై యున్నది. అనగా సాధకుడు ధ్యానమును సాగించుటకు ముందు ఏర్పరచు కొనవలసిన సుగుణములను, సదాచార జీవనమును పొంది యున్నాడని భావము. ఈ అర్హతను కలిగిన సాధకుని బుద్ధి యనెడి వధువు ధ్యానము యొక్క ఆసనమనెడి పెళ్ళి పీటలపై పరమాత్మ యనెడి భర్తకు అంకితమైనది.

అంకితమైన బుద్ధి ఆంతరంగిక దాసి యైనది. తనను ముస్తాబు చేసిన సదుపచారము లనెడి బాహ్యము నందలి బంధువులను, చెలికత్తెలను వదలి పెట్టింది. ఒంటరిగా ఆత్మార్పణ యనెడి క్షీరపాత్రను చేతిలో పట్టుకొని, "అద్వేష్టా సర్వభూతానాం" ఇత్యాది సుగణ పరిమళములతో, ఆనందాతిశయము కదలికను నిరోధించుచుండ, కుదరని ధ్యాన మనెడి తడబడు అడుగులతో, హృదయ శయ్యపై ఆసీనమై, దేదీప్య మానంగా శోభించుచున్న భర్త యనెడి పరమాత్మను కలుసుకొనేందుకు తరలివచ్చింది.

తన వంతు పూర్తి చేసుకొని సమీపించిన వధువుపై దృష్టిని సారించిన వరుడు ఆమెను స్పృశించుట యనెడి ప్రశాంత స్థితి నందించడము జరిగినది.

భయానందము అనెడి మిశ్రమ భావాలతో మది పులకరించగా బుద్ధి యనెడి పతి భర్త యనెడి ఈశ్వరుని పాద పద్మములపైబడి "ప్రభూ! నన్ను ఉద్ధరింపుము" అని పలికినది. కృప జూపిన పతి ఒడిలో తన్మయత్వముతో ఒదిగిపోయినది.

ఇదొక ఆధ్యాత్మిక శృంగార విలాసము. ఓ పాఠక మహాత్ములారా! ఏమిటి మీ ధర్మ సందేహాలు? అంతటితో ఆపండి చాలు. శోభన గది తీరు ఈ బాబు కెలా తెలుసు? అంతేనా! నన్ను సాధారణంగా మా భక్తులు కొందరు అడుగుతూ ఉంటారు. "స్వామీజీ! మా ఇళ్ళల్లో జరిగే వింతలన్నీ మీరు చెప్పేస్తూంటారు. మీకెలా తెలుస్తాయి?" అని. నేను నవ్వుతూ అంటుంటాను: "భార్యచే తిట్లు తిన్న భర్త ముఖాన్ని గుర్తించ లేనంత దద్దమ్మలా సాధువులు? మీ ముఖకవళికలు "కమాండ్స్" ఇస్తుంటాయి. మేము చక్కని కంప్యూటర్ వలె ప్రదర్శిస్తూంటాము" అని.

చావును చెప్పేందుకు మనిషి చావ నవసరములేదు. వైద్యము చేసేందుకు వైద్యుడు రోగి కానవసరములేదు. తిక్క అర్థమయ్యేందుకు తిక్క పట్ట వలసిందేనా? ఈ తికమకలు ముప్పుతిప్పలు పెట్టేవే గాని ముందుకు నడిపేవి కావు. కన్ను చెడనంత కాటుక కంటికి ఎప్పుడూ ఆరోగ్యమునే ఇస్తుంది.

ఈ గ్రంథ కర్త పరమహంస పరివ్రాజకాచార్యులు, అనుభవ వేదాంత విద్వద్వరిష్ఠులైన శ్రీశంకరులు. పరమాత్మ వారిపై వర్షింప జేసిన కృపా వృష్టిలో ఒక బిందువు ఈ కలమును కదిలించే దీనుడిపై పడితే అసాధ్యమేదియును ఉండదు.

బుద్ధి యనెడి వధువు సాధన చతుష్టయ సంపద యనెడి శిక్షణను పొంది, పరమాత్మ యనెడి వరుని వరించి, ధ్యానాసన మనెడి వివాహ వేదికపై పరిణయమాడి, హృదయ శోభన గదిలో పరమాత్మ యనెడి భర్తను ఏకాంతముగా కలుసుకొనే అపూర్వ స్థితిలో భయానందము లనెడి మిశ్రమ భావాలు మదిని కదిలించుచున్న అనూహ్యా పరిస్థితులలో "నాథా! నన్ను ఉద్ధరింపుము" అని నిస్సంకల్ప ఒడిలో బుద్ధియనెడి వధువు వాలిపోయింది.

కళ్ళు మూతబడినవి. మూతబడిన నేత్రములను బుద్ధి యనెడి వధువు తెరువలేకున్నది. భర్త పాదము లెక్కడ యున్నవో గోచరించుట లేదు తెలుపమని భర్తనే అడుగుచున్నది. ఈ విషయమును రాబోవు శ్లోకమునందు చూచెదము.

నిత్యం యోగి మనస్సరోజ దళ సంచార క్షమస్త్వత్క్రమ
శ్శంభో తేన కథం కఠోర యమరాడ్వక్షః కవాట క్షతిః
అత్యంతం మృదులం త్వదంఘ్రి యుగళం హా మే మనశ్చింతయ
త్యేతల్లోచన గోచరం కురు విభో హస్తేన సంవాహయే 79

శంభో = శివా, త్వత్క్రమః = మీ పాద విన్యాసము, నిత్యం = ఎల్లప్పుడు, యోగిమనః= యోగుల యొక్క మనస్సనియెడి, సరోజ = పద్మము యొక్క, దళ = రేకులతో, సంచార= సంచరించుట యందు, క్షమః = సమర్థమైనది, తేన = అట్టిదానితో, కఠోర= మిక్కిలి కఠిన మైన, యమరాట్ = యమ ధర్మరాజు యొక్క, వక్షః కవాట = తలుపువంటి రొమ్ముయొక్క, క్షతిః = భేదనము, కథం = ఎట్లు? అత్యంతం = మిక్కిలి, మృదులం= కోమలమైన, త్వత్ = నీ యొక్క, అంఘ్రియుగళం = పాదద్వయమును గూర్చి, మే= నాయొక్క, మనం = మనస్సు, చింతయతి = చింతించు చున్నది. హా = అయ్యో!, ఏతత్ = ఈ పాద యుగ్మము, లోచన = కన్నులకు, గోచరం = కనబడునట్లు, కురు= చేయుము, హస్తేన = చేతితో, సంవాహయే = ఎత్తి పట్టెదను.

భావము :- పరమ శివా! యోగుల మానసములందు సంచరించు కోమలమైన మీ పాదపద్మములతోనా యముని రొమ్మును తన్నుట! ఆహా!....ఎంత మృదులమైనవి నీ పాద పద్మములు . నా మనస్సు మిక్కిలి చింతించు చున్నది. తండ్రీ! నీ పాద పద్మములను నా లోచనములకు అగుపడునట్లు చేయుము. నా హస్తముతో వాటిని పట్టి యెత్తెదను.

వ్యాఖ్య

నూతన వధువువైన భక్తుని చిత్తము పతియై, గతియై జీవిత సర్వస్వమైన పరమేశ్వరుని పాదారవింద సేవనమునకు కుతూహలపడు చున్నది. పాదములను ఒత్తెడి భాగ్యమును కల్పించమని యాచించు చున్నది.

పరమశివుని పాదములు గోచరించుట లేదని తెలుపుటలో సత్యమును నేత్రములు దర్శింప లేవని భావము. తమకు గోచరించని ఆ దివ్య పాదారవిందములు ముని మానసముల యందు చరించు చున్నవని తెలుపు తున్నారు. అట్టి పాదములను తనకు గోచరించునట్లు జేయుమని ప్రార్థించుట అంతర్యములో జ్ఞానోదయ మగునట్లు జేయుమని ప్రార్థించుటయే అగుచున్నది.

ముని మానసములందు చరించెడి పరమశివుని పాదములు యముని కర్కశ హృదయమును తన్నుట వలన కందిపోయిన వేమో యని చింతించు చున్నారు. ఇది పవిత్రమైన భక్తి తత్త్వములో పరాకాష్ఠగా యున్నది. సదాశివుని కోమల పాదయుగ్మమునకు బాధ కలిగినదని వ్యథ చెందుతూ వాటిని దర్శించి, సేవించే భాగ్యమును కల్పించమని ప్రార్థించు చున్నారు.

దర్శించుట యనునది అంతర్యమునకు సంబంధించిన విషయమైనందున సేవించుట ఎచ్చట జరుగవలెను? అంతర్యములో సేవ జరిగేందుకు వీలు లేనందున బాహ్యమునందే జరుగవలెను. జగత్తునకు సేవ చేయుటయే జగదీశ్వరుని సేవగా భావింపవలెను.

ముని మానసముల యందు చరించు పరమేశ్వరుడు తన అంతర్యములో ఏల దర్శనీయుడు కాడు? ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

ఏష్యత్యేష జనిం మనోస్య కఠినం తస్మిన్నటానీతి మ
ద్రక్షాయై గిరిసీమ్ని కోమల పదన్యాసః పురాభ్యాసితః
నోచే ద్దివ్య గృహాంతరేషు సుమన స్తల్పేషు వేద్యాదిషు
ప్రాయస్సత్సు శిలా తలేషు నటనం శంభో కిమర్థం తవ 80

శంభో = శివుడా!, ఏషః = వీడు, జనిం =పుట్టుకను, ఏష్యతి = పొందబోవు చున్నాడు, అస్య = వీనియొక్క, మనః = మనస్సు, కఠినం = కఠోరమైనది, తస్మిన్ = దానియందు, అటాని = చరింప వలసిన వాడను, ఇతి = అని, మద్రక్షాయై = నన్ను రక్షించుట కొరకు, కోమల = మృదువైన, పదన్యాసః = పదము లిడుట, గిరిసీమ్ని = పర్వత

ప్రదేశమందు, పురా = పూర్వము, అభ్యాసితః = అభ్యాసము చేయబడినది, నోచేత్= అట్లు కాదేని, దివ్యగృహాంతరేషు = రమ్యమైన గృహముల యొక్క మధ్యప్రదేశములును, సుమన స్తల్పేషు = పూల పాన్పులును, వేద్యాదిషు = అరుగులు మొదలగునవి, ప్రాయః= ఎక్కువగా, సత్సు = ఉండగా, శిలా తలేషు = రాతి నేలలయందు, తవ = నీయొక్క, నటనం = నాట్యము, కిమర్థం = దేనికొఱకు?

భావము :- హే సదాశివా! "వీడు భూమిలో పుట్టగలడు. కఠినమైన వీడి హృదయములో సంచరింప వలసి యుండును" అని నన్ను గూర్చి ఆలోచించి నేను పుట్టకముందే నన్ను రక్షించుటకు కొండలమీద నీ కోమల పాదములతో నడుచుట కలవాటు చేసుకొంటివి. లేనిచో మిద్దెలు, మేడలు, పూలపాన్పులు, మంచి మంచి యరుగులు నుండగా నీకేల యీ రాళ్ళమీద నాట్యము చేయవలసి వచ్చినది?

వ్యాఖ్య

"హే పరమేశ్వరా! సదాశివా! నీవు కొండల మీద సంచరింప వలసిన అగత్యమేమున్నది? కుసుమ కోమలమైన నీ చరణ కమలములు ఎంతగా కందిపోయినవియోగదా! మిద్దెలు, మేడలు, రత్నఖచిత పాన్పులు, పూల పాన్పులు, నీ కొరకు ఎదురు చూచుచుండగా కర్కశమైన రాళ్ళలో చరించవలసిన గతి నీకు ఎందులకు పట్టినది?" అని భక్తుడు ప్రశ్నించుచున్నాడు.

"ఈశ్వర స్సర్వభూతానం హృద్దేశేర్జున తిష్ఠతి"

"సమస్త భూతముల హృదయాలలో పరమాత్మ వసించు చుండును" అని శ్రీకృష్ణుడు గీత యందు తెలిపి యున్నాడు. కనుక ఈశ్వరుడు అందరి హృదయాలలో వసింప వలసి యుండును.

"శివా! నేను కఠినాత్ముడను. కర్కశ హృదయుడను. శిల వంటి నా హృదయములో నీవు వసించవలసి యున్నది. అది నీకు చాలా కష్టముగా యుండును. అందుకని రాబోయే కరువు తెలియగానే ముందు నిలిచియున్న ఆపదను ఊహించుకొని మనుజులు ఒక్కపూట భుజించునట్లు కర్కశమైన నా

హృదయములో నివసించుటకు గాను నీవు కొండలపై చరించుటను అభ్యాసమొనర్చు కొంటివి.

ఈ విధముగా ప్రార్థించుటలో శ్రీశంకరుల వారి ఆంతర్యము, అభ్యర్థన మనకు అవగతమగుచునే యున్నది. భక్తుడైన వాడు కర్కశ హృదయుడు కారాదు. బండరాతి గుండెలలో నివసించుట పరమాత్మకు కూడా కష్టమే. కనుక హృదయములో పరమాత్మను దర్శింపగోరు భక్తుడు హృదయమును సున్నిత మొనర్చుకొనవలెను. కారుణ్య ప్రేమలతో అంతఃకరణమును మృదులముగ పదిల పరచుకొనవలెను. అట్టివాడు శివుని ఆరాధించి ధన్యుడగును. ఎట్టివాడు ధన్యుడు? ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

కంచిత్కాల ముమామహేశ భవతః పాదార విందార్చనైః
కంచి ద్ధ్యాన సమాధిభిశ్చ నతిభిః కంచి త్కథా కర్ణనైః
కంచి త్కంచి దవేక్షణై శ్చ నుతిభిః కంచి ద్దశా మీదృశీం
యః ప్రాప్నోతి ముదా త్వదర్పితామనా జీవన్ సముక్తః ఖలు 81

ఉమా మహేశ = ఉమా మహేశ్వరా!, కంచిత్కాలం = కొంతకాలము, భవతః = నీయొక్క, పాదారవింద = పాదపద్మముల, అర్చనైః = అర్చనల తోడను, కంచిత్ = కొంతసేపు, ధ్యానసమాధి భిశ్చ = ధ్యానసమాధుల తోడను, కంచిత్ = కొంతసేపు, నతిభిః = నమస్కారముల తోడను, కంచిత్ = కొంతసేపు, అవేక్షణైశ్చ = దర్శనముల తోడను, కంచిత్ = కొంతసేపు, నుతిభిః = స్తోత్రముల తోడను, ముదా = సంతోషముతో, త్వదర్పిత = నీయందు నిలుపబడిన, మనాః = మనస్సుగలవాడై, ఈ దృశీం = ఇట్టి, దశాం = స్థితిని, యః = ఏ పురుషుడు, ప్రాప్నోతి = పొందుచున్నాడో, సః = వాడు, జీవన్ = జీవించి యుండగనే, ముక్తఃఖలు = మోక్షము పొందిన వాడగును గదా!

భావము :- ఉమా మహేశ్వరా! నీయందు చిత్తము నుంచి నిరాటంకముగా కొంతసేపు నిన్ను అర్చించుట యందును, కొంతసేపు నిన్ను ధ్యానించుట యందును, కొంతసేపు నిన్ను నమస్కరించుట యందును, కొంతకాలము నిన్ను దర్శించుట

యందును. కొంతకాలము నిన్ను స్తుతించుట యందును. కొంతకాలము నీ కథా శ్రవణము నందు కాలమును గడుపువాడు జీవన్ముక్తుడగు చున్నాడు.

వ్యాఖ్య

జీవన్ముక్తుడనగా జీవించి యుండగనే ముక్తి నొందిన వాడని భావము. ముక్తి ఎవరికి? దేహము జడము గనుక దానికి బంధముక్తులు తెలియవు. ఆత్మ నిత్య ముక్తమైనందున దానికి కూడా బంధ ముక్తులు లేవు. మరి ముక్తి ఎవరికి? బంధమున్నట్లు గుర్తించువారికి, బంధమును గుర్తించిన దెవరు? ముక్తి లేదని భావించిన వారు. అట్టి వారెవరు? మనస్సే. కనుక బంధమున చిక్కియున్న మనస్సునకు ముక్తి నందించాలి. అది ఎలా సాధ్యము? భగవంతుని చింతించు మనస్సు భగవంతుని యందే ఉన్నదని భావము. కనుక నిరంతరము మనస్సును ఈశ్వర స్మరణము నందు లగ్న మొనర్చవలెను. అయితే ఎప్పుడూ మనస్సు పరమేశ్వరుని ధ్యానించగలదా? ధ్యానించ లేదు. కనుక ఈ శ్లోకము నందు కొన్ని సాధనలు తెలుపబడినవి. వాటిని ఆచరించి వ్యక్తి తరించ వచ్చును.

కొంత సమయము పూజయందు కాలమును గడుపవలెను. దేహేంద్రియ మనోబుద్ధులను పూజ ద్వారా పరమాత్మ యందు లగ్నమొనర్ప వలెను.

"పూజా దిష్వనురాగ ఇతి పారాశర్యః"

పూజ యందు ప్రీతి కలిగి యుండుటయే భక్తి అని పరాశరుని కుమారుడగు వేదవ్యాసుని అభిప్రాయమును నారద మహర్షి భక్తి సూత్రములలో తెలియజేసెను.

పూజయందు అలసినచో కొంతసేపు ధ్యానమును కొనసాగించి నిర్విషయానంద సాగరములో ఓలలాడవలెను. పనులు చేసుకొను సమయాలలో ఎదురయ్యే పరిచయస్థులకు దైవభావముతో నమస్కరించుట ద్వారాను, ఆలయాలలో మూర్తికి వందన మాచరించుట ద్వారా పరమాత్మను సదా మనస్సు యందు నిలుపుకొనవలెను. కొంతసేపు కథా శ్రవణము ద్వారాను, కొంతసేపు రూప దర్శనము ద్వారాను మరి కొంతసేపు స్తోత్రముల ద్వారాను మనస్సును పరమాత్మ యందు లగ్నమొనర్చవలెను. మనస్సు మాధవుని యందున్నచో అదియే ముక్తి యగును. అట్టి స్థితి సదా కొనసాగుటయే జీవన్ముక్తి యనబడు చున్నది.

బాణత్వం వృషభత్వ మర్ధవపుషా భార్యా త్వ మార్యాపతే
ఘోణిత్వం సఖితా మృదంగ వహతా చేత్యాది రూపం దధౌ
త్వత్పాదే నయనార్పణం చ కృతవాన్ త్వద్దేహ భాగోహరిః
పూజ్యాత్పూజ్య తరస్స ఏవహి న చేత్కోవా తదన్యోఽధికః 82

ఆర్యాపతే = పార్వతీపతీ!, హి = ఏ కారణము వలన, హరిః = విష్ణుమూర్తి, బాణత్వం= బాణమగుటయు, వృషభత్వం = నందియగుటయు, అర్ధ వపుషా = అర్ధశరీరముతో, భార్యాత్వం = నీకు భార్యయగుటయు, ఘోణిత్వం = వరాహమగుటయు, సఖితా = మిత్రమగుటయు, మృదంగవహతాచ = మృదంగ మగుటయు, ఇత్యాదిరూపం = ఈ మొదలగు నాకారమును, దధౌ = ధరించెనో, త్వత్పాదే = నీ పాదము నందు, నయనార్పణంచ =నేత్రము నర్పించుటయు, కృతవాన్ = చేసిన వాడయ్యెనో, చ = ఇంతియేగాక, త్వదేహభాగః = నీదేహమునందు ఒక్క భాగము గలవాడు నయ్యెనో, స ఏవ = ఆ విష్ణువే, పూజ్యాత్ = పూజ్యులైన, పూజ్యతరః = ఎక్కువగా పూజింప దగినవాడు, నోచేత్ = అట్లుకాదేని, తదన్యః = అతని కన్నను అన్యుడు, అధికః = అధికుడు, కోవా = ఎవ్వడు?

భావము :- హే పార్వతీశా! శ్రీ మహావిష్ణువు నీకు బాణ మయ్యెను. నీకు వృషభరూపుడై వాహన మాయెను. ఆర్యా రూపముతో నీ శరీరములో సగ భాగమున భార్యయై యొప్పారెను. నీ పాద దర్శనమునకై వరాహ రూపమెత్తెను. నీకు మృదంగము వాయించు వాడాయెను. జగన్మోహినీ రూపమున మిత్ర మాయెను. నీ దేహమున ఒక భాగమాయెను. నిన్ను సహస్రకమలములతో పూజించు చుండగా ఒక కమలము తక్కువ కాగా తన నేత్రమును అర్పించెను. ఈ విధముగా విష్ణువు నీ భార్య రూపమగుటచే పూజ్యుడగు బ్రహ్మదేవుని కన్నను పూజ్యతరుడాయెను. నీవు పూజ్యతముడ వైతివి.

వ్యాఖ్య

మంగళకరుడగు సదాశివుని బ్రహ్మాదులు కూడా సేవించి శ్రేష్ఠులైనట్లు తెలుపుతున్నారు. త్రిపుర సంహార మొనర్చి పరమశివుడు త్రిపురారి ఆయెను.

త్రిపురా సంహార కాలమున విష్ణుమూర్తి శివునకు బాణమాయెను. వృషభ రూపమెత్తి శివునకు వాహన మాయెను. అంబ యొక్క రూపమును బొంది భార్య అయ్యెను. పాదములను దర్శింపవలెనని వరాహ రూపమెత్తి పాతాళము నంతటిని అన్వేషించెను. నీకు మన: ప్రీతిని కలిగించుటకు జగన్మోహినీ రూపము నెత్తెను. నీవు నటరాజస్వామివై ప్రదోషకాల తాండవము చేయునపుడు విష్ణువు మృదంగము వాయించెను. సహస్ర పద్మములతో నిన్ను అర్చించునపుడు ఒక పుష్పము తక్కువ కాగా తన నేత్రమును సమర్పించెను. ఇన్ని విధములుగా విష్ణువు నీ వైభవ మెరిగి నిన్ను సేవించెను. బ్రహ్మదేవుని కన్నను అధికుడాయెను. బ్రహ్మ పూజ్యుడు కాగా విష్ణుదేవుడు పూజ్య తరుడాయెను. సదాశివుడవైన నీవు పూజ్య తముడవైతివి.

శివా! నేను కూడా అన్ని విధముల నీతోనే సంబంధమును కలిగి యుందును. అన్నివేళల నిన్నే చింతించు చుందును. భక్తిలో ఇదియే పరాకాష్ఠగా తెలియుచున్నది.

"సర్వదా సర్వభావేన నిశ్చింతితై ర్భగవానేవ భజనీయః"

"సర్వకాల సర్వావస్థలయందు అన్ని భావముల చేతనూ నిర్విషయము గలవారిచే స్తవనీయుడగు వాడు భగవానుడే" యని నారద భక్తి సూత్ర ప్రబోధము.

మరికొందరు దేవతల నారాధించు చుందురు కదా! వారి పరిస్థితి ఏమగును? వారు మోక్షమునకు అర్హులు కాలేరు. శివుని ఆరాధించువారే జీవన్ముక్తులగుదురు. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

జనన మృతి యుతానాం సేవయా దేవతానాం
న భవతి సుఖలేశ స్సంశయో నాస్తి తత్ర
అజని మమృత రూపం సాంబ మీశం భజన్తే
య ఇహ పరమసౌఖ్యం తే హి ధన్యాలభన్తే 83

జనన మృతి యుతానాం = జనన మరణములతో కూడిన, దేవతానాం = దేవతల యొక్క, సేవయా = సేవనము చేత, సుఖలేశః = సుఖము లేశమైనను, న భవతి = కలుగదు, తత్ర = అక్కడ, సంశయః = సందేహము, నాస్తి = లేదు, యే = పురుషులు, అజనిం = పుట్టుక లేనివాడును, అమృత రూపం = అమృత రూపుడును, సాంబం= అంబతో గూడినవాడును, ఈశం = ఈశ్వరుని, ఇహ = ఇక్కడనే, భజన్తి = సేవించుచున్నారో, తే = వారు, ధన్యాః = ధన్యులై, పరమ సౌఖ్యం = మోక్ష సుఖమును, లభన్తే = పొందుదురు.

భావము :- జనన మరణములు గల దేవతలను సేవించు వారలకు విషయానందమైనను పూర్తిగా కలుగదు. ఈ విషయమున సంశయము లేదు. అంబా సమేతుడగు పరమేశ్వరుడు అమృత రూపుడు. పుట్టుకలేనివాడు. అట్టివానిని జీవించి యుండగనే ఎవరు సేవించుదురో వారు మోక్షానందమును పొందుదురు.

వ్యాఖ్య

సృష్టింపబడిన ప్రతి వస్తువు లయించ బడుచున్నది. ఈ గతి బ్రహ్మకు కూడా తప్పదు. బ్రహ్మదేవుడు కూడా సృష్టికి పూర్వము సృజింప బడినవాడే గనుక లయము నందు తానూ అంతర్హితుడగుచునే యున్నాడు. బ్రహ్మయే అదృశ్య మగునపుడు బ్రహ్మదేవుడు సృష్టించిన దేవతలు శాశ్వతముగా యుందురా? అశాశ్వతమైన దేవతలను కొలిచిన అశాశ్వత సుఖములు లభించునే గాని శాశ్వతానందములు లభించునా? పుణ్యకార్యము లాచరించి ఆర్జించిన పుణ్యఫల కారణముగా వారికి ఇంద్రాది పదవులు సంక్రమించును.

"క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి"

"పుణ్యము క్షీణించగానే మళ్ళీ మానవలోకమునకే రావలసివస్తుంది" స్వప్న సుఖాలు ఎవరికి శాంతి నందించాయి? స్వర్గసుఖాలు స్వప్న సుఖాలకు తేడా ఏమి ఉన్నది?

శివుడు పుట్టుక లేనివాడు. పుట్టుకలేని తాను ఎలా నశించగలడు? అందుచేత తాను అమృత స్వరూపుడగుచున్నాడు. అమృత స్వరూపుడైన శివుని

ధ్యానించువారు కూడా అమృత రూపులే కాగలరు. అమృతత్వము ఎప్పుడో ఎక్కడో లభించునది కాదు. శివానుగ్రహమునకు పాత్రులైనచో ఇప్పుడే ఇక్కడే పొందగలరు. కనుక మనస్సును శివునకు సమర్పించి పరమేశ్వరుని హృదయములో నిలుపుకొని తరించవలెను. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

శివ తవ పరిచర్యా సన్నిధానాయ గౌర్యా
భవ ! మమ గుణధుర్యాం బుద్ధికన్యాం ప్రదాస్యే
సకల భువనబంధో సచ్చిదానంద సింధో
సదయ హృదయగేహే సర్వదా సంవస త్వమ్ 84

శివ = శివా!, భవ = భవుడా!, సకల భువనబంధో = సమస్త లోకములకు బంధువైనవాడా!, సచ్చిదానంద సింధో = సచ్చిదానంద సాగరుడా!, సదయ = దయా వంతుడా, గౌర్యా= పార్వతీదేవితో కూడ, తవ = నీయొక్క, పరిచర్యా సన్నిధానాయ = సేవించుటకై సమీపమునందుండుట కొరకు, మమ = నాయొక్క, గుణధుర్యాం = సకల గుణములను వహించిన, బుద్ధి కన్యాం = బుద్ధి యను కన్యను, ప్రదాస్యే = దాస్యము చేసెదను, త్వం = నీవు, హృదయగేహే = హృదయ మను గృహమునందు, సర్వదా = ఎల్లప్పుడును, సంవస = సుఖముగా వసింపుము.

భావము :- శివా! సకల భువనబంధో ! సచ్చిదానంద సింధో ! దయా స్వరూపా! పార్వతీదేవితో కూడి నిన్ను సేవించుటకు సమీపమున ఉండుటకొరకు సకల సద్గుణ రాశియైన నా బుద్ధియను కన్యను నీకు దానమిచ్చెదను. నీవు నా హృదయ మను గృహమునందు సర్వదా వసింపుము.

వ్యాఖ్య

"శివా! కన్యాదానము విశిష్టమైనదని వినియున్నాను. మంగళకరుడైన నీకు నేను కన్యాదానము చేయదలచినాను. నాకు ఏకైక పుత్రిక. ఆవిడ పేరు బుద్ధిదేవి. సుగుణాల రాశి. పెద్దల యెడ గౌరవము కలది. దైవభక్తి మెండుగా గలది. నా ఆస్థి యంతటికి ఆవిడయే వారసురాలు. ఆవిడను వదలి పెడితే

నాకు జీవితమేలేదు. అట్టి నా బిడ్డను నీ సేవను వాంఛించి నీకు కన్యాదాన మొనర్ప నిశ్చయించుకొనినాను. నీతో నాకు చక్కని బంధుత్వమేర్పడుతుంది.

"పరమేశ్వరా! ఒప్పుకొంటివా! అయితే ఒక్క షరతు. నాకు ఒక్కగానొక్క బిడ్డ. ఆవిడను నీవు పరిణయ మాడినను నీతో కూడా ఆవిడను పంపుటకు నేను సిద్ధంగా లేను. నీవే నా ఇంటికి ఇల్లరికం రావాలి. మీరిరువురు నా ఇంటిలోనే ఉండండి.ఇక నాది అనునదేదియు మిగలదు. అంతయూనీదే".

"ఏమిటి? ఇల్లరికం ఇష్టములేదా? ఎందుకని? పార్వతీదేవి అంగీకరించదా? అయితే ఒక పని చేయుదుము. ఆమెను కూడా తీసుకొని మా ఇంటికి రమ్ము. నా బిడ్డ బుద్ధి ఆమెతో కలిసి నీకు సేవ లొనర్చును. నా హృదయమనెడి మనోహర భవనమున మీరిరువురు హాయిగా ఉండవచ్చును. శివా! నేనిచ్చే కన్యాదానమును స్వీకరించి నా హృదయ సౌధములో శాశ్వతముగా నిలిచిపొమ్ము. కరుణించుము తండ్రీ! నిన్ను మరో విధంగా పూజించుటకు అర్హత లేనివాడను. అనర్హత ఏమిటో తరువాత శ్లోకము వివరించును.

జలధి మదన దక్షో నైవ పాతాళ భేదీ
న చ వనమృగ యాయాం నైవ లుబ్ధః ప్రవీణః
అశన కుసుమ భూషా వస్త్ర ముఖ్యాం స పర్యాం
కథయ కథ మహం తే కల్పయా నీందు మౌళే 85

ఇందుమౌళే = చంద్రుని శిరస్సునందు ధరించిన వాడా!, తే = నీకు, అశన = ఆహారము, కుసుమ = పుష్పము, భూషా = భూషణము, వస్త్ర = వస్త్రమును, ముఖ్యాం = ముఖ్యముగా, సపర్యాం = సపర్యయును, కథం = ఎట్లు, కల్పయాని = కలిగించెదను, కథయ = చెప్పుము, అహం = నేను, జలధి = సముద్రమును, మథన = తరుచుటకు, దక్షః = చాలిన వాడను, నైవ = కాను, పాతాళ = పాతాళలోకమును, భేదీ = భేదించువాడను, న చ = కాను, వన = అడవియందు, మృగయాయాం = వేటాడుట యందు, ప్రవీణః = నేర్పుగల, లుబ్ధః = బోయవాడును, నైవ = కాను.

భావము :- పరమశివా! నిన్ను నేనెట్లు పూజింపగలనో చెప్పుము. నేను సాగరమును మథింప జాలిన వాడను కాను. నీకిష్టమైన కాలకూట విషమును గాని, చంద్రుని

గాని ఎలా ఇవ్వగలను? పాతాళ లోకమును భేదించు వాడను గాను. నీకు భుజగ భూషణ మెట్లు కల్పించ గలను? అడవులలో మృగముల వేటాడ నేర్చిన బోయవాడ నైనగాను. నీకు గజచర్మ వస్త్రము నెలా ఇవ్వగలను?

వ్యాఖ్య

పూజ చేయలేని అశక్తతను ఈ శ్లోకంలో శ్రీశంకరులు తెలియ జేయుచున్నారు. పూజయందు పరమాత్మకు నైవేద్యమును సమర్పించవలెను. శివునకు హాలాహలము ఇష్టమైన నైవేద్యము. అది సమర్పించవలెను. పాల సముద్రమును మథించిన గానీ హాలాహలము పుట్టదు. క్షీర సాగరమును మథించే శక్తి తనకు లేదనుచూ నైవేద్యమును సమర్పించలేని తన అశక్తతను తెలుపుచున్నారు.

శివుడు శిరస్సుపై పుష్పము వలె చంద్రుని ధరించును. చంద్రుడు కూడా క్షీర సాగరము నుండియే లభించును. కనుక అది కూడా తన చేతకాదని పలుకుతున్నారు.

శివుడు నాగాభరణుడు. మరి తనకు ఆభరణమైన సర్పము పాతాళమున భూమిని మోయుచున్నది. ఆభరణమును సమర్పించవలె నన్నచో పాతాళమునకు వెళ్ళవలసియున్నది. తనకు ఆ శక్తి లేదను చున్నాడు.

పూజయందు వస్త్రము సమర్పించ వలసి యుండును. వస్త్రమును సమర్పించవలె నన్నచో శివుడు ధరించు గజ చర్మమును సమర్పించవలసి యుండును. వేటాడి ఏనుగును వధించినగాని గజ చర్మము లభింపదు. గజమును వేటాడి చంపుటకు తాను బోయవాడను కానని తెలుపుచున్నారు.

కనుక బాహ్య పూజ లేవియును తాను సాగించలేడట. తాను మానసిక పూజను చేయగలనని తెలుపుటయే ఇందులోని అంతర్భావము.

"పరమశివా! హాలాహలమును నేను సమర్పించ లేను. కానీ కాలకూట విషము కన్నను భయంకరమైన నా అజ్ఞాన మనెడి విషమును నీకు

సమర్పించగలను. సదాశివా! చంద్రుని నీకు ఆభరణముగా సమర్పించలేను. కానీ చంద్రుని వలె వృద్ధిక్షయాలు గల నా చిత్తమును నీకు సమర్పించగలను. నీలకంఠా! నీవు నాగాభరణుడవు. నీకు పుష్పమాలగా సర్పము నేను సమర్పించలేను. కానీ నాలోని వంకర టింకరగా పోవు కుటిల స్వభావమనెడి సర్పమును నీకు అర్పించగలను. పార్వతీ పతీ! నీకు వస్త్రముగా గజ చర్మమును నేను సమర్పించలేను. నా అహంకారమునే నీకు వస్త్రముగా ఇవ్వగలను". ఈ భావనయే ప్రస్తుత శ్లోకమున కేంద్ర విషయమై ఉన్నది.

పూజ సల్పినంత మాత్రాన శివుని స్వరూపమును గ్రహించుట సాధ్యపడదు. శివానుగ్రహము వలననే శివుని దర్శనము సాధ్యమగును. ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

పూజాద్రవ్య సమృద్ధయో విరచితాః పూజాం కథం కుర్మహే
పక్షిత్వం న చ వా కీటత్వమపి న ప్రాప్తం మయా దుర్లభం
జానే మస్తక మంఘ్రి పల్లవ ముమాజానే నతేఽహం విభో
న జ్ఞాతం హి పితా మహేన హరిణా తత్త్వేన తద్రూపిణా86

పూజాద్రవ్యః = పూజాద్రవ్యములు, సమృద్ధయః = సమృద్ధిగా యున్నవి, విరచితాః = సమకూర్చ బడినవి, పూజాం = పూజను, కథం = ఎట్లుగా, కుర్మహే = చేయుదుము, దుర్లభం = పొందశక్యముగాని: పక్షిత్వం = హంస రూపముగాని, చవా = లేనిచో, కీటిత్వ మపి = వరాహ రూపముగాని, మయా = నాచేత, నప్రాప్తం = పొందబడలేదు, అహం = నేను, తే = నీ యొక్క, మస్తకం = శిరస్సును, అంఘ్రిపల్లవం = చిగురువంటి పాదమును, నజానే = ఎఱుగను, విభో = సర్వవ్యాపకుడా!, తద్రూపిణా = ఆ విధమైన రూపములు పొందిన, పితా మహేన = బ్రహ్మదేవునిచేతను, హరిణా = విష్ణుమూర్తిచేతను, తత్త్వేన = యదార్థముగా, న జ్ఞాతంహి = తెలియబడలేదు గదా!

భావము :- సదాశివా! పూజాద్రవ్యములు సమృద్ధిగా సమకూర్చబడినను అపుడు కూడా నిన్ను పూజించుట సాధ్యపడదు. నీ శిరస్సును తెలియదు. నీ పాదములును తెలియవు. హంస రూపము, వరాహ రూపములను బొందుట అసాధ్యములు.

అట్టి రూపములను ధరించిన బ్రహ్మ విష్ణువులు కూడా దర్శించలేక పోయిరి గదా!

వ్యాఖ్య

గమ్యము తెలియని వాని గమనము విచిత్రమైనది. గహనమైనది. ఆధ్యాత్మిక సాధనలో సత్యమునకు సంబంధించిన అవగాహన సాధకునకు అత్యంత అవసరము. తాను చేరవలసిన గమ్యమేమిటియో తెలియని వాడు సాధనలో ఎలా నడువగలడు?

పూజా సామాగ్రి యున్నను పూజా స్థానమేమిటో తెలియుటలేదని ఈ శ్లోకము యొక్క భావము. అందరికీ దేవుడు కావాలి? కానీ దేవుడంటే ఏమిటో ఎందరికి తెలుసు? గొప్ప శక్తులు కలిగిన పెద్ద రూపము గలవాడు దేవుడని అభిప్రాయపడుతూ ఉంటారు. దేవుడు రూపమే అయితే ఆయన అస్తిత్వమునకే భంగము వాటిల్లును గదా! భక్తుని ఉద్ధరించుటకు పరమాత్మ రూపమును ధరించవచ్చు. యదార్థానికి ఆయన రూప నామ క్రియా రహితుడు. ఆద్యంతములు లేనివాడు. సత్తాస్వరూపుడు.

బ్రహ్మదేవుడు హంస రూపమును ధరించి ఆకాశ మార్గమున చరించి శివుని పాదముల నన్వేషించెను. కానీ బ్రహ్మదేవుడు శివుని పాదములను దర్శించ లేకపోయెను. అలాగే విష్ణుదేవుడు హంస రూపమును ధరించి పాతాళమున అన్వేషించెను. అయినను శివుని పాదములు గోచరించలేదు. అట్టి వారికే పూజా స్థానమైన చరణ కమలములు లభ్యము కానపుడు తాను మాత్రము పూజా సామాగ్రులను సిద్ధపరచుకొని చేసేదేమున్నది? అంటున్నారు శ్రీశంకరులు.

"నీ రూపంబుఁ దలంపగా దుద మొదల్నేగాన నీవైనచో

రా! రా! రమ్మనియచు జెప్పవు వృథారంభంబు లింకేటికిన్

నీటన్ముంపుము పాలముంపు మిక నిన్నే నమ్మినాడం జుమీ

శ్రీరామార్చిత పాదపద్మ యుగళా శ్రీకాళహస్తీశ్వరా!

"హే పరమేశ్వరా! శ్రీరాముడే నీ పాదపద్మములను అర్చించినాడు. నీ రూపమును గూర్చి ఆలోచింపగా నాకు మొదలెక్కడో అంతమెక్కడో తెలియుటలేదు. నీవేమో నన్ను రమ్మని పిలువవు. ఇక నీట ముంచినా పాలముంచినా నీదే బాధ్యత" యని శ్రీకాళహస్తీశ్వర శతకమునందు తెలుపబడినది.

ఈశ్వరుని నుండి మనం ఆశించవలసినది ఏమిటి? ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

అశనం గరళం ఫణీ కలాపో
వసనం చర్మ చ వాహనం మహోక్షః
మమ దాస్యసి కిం కిమస్తి శంభో
తవ పాదాం బుజ భక్తి మేవ దేహి 87

శంభో = శివుడా!, తవ = నీకు, అశనం = భోజనము, గరళం = విషము, కలాపః= భూషణము, ఫణీ = సర్పము, వసనం = వస్త్రము, చర్మ = ఏనుగు చర్మము, వాహనంచ = వాహనమును, మహోక్షః = ముసలిఎద్దు, కిం = ఏమి?, దాస్యసి = ఇచ్చెదవు, మమ = నాకు, కిం = ఏమి, అస్తి = ఉన్నది, తవ = నీ యొక్క, పాదాంబుజ = పాదపద్మముల యందు, భక్తి మేవ = భక్తి మాత్రమే, దేహి = ఇమ్ము.

భావము :- శివా! విషము నీకు ఆహారము. పాము నీకు ఆభరణము. ధరించునది గజ చర్మము. వాహనము ముసలిదైన వృషభము. ఇక నాకు ఇష్టమైనది నీవద్ద ఏమున్నది? నీ పాద పద్మముల యందు భక్తి నిమ్ము. అది ఒక్కటే నాకు చాలును.

వ్యాఖ్య

అన్న, వస్త్ర వాహన భూషణాదులేవియు మనుజునికి శాశ్వతమైన ఆనందము నొసంగలేవు. ఆకలి ప్రాణ ధర్మము. అన్నము వలన ఆకలి తీరి ప్రాణము కుదుట పడునే గాని ఆత్మ శాంతించదు.

దేహమును రక్షించుకొనేందుకు వస్త్రము అవసరము. కొంతకాలము ఉపయోగించిన తరువాత వస్త్రము ఎలా జీర్ణమగునో అలాగే కాలగర్భంలో శరీరము కూడా మటుమాయమగును. నశించే దేహాన్ని ఎంత సింగారించినను పొందున దేమియును ఉండదు. అట్టి దేహము త్వరగా చరించుటకు వాహనము, అందముగా గోచరించుటకు భూషణము అవసరము.

వాహనాదులు అవసరాలను తీర్చేందుకు ఉపకరిస్తాయే గాని ఆనందమును పంచలేవు. భూషణాదుల ద్వారా దేహమును ఎంత అందముగా తీర్చిదిద్దినను అది ఒకనాటికి శ్మశానానికి నడిచి వెళ్ళేదియే గాని నిలిచి ఉండేది కాదు.

ఒకపూటించుక కూడు తక్కువగునే నోర్వంగలే దెండకో
పడనీక స్వేదకుం జలిం జడిసి కుంపట్లెత్తుకో జూచు వా
నకు నిల్లిల్లును దూఱు నిత్తనువు దీనన్ వచ్చు సౌఖ్యంబు
రోసి కడాసింపరు గాక మర్త్యులకటా శ్రీకాళహస్తీశ్వరా !

"ఒక్కపూట అన్నము తక్కువైనచో ఈ దేహము ఓర్వలేదు. ఎండకు తాళలేదు. చలికి భయపడి కుంపట్లు వెతుకును. వర్షము వచ్చిన ఇల్లిల్లు దూరును. దీని వలన ఏమి సౌఖ్యమున్నది? అయినను దీనిపై మనుష్యులకు రోత జనించుటలేదు", అని శ్రీకాళహస్తీశ్వర శతక కర్త తెలిపెను.

కనుక ఇవియేవియును తనకు వద్దనియు, ఒక్క ఈశ్వర పాదసేవనమే ప్రసాదించమనియు ప్రార్థించు చున్నారు. ఈశ్వర పూజనమునకు కూడా తనకు అర్హత లేదని విన్నవించుకొను చున్నాడు. ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

యదా కృతాం భోనిధి సేతు బంధనః
కరస్థలాధః కృతపర్వతాధిపః
భవాని తే లంఘిత పద్మసంభవ
స్తదా శివార్చ స్తవ భావన క్షమః 88

శివ = శివా!, యదా = ఎప్పుడు, కృత = చేయబడిన, అంభోనిధి = సముద్రమందు సేతుబంధనః = వారధి నిర్మాణము గలవాడును, కరస్థల = అఅచేతితో, అధఃకృత= దిగువ కణచ బడిన, పర్వతాధిపః = వింధ్య పర్వతము గలవాడును, లంఘిత = అతిశయింప బడిన, పద్మ సంభవః = బ్రహ్మదేవుడు గలవాడును, తదా = అప్పుడు, తే = నీ యొక్క, అర్చా = పూజయందును, స్తవ = స్తోత్రమునందును, భావన = ధ్యానమందును, క్షమః = సమర్థుడను, భవాని = అగుదును.

భావము :- శివా! సముద్రమునకు వారధి గట్టిన శ్రీరాముడు, అరచేతితో వింధ్య పర్వతము యొక్క గర్వము నణచిన అగస్త్యుడు, మరియు బ్రహ్మదేవుడు అను వారి కన్న నేను ఎక్కువ వాడనైనచో నీ పూజా స్తోత్ర ధ్యానములను చేయుటకు సమర్థుడనగుదును.

వ్యాఖ్య

శ్రీరాముడు, అగస్త్యుడు, బ్రహ్మదేవుడు ఇత్యాది మహాత్ముల వంటి భక్తి యుండినపుడే మనుజుడు ఈశ్వరానుగ్రహమునకు పాత్రుడగును. శ్రీరాముడు శివుని పూజించి, లంకకు వారధిని నిర్మించి రావణాసురుని వధించెను. అలాగే శ్రీరాముని వలె శివుని పూజించిన వారు, సంసార సాగరముపై సేతువును నిర్మించి, అజ్ఞానమనెడి రావణాసురుని వధించగలరు. అగస్త్య మహాముని తన తపశ్శక్తిచే వింధ్యాచలమును అణచెను. అగస్త్యుడు గొప్ప శివభక్తుడు. అహంకార మనెడి వింధ్యాచలమును అణచిన వారు మాత్రమే శివానుగ్రహమునకు పాత్రులగుదురు. మంగళ కరమగు సృష్టిని సాగించునపుడు బ్రహ్మ ఈశ్వరుని ప్రార్థించెను. కనుక ఈశ్వరానుగ్రహముతో, ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలను సాగించువారే ధన్యులగుదురు.

భగవంతుని ధ్యానించి, కీర్తించ వలెననిన భగవంతునికి సంబంధించిన జ్ఞానము ఉండవలెను. జ్ఞానము లేని వానికి ముక్తి ఉండనేరదు.

జ్ఞాన యజ్ఞోడుపే నైవ బ్రాహ్మణో వాఽంత్యజోఽపి వా

సంసార సాగరం తీర్త్వా ముక్తి పారం హి గచ్ఛతి

"జ్ఞాన మనెడి నావ చేత బ్రాహ్మణుడైనను, అంత్యజుడైనను, సంసార సముద్రమును దాటి ఈ లోకముననే మోక్షమును పొందును" అని సూత సంహిత తెలుపుచున్నది.

సత్త్వగుణము వృద్ధి చెందునపుడు మనలో భక్తి కలుగుచుండును. వ్యవహారిక మనుగడ నధిగమించి, పారమార్థిక సత్యమును దర్శించినపుడే ఏకత్వానుభూతి సిద్ధించును. శ్రీరాముడు, అగస్త్యుడు, బ్రహ్మదేవుడు ఇత్యాది మహాత్ములందరు ఏకత్వము ననుభవించినవారే. ఈశ్వర ప్రియత్వము నెరిగి, దానికి అనుకూలముగా చరించుటచేత వారు శివునకు ప్రీతి పాత్రులైరి. అయితే మనము కూడా వారివలె ప్రీతి పాత్రులము కావచ్చును కదా? మరి శివునకు దేనియందు ప్రీతి మెండు? ఈ విషయమును రాబోవు శ్లోకము వివరించును.

నతిభి ర్నుతిభి స్త్వమీశ పూజా
విధి భి ర్ధ్యాన సమాధి భి ర్న తుష్టః
ధనుషా ముసలేన చాశ్మభి ర్వా
వదతే ప్రీతికరం తథా కరోమి 89

ఈశ = పరమేశ్వరా!, త్వం = నీవు, నతభిః = నమస్కారముల చేతను, నుతిభిః = స్తోత్రములచేతను, పూజావిధిభిః = పూజా విధానముల చేతను, ధ్యాన సమాధిభిః = ధ్యాన సమాధుల చేతను, ధనుషా = వింటి దెబ్బలచేతను, ముసలేన = రోకటి పోట్ల చేతను, అశ్మభిర్వా = రాళ్ళు రువ్వుట చేతను, తుష్టః = సంతోషించినవాడవు, న = కావు, తే = నీకు, ప్రీతికరం = ప్రియమైనది, వద = చెప్పుము, తథా = అట్లు, కరోమి = చేయుదును.

భావము :- ఈశ్వరా! వందనములు, స్తోత్రములు, పూజా విధానములు, ధ్యాన సమాధుల చేత ప్రీతి నొందక వింటి దెబ్బలు, రోకటి పోట్లు, రాళ్ళదెబ్బలు మొదలగు వానితో నీవు సంతోషించి నట్లు పురాణ గాథలు తెలుపు చున్నవి. వీనిలో నీకు ఏది ప్రీతికరమో తెలుపుము. అట్లు చేయుదును.

వ్యాఖ్య

సర్వులూ శివుని వాంఛింతురు. కానీ సర్వులూ పొందలేరు. కారణము ఏమిటి? ఇంద్రియ మనో బుద్ధులను పరమాత్మ బహిర్ముఖ మొనర్చి యుండుటయే ఈ బలహీనతకు కారణము.

పరాఞ్చి ఖాని వ్యతృణ త్స్వయంభూ

స్తస్మా త్పరాఙ్ పశ్యతి నాన్తరాత్మన్

కశ్చిద్ధీరః ప్రత్యగాత్మాన మైక్ష

దావృత్త చక్షు రమృతత్వ మిచ్ఛన్

"పరమాత్మ ఇంద్రియములను బహిర్ముఖ మొనర్చియున్నాడు. అందుచేత అవి బాహ్య విషయములనే దర్శించుచున్నవి. అంతర్ముఖ మగుటలేదు. అంతఃకరణ శుద్ధి గలిగిన ఒకానొక ధీరుడు మోక్షమును వాంఛించువాడై, ఇంద్రియములను మరల్చి పరమాత్మను గాంచుతున్నాడు' అని కఠోపనిషత్తు తెలియజేసింది.

కనుక ఇంద్రియ మనోబుద్ధులను అంతర్ముఖము గావించుటయే సర్వ సాధనల యొక్క ఏకైక లక్ష్యమై యున్నది. వీటిలో భగవానుని స్తుతించునవి స్తోత్రములు. షోడశోపచార విధి ననుసరించి చేయునవి పూజలు. మనోవృత్తులను అంతర్ముఖ మొనర్చి, వృత్తి రహిత చైతన్యము ననుభవింప జేయునవి జప ధ్యానాదులు. వీటన్నిటి కంటెను పరాభక్తి ఈశ్వరునికి అత్యంత ప్రియమైనది యని చెప్పుచున్నారు.

పాశుపతాస్త్రమును సాధించుటకై అర్జునుడు తపము లాచరించెను. ఆ సందర్భమున అర్జునుని వింటి దెబ్బలను కూడా శివుడు భరించెను. సహించెను. తరువాత రాళ్ళను రువ్వగా పిడికిటి పోట్ల నుపయోగించగా వాటిని కూడా సహించెను. ఇవన్నియు విఫలము కాగా ఇరువురు కలియబడి పోరాడిరి. భక్తులతో పోరాటము కూడా శివునకు ఎంతయో ప్రీతిగా యుండును.

నిద్రలో బిడ్డ తండ్రిని కాలుతో తన్నును. కానీ తండ్రి కోపగించడు. బిడ్డపై తండ్రికి గల వాత్సల్యము అద్భుతము. కానీ పరమాత్మకు భక్తులపై నున్న ప్రేమ అనూహ్యము. అందుచేతనే తన దర్శనానికి వచ్చెడి భక్తులు ధూళితోనే వచ్చి తనను తాకినచో శ్రీశైలములో మల్లికార్జునుడు సంతసించును. కనుకనే శివానుగ్రహమునకు సాధన లాచరించ వలెను. ఏమిటా సాధనలు? ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

వచసా చరితం వదామి శంభో
రహ ముద్యోగ విధాసు తేఽప్రసక్తః
మనసాఽకృతి మీశ్వరస్య సేవే
శిరసా చైవ సదాశివం నమామి 90

అహం = నేను, తే = నీ యొక్క, ఉద్యోగ = ఉద్యోగముల యొక్క, విధాసు = విధానముల యందు, అప్రసక్తః = పరిచయము లేనివాడును, వచసా = వాక్కుచేత, శంభో = శివుని యొక్క, చరితం = చరిత్రమును, వదామి = చెప్పుచున్నాను, మనసా = మనస్సుచేత, ఈశ్వరస్య = ఈశ్వరుడనైన, తవ = నీయొక్క, ఆకృతిం = ఆకారమును, సేవే = సేవించుచున్నాను, శిరసా = శిరస్సుచేత, సదాశివం = సదాశివుడనైన, త్వామేవ= నిన్నే, నమామిచ = నమస్కరించుచున్నాను.

భావము :- ప్రభూ! విశిష్టమైన సాధనలు తెలియని వాడను. మనస్సునకు నిలుకడలేదు. అందుచేత వాక్కుతో నీ చరితమును చెప్పుచున్నాను. నీ రూపమును ధ్యానించుచున్నాను. శిరస్సుతో నీ పాదములకు నమస్కరించు చున్నాను.

వ్యాఖ్య

హే పరమేశ్వరా! ఉన్నతమైన సాధన లాచరించలేని మందమతిని. నాకు చేతనైన రీతిలో నిన్ను సేవించు కొందును. నీలకంఠా! వాక్కుద్వారా నీదివ్య చరితమును చెప్పుకొందును. పరవశించి నీ దివ్యగాధలను ఇతరులకు చెప్పుచు

పరవశించెదను. ప్రాపంచిక విషయ వాసనా పరులు అనాలోచిత విషయములను ముచ్చటించుచున్నను మాటల మధ్యన నీ విశేష గుణములను కొనియాడుచు, నా మనస్సును శాంత పరచు కొందును. అన్యులకు శాంతిని పంచి పెట్టెదను.

దీననాథా! శిరము వంచి నీకు నమస్కరించెదను. సృష్టిలోని ప్రతి ప్రాణిలో నిన్ను దర్శించుచూ వందన మాచరింతును. వందనమే నీకు బంధనమని విన్నాను. నా హృదయమును నీ తలంపులతో నందనోద్యాన వనముగా తీర్చిదిద్దు కొందును.

"మనస్సులో నీ సంబంధమైన విషయమునే మననము చేసి కొందును. అనన్య చింతనముతో బ్రతుకును పండించుకొందును.

"అవ్యావృత భజనాత్"

ఎడతెగని భక్తిచే నిన్ను పొందమని నారద మహర్షి తెలిపినాడు. కనుక సదా నీ భక్తియందే చరింతును. భక్తి లేని జ్ఞానము నిష్ఫలమే కదా తండ్రీ!

మద్భక్తి విముఖానాం హి శాస్త్ర గర్తేషు ముహ్యతామ్
న జ్ఞానం న చ మోక్షః స్యాత్తేషాం జన్మశతైరపి

"నా యందు భక్తిలేక శాస్త్రమనెడి బురద గుంటలో దొర్లుచుండు వారికి ఈ లోకము నందు వందలాది జన్మలెత్తినను ముక్తిరాదు"

పై నీ మాట యందు విశ్వాసముంచి నా మనసారా నాకు తోచిన రీతిలో నిన్ను ధ్యానించెదను. నన్ను ఉద్ధరించ వలసిన బాధ్యత నీదే సుమా!

ఈ శ్లోకమున "వచసా, మనసా, శిరసా" అని ప్రయోగింప బడిన పదములు భక్తియందలి త్రికరణ శుద్ధిని కూడా తెలుపుచున్నవి. అంతర్యాము శుద్ధిపడిన వారికి ఆదిదేవుడు లభించును. ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

ఆద్యాఽవిద్యా హృద్గతా నిర్గతాసీ
ద్విద్యా హృద్యా హృద్గతా త్వత్ప్రసాదాత్
సేవే నిత్యం శ్రీకరం త్వత్పదాబ్జం
భావే ముక్తే ర్భాజనం రాజమౌళే 91

రాజమౌళే = చంద్రశేఖరా!, త్వత్ప్రసాదాత్ = నీయనుగ్రహము వలన, హృద్గతా = హృదయమును వంటియున్న, ఆద్యా = మొట్టమొదటిది యగు, అవిద్యా = అజ్ఞానము, నిర్గతా = తొలగి పోయినది, ఆసీత్ = అయ్యెను, యా = ఏ జ్ఞానము, హృత్ = హృద్గ్రంథి, విద్యా = జ్ఞానము, హృద్యా = హృదయమున ప్రవేశించిన దయ్యెను, శ్రీకరం = సంపదతో కూడినదియు, ముక్తేః = మోక్షమునకు, భాజనం = ఆధారమైనదియును. త్వత్పదాబ్జం= నీ పాదపద్మమును, భావే = భావమునందు, నిత్యం = ఎల్లప్పుడు, సేవే = సేవించుచున్నాను.

భావము :- చంద్రశేఖరా! నీ అనుగ్రహము వలన నా అవిద్య అంతమైనది. హృదయ గ్రంథిని భేదించు జ్ఞానము నా హృదయములో ప్రవేశించినది. సంపదతో కూడినదియు, మోక్షమునకు ఆధారమైనదియు నగు నీ పాదపద్మమును భావమునందు సదా సేవించుచున్నాను.

వ్యాఖ్య

ప్రతి వ్యక్తి సచ్చిదానంద స్వరూపమై యున్నాడు. అజ్ఞానముచే తాను దేహమనియు, ఇంద్రియములనియు, మనో బుద్ధులనియు భావించి, వానితో తాదాత్మ్యం చెంది "నా బుద్ధి", "నా శరీరము" ఇత్యాది మాటలు మాట్లాడు చున్నాడు. కనుకనే సర్వ దుఃఖములకు కారణము అజ్ఞానము అని చెప్పవలసియున్నది. మనము దేహము అని భావించుట వలన దేహ సంబంధమైన బాధలు, ఆ దేహమునకు సంబంధించిన వారి బాధలు మనము అనుభవించ వలసి వస్తున్నది. మనము సచ్చిదానంద స్వరూపమైన ఆత్మ యనెడి జ్ఞానము కలుగగనే అజ్ఞాన బంధములనుండి మనము విడిపోవు

చున్నాము. ఆత్మానందమును అనుభవించు వారమగుచున్నాము. అంటే ఇప్పుడు మనము ఆత్మకాదని భావము కాదు. మనము ఆత్మయై ఉన్నను, అలా ఆత్మయై ఉన్నాము అనెడి జ్ఞానము మనకులేదు. భేదభావముతో మనము పరిమిత జీవనమును కొనసాగించుచున్నాము. దీనికి కారణమైనది అజ్ఞానమే.

వెలుగు చీకటిని పోగొట్టునట్లు, జ్ఞానము అజ్ఞానము నంతమొందించును. జ్ఞానము కలుగగనే మన దృష్టి మారిపోయి సృష్టి అంతయు భగవత్స్వరూపముగా గోచరించును. ఇది క్రొత్తగా కలిగే జ్ఞానము కాదు. మనకు ఉన్నదియే. ఇచ్చట జ్ఞానము వచ్చేది ప్రత్యేకముగా లేదు. అజ్ఞానము అంతరించుటయే జరుగుచున్నది.

మన కంటిలో నలుసు పడినపుడు మనము తీవ్ర వ్యధకు గురియగుదుము. దానిని భరించలేక వైద్యుని సమీపించెదము. వైద్యుడు మన నేత్రములను పరిశీలించి నలుసును తొలగించును. అదిపోగానే మనము ఆరోగ్యవంతులమై నట్లు, ఆనందముగా యున్నట్లు భావింతుము. అయితే ఇక్కడ క్రొత్తగా మనము పొందినదేమైనా యున్నదా? లేదు. తాత్కాలికముగా ఏదయితే మనలను బాధలకు గురిచేయుచుండినదో దానిని తొలగించు కొనుటయే జరిగినది. కనుక మనకు, మన ఆనందమునకు మధ్య నలుసుచేరి మనలను తాత్కాలికంగా బాధించి వైద్యుడు దానిని తొలగించగనే మనకు శాశ్వతముగా స్వస్థత లభించునట్లు, మనకు, భగవానునకు మధ్య అజ్ఞానమనెడి నలుసు చేరి తాత్కాలికంగా మనలను బాధించి, పరమాత్మ కరుణించగనే దుఃఖము తొలగిపోయి, శాశ్వతానందము ప్రసాదించ బడుచున్నది. నిన్ను నీవు తెలుసుకొనినచో సమస్తము నీవుగానే తెలుస్తుంది.

చెంబుడు నీళ్ళు తీసుకొని నాలుగుచోట్ల పోసినచో నలుగురు సూర్యులున్నట్లు మనకు తెలియును. యదార్థానికి అక్కడ ఉన్నది ఒక్క సూర్యుడేగాని నలుగురు కారు.

"అత ఏవ చ సూర్యకాదివత్"

అనెడి బ్రహ్మసూత్రము నందు ఈ విషయమునే ధృవ పరచుట జరిగినది.

ఈ విధమైన పరమాత్మ సంబంధమైన జ్ఞానము ఈశ్వరానుగ్రహముతోనే మనకు లభిస్తుంది. అజ్ఞాన గ్రంధి ఛేదింప బడుతుంది. కనుక సర్వసంపదలకు నిలయమైనదియు, మోక్ష ప్రదమైనదియు నగు ఈశ్వర పాదార విందమును సేవించమని శ్రీ శంకరులు తెలుపుచున్నారు.

ఈశ్వర పాదసేవనము ద్వారా సమస్త దురితములు దూరమగును. ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

దూరీకృతాని దురితాని దురక్షరాణి
దౌర్భాగ్య దుఃఖ దురహంకృతి దుర్వచాంసి
సారం త్వదీయ చరితం నితరాం పిబంతం
గౌరీశ మామిహ సముద్ధర సత్కటాక్షైః 92

గౌరీశ = గౌరీనాధా!, దురక్షరాణి = బ్రహ్మవ్రాసిన చెడువ్రాతను, దురితాని= పాప సంజనితములగు, దౌర్భాగ్య = దురదృష్టము, దుఃఖ = దుఃఖము, దురహంకృతి = దురహంకారమును, దుర్వచాంసి = చెడు భాషణమును, సత్కటాక్షైః = సత్కటాక్షము చేత, దురీకృతాని = దూరముగా చెదర గొట్టబడినవి, సారం = సారమైన, త్వదీయ= నీయొక్క, చరిత్రం = చరిత్రను, నితరాం = మిక్కిలి, పిబంతం = వినుచున్న, మాం= నన్ను, ఇహ = ఈ జన్మమందు, సముద్ధర = ఉద్ధరింపుము.

భావము :- బ్రహ్మదేవుడు నొసట వ్రాసిన చెడువ్రాతల ఫలితముగా కలిగిన దురదృష్టము, దుఃఖము, దురహంకారమును నీ కటాక్ష వీక్షణము పోగొట్టినది. ఇక మీదట సార రూపమైన నీ చరితమును వినుచుందును. గౌరీశా! ఈ జన్మమందే నన్ను ఉద్ధరింపుము.

వ్యాఖ్య

భగవానుని ఆశ్రయించుట ద్వారా, ఆయన దివ్యగాధలను శ్రవణము చేయుట ద్వారా, సంకీర్తనము ద్వారా, మనస్సు మొదట అంతర్ముఖమై, ఆ తరువాత తన అస్తిత్వమును కోల్పోయి ఆత్మయందు విలీనమగును. వెంటనే మనకు ఆత్మయనెడి జ్ఞానము కలుగును. సర్వగతమై, సర్వశక్తి వంతమైన

ఆత్మయే గాని మనము మరొకటి కాదు యనెడి జ్ఞానము కలుగును. భగవన్నామము ద్వారా ఈ విధమైన జ్ఞానము మనకు లభించుచున్నది. ప్రారంభములో మనలో నామముండును. అనుభవము కలిగినకొలది నీవే నామములో ఉంటావు.

ఈ దశలో దురదృష్టములు తెలిసిరావు. దురదృష్టములను గుర్తించే మనస్సు అదృశ్యమై ఉండుటయే దానికి కారణము. దుఃఖము తెలిసే అవకాశములేదు. అద్వైత భక్తిలో నీకన్నా మరొక వస్తువు ప్రత్యేకంగా ఉండేందుకు వీలులేనందున దుఃఖము కలిగే అవకాశము లేదు. 'నాది' అనునది అంతమైనందున దురహంకారము విజృంభించే అవకాశము లేదు. భగవత్కృపా వీక్షణము యొక్క ఫలితముగా సమస్త దురితములు హరింపబడినవి. బ్రహ్మ వ్రాసిన దురదృష్ట జాతకము అంతరించిపోయినది. కుచేలునకు "శ్రీక్షయ" యనెడి పదమును బ్రహ్మదేవుడు నొసటన వ్రాసెను. కానీ దానిని శ్రీకృష్ణుడు తారుమారు చేసి "యక్షశ్రీ" అని మార్చి అనుగ్రహించెను. బ్రహ్మ వ్రాతలను తారుమారు చేయునది భగవన్నామమే.

నామము ద్వారా అంతఃకరణ శుద్ధి యగును. అప్పుడు మనము భగవల్లీలలను శ్రవణము చేయగలుగుదుము. ఈ జనన మరణ సంసార సాగరము నుండి బయట పడగలుగుదుము. భయరహితులమగుచున్నాము. అభయప్రదాత యగు పరమాత్మను శరణు జొచ్చినవారికి భయమెలా కలుగుతుంది?

"అభయం సర్వభూతేభ్యో న మే భీతిః కదాచన"

"సర్వ భూతములకు నేను అభయ మొసంగు చున్నాను. నాకెన్నడును భయము లేదు. నావలన ఎవరికిని భయము కలుగకుండు గాక!' అని ప్రాణాగ్ని హోత్రోపనిషత్తు తెలియ జేసింది.

కనుక మన చిత్తమెప్పుడూ శివునియందే ఉండాలి. ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

సోమ కళాధర మౌళే
కోమల ఘన కంధరే మహోమహసి
స్వామిని గిరిజా నాథే
మామక హృదయం నిరంతరం రమతామ్ 93

మామక = నీయొక్క, హృదయం = హృదయమును, సోమకళాధర మౌళే = శిరస్సున చంద్రకళ ధరించినట్టియు, కోమల = కోమలమైన, ఘన = మేఘము వంటి, కంధరే= మెడగలిగిన, స్వామిని = సర్వనియంతయైన, గిరిజా నాథే = పార్వతీ నాథుడైన, మహోమహసి = గొప్పజ్యోతియందు, నిరంతరం = ఎల్లప్పుడును, రమతాం = రమించుగాక!

భావము :- శిరమున చంద్రరేఖను ధరించినట్టియు, కోమలమైన మేఘము వంటి కంఠమును కలిగి సర్వనియంతయై, సాంబశివ రూపమున ప్రకాశించుచున్న పరంజ్యోతి స్వరూపమైన పరబ్రహ్మము నందు సదా నా చిత్తము రమించు గావుత.

వ్యాఖ్య

చిత్త మెప్పుడూ శివునియందే ఉండాలి. మనస్సులో మహేశ్వర ధ్యానమే సాగుతూ ఉండాలి. శివుడు చంద్రుని శిరస్సుపై ధరించి యున్నాడనియు, నీలకంఠుడనియు, జ్యోతిరూపమై వెల్గొందు చున్నాడని తెలుపబడినది.

చంద్రుడు మనస్సునకు అధిష్ఠాన దేవత. కనుక మనస్సునందు శివునే ప్రతిష్ఠించు కోవాలి అని తెలుపుటయే నెలవంకను శిరస్సు నందు పరమేశ్వరుడు ఉంచుకొనుటలోని ముఖ్యోద్దేశ్యము.

తాను నీలకంఠుడు. పరులకొరకు విషమును పానముచేసి శివుడు నీలకంఠుడాయెను. సాధకులు మనస్సునందు శివుని ప్రతిష్ఠించుకోవాలి. అంతియేగాదు ఇతరులను కూడా శివ స్వరూపులుగా భావించి సేవించాలి. ఇది సాగింపవలె నన్నచో హృదయములో సదా సాంబశివుని దర్శించ గలగాలి.

అప్పుడే అన్ని హృదయాలలో నిండియున్న పరమేశ్వరుని దర్శించగలము.

"ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి"

"సమస్త భూతముల హృదయాలలో ఈశ్వరుడు నిలిచియున్నాడు" అని భగవద్గీతలో పరమాత్మ తెలిపియున్నాడు.

ఏత జ్జేయం నిత్యమేవాత్మ సంస్థమ్
నాతః పరం వేదితవ్యం హి కించిత్

"సదా తనలో యున్న పరమాత్మను తాను తెలుసుకొనవలెను. తెలిసికొనదగిన వస్తువు దీనికంటెను మరియొకటి లేదు. అని శ్వేతాశ్వతరోపనిషత్తు తెలిపినది. అట్టి పరమాత్మయందే సాధకుడు స్థిరముగా బుద్ధిని నిలుపవలెను.

సా రసనా తే నయనా తావేవ కరౌ స ఏవ కృతకృత్యః
యాయే యౌ యో భర్గం వదతి ఈక్షేతే సదార్చతః స్మరతి 94

యా = ఏ నాలుక, భర్గం = "భర్గ" శబ్దమును, వదతి = పలుకుచున్నదో, యే = యే నేత్రములు, భర్గం = శివుని, ఈక్షతే = గాంచు చుండునో, యౌ = ఏ హస్తములు, భర్గం = శివుని, సదా = నిరంతరము, అర్చతః = అర్చించుచుండునో, యః = ఏ భక్తుడు, భర్గం = శివుని,స్మరతి = తలంచు చుండునో, సా = అదియే, రసనా = నాలుక, తే = అవియే, నయనే = నేత్రములు, తావేవ = అవియే, కరౌ = చేతులు, స ఏవ = అతడే, కృతకృత్యః = కృతార్థుడు.

భావము :- ఎల్లప్పుడు ఈశ్వర నామమును పలుకుచుండు నాలుకయే నాలుక. ఎల్లవేళల ఈశ్వరుని గాంచెడి నేత్రములే నేత్రములు. నిత్యము ఈశ్వరుని అర్చించు హస్తములే హస్తములు. నిత్యము పరమేశ్వరుని ధ్యానించు భక్తుడే కృతార్థుడు.

వ్యాఖ్య

ఏడుస్తూ ఈ ప్రపంచంలో కాలు పెట్టాము. మనము దుఃఖిస్తూ పుడితే జగత్తు నవ్వుతూ ఆహ్వానించింది. మరణించే రోజు జగత్తు ఏడుస్తుంది. అయితే మనం ఏమి చేయాలి? నవ్వగలగాలి. లేనిచో పుట్టి ఏమి సాధించినట్లు? నవ్వుతూ మరణించడం అంతతేలికయైన పనికాదు. నవ్వుతూ జీవించ

గలిగినవాడే నవ్వుతూ మరణించ గలడు. నవ్వు నిచ్చే వస్తువు సుందరమై ఉండాలి. ఈ ప్రపంచంలో సుందరమైన వస్తువు ఏది? పరిణామ శీలమైన జగత్తులో శాశ్వతమైన వస్తువేమున్నది? కనుక శాశ్వతుడైన పరమాత్మను ధ్యానించిన వాడే నిత్యానందము ననుభవించ గలడు. జీవిత మంతయు ధ్యానించిన వ్యక్తియే అంత్యక్షణమున ఆనందము ననుభవించగలడు.

జన్మ జన్మ ముని జతన కరాహి
అంత్ రామ్ కహి ఆవత్ నాహి

"జీవిత మంతయు ఏది మనకు స్మృతి యందుండునో అంత్యకాలమున అదియే జ్ఞాపక మొచ్చును" అని తులసీదాస్ మహాశయుడు తెలుపుతాడు. జీవిత కాలమంతయు పరమేశ్వర ధ్యానములో గడుపుటకే పరమాత్మ మనకు దేహేంద్రియ మనోబుద్ధుల నొసంగినాడు.

కనుక నాలుక సదా భగవన్నామమునే స్మరించ గలగాలి. నేత్రములు పరమాత్మనే వీక్షించుచుండ వలెను. ఈశ్వరుని అర్చించే చేతులే చేతులు. పరమేశ్వరుని సదా ధ్యానించు భక్తుడే కృత కృత్యుడు.

కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాధు వర్ణించు జిహ్వ జిహ్వ
సుర రక్ష కుని జూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు
మధువైరి దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు
పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి
దేవదేవుని జింతించు దినము దినము
చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు
కుంభినీ ధవు జెప్పెడి గురుడు గురుడు
తండ్రి! హరి జేరు మనియెడి తండ్రి తండ్రి!

అని ప్రహ్లాదుడు భాగవతములో తెలిపియున్నాడు. కనుక సదా తన హృదయము నందు నిలిచి యుండుమని తరువాత శ్లోకములో ప్రార్థించు చున్నారు.

అతి మృదులౌ మమ చరణా వతి కఠినం తే మనో భవానీశ
ఇతి విచికిత్సాం సంత్యజ శివ కథ మాసీద్గిరౌ తథా ప్రవేశః 95

శివ = శివా!, భవానీపతే = పార్వతీ పతీ!, మమ = నాయొక్క, చరణే = పాదములు, అతి మృదులే = మిక్కిలి కోమలములు, తే = నీయొక్క, మనః = మనస్సు, అతికఠినం= మిక్కిలి కఠినము, ఇతి = అని, విచికిత్సాం = సంశయమును, సంత్యజ = విడువుము, తథా = అట్టి , గిరౌ = పర్వతముపై, ప్రవేశః = ప్రవేశము, కథం = ఎట్లు?, ఆసీత్= అయ్యెను,

భావము :- దేవా! పార్వతీనాథా! "నా పాదములు మిక్కిలి కోమలములు. ఈ భక్తుని మనస్సు అతి కఠోరము" అట్టిచోట నంచరించుట ఎలాగు? అనెడి సంశయమును నీవు విడిచి పెట్టుము. కఠినమైన పర్వతములపై నీవు చరించలేదా?

వ్యాఖ్య

"హే పరమశివా! అభిమాన అహంకారాలతో కరుడు గట్టిన నా చిత్తము అతి కఠినమైనది యని నాకు తెలుసు. కోమలమైన నీ చరణ కమలములను ధరింప శక్తి లేనిది. అలాగని దానిని త్యజించకుము. నీవు త్యజించిన మరెవరు దిక్కు?, బిడ్డ తప్పులు చేయవచ్చు. అలాగని తల్లి విస్మరించునా! బిడ్డ మాట వినక పోవచ్చును. అలాగని తండ్రి విడిచి పెట్టునా! ఆ దోషమును నింపే నీ పాదపద్మములు నాలో దోషమును చూడతగునా?"

"కరుడు గట్టిన నా మనస్సును గాంచి నన్ను పరిత్యజించకుము. నీ పాదపద్మములను నా చిత్తములో నిలువ నిమ్ము. కఠినమైన గిరులపై చరించిన నీవు నన్ను పరిత్యజించుట తగునా?"

"శివా! భస్మాసురుని ఉద్ధరించినది నీవు కావా? కాముని కరుణించిన దయామూర్తివి నీవు కావా! రావణుని ఆశీర్వదించినది నీవుకావా? మరి నన్ను పరిత్యజించుట ఎందులకు?"

"పుణ్యాత్ములకు ఎక్కడైనా చోటు లభిస్తుంది. నాలాంటి పాపాత్ములను కాపాడవలసిన వాడవు నీవేకదా! ఎంతటి పాపిష్ఠియైనను, నీ నామస్మరణచే పవిత్రుడగునని శాస్త్రములు చెప్పుచున్నవి కదా!"

అపి చేత్సు దురాచారో భజతే మా మనన్య భాక్

సాధు రేవ సమన్త వ్య స్సమ్యగ్వ్యవసితో హిసః

"మిగుల దురాచార వంతుడైనను, అనన్య భక్తి కలవాడై నన్ను భజించెనేని స్థిర చిత్తము గలవాడైన తాను సాధువే యని తెలియ బడుచున్నాడు" అని భగవద్గీత తెలియ జేసింది.

"తండ్రీ! పరమ శివా! నేను అజ్ఞానినే. అలాగని నన్ను త్యజించకుము. నా మద మణచి, మతి పరిజేసి ఉద్ధరింపుము." ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

ధైర్యాంకుశేన నిభృతం
రభసా దాకృష్య భక్తి శృంఖలయా
పురహర చరణా లానే
హృదయ మదేభం బధాన చిద్యం త్రైః 96

పురహర = త్రిపురములను హరించిన వాడా! హృదయ మదేభం = హృదయమను మదపుటేనుగును, ధైర్యాంకుశేన = ధైర్యమనెడి అంకుశముతో, రభసాత్ = వేగమువలన, అకృష్య = వశపరచుకొని, భక్తి శృంఖలయా = భక్తి యను గొలుసులతో, చరణాలానే= పాదంబను కట్రాడువందు, చిద్యంత్రైః = నీ జ్ఞానము అనెడి యంత్రములతో, నిభృతం= కదలకుండ, బధాన = బంధింపుము.

భావము :- త్రిపురహరా! మహాదేవా! నాహృదయమొక మదపు టేనుగు. దానిని చిద్యంత్రముతో ఆకర్షించి, ధైర్యాంకుశముతో నాకర్షించి, భక్తియను త్రాటితో మీ పాద పద్మము లను గట్టి కొయ్యకు కదల కుండా కట్టివేయుము.

వ్యాఖ్య

మనుజుడనుభవించు బాధలు సంఘటనలపై, విషయాలపై ఆధారపడిలేవు. వాటిని అనుభవించు మనస్సుపై ఆధారపడి యున్నవి. మనస్సొక మత్తగజము. చెత్తను నింపుకొనేందుకు అలవాటు పడిన అహంకార మృగము. శరీరమును అనుదినము శుభ్రపరచు కొనునట్లు, మనస్సును అనుక్షణము నిగ్రహించు కొనవలెను. శుద్ధి పరచుకొనవలెను. శుద్ధి పడని మనస్సు శివ ధ్యానమున కుపకరించదు. దారి చెడిన ఈ హృదయ మత్తగజమును జగద్విషయములు ప్రేరేపించుచునే యుండును. భగవన్నామ స్మరణము ద్వారా దానిని ఎప్పటి కప్పుడు నిగ్రహించి అనుగ్రహ మార్గములో ఉంచవలెను.

రాజ్యములు జయించి నీవు చక్రవర్తివి కాలేవు. మనస్సును జయించినవాడే నిజమైన చక్రవర్తి. జగత్తు అతని పాదముల వద్ద మోకరిల్లును. జ్ఞాన మనెడి యంత్రముతో హృదయ మత్తగజము నాకర్షింపవలెను. చిత్తములో చిదంశ చోటు చేసుకోగానే దురవస్థ దూరమగును. మనస్సు మలిన రహిత మైనపుడు బుద్ధి భ్రాజితమై శాంతి నిలయ మగును.

మనస్సు ఎప్పుడూ బహిర్ముఖ మగుచునే యుండును. బహిర్ముఖ మగుచున్నంత వరకు మనస్సు ఇంద్రియ పరిచ్ఛేదము నందే పరిభ్రమించు చుండును. దానిని ఉత్తేజ పరచి అంతర్ముఖ మొనర్చుటయే భక్తి యనబడును. భక్తి ద్వారా చిత్తము భగవానుని పాద పద్మములకు కట్టబడి యుండవలెను. అనగా అనుక్షణము మదిలో ఈశ్వర స్మరణమే చోటుచేసుకొని యుండవలెను. ఆలోచన ననుసరించి అంతఃకరణ ఉంటుంది. అంతఃకరణను బట్టి వ్యక్తి జీవితము రూపు దిద్దు కుంటుంది. నిర్మలమైన మనస్సునందే నిరంజన స్వరూపము భాసించును.

కనుక తన చిత్తమనెడి మత్త గజమును బంధించు శక్తి నిమ్మని ఈ శ్లోకమున ప్రార్థించిన ఆచార్యులు ఈ విషయమునే రాబోవు శ్లోకమునందు కూడా తెలుపుతున్నారు.

ప్రచరత్యభితః ప్రగల్భ వృత్త్యా
మదవానేష మనః కరీ గరీయాన్
పరిగృహ్య నయేన భక్తి రజ్వా
పరమ స్థాణు పదం దృఢన్నయామమ్ 97

మదవాన్ = మదము గలిగిన, గరీయాన్ = గొప్పదియును, ఏషః = ఈ, మనః కరీ= చిత్తగజము, ప్రగల్భవృత్త్యా = నిలుపుటకు వీలుగాని విధముగా, అభితః = అంతటను, ప్రచరతి = చరించుచున్నది, అముం = దీనిని, భక్తిరజ్వా = భక్తి యనెడి త్రాడుతో, నయేన = అనునయముతో, పరిగృహ్య = గ్రహించి, స్థాణు = స్థిరమైన, పదం = స్థానమును, దృఢం = దృఢముగా, నయ = పొందింపుము.

భావము :- పరమ శివా! నా చిత్త మనెడి మత్త గజము నిరోధింప వీలుగాని రీతిలో నలువైపుల పరుగులిడు చున్నది. దీనిని నీభక్తి యనెడి త్రాటితో గట్టి స్థిరమైన మోక్ష పదము ననుగ్రహింపుము.

వ్యాఖ్య

కల్పిత భావాలను, కల్లోల పరిస్థితులను కలిగించి కదిలించేది మనస్సు. అది ఆంతర్యపు లోతుల నుండి వికారము లనెడి స్పందనను కలిగించి మనో ఫలకముపై విచిత్ర రూపములను చూపెడుతుంది. అట్టి విషమ సమయాలలో భక్తి యనెడి త్రాడుచే మత్తగజమును నిరోధించాలి.

ప్రతిపక్ష భావన ద్వారా మనస్సు నిరోధించాలి. అప్పుడు వికారములో ఆకారము తెలియును. విషాదములో వినోదము అందును. చెడులో మంచి గోచరించును. క్రోధములో ప్రేమ స్ఫురించును.

అసత్య జీవనానికి అలవాటు పడిన అంతఃకరణ జన్మాంతరములలో పయనించి బంధములను ఏర్పరచుకొని, బరువులను తెచ్చుకొనినది. విచిత్రమైన బరువులను తలపై నిడుకొని అగాధ సంసారార్ణవములో పయనించు చున్నది. తీరమెక్కడో, విరామ మెక్కడో అవగతముగాక అలమటించు చున్నది.

ఆలుబిడ్డలుఁ దల్లిదండ్రులు ధనంబంచున్ మహాబంధనం

బేలా నామెడఁ గట్టినాడ! విఁక నిన్నే వేళ జింతింతు ని

ర్మూలం బైన మనంబు తోనఁ గడు దుర్మోహాబ్ధిలోఁ గ్రుంకి యీ

సీలా మాలపుఁ జింత నెట్లుడిపెదో! శ్రీ కాళహస్తీశ్వరా!

"భార్యా పిల్లలు, తల్లి దండ్రులు, ధనము లనెడి గొప్ప బంధనములను నా గొంతునకు చుట్టినావు. నేను ఈ అజ్ఞాన సముద్రములో పడి ఆధారము లేని మనస్సుతో నిన్ను ధ్యానించెదను. నా చింత నెట్లు పోగొట్టెదవో కదా!" అని శ్రీకాళహస్తీశ్వర శతక కర్త వ్రాసియున్నాడు. కనుక చిత్తమనెడి మత్తగజమును నిగ్రహించుటకు భక్తియే ఏకైక సాధనమై యున్నది. భక్తి మనుజుని ఆధ్యాత్మిక శక్తివంతునిగ జేయును. పరమాత్మ యందు ఆసక్తిని పెంచి ముక్తి ధామము వైపు నడపించును. ఆత్మ విదునిగా తీర్చిదిద్దును.

ఇంతవరకు శివభక్తిని అనూహ్య అద్భుత అసమాన రీతులలో లిఖించిన శ్రీ ఆచార్యులు గ్రంధ సమాప్తి చేయుట కుపక్రమించుచు కవితా కన్యాదానము చేయనున్నారు. ఈ విషయమును తరువాత శ్లోకము వివరించును.

సర్వాలంకార యుక్తాం సరళపదయుతాం సాధువృత్తాం సువర్ణాం

సద్భి స్సం స్తూయమానాం సరసగుణయుతాం లక్షితాం లక్షణాఢ్యామ్

ఉద్యద్భూషా విశేషా ముపగత వినయాం ద్యోతమానార్థ రేఖాం

కల్యాణీం దేవ గౌరీప్రియ మమ కవితా కన్యకాం త్వం గృహాణ 98

గౌరీప్రియ = పార్వతీశా!, దేవ = మహాదేవా!, సర్వ = సమస్తమైన, అలంకార = అలంకారముల తోడను, యుక్తాం = కూడినదియు, సరళ = మృదువైన, పద = శబ్దములతో, యుతాం = కూడినదియు, సాధువృత్తాం =మంచి వృత్తములు గలదియు, సువర్ణాం = చక్కని వర్ణము గలదియు, సద్భిః = సాధువులచే, సంస్తూయమానాం = స్తుతించబడుచున్నదియు, సరస గుణయుతాం = సరసమైన గుణములతో కూడినదియు, లక్షితాం = కోరబడినదియు, లక్షణాఢ్యాం = లక్షణయుతమైనదియు, ఉద్యత = ప్రకాశించుచున్న, భూషా విశేషం = అలంకార విశేషముగు, ఉపగత = తెలియబడిన,

వినయాం = వినయము గలదియు, ద్యోతమాన = స్పష్టముగా తెలియు, అర్థరేఖాం= భాగ్యరేఖ గలదియు, కల్యాణీం = కళ్యాణకరమైనదియు, మమ = నాయొక్క, కవితా కన్యకాం = కవితా కన్యను, త్వం = నీవు, గృహాణ = గ్రహింపుము.

భావము : - గౌరీ ప్రియా! నాయొక్క కవితా కన్యను గ్రహింపుము. ఆమె చక్కని కన్యయొక్క లక్షణములు కలిగి కళ్యాణమునకు తగియున్నది. సకలా భరణములు కలిగి యున్నది. సర్వ శబ్దాలంకార శోభితమై ఉన్నది. చక్కని చంధోవృత్తములతో శోభిల్లు చున్నది. సరసమైన గుణములతో కూడినది. పండితులచే, సాధువులచే స్తుతించబడినది. మృదుపద యుతమైనది. వినయము గలది. భాగ్యరేఖ గలది.

వ్యాఖ్య

పరమ పవిత్రమైన 'శివానందలహరి" యనెడి గ్రంథమును రచించి ముగింపు జేయబోవు సమయమున ఈ కృతిని పరమేశ్వరునికే అంకిత మొనర్పదలచి, కృతిని కన్యగా భావించి సమర్పించు చున్నారు.

ఈ కృతి కన్య యొక్క లక్షణములను కలిగి కళ్యాణమునకు తగియున్నది అని చెప్పు చున్నారు. సద్వంశమున జన్మించిన సత్కన్య ఆభరణములతో శోభించునట్లు సద్రూపులైన శంకరులనుండి ఆవిర్భవించిన సద్గ్రంధమనెడి కవితా కన్య సర్వ శబ్దార్థాలంకార శోభితమై యున్నది. కన్యక సాధువృత్త మైనట్లు, కవితాకన్య చక్కని చంధో వృత్తములతో వెల్గొందు చున్నది. కన్యక మందగమన మైనట్లు, కవితాకన్య కోమలమైన నడకతో యొప్పారు చున్నది. అనగా మృదు పదములతో శోభించుచున్నది. సరస సద్గుణములు కన్య కుండునట్లు శృంగారాది రసములు, మాధుర్యాది గుణంబులు ఈ కవితా కన్య కున్నవి. చక్కని శరీరముతో నొప్పారు కన్యను అందరూ మెచ్చుదురు. చక్కని కావ్య లక్షణములతో శోభించుచున్న ఈ కవితాకన్యను విబుధులైన వారందరు ప్రశంసింతురు. కన్య వినయ శీలమైనట్లు, శివానంద లహరి యనెడి కవితా కన్య కూడా భక్తి వినయాదులను ప్రదర్శించుచున్నది.

కన్యలో భాగ్యరేఖలున్నట్లు, కవితా కన్యలో శుభలక్షణము లుండి పఠించు వారలను ముక్త స్వరూపులను గావించుచున్నది.

ఇచ్చట కావ్యము శివానంద లహరి. కృతి భర్త శుభకరుడైన సాంబశివుడు. కృతికర్త సర్వశాస్త్ర వేత్తయైన శ్రీశంకరులు తాను రచించిన ఈ గ్రంథమును ఈశ్వరార్పణ మొనర్చుటయే సత్కృతి కన్యాదానము.

శివానందలహరి అనెడి ఈ సద్గ్రంథము చక్కని కవితా కన్యయై యొప్పారు చుండ, శుభకరుడగు పరమేశ్వరుడు షడ్గుణైశ్వర్య సంపన్నుడై కృతి భర్తకు శోభించు చున్నాడు. కృతికర్తయైనట్టి శ్రీశంకరులు సర్వశాస్త్ర పారంగతులై యున్నారు.

"నా నృషిః కురుతే కావ్యమ్"

"ఋషి గానివాడు కావ్యమును వ్రాయలేడు" అని కలదు. అయితే ఇక్కడ మన కృతి కర్తయైన శ్రీశంకరులు ఋషి వర్యులకు ఆరాధ్యుడైన పరమహంసయై ఉన్నాడు.

గ్రంథము శివవైభవము గాక, గ్రంథకర్త శివాంశయని కీర్తింపబడిన దివ్య పురుషులు కాగా కృతి భర్త పరమశివుడే యగుట గుర్తింపదగిన విషయము.

జలకంబుల్ రసముల్, ప్రసూనములు, వాచా బంధముల్
వాద్యముల్ కలశబ్ద ధ్వను లంచితాంబర మలంకారంబు
దీప్తుల్మైలుంగులు, నైవేద్యము మాధురీ మహముగా గొల్తు
న్నినున్ భక్తిరంజిల దివ్యార్చనఁ గూర్చి నేర్చిన క్రియన్ శ్రీకాళహస్తీశ్వరా

"శ్రీ కాళహస్తీశ్వరా! నేను కవిత్వమును నేర్చినాను. శృంగారాది రసములతో అభిషేక మొనర్చినాను. మృదు పదములనే పుష్ప వచనములుగా తీర్చినాను. అలంకారములనే వస్త్రముగా అర్పించినాను. శబ్దధ్వనులను వాద్యములుగాను, మాధుర్యమునే నైవేద్యముగాను భక్తితో నీకు పూజ గావించి సేవించెదను" అని శ్రీకాళహస్తీశ్వర శతకమునందు తెలుపుట జరిగినది.

ఇదంతే యుక్తం వా పరమశివ కారుణ్య జలధే
గతౌ తిర్యగ్రూపం తవ పదశిరో దర్శనధియా
హరి బ్రహ్మాణౌ తౌ దివి భువి చరంతౌ శ్రమయుతౌ
కథం శంభో స్వామిన్కథయ మమ వేద్యోఽసి పురతః 99

పరమశివ = పరమశివుడా!, కారుణ్య జలధే = కరుణా సాగరా, తవ = నీయొక్క, పదశిరో దర్శనధియా = పాదములను శిరస్సును తెలుసుకొనవలెనను బుద్ధితో, తిర్యగ్రూపం = తిర్యగ్జంతువు రూపమును, గతౌ = పొందిన, తౌ = ఆ, హరి బ్రహ్మాణే= హరిబ్రహ్మలును, దివి = ఆకాశమందును, భువి = భూమియందును, చరన్తౌ = చరించువారై, శ్రమయుతౌ = శ్రమతోగూడియున్నవారలు, శంభో = శివా!, స్వామిన్ = స్వామీ, మమ = నాయొక్క, పురతః = ముందరను, వేద్యః = తెలియదగిన వాడవు, కథం = ఎట్లు, అసి = అగుదువు, కథయ = చెప్పుము, ఇదం = ఇది, తే= నీకు, యుక్తంవా = తగునా!

భావము :- హే పరమశివా! కరుణాసాగరా. నీ పాద దర్శనమునకు వరాహ రూపము దాల్చి శ్రీహరియు, నీ శిరో దర్శనమునకు హంసరూపముదాల్చి బ్రహ్మదేవుడును భూమ్యంతరిక్షముల యందు తిరిగి, విసుగు చెంది ఫలములేక వెనుదిరిగి వచ్చిరి. పరమశివా. దీనుడగు నాకు నీవు ఎట్లు ప్రసన్నుడవై బ్రోతువో తెలుపుడు.

వ్యాఖ్య

పరమ శివుని శిరస్సును దర్శించవలెనని హంస పక్షిరూపమున బ్రహ్మదేవుడు ఆకాశ మార్గమున పయనించెను. శివుని పాదములను దర్శింపవలెనని విష్ణుదేవుడు వరాహరూపమును ధరించి పాతాళమున పయనించెను. కానీ ఇరువురును దర్శించలేక పోయిరి. అట్టి అనంతుడైన పరమేశ్వరుడు తనముందు ప్రత్యక్షమై ఏవిధముగా ఉద్ధరించనున్నాడు అని శ్రీశంకరులు అడుగుచున్నారు. విష్ణు బ్రహ్మదులకు అలభ్యమైన శివదర్శనము భక్తునికి లభ్యము కానున్నది. భగవానుడు భక్త సులభుడు. భక్తవత్సలుడు.

భక్తి పరమ పవిత్రమైనది. భక్తి సర్వవాసనా క్షయము గావించును. ప్రేమను వృద్ధి పొందించును. అగ్ని పత్తి గూళ్ళను దగ్ధమొనర్చునట్లు, భక్తి

సర్వపాపములను పోగొట్టి దివ్యైశ్వర్యము నొసగి కాపాడుతుంది. భక్తిలో శరణాగతియే కేంద్ర విషయమై యున్నది. శరణాగతి, దైవకరుణ ఈరెండును పరస్పరాధీనములు, అన్యోన్యాశ్రయములు. శరణాగతి హృదయ శుద్ధి నారంభిస్తుంది. దైవకరుణ దానిని పూర్తిచేస్తుంది.

ఏ వేదంబు పఠించె లూత? భుజగం బే శాస్త్రము ల్చూచె దా
నే విద్యాభ్యాసనం బొనర్చె గరి? చెంచేమంత్ర మూహించె బో
ధావిర్భావ నిదానముల్ చదువులయ్యా! కావు మీ పాద సం
సేవాసక్తియె కాని జంతు తతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!

"శ్రీకాళహస్తీ శ్వరా! సాలెపురుగు ఏ వేదమును పఠించినది? పాము ఏశాస్త్రములను చదివినది? ఏనుగు ఏ విద్యలు నేర్చినది? బోయవాడు ఏమంత్రమును పఠించెను? జీవులకు జ్ఞానము కలుగుటకు నీపాద సంసేవనా భాగ్యము ముఖ్యముగాని చదువులు ముఖ్యములుగావు" అని శ్రీ కాళహస్తీశ్వర శతకము తెలిపినది.

స్తోత్రేణాల మహం ప్రవచ్మి నమృషా దేవా విరించాదయ
స్స్తుత్యానాం గణనా ప్రసంగ సమయే త్వామ గ్రగణ్యం విదుః
మాహాత్మ్యాగ్ర విచారణ ప్రకరణే ధానాతుష స్తోమవ
ద్ధూతాస్త్వాం విదురుత్తమోత్తమ ఫలం శంభో భవత్సేవకాః 100

శంభో = శివుడా!, భవత్ = నీయొక్క, సేవకాః = సేవకులైన, విరించాదయః = బ్రహ్మాదులగు, దేవాః = దేవతలు, సుత్యానాం = స్తుతింప దగిన వారలయొక్క, గణనా= లెక్కనుగూర్చి, ప్రసంగసమయే = ప్రసంగించు సమయమున, త్వాం = నిన్ను, అగ్రగణ్యం = అగ్రగణ్యుడుగా, విదుః = తెలిసికొనుచున్నారు, మహాత్మ్య = మహాత్మ్యమును గూర్చిన, అగ్రవిచారణ = మొదటి చర్చను, ప్రకరణే = చేయునప్పుడును, ధానాతుష స్తోమవత్= సారములేని ధాన్యమునందలి పొట్టువలె, ధూతాః = చలించిన వారై, త్వాం = నిన్ను, ఉత్తమోత్తమ ఫలం = ఉత్తమ ఫలముగా, విదుః = తెలిసికొనుచున్నారు, స్తోత్రేణ = స్తుతిచేత, అలం = చాలును, అహం = నేను, మృషా = అసత్యము, నప్రవచ్మి = చెప్పను.

భావము :- శివా! నీ భక్తులైన బ్రహ్మదేవుడు మొదలగు స్తుతింపదగిన వారియొక్క లెక్కను గూర్చి ప్రసంగించినపుడు నిన్ను మొదటివానిగా తెలిసికొని యున్నారు. సృష్టి స్థితి లయాదులకు సంబంధించిన మహాత్మ్యమును గూర్చి ప్రసంగించు సమయమున ఇతరులెల్లరు తూర్పార బట్టగా గాలికి కొట్టుకొనిపోవు పొట్టుగాక సారమైన ధాన్యము వలె శేషించిన నిన్ను ఉత్తమోత్తమునిగా తెలిసికొని యున్నారు. నా స్తోత్రము అసత్యము కాదు. ఈ స్తోత్రమిక చాలును.

వ్యాఖ్య

"శివానందలహరి" అనెడిగ్రంథమును సమాప్తిచేయుచు స్తోత్రేణాలం" అని శ్రీశంకరులు ప్రవచించినారు. "స్తోత్రేణ" అనగా స్తోత్రముచేత అని అర్థము. "అలం" అనగా చాలును అని భావము. వ్యక్తి తరించుటకు, అజ్ఞానం అంతరించుటకు ఈ ఒక్క గ్రంధమే చాలును అని శంకరుల వారి అభిప్రాయము.

"అహం మృషా నప్రవచ్మి" నేను అసత్యమును పలుకుట లేదు" అని శ్రీ శంకరులు తెలుపుచున్నారు. గ్రంధ ప్రాశస్త్యమును పెంచు నుద్దేశ్యములో అతిశయములుగాని, ఉత్ప్రేక్షలు గాని ప్రవేశ పెట్టలేదని ఆచార్యులు తెలియజేయుచున్నారు.

జ్ఞానమును వాంఛించు ముముక్షువులకు సాంబశివుడు ధాన్యమువలె నిలువగా ఇతర దేవతలు ధాన్యపు పొట్టువలె కొట్టుకొని పోవుచున్నారని తెలుపుతున్నారు.

ఇతి శ్రీ శంకర భగవత్పాద విరచిత

శివానంద లహరీ


సంపూర్ణమ్

శ్రీశంకర భగవత్పాదులు రచించిన

శివానందలహరి

సంపూర్ణము

ఓం తత్ సత్



సర్వజీవులు ఆశించు
అఖండానందమే శివానందము.
నిత్యానంద స్వరూపమైన ఈ
శివానందానుభూతియే
శివానందలహరి.

శ్రీ శైలక్షేత్ర పాలకులగు
భ్రమరాంబ సమేత మల్లికార్జున
స్వామి దివ్యవైభవమును గాంచి
పులకాంకితులైన శ్రీ
ఆదిశంకరులు తమ హృదయ
పారవశ్య జనిత తరంగ
కుసుమాలను సాహిత్య
దారములతో కూర్చి,
అందమైన భక్తి ప్రబంధమాలగా
తీర్చి, మల్లికార్జునుని మెడను
అలంకరించి అర్చించారు. అట్టి
భక్తి భావ సుమాలయే
శివానంద లహరి.

పూజ్యపాదులు సమర్పించిన
"శివానందలహరి" యనెడి
భావ పుష్పహారమునందలి జ్ఞాన
సౌరభమును భక్తులు
ఆఘ్రాణించుటకు అనువుగా
పూజ్యులు స్వామి సుందర
చైతన్యానందుల వారు
రచించిన సుమధుర
వ్యాఖ్యానమే ఈ "శివానంద
లహరి" గ్రంథము.

శివ భక్తులకు ఈ గ్రంథము
అమృతమును మరపించును.
ఆనందామృతమును
కురిపించును.

